ఆంధ్ర సారస్వత పరిషత్తు

సప్తతి మహోత్సవ ప్రత్యేక ప్రచురణ

వ్యాసగుళుచ్ఛం

మొదటి భాగం

ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్ రోడ్డు, హైదరాబాద్-1

ఆంధ్ర సారస్వత పరిషత్తు

సప్తతి మహోత్సవ ప్రత్యేక ప్రచురణ

వ్యాస గుళుచ్ఛం

మొదటి భాగం

ప్రధాన సంపాదకులు

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్

డా॥ సి. నారాయణరెడ్డి

ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షులు

సంపాదకులు

డా॥ జె. చెన్నయ్య

ప్రధాన కార్యదర్శి

ఆంధ్ర సారస్వత పరిషత్తు

డా॥ ముదిగంటి సుజాతారెడ్డి

ప్రముఖ సాహితీవేత్త, ఉపాధ్యక్షులు

ఆంధ్ర సారస్వత పరిషత్తు

ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్‌రోడ్, హైదరాబాద్-1

'VYASA GULUCHCHAM'
PART-I
A Collection of Essays

First Edition : May, 2013

Pages : 142

Copies : 500

Price : Rs. 80/-

For Copies
Andhra Sarasvatha Parishath
Tilak Road, Abids, Hyderabad -1.
Ph: 040-24753724

DTP :
Pavan Graphics
Ramnagar, Hyderabad-44.
Cell: 9490146218

Printed at:
Sai Likhita Printers
Khairatabad, Hyderabad.

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్
డా॥ సి. నారాయణరెడ్డి
అధ్యక్షులు
ఆంధ్ర సారస్వత పరిషత్తు

అవతారిక

నిజాం పాలనలో తెలుగు భాషాదీపం కొడిగట్టిన కాలంలో దాని పునరుద్దీపనానికి ఉద్యమించిన మాతృసంస్థ ఆంధ్ర సారస్వత పరిషత్తు. శ్రీ మాడపాటి హనుమంతరావు, శ్రీ సురవరం ప్రతాపరెడ్డి, శ్రీ లోకనంది శంకర నారాయణరావు వంటి పలువురు సాహితీమూర్తుల ప్రేరణతో పరిషత్తు 1943లో రూపుదిద్దుకొని, ఈ రోజు ఆంధ్రప్రదేశ్‌లో అగ్రేసర సాహితీ సంస్థగా విశిష్టస్థానం వహించింది. మాన్య మిత్రులు డా. దేవులపల్లి రామానుజరావుగారు యావజ్జీవం పరిషత్తు అభివృద్ధికి శ్రమించారు. ఉత్తమాదర్శాలతో, ఆశయాలతో ఆవిర్భవించిన పరిషత్తు కాలానుగుణంగా బహుముఖీన కార్యక్రమాలు చేపట్టి సమర్థంగా నిర్వహిస్తూ అందరి మన్ననలందుకుంటున్నది. వీటిలో భాషాబోధన, గ్రంథ ప్రచురణ ముఖ్యభూమికలు వహిస్తున్నాయి. ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాథమిక, ప్రవేశ, విశారద పరీక్షలు జరపడంతో పాటు, తెలుగు పండిత శిక్షణ కళాశాల, స్నాతకోత్తర స్థాయి ప్రాచ్యకళాశాల నిర్వహిస్తున్నది. పరిషత్తు రూపొందించి నిర్వహించే సాహితీసభలు, సమావేశాలు, ప్రసంగాలు, సదస్సులు, ఉత్సవాలు, చర్చాగోష్ఠులు, ప్రసంగాత్మక ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు మొదలైనవి వైలక్షణ్యాన్ని చేకూర్చుకున్నాయి. పరిషత్తు ప్రచురించే గ్రంథాలను సాహితీలోకం హార్దికంగా స్వాగతిస్తున్నది. ఇంతవరకు దాదాపు 300 గ్రంథాలను వెలువరించింది.

ఈ మహాసంస్థను స్థాపించి 26.5.2013 నాటికి 70 సంవత్సరాలు పూర్తి అయినాయి. పరిషత్తు సప్తతి మహోత్సవాలను ఘనంగా నిర్వహించింది. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని సప్తతి మహోత్సవ ప్రచురణగా “వ్యాసగుళుచ్ఛం”

మొదటిభాగం వెలువరిస్తున్నాం. పరిషత్తు లోగడ నిర్వహించిన సాహిత్య కార్యక్రమాలలో ఆయా అంశాలపై నిపుణులు చేసిన ప్రసంగాలను వ్యాసాల రూపంలో సేకరించి ఈ గ్రంథంలో సంకలనపరిచి సాహిత్యలోకానికి అందిస్తున్నాం. విషయ సాంద్రత, అభివ్యక్తి సంక్షిప్తత సంతరించుకున్న ఈ వ్యాసాలు సాధారణ పాఠకులకు, విద్యార్థులకు, పరిశోధకులకు, పండితులకు ఉపకరించేవిగా వున్నాయి.

పరిషత్తు వెలువరిస్తున్న ఈ గ్రంథం ఎప్పటిలాగే అందరి మన్ననలు పొందగలదని విశ్వసిస్తున్నాను.



హైదరాబాద్
26 మే 2013

డా॥ సి. నారాయణరెడ్డి

డా॥ జె. చెన్నయ్య
ప్రధాన కార్యదర్శి
ఆంధ్ర సారస్వత పరిషత్తు

ముందుమాట

డెబ్బయ్యేళ్ళుగా తెలుగు భాషాసంస్కృతుల వికాసానికి మౌలిక కృషిని కొనసాగిస్తున్న ఆంధ్ర సారస్వత పరిషత్తు ఈనాడు సప్తతి మహోత్సవాలను జరుపుకుంటున్నది. స్వర్ణోత్సవాన్ని, వజ్రోత్సవాన్ని, సప్తతి మహోత్సవాన్నీ అధ్యక్షులు డా. సి. నారాయణరెడ్డిగారి నేతృత్వంలోనే జరుపుకోవడం ప్రత్యేకంగా చెప్పుకోదగ్గ అంశం. నిజాము పాలనాకాలంలో తెలుగు భాషకు ఏమాత్రం చోటులేని కాలంలో భాషాసముద్ధరణ ముఖ్యలక్ష్యంగా ఈ సంస్థను నెలకొల్పారు. లోకనంది శంకర నారాయణరావు, సురవరం ప్రతాపరెడ్డి, భాస్కరభట్ల కృష్ణారావు, మాడపాటి హనుమంతరావు, బూర్గుల రంగనాథరావు, నూకల నరోత్తమరెడ్డి, దేవులపల్లి రామానుజరావు, గడియారం రామకృష్ణశర్మ వంటి పెద్దలు ఆంధ్ర సారస్వత పరిషత్తు చరిత్రలో స్మరించుకోదగినవారు. సప్తతి సందర్భంలో వారిని గుర్తుచేసుకుంటున్నాం.

సప్తతి మహోత్సవాలను పురస్కరించుకొని పరిషత్తు కార్యవర్గ సభ్యుల సలహా, సహకారాలతో అధ్యక్షులు డా. సి. నారాయణరెడ్డి కొన్ని ప్రత్యేక కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. 'తెలంగాణాలో విలక్షణ జానపద కళారూపాలు', 'ఆంధ్ర నాట్యం పేరిణి ప్రదర్శనలు – ప్రసంగాలు', 'తెలంగాణంలో తెలుగు సాహిత్య వికాసం', 'ప్రాచ్య కళాశాలల్లో భాషాబోధన' మొదలైనవి జయప్రదంగా నిర్వహించడం జరిగింది.

పరిషత్తు సప్తతి మహోత్సవాలను పురస్కరించుకొని 'వ్యాసగుళుచ్ఛం' మొదటి సంపుటిని అందిస్తున్నాం. ఈ ప్రత్యేక ప్రచురణలో కథాసాహిత్యానికి, ఆధునిక కవిత్వానికి సంబంధించిన వ్యాసాలున్నాయి. వివిధ సందర్భాల్లో ప్రముఖులైన సాహితీవేత్తలు చేసిన ప్రసంగాలనుంచి వీటిని ఎంపిక చేసుకున్నాం. సంపాదకత్వం

వహించిన ఆంధ్ర సారస్వత పరిషత్తు ఉపాధ్యక్షులు, ప్రముఖ రచయిత్రి, విమర్శకులు డా. ముదిగంటి సుజాతారెడ్డిగారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ప్రత్యేక ప్రచురణలు వెలువరించే పనుల్లో తమ సహకారాన్ని అందించిన మా కార్యక్రమాల సలహాదారు గోవిందరాజు రామకృష్ణారావు గారికి కృతజ్ఞతలు. ఈ గ్రంథంలోని అక్షర దోషాలు సరిచేసిన అధ్యాపకురాలు బి. రాజరత్నం గారికి, కార్యనిర్వహణాధికారులు యాదగిరిరావు, గోపాలరెడ్డిగార్లకు, డి.టి.పి. చేసిన నరసింహారావుకు, ముద్రించి ఇచ్చిన సాయి లిఖిత ప్రింటర్స్ వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

(ప్రధాన కార్యదర్శి)

విషయ సూచిక

తెలుగు కథానిక : ప్రారంభదశ

◆ పోరంకి దక్షిణామూర్తి

కథానిక అనే మాట తెలుగు సాహిత్య శాస్త్ర పరిభాషలోకి ఏడు దశాబ్దులకు పూర్వమే ప్రవేశించింది. ఇరవయ్యో శతాబ్దిలో, ఆంగ్లభాష ద్వారా పరిచయమైన పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో విరివిగా ప్రచురణ అవుతూ వచ్చిన ఆధునిక కథన ప్రక్రియకు 'కథానిక' అన్న పేరు ప్రతిపాదించినవారు ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు. దీన్ని వారు 'అగ్ని పురాణం' నుంచి తీసుకొన్నారు (అగ్ని పురాణం ఎప్పటిదో చెప్పడానికి నిర్వివాదమయిన ఆధారాలు లేవు. కొందరన్నట్లుగా, కనీసం వెయ్యేళ్ళకు పూర్వపుదే కాని ఇటీవలిది కాదు). అందులో కథానికకొక నిర్వచనముంది (అధ్యాయం 337, శ్లోకం-20) పాశ్చాత్య సాహిత్యశాస్త్రవేత్తలెవరూ 19వ శతాబ్ది మధ్యకాలం వరకు చిన్నకథను నిశితంగా పరిశీలించి ప్రక్రియాపరంగా లక్షణ నిర్దేశం చేసిన దాఖలాలు లేవు. అంటే, ప్రపంచ సాహిత్యంలో 'చిన్నకథ'ను ఒక ప్రత్యేక ప్రక్రియగా గుర్తించి మొట్టమొదటిసారిగా దాన్ని నిర్వచించిన ప్రతిష్ఠ, అగ్నిపురాణం ద్వారా భారతదేశానికి దక్కిందన్నమాట. ఈ ప్రక్రియకు 'కథానిక' అన్న పేరు అగ్నిపురాణమే పెట్టింది (దీనికి తద్భవరూపం 'కహానీ'గా హిందీలో చెలామణి అవుతోంది). ఆ వారసత్వాన్ని నిలుపుకోడం మనకు ప్రతిష్ఠాకరం కూడా.

కాబట్టి సాహిత్యశాస్త్రవేత్తలు 'కథానిక' అన్న పేరే వాడుతున్నారు. సామాన్య పాఠకులు, కొందరు రచయితలు, కొన్ని పత్రికల వారు తమ సౌలభ్యం కోసమూ పాతకాలపు అలవాటును బట్టీ 'కథ' అనే అంటున్నారు. కాని, 'కథానిక' అన్నప్పుడు ఉండే శాస్త్రీయ నిష్కర్ష 'కథ' అన్నప్పుడు ఉండదు. ఏమంటే - ప్రతి ఒక్క కథానికా కథే; కాని ప్రతి ఒక కథా కథానిక కాదు. కథను ముడివజ్రమనుకొన్నప్పుడు కథానికను సానపట్టిన వజ్రమని చెప్పవచ్చు. ఇది గుర్తుంచుకోవలసిన విషయం.

భారతీయ సాహిత్యశాస్త్రానికి ఆది గ్రంథమైన 'నాట్యశాస్త్రం'లో భరతుడు, 'కథ' అన్నమాట ఎక్కడా ప్రయోగించలేదు; దాన్ని గురించి నేరుగా చెప్పనూ లేదు. నాటక 'ఇతివృత్తం' గురించి చెబుతూ, దాన్ని నాటక శరీరమన్నాడు. అంటే ఇతివృత్తంలో కథ ఇమిడి ఉంటుందన్నమాట. దశరూపక కారుడయిన ధనంజయుడు, నాటక ఇతివృత్తాలు మూడు రకాలుగా ఉంటాయన్నాడు (ప్రఖ్యాతం, ఉత్పాద్యం, మిశ్రం). కావ్యాలంకార గ్రంథకర్త భామహుడు, కథను స్పష్టంగా పేర్కొని, ఐదు రకాల పద్యకావ్యాల్లో అది ఒకటి అన్నాడు. (సర్గబంధ, అభివేయార్థ, ఆఖ్యాయిక, కథ, ముక్తక ప్రక్రియలు ఐదు). గద్య పద్య కావ్యాలను వేరు చేస్తూ రెండింటిలోను కథ ఉంటుందన్నాడు. సంస్కృతేతర భాషల్లో కూడా సాహిత్యం ఉందన్నాడు కాని, దాన్ని గురించి చర్చించలేదు.

దండి (కావ్యాదర్శం) గద్య సాహిత్య వర్గీకరణలో కథను పేర్కొన్నాడు. కాని, దానిలో రకాలను విభజించి చూపించలేదు; నిశ్చితమైన లక్షణమూ చెప్పలేదు. విషయపరంగా, కథకూ మహాకథకూ భేదం చెప్పలేదు.

రుద్రటుడు తన కావ్యాలంకారంలో ప్రబంధాలను (కావ్యాలను) ప్రధానంగా రెండు వర్గాలుగా చెప్పాడు - ఉత్పాద్యం, అనుత్పాద్యం అని. వీటిలో ఒక్కొక్కదాన్ని మహాకావ్యంగాను, లఘుకావ్యంగాను విడదీశాడు. ఖండకథను లఘుకావ్య వర్గంలో చేర్చాడు. లఘుకథను గురించి చెప్పేటప్పుడు సోమదేవుడి కథాసరిత్సాగరాన్ని దృష్టిలో పెట్టుకొన్నట్లు తెలుస్తుంది. కథకు నిశ్చితమయిన నిర్వచనం ఇయ్యలేదు.

ఆనందవర్ధనుడు (ధ్వన్యాలోకకర్త) కొన్ని కథాభేదాలను చెప్పాడు - పరికథ, ఖండకథ, సకల కథ, సర్గబంధం, ఆఖ్యాయిక, కథ మొ॥వి. వీటిలో ప్రతి ఒక్కదానికీ పద సంఘటన (మాటల కూర్పు)లో కొన్ని వైవిధ్యాలుండాలన్నాడు. కథా, ఆఖ్యాయికా అన్నవి చాలావరకు వచనంలో ఉంటూ కొన్ని పద్యలక్షణాలను నిలుపుకొంటాయి. కథను అతడు ఏ సందర్భంలోనూ గద్యరచనతో సమానం చేసి చెప్పలేదు. కథలోని పదాల ప్రయోగరీతిలో 'రసానుగుణత' ఉండాలన్నాడు.

హేమచంద్రుడు 'కావ్యానుశాసనం'లో కథను గురించి, దాని విభాగాలను గురించి కొంతవరకు వివరంగా చెప్పాడు – ఆఖ్యానం, నిదర్శనం, ప్రవహ్లిక, మతల్లిక, మణికుల్య, పరికథ, ఖండకథ, ఉపకథ, బృహత్కథ, ఖండకథ, పరికథ, సకలకథ

ధ్వన్యాలోకంలోను, అగ్నిపురాణంలోను ఉన్నవే అయినప్పటికీ వాటికి హేమచంద్రు డిచ్చిన నిర్వచనాలు వేరుగా ఉంటాయి. మొదటి ఐదు రకాలనూ ఇతరులెవరూ చెప్పలేదు. దండి మాత్రం ఆఖ్యాయికను యథాలాపంగా చెప్పి ఊరుకొన్నాడు. హేమచంద్రుడు 'బృహత్కథ'ను ఒక గ్రంథనామంగా కాక, ప్రక్రియానామంగా పేర్కొనడం విశేషం.

విశ్వనాథ కవిరాజు (సాహిత్యదర్పణం), "కథాయాం సరసం వస్తు" (కథరసంతో నిండి ఉండాలి) అన్నాడు కాని కథను ప్రత్యేకంగా నిర్వచించలేదు. కథకు రసాన్నే సారంగా గ్రహించాడు; కథనం వచనంలో ఉండాలన్నాడు.

సోమదేవుడు 'కథాసరిత్సాగరం'లో, అక్కడక్కడ ప్రయోగించిన విశేషణాలను బట్టి కొన్ని లక్షణాలు తెలియవస్తాయి (చూడండి : ప్రొ॥ నళినీసాధళే రచించిన 'కథా ఇన్ సంస్కృత్ పొయటిక్స్, 1986)

1. రమ్యా : మనస్సుకు ఉల్లాసం కలిగించాలి కథ.
2. హృద్యా : హృదయాన్ని స్పృశించాలి (కదిలించాలి).
3. హారిణీ : శ్రోతను (చదువరిని) బాగా ఆకట్టుకొని తన వెంట తీసుకుపోవాలి.
4. చిత్రా : చెప్పిన విషయం, చెప్పే తీరు ఆకర్షకంగా ఉండాలి.
5. ఉదారా : తెలిపే విషయం సమృద్ధిగా ఉండాలి.
6. విచిత్రార్థా : విసుగెత్తించగూడదు కాబట్టి వైవిధ్యముండాలి.
7. అర్థ్యా : ప్రయోజనవంతమయి ఉండాలి.
8. అపూర్వా/ నూతనా : సరికొత్తగా ఉండాలి.
9. స్వల్పా : చిన్నగా ఉండవచ్చు కాని హృదయానికి సంతోషం కలిగించాలి.
10. మహాకథా : కథ దీర్ఘంగానూ ఉండవచ్చు; బహుళ ప్రయోజన వంతంగానూ ఉండవచ్చు.
11. దివ్యా : అలౌకికతతో ఆకర్షకం కావచ్చు.
12. వినోదినీ : వినోదం కలిగించే గుణాలు ఉండాలి.

13. శిక్షావతీ : వినోదింపజేస్తూనే బోధ చేస్తూ ఉండాలి.

14. బుద్ధి విభవసంపన్నా: బుద్ధి బలంతో విషయావగాహనను పెంచేటట్లు ఉండాలి.

15. రుచిరా : ఆసక్తికరంగా ఉండాలి.

16. అద్భుత విచిత్రార్థరుచిరా: ఆశ్చర్యం కలిగించే విషయ వర్ణనవల్ల వైవిధ్యం సమకూరి ఎక్కువ ఆసక్తికరం అయేలా ఉండాలి.

17. ముగ్ధ విషయా : కథావిషయం మూర్ఖుణ్ణి గురించి కూడా ఉండవచ్చు.

సోమదేవుడి ఆలోచనలోని పరిపక్వత, సహేతుకత పై అంశాల ద్వారా మనకు తెలియవస్తాయి.

సంస్కృత లాక్షణికులూ కథారచయితలూ కథను గురించి చెప్పిన అంశాలతో బాటు, 'అగ్నిపురాణం'లో సాహిత్య శాస్త్రపరమయిన అధ్యాయాల్లో 337వ అధ్యాయం మనకు ముఖ్యమయినవి. ఇందులో 12వ శ్లోకంలో, కథాత్మక సాహిత్యంలోని ఐదు ప్రక్రియా భేదాలు చూడవచ్చు : ఆఖ్యాయిక, కథ, ఖండకథ, పరికథ, కథానిక. వీటిలో మొదటి నాలుగింటినీ ఆనందవర్ధనుడు కూడా చెప్పాడు. ఆయన చెప్పిన సకల కథ 'అగ్నిపురాణంలో లేదు. కాని, చివరిది – 'కథానిక' – మరెక్కడా కనిపించదు. దానికి నిర్వచనం ఇలా ఉంది:

"భయానకం సుఖపరం గర్భే చ కరుణోరసః

అద్భుతోఽ ంతే సుక్లుప్తార్థా నోదాత్తా సాకథానికా." (337.20)

కథానిక క్లుప్తంగా ఉండాలి; దూరంగా సాగిపోక పొందికగా ఉండాలి. ఇది మొదటి లక్షణం. పెద్ద పెద్ద సమాసాలతోను వర్ణనలతోను కథాశరీరం బిగిసిపోకుండా అనుదాత్తంగా ఉండాలి. ఇది రెండో లక్షణం. ఈ రెండూ, కథానికకు అగ్ని పురాణం చెప్పిన బాహ్యలక్షణాలు.

పఠితను ఆకట్టుకొనే విధంగా ఆరంభంతో భయానకత ఉండాలి. కథాగర్భంలో హృదయాన్ని కరిగించే విధంగా కరుణరసాత్మకమయిన సన్నివేశం ఉండాలి. చివరికి, పఠిత ఊహించని విధంగా అద్భుతావహంగా ముగిసిపోవాలి. రసప్రాధాన్యపరమయిన ఈ మూడూ అభ్యంతర లక్షణాలు.

సంస్కృత సాహిత్యశాస్త్రంలో కథను గురించి వివిధ లాక్షణికులు వెల్లడించిన అభిప్రాయాలను తులనాత్మకంగా పరిశీలించిన ప్రొ॥ నళినీ సాధళే, తామే స్వతంత్రంగా ఒక నిర్వచనమిచ్చారు:

"కథాయా లక్షణం జ్ఞేయం సారత్వేన నిరూప్యతే,

ఉత్పాద్యం సరసం హృద్యం వస్తు సంకీర్తయే కథా"

అంటే – రచయిత ఊహలో పుట్టి, రసవంతమయి, హృదయాన్ని ఆకట్టుకొనే వస్తువును 'కథ' అంటారు (కథా ఇన్ సంస్కృత్ పొయటిక్స్, 1986, పుట. 66)

ఈ పరిశీలనలో మనకు తెలియవస్తున్నవి ఏమిటంటే,

1. పూర్వలాక్షణికులు కావ్యలక్షణ పరిశీలన మీద చూపించిన శ్రద్ధ కథ మీద చూపించలేదు.
2. కథను ప్రస్తావించినవాళ్ళు దాన్ని వస్తువుగానే పరిగణించారు. అది గద్యపద్య రూపాలు రెంటిలోనూ ఉంటుందన్నారు.
3. కథాభేదాలను చూపినవాళ్ళు పదసంఘటన (మాటలకూర్పు)ను బట్టి దాన్ని వింగడించారు. వాటిని స్పష్టంగా నిర్వచించలేదు.
4. అగ్నిపురాణం ఒక్కటే కథానికను ప్రత్యేక ప్రక్రియగా గుర్తించి నిర్వచించింది.
5. కథానిక వేరు, కథ వేరు – కథానిక ప్రక్రియ, కథ వస్తువు
6. 'కథ్' అనే ధాతువుకు చెప్పడమని అర్థం. చెప్పినదెల్లా 'కథ' అనిపించుకుంది. అది అన్ని ప్రక్రియల్లోనూ ఉంది.

తెలుగులో, అన్ని భాషల్లో మాదిరిగానే, జానపద సాహిత్యం ముందు పుట్టిందని మనకు తెలుసు. అందుల్లో కథలున్నాయి. పాటలున్నాయి. వాటిలో, ఇంద్రియ జ్ఞానానుభవాన్ని బట్టి పుట్టినవే ఉన్నాయి, ఊహించినవీ ఉన్నాయి. వాటిని చెప్పడంలోను, పాడటంలోను ఉన్న నేర్పు శ్రోతలను ఆకట్టుకొంటుంది. వేడుకనిస్తుంది. అవి ఒక తరం నుంచి మరొకతరానికి, ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి చేరుతూ ఉంటాయి. ఇదంతా మౌఖిక సాహిత్యం. లిఖిత సాహిత్యం పుట్టిన తరవాత కూడా మౌఖిక సాహిత్యం, ఎంతో కొంత మేరకు, మనుగడ సాగిస్తూనే ఉంది. ఈ రెండూ ఒక దాన్నొకటి ప్రభావితం చేస్తూనే ఉన్నాయి; పోషిస్తూనే ఉన్నాయి. మౌఖిక

కథలు లిఖిత సాహిత్యంలోకి ప్రవేశించాయి; లిఖిత సాహిత్య కథలు మౌఖికంగానూ ప్రసారమవుతూ వచ్చాయి. ఇవి ఒక భాషకే పరిమితమయి ఉండవు. రెండు భాషలూ తెలిసినవాళ్ళ ద్వారా, ఒక భాషలోవి మరొక భాషలోకి చొరబడుతూండటం కద్దు. అలాగే ఒక ప్రక్రియలో ఉన్న వస్తువు మరొక ప్రక్రియలోకి ప్రవేశిస్తూ ఉంటుంది. సన్నిహిత ప్రాంతాలకేకాదు, దూరప్రాంతాలకు కూడా వ్యాపిస్తూ ఉంటాయి. ఏది ఎక్కడ పుట్టి ఎక్కడికి వెళ్ళిందో చెప్పలేని పరిస్థితి కూడా ఉంటుంది (ఉదా: తెలుగులో, 'ఎండని చేప' కథ. ఇదే కథ, కొద్దిపాటి మార్పుతో, అస్సాములోని చిన్న పిల్లల పాటలో కనిపిస్తుంది).

తెలుగు కథ నాలుగు కొమ్మల మీద గూళ్ళు కట్టుకుందని మనకు తెలుసు. (1) గేయకథాశాఖ (2) ప్రాచీనకావ్యశాఖ (3) ప్రాచీన కథాకావ్యశాఖ (4) వచన కథాశాఖ. బాలనాగమ్మ కథ, పల్నాటియుద్ధం కథ, గుర్రాల గోపిరెడ్డికథ, ఆరెమరాఠీల కథ మొ॥వి మొదటి శాఖవి. మహాభారతకథ, కుమార సంభవ కథ, కాశీఖండం, భీమఖండం, మనుచరిత్ర, ఆముక్తమాల్యద, వసుచరిత్ర మొ॥వి రెండో శాఖవి. దశకుమార చరిత్ర, సింహాసన ద్వాత్రింశిక, శుకసప్తతి, హంసవింశతి మొ॥వి మూడోశాఖవి. విక్రమార్క చరిత్రము, మదనకామరాజు కథలు, కాంభోజరాజు కథలు, పలుకని పద్మాక్షి కథలు, తెనాలి రాముని కథలు, తాతాచార్లకథలు, పంచతంత్ర కథలు మొ॥వి నాలుగోశాఖవి. వచన కథలు కొన్ని కావ్యభాషలోను, కొన్ని వాడుక భాషలో కావ్యభాషను కలిపి రాసినవీ ఉన్నాయి.

1848లోనో 1862లోనో మొదలయిన 'హితవాది' పత్రిక (సంపాదకుడు : జాన్ ఎడ్మండ్ షార్కీ)లో ప్రచురణ అయిన కథలు, క్రైస్తవ మత ప్రచారం కోసం చేసిన అనువాదాలు. బెషీ అనే మత ప్రచారకుడు 1861లో 'పరమానంద గురువుల కథలు ప్రచురించాడు. తడకమళ్ళ వెంకట కృష్ణారావు 1864లో 'కామరూపకథ' అనే దాన్ని కావ్యభాషలో రాశాడు. ఎర్రమిల్లి మల్లికార్జునుడి 'చార్దర్వేషుకథలు' (నలుగురు పకీరుల కథలు) వాడుక భాషలో ఉంది. ఇది 1863 నుంచి 1912 వరకు చాలాసార్లు పునర్ముద్రిమయిందని గురజాడ అప్పారావుగారు అన్నాడు. ఈ మాదిరి కథలు ఎన్నో కొన్ని, పత్రికల్లోనో, పుస్తకరూపంలోనో అచ్చవుతూనే వచ్చాయి. వాటిలో మనకిప్పుడు ఎన్ని దొరుకుతాయో, ఏవి దొరుకుతాయో చెప్పలేం, కాని,

వాటిని గురించి స్థూలంగా ఒక్క విషయం మాత్రం చెప్పవచ్చు. వాటికి కథ ఎలా మొదలుపెట్టాలి, ఎలా నడపాలి, ఎలా మలుపు తిప్పాలి, ఎలా ముగించాలి, కథకుడు ఎలా చెప్పాలి, పాత్రల చేత ఎలా మాట్లాడించాలి – అన్నవాటితో నిమిత్తం లేదు. వస్తువు ఒక్కటే ప్రధానం. ఇలాంటి కథలు మనకు ఎప్పటినించో ఉన్నాయి; ఇప్పుడు దొరికినా, దొరక్కపోయినా, శిల్పప్రధానమయిన ప్రక్రియావిశేషంగా అప్పటివాళ్ళు దాన్ని తలచినట్లు కనిపించదు.

అయితే గురజాడ అప్పారావుగారికి చిన్నప్పటినుంచి కథల మీద ఆసక్తి ఉంది; ప్రత్యేక శ్రద్ధ ఉంది. దీనికి దాఖలా ఆయన డైరీల్లో కనిపిస్తుంది. 1895 ఫిబ్రవరి 12, బుధవారం నాడు 'కథలు' అన్న శీర్షిక కింద ఎనిమిది కథల పేర్లను ఆయన డైరీలో రాసి పెట్టుకొన్నారు. అదే నెలలో 20వ తేదీన 'కథాసప్తతి' అనే పుస్తకం కొనుక్కున్నారు. ఫిబ్రవరి 26 మంగళవారంనాడు, 'మిస్టర్ అండవుడ్‌కు కథలు' అన్న శీర్షిక కింద 14 కథలు రాసిపెట్టుకొన్నారు. మార్చి 10, ఆదివారం నాడు మరో పది కథల పేర్లు రాసుకోడం గమనించవచ్చు. 1895 ఏప్రిల్ 28 ఆదివారం నాడు డైరీలో రాసుకొన్న దాంట్లో ఒక విశేషముంది. ఆయన దగ్గర పనిచేసే వంటలక్క ఒక కథ చెప్పింది; అది యథార్థంగా జరిగిందనీ, అందులో పురుషపాత్ర ఫలానా 'వి.ఎస్.ఆర్.' అని కూడా చెప్పింది. ఈ కథ అప్పారావుగారికి నమ్మబుద్ధి కాలేదు. బహుశా, అది మరోలా జరిగి ఉంటుందని ఊహించారు. ఈ రెండు పాఠాలూ రాసి పెట్టుకొన్నారు. తరువాత, ఆ కథలో ముఖ్యపాత్ర అయిన 'వి.ఎస్.ఆర్.'ను కలుసుకోడం తటస్థించింది. వెనక తాను విన్న విషయాన్ని గురించే ఆయన చెప్పింది వేరే విధంగా ఉంది. ఒకే వృత్తాంతం తాలూకు ఈ మూడు పాఠాలను సమన్వయం చేసి చూసుకొన్నమీదట 'మెటిల్డా' కథ రాయడానికి ప్రేరణ కలిగింది. అదే సంవత్సరం డైరీలో మే 11వ తేదీన, శనివారం నాడు, "ప్రహ్లాదనాటక ప్రదర్శనలోని నటుల అభినయమును, ఏదైనా ఒక స్కెచ్‌లో వర్ణించవలెను" అని రాసుకొన్నారు. "నేను వ్రాతామని వేసుకున్న సాహిత్యప్రణాళిక" (మహాకవి డైరీలు, పుట. 136) అన్న శీర్షిక కింద, చారిత్రికాది గ్రంథాలతోబాటు, "ఇంగ్లీషులో ప్రచురించుటకై ఆంగ్లములో కొన్ని కథలు" అని కూడా పేర్కొన్నారు. "Stooping to Rise" అన్న కథ అందుకు ఉదాహరణ (దీనికి అవసరాల సూర్యారావు చేసిన అనువాదం పేరు : సంస్కర్త హృదయం).

ఈ సాక్ష్యాధారాలను బట్టి, కథానికా రచనకు గురజాడవారి పూనిక కనీసం 19వ శతాబ్ది కడపటి దశకం నుంచి ఉన్నట్లు తెలుస్తుంది. అంతేకాక, ఆయా రచనల్లో ఆయన తీర్చిదిద్దిన పాత్రలూ వాళ్ళ చుట్టూ చిత్రించిన పరిస్థితులు, వాళ్ళకెదురయిన సమస్యలూ భాషాశైలీ చాలావరకు ఆ శతాబ్దివే కావడం గమనించవచ్చు. అందుకే కె.వి. రమణారెడ్డిగారు (మహోదయం 1969, పుట. 335, 256) ఇలా అన్నారు:

"గారడీవాని మామిడిమొక్కలాగా, గురజాడ అప్పారావు చేతిలో తెలుగు కథ అప్పటికప్పుడు మొలిచి పూచి కాచింది. సాహిత్య విషయాలలో కూడా అద్భుతాలనేవి ఉంటే, ఇది అలాంటిది (పు. 335).... మధిర సుబ్బన్న దీక్షితుల కాశీమజిలీలు, ఎర్రమిల్లి మల్లికార్జునుడి చార్‌దర్వేష కథలు, తాతాచార్యుల కథలు వగైరా వగైరా తెలుగువాళ్ళకు కాలక్షేపాన్నీ వినోదాన్నీ కలిగించే రోజులలో, గురజాడ అప్పారావు కథారచనలో పరిపూర్ణమయిన విప్లవమే కలిగించాడు. చిన్నకథ (కథానిక) అప్పారావు మానస పుత్రిక (పు. 256)".

రమణారెడ్డిగారే కాదు, అంతకు పూర్వం - 1910 నుంచి తల్లావజ్ఝల శివశంకరశాస్త్రి, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, భమిడిపాటి కామేశ్వరరావు, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, పాలగుమ్మి పద్మరాజు మొదలైన సాహితీవేత్తలందరూ ఆధునిక కథకు (శిల్ప ప్రధానమైన 'కథానిక'కు) గురజాడవారే ఆద్యులని అనేక సందర్భాల్లో ప్రకటించారు.

అప్పారావుగారు రచించినవి ఐదు కథానికలు : దిద్దుబాటు, మీ పేరేమిటి, మెటిల్డా, పెద్ద మసీదు, సంస్కర్త హృదయం. వీటిలో 'దిద్దుబాటు' 1910 ఫిబ్రవరి నెల 'ఆంధ్రభారతి' పత్రికలో అచ్చయింది. దీన్నిబట్టి, తెలుగు కథానికల్లో 'దిద్దుబాటు' మొదటిదన్న గుర్తింపు వచ్చింది. కేవలం ప్రచురణ తేదీని బట్టి మాత్రమే కాక, రచనాశిల్పపరంగా కూడా దీన్ని తొలి తెలుగు కథానికగా గుర్తించవచ్చు. దీనికి ప్రమాణాలు మూడు : (1) శిల్పం (2) వస్తువు (3) భాష.

ఎత్తుగడ మొదటి ముగింపు వరకు రచయిత చూపే కళానైపుణ్యమే శిల్పం. కథానికకు అదే గీటురాయి. 'ఎక్కడ ప్రారంభించాలి, ఎలా ప్రారంభించాలి, ఏయే పాత్రలను ప్రవేశపెట్టాలి, వాళ్ళచేత ఎలా మాట్లాడించాలి, ఎలా నడపాలి, ఎలా మలుపుతిప్పాలి, ఎలా మెరుపు చూపాలి, ఎలా ముగించాలి' అన్న ప్రశ్నలు మామూలు

కథారచయిత దృష్టిని ఆకర్షించవు. కథకు ముందు కొంత ఉపోద్ఘాతం, దేశకాలవర్ణన, పాత్రల పుట్టుపూర్వోత్తరాలు, వగైరాలతో ఒంటెద్దు బండిలా నిదానంగా నడిచేది కథ. ఎక్కడో హఠాత్తుగా మొదలయి చకచకా సాగుతూ, అత్యవసరమయిన పాత్రలను మాత్రమే ప్రవేశపెడుతూ, అవసరమయినమట్టుకే చెబుతూ, అవసరమయినమట్టుకే మాట్లాడిస్తూ, అవసరమయినమట్టుకే వర్ణిస్తూ ఆద్యంతాలను సమన్వయం చేసే విధంగా ఏకసూత్రతను పాటిస్తూ సాగేది కథానిక. పూర్వరచయిత, తన మనస్సులో ఉన్నదంతా చెప్పేస్తేనే కాని తృప్తి పడేవాడు కాడు. ఆధునిక కథానికా రచయిత పాఠకుడిని చెప్పవలసిన దానికి మించి ఒకమాట కూడా అదనంగా చేర్చడు. ఈ శిల్పనైపుణ్యం అప్పారావుగారి 'దిద్దుబాటు'లో స్పష్టంగా కనిపిస్తుంది. అంతకుముందటి రచనల్లో ఇది లేదు.

రెండో విషయం వస్తువు. ఏ కాలంలో జీవించే రచయిత ఆ కాలపు కథావస్తువును ఎన్నుకోడం సాధారణం. 'దిద్దుబాటు'తో వస్తువు సమకాలికమయినదే. వేశ్యా వ్యామోహంలో పడి ఇంటినీ ఇల్లాలినీ విస్మరిస్తున్న గోపాలరావును చక్కదిద్దడానికి, అతని భార్య కమలిని చేసిన ప్రయత్నాన్నీ దాని సాఫల్యాన్నీ వస్తువుగా ఎన్నుకొన్నారు అప్పారావుగారు. ప్రతిభావంతంగా కథ నడిపించారు. అయితే కథానికారచయితకు, సమకాలికమయిన వస్తువునే ఎన్నుకోవాలన్న నిర్బంధం లేదు. ఏనాటి వస్తువునయినా శిల్పనైపుణ్యంతో, సమకాలిక భాషలో రచించి మెప్పించవచ్చు.

మూడో విషయం భాష : ఏకాలంలో జీవించేవాడు ఆ కాలపు భాషలో మాట్లాడటం, ఆలోచించడం, రాయడం సహజం. కాబట్టి వరచన రచనా వ్యాసంగం కూడా ఆ భాషల్లో సాగడం ప్రతిదేశంలోనూ ఉంది; దాదాపు ప్రతిభాషలోనూ ఉందని చెప్పవచ్చు. తెలుగులో కూడా చిన్నయసూరి ప్రాబల్యం నెలకొనేవరకు ఆ సంప్రదాయమే చాలావరకు కొనసాగుతూ వచ్చిందని చెప్పడానికి దాఖలాలు ఉన్నాయి. దాన్ని పునరుద్ధరించాలన్న ఆశయం అప్పారావుగారికి అత్యంతముఖ్యమయినది. 'కన్యాశుల్కం' నాటక రచనలో అది కనిపిస్తుంది. తరవాత రచించిన కథానికల్లోను, గేయాల్లోను, మద్రాసు విశ్వవిద్యాలయం వారి 'కాంపోజిషన్ సబ్ కమిటీ' నివేదికకు నిరసనగా జోడించిన 'డిసెంట్ పత్రం'లోను అది ప్రతిఫలించింది. గిడుగు రామమూర్తి గారికి, పి.టి. శ్రీనివాస అయ్యంగారికి తోడుగా అప్పట్లో వారు నిర్వహించిన

ఉద్యమం ఎట్టకేలకు ఫలించింది. 'దిద్దుబాటు' కథను మొదట్లో, 'కమలిని' పేరుతో గ్రాంథికంలో రాసి తరువాత వాడుకభాషలోకి మార్చుకొని ఉండవచ్చు. అయినా, అది రచయిత కథనం ఉన్నంతమట్టుకే. సంభాషణలు పాత్రోచితమయిన వాడుక భాషలోనే సాగాయి. ఈ పని, అంతకుముందటి రచయితలెవ్వరూ చెయ్యలేదు.

ఇంతటి సమగ్ర దృష్టి, సమకాలిక భావన, శిల్ప విన్యాస నేతృత్వం పెనగొన్న వ్యక్తిత్వం కావడం వల్లనే అప్పారావుగారు, పాశ్చాత్య కథానికాశిల్పాన్ని అవగాహన చేసుకొని, శిల్పవస్తు భాషాశైలులరీత్యా ఆధునికమనిపించుకోదగ్గ ప్రక్రియకు ఆద్యులయ్యారు; అనంతర కాల రచయితలకు మార్గదర్శకులయ్యారు.

ఇటీవలి కాలంలో కొందరు, కేవలం ప్రచురణ తేదీని మాత్రమే పరిగణించి పెట్టుకొని, తెలుగు కథానికకు ఆద్యులు అప్పారావుగారు కారంటూ వివాదం కల్పించారు. దాన్ని దృష్టిలో ఉంచుకొని శ్రీకాకుళంలోని 'కథానిలయం'వారు, "తొలి తెలుగు కథ – ఏడు అభిప్రాయాలు" పేరుతో ఒక చిన్న పుస్తకం ప్రచురించారు (ఫిబ్రవరి, 2006). అందులో ఉన్న కథలు ఇవీ:

ధనత్రయోదశి : భండారు అచ్చమాంబ (1902 నవంబరు, 'హిందూసుందరి')

స్త్రీవిద్య (భార్యాభర్తల సంవాదము) :: భండారు అచ్చమాంబ (1902, నెల తెలియదు)

లలిత :: ఆచంట వేంకటరాయ సాంఖ్యాయన శర్మ (1903 నవంబరు, 'కల్పలత')

విశాఖ–1:: ఆచంట వేంకటరాయ సాంఖ్యాయన శర్మ (1904 అక్టోబరు, 'కల్పలత')

విశాఖ–2:: ఆచంట వేంకటరాయ సాంఖ్యాయన శర్మ (1904 నవంబరు, 'కల్పలత')

అపూర్వోపన్యాసము:: ఆచంట వేంకటరాయ సాంఖ్యాయన శర్మ (1903 నవంబరు, 'కల్పలత')

దిద్దుబాటు :: గురజాడ అప్పారావు (1910 ఫిబ్రవరి, 'ఆంధ్రభారతి')

హృదయశల్యము:: మాడపాటి హనుమంతరావు (1912 జనవరి, 'ఆంధ్రభారతి')

పైవాటిలో, 'దిద్దుబాటు'లో తప్ప, తక్కినవాటిలో, కథానికకు ప్రాణమయిన

శిల్పం కొరవడింది. కాబట్టి వాటిని కథలుగానే కాని కథానికలుగా పరిగణించలేము. విశాఖ-1,2లలోను, హృదయశల్యము'లోను తప్ప, కథావస్తువులు సమకాలికమైనవే. 'దిద్దుబాటు'లో తప్ప తక్కిన వాటిలోని భాషాశైలీ నిర్వహణలో దోషభూయిష్ఠంగా ఉన్నాయి. 'స్త్రీవిద్య' ప్రాముఖ్యాన్ని గురించి భార్యాభర్తల మధ్య జరిగిన సంవాదమే రెండో కథ. సంభాషణలు పాత్రోచితభాషలో లేవు. ఆచంటవారి రచనలుగా పేర్కొన్న పై వాటిలో రచయితగా ఆయన పేరు 'కల్పలత'లో ప్రచురణ కాలేదు. ఆయన ఆ పత్రికకు సంపాదకులు మాత్రమే. పైగా, ఆ రచనలకు 'నవలిక' అని పేరు పెట్టినట్లు తెలుస్తోంది. 'అపూర్వోపన్యాసము' పరమ చెత్తకథ. 'హృదయశల్యము' చారిత్రిక నేపథ్యంలో ఉన్నందుకు ఆక్షేపణ లేదు కాని, నిర్వహణలో శిల్పంలేదు; భాష (సంభాషణలతో సహా) సరళగ్రాంథికం. అప్పారావుగారి కథ అచ్చయిన రెండేళ్ళకు వచ్చింది ఇది. కాబట్టి 'దిద్దుబాటు' ఒక్కటే ఆధునిక కథానిక అని చెప్పవచ్చు.

ఇవి ఇలా ఉండగా, భండారు అచ్చమాంబగారు 'ప్రేమపరీక్ష' పేరుతో రచించిన కథ ఒకటి 1898లో, 'తెలుగు జనానా' పత్రికలో వచ్చినట్లు రాయసం వెంకట శివుడుగారు ఎక్కడో రాసినట్లు తెలియవస్తున్నది. కాని ఆ కథ ఇంతవరకు ఎవరికీ దొరకలేదు. ఒకవేళ దొరికితే, శిల్పవస్తువు భాషాశైలుల రీత్యా అది ఆధునికతా ప్రమాణాలకు నిలిచేటట్లయితే, దాన్ని తొలి తెలుగు కథానికగా స్వీకరించడానికి ఎవ్వరికీ అభ్యంతరం ఉండదు. కాని ఇప్పటివరకు లభ్యమయిన రెండు కథలనూ చూసినప్పుడు (అంతకు ముందు రాసిన 'ప్రేమపరీక్ష' ఆశాజనకంగా ఉంటుందని చెప్పలేము. కాబట్టి అప్పారావు 'దిద్దుబాటు'ను తొలి తెలుగు కథానిక అని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు.

చివరగా, కొన్ని ప్రముఖ భారతీయ భాషల్లో, తొలి 'చిన్నకథ'గా గుర్తింపు పొందిన వాటిని ఈ సందర్భంగా తలుచుకోడం సముచితమనుకొంటాను:

భాష	రచయిత	రచన
బెంగాలీ	పూర్ణచంద్ర చటర్జీ	మధుమతి, 1872
హిందీ	చంద్రధర్‌శర్మ 'గులేరీ'	ఉస్నే కహాథా, 1911
	బంగ మహిళా	'ద బ్రైడ్', 1911
	కిశోరీలాల్ గోస్వామి	ఇందుమతి, 1911
కన్నడం	పంజేమంగేశ్‌రావు	'మై ఆంట్', 1900

మలయాళం	కుంజురామన్ నాయనార్	'ద మిస్చీఫ్ ఆఫ్ హాబిట్, 1891
మరాఠీ	విష్ణుఘనశ్యామ్	(కథ పేరు తెలియదు), 1854
తమిళం	సుబ్రమణియ భారతి	'ఒన్ సిక్స్త్ షేర్', 1913
	వి.వి.ఎస్. అయ్యర్	'చెరువుగట్టున రావిచెట్టు', 1915
తెలుగు	గురజాడ అప్పారావు	(పేరు ఇవ్వలేదు)
	ఆచంట వేంకటరాయ సాంఖ్యాయనశర్మ	

(ఈ సమాచారానికి ఆధారం : 2009 సెప్టెంబరు 'భవన్స్ జర్నల్'లో, 'ద డిక్లయినింగ్ షార్ట్‌స్టోరీ' అన్న పేరుతో వి. శివరామకృష్ణన్ ప్రచురించిన వ్యాసంలో ఇచ్చినది. దీనికి మూలం కేరళ సాహిత్య అకాడమీ వారి 'కంపారెటివ్ ఇండియన్ లిటరేచర్' (1985, సంపుటం-2లో ఉన్నది)

●

తెలుగు కథానిక - వికాసదశ

◆ డా॥ వేదగిరి రాంబాబు

"గురజాడ కథారచనతో తెలుగు" కథానిక పుట్టగానే యవ్వనదశనందుకుంది అన్నారు పాలగుమ్మి పద్మరాజు.

1910 ఫిబ్రవరి 'ఆంధ్రభారతి' మాసపత్రికలో 'దిద్దుబాటు' అనే గురజాడ కథ ప్రచురితమైంది. అంతకుముందు వచ్చిన కథలకు ఇది చాలా భిన్నంగా ఉందని గుర్తించారు.

అప్పట్లో వేశ్యాలోలత్వం మగవాళ్ళలో ఎక్కువగా ఉండేది. 'దిద్దుబాటు' వస్తువు అది.

మొదట్లో గురజాడ కమలిని పేరుతో ఈ కథను గ్రాంథికంలో రాసారు. గిడుగు, గురజాడ వ్యవహార భాషావశ్యతకను చర్చల ద్వారా ఉపన్యాసాల ద్వారా అందరికీ తెలియజెప్పడమే కాకుండా, గురజాడ తనని తాను 'దిద్దుబాటు' చేసుకుంటూ అంతకుముందు గ్రాంథికంలో చేసిన రచనలను వ్యవహారిక భాషలోకి తిరగరాసారు. అలా దిద్దుబాటు గ్రాంథికం నుంచి వ్యవహారికంలోకి మార్చడం జరిగింది.

అందుకే గొర్రెపాటి వెంకట సుబ్బయ్య వ్యవహారిక భాషావాదాన్ని ప్రవేశపెట్టి లక్ష్యమును చెప్పినవారు – గిడుగు రామ్మూర్తి పంతులు. ఆయన లక్ష్యమునకు లక్షణము చూపినవారు – గురజాడ వేంకట అప్పారావు. సలక్షణమైన ఆధునిక కథలు వ్రాసినవారు ప్రథమంగా వారే!" అన్నారు.

తల్లావఝ్ఝల శివశంకరశాస్త్రి "హిందీ భాషలో ఆధునిక కథ పుట్టిన రోజులలోనే ఆంధ్రములో కూడా ఆధునిక కథ అవతరించింది. గురజాడ అప్పారావు పంతులు వాడుకభాషలో చెప్పిన 'దిద్దుబాటు' వల్ల 'తెలుగులో వెలుగు బయల్దేరింది' అన్నారు.

"కథానిక పై లక్షణ గ్రంథాన్ని లేక వ్యాసాన్ని గురజాడ వ్రాయకపోయినా మంచి ఆధునిక కథకు ఉండవలసిన లక్షణాలేవో ఊహించుకోవడానికి వీలుగా అప్పారావు పంతులుగారు భావికథారచయితల ముందుంచిన లక్ష్యము –దిద్దుబాటు" అన్నారు మధురాంతకం రాజారాం.

అంతవరకూ వచ్చిన కథలు గ్రాంథికమే కాక ఉపోద్ఘాతాలతోనో, వర్ణనలతోనో ప్రారంభమవుతుండేవి. కథని పాత్రలతోను, సంఘటనలతోను చెప్పుకుపోతూ హఠాత్తుగా రచయిత లేక రచయిత్రి మధ్యలో ప్రవేశించి తన అభిప్రాయాల్ని వ్యాఖ్యానించడం జరుగుతుండేది. కానీ 'దిద్దుబాటు'తో మధ్యలో ఎక్కడా రచయిత జొరబడరు. ప్రారంభం సరాసరి కథలోకి వెళ్ళడం జరుగుతుంది.

'తలుపు... తలుపు...' అంటూ తలుపు తట్టడంలో ప్రారంభమవుతుంది. అలా గురజాడ ఆధునిక కథ తలుపులు తట్టి తెరిచారు.

కథలో కూడా తలుపు కొట్టగానే ఎవ్వరూ తలుపు తియ్యరు. అనుమానం వచ్చి మళ్ళీ తలుపులు తడతాడు. ఇలా రెండవసారి, తలుపులు తట్టడాన్ని గురజాడ 'దిద్దుబాటు'ని వ్యవహారిక భాషలోకి తిరగరాయడంతో పోల్చవచ్చు. లోపల చీకటి. దీపం లేదు.

చీకటిలో కూడా సృజనకారుడు తనదారి తాను తీసుకోగలడు. భార్య కమలినిని పిలుస్తాడు. జవాబు రాదు. నౌఖరు రాముణ్ణి కేకేస్తాడు. రాముడి పాత్రకి తగ్గ మాండలిక ప్రయోగం చేసారు గురజాడ.

ముందు గ్రాంథికంలో రాసినప్పుడు ఈ కథకి 'కమలిని' అనే పేరునే పెట్టారు గురజాడ. కానీ మంచికథకు శీర్షిక ముఖ్యమని – అది సూచనప్రాయంగా కథని చెప్పడం సముచితమని భావించి దిద్దుబాటుగా మార్చారు.

భార్య కమలిని తనతో చెప్పకుండా కోపం వచ్చి రాత్రికి రాత్రి పుట్టింటికి వెళ్ళిపోయిందని భయపడతాడు పంతులు. రాముడిని వెళ్ళి ఆవిడకి నచ్చజెప్పి, పంతులులో మార్పువచ్చింది – ఇక అలాంటి పనులు చేయడని నచ్చచెప్పి తీసుకురమ్మంటాడు. ఈ సందర్భంలో స్త్రీ విద్య ప్రాముఖ్యాన్ని చెబుతాడు. 'చదువుకున్న స్త్రీ భర్త ఎలా పడితే అలా, సంచరిస్తే ఊరుకోదనే, ధ్వని వినిపిస్తుంది.

"పంతులుకి బుద్ధి వచ్చిందని" చెప్పు అంటూ చెంపలు వేసుకోగానే అంతవరకూ మంచం క్రింద దాక్కొని నాటకాన్ని నడుపుతున్న కమలిని కిలకిలనవ్వుతూ బయటకు రావడంతో కథ ముగుస్తుంది.

చివరివరకూ కమలిని కనిపించకుండా భర్తని దిద్దుబాటు చేసుకోవడం కోసమని నాటకమాడినట్లు చూపిన శిల్పం అమోఘం. కమలిని కోపంతో భర్తతో వాగ్యుద్ధానికి దిగడమో ఇంట్లోంచి వెళ్ళిపోవడమో చెయ్యకుండా ఇంట్లో నుంచి కదలకుండా భర్త చెంపలు వేసుకునేట్టు చేసి అబలని కాదు సబలనని నిరూపిస్తుంది.

ఇలా గురజాడ వస్తుపరంగా, భాషాపరంగా, శిల్పపరంగా సంపూర్ణ ఆధునికతతో, ఆధునిక కథని తమచేతుల్లో– పదిహేనేళ్ళ మానసిక సంఘర్షణకి ఫలితంగా తీర్చి దిద్దారు. ఆంగ్ల షార్ట్ స్టోరీకి తక్కువ కాని విధంగా తెలుగు కథని తీర్చిదిద్దాలని గురజాడ పడ్డ పదిహేనేళ్ళ శ్రమ ఆయన డైరీల ద్వారా మనకి వ్యక్తమవుతోంది.

తర్వాత ఏమి జరుగుతుందో చదవాలనే ఉత్సుకతని కలిగించే ప్రారంభం, తీరైన నడక, ఊహించని ముగింపుతో బాటు ఏకాంశం, క్లుప్తత, స్పష్టతలాంటి లక్షణాలన్నీ 'దిద్దుబాటు'తో కనిపిస్తాయి. కాబట్టే మొదటి ఆధునికకథగా దీన్ని గుర్తించారు. నన్నయ్య ప్రాచీన సాహిత్యానికి ఆద్యులైతే గురజాడ ఆధునిక సాహిత్యానికి ఆద్యులు. ఆధునిక కథే కాదు, ఆధునిక గేయం, ఆధునిక నాటకాలకు కూడా ఆయన ఆద్యులు. అందుకే గురజాడని ఆధునిక యుగకర్త అన్నారు.

'ఆంధ్రభారతి' పత్రిక ఆధునిక సాహిత్యానికి పెద్ద అండగా నిలిచింది. గురజాడ 'దిద్దుబాటు' తర్వాత మీ పేరేమిటి? అనే కథ ఏప్రిల్, మే, జూన్ సంచికలో వరుసగా వచ్చింది.

వందేళ్ళ తర్వాత ఇప్పుడూ విమర్శకులు, విశ్లేషకులు గొప్ప కథగా భావిస్తున్నారు. దేముడు చేసిన మనుషుల్లారా! మనుషులు చేసిన దేవుళ్ళారా మీ పేరేమిటి? అంటూ నిలదీశారు గురజాడ. మతం ముసుగులోని దగాకోరుతనాన్ని ఎండగట్టారు ఈ కథ ద్వారా హిందూమతంలో వున్న శైవ, వైష్ణవ విభాగాలలోని కొందరు పోటాపోటీలు దగాబుద్ధులు, కబ్జాకోరుతనం – నాటకీయతతో కళకు కట్టించినట్టు చూపించారు ఈ కథలో.

పెద్ద మసీదు – 'మతము విమతము కథలో మతాలతోబాటు మారే ఊసరవెల్లుల్ని మనముందుంచారు.

బాబాయిని చూడడానికి ఎక్కడినుంచో అక్కడికి వస్తాడతను మిత్రుడితో గుడి ఉండే స్థానంలో మసీదు కనిపించడంతో – ఇక ఆ గుడి పూజారి బాబాయ్ అక్కడెందుకు ఉంటాడని వెనుతిరుగుతాడు. మసీదు అరుగు మీద పెరిగిన గడ్డంతో ఓ వ్యక్తి కూర్చుని ఉంటాడు. అతడి నింతకు ముందు చూసినట్లనిపించి అటు తిరుగుతాడు.

అతను మరెవరో కాదు – బాబాయ్! కథ ముగుస్తుంది. మన మస్తిష్కానికి పని పెడుతుంది.

గురజాడ మరో కథ 'సంస్కర్త హృదయం'. ఓ వేశ్యని సంస్కరించ ప్రయత్నించిన ప్రొఫెసర్ వేశ్యాలోలుడు కావడం పెద్ద పెద్ద పనులు చేయాలనుకునేవారికి పెద్ద మనసుండాలని చెబుతుంది కథ.

'మెటిల్డా' ముసలిమొగుడు పడుచుపెళ్ళాం కథ. అడవిలో ముక్కు మూసుకుని తపస్సు చేసుకునే మునులకన్నా జనారణ్యంలో రకరకాల ఆకర్షణల మధ్య బ్రతుకుతూ వాటికి లోనుకానివాడు గొప్ప అనే విషయాన్ని మనముందుంచుతుంది ఈ కథ.

అయిదు కథలతో హఠాత్తుగా తెలుగుకథని అందలం ఎక్కించి కూర్చోబెట్టారు గురజాడ.

ఆధునిక కథ గురజాడ చేతుల్లో యవ్వనంతో పుట్టినా – ఆ తర్వాత అది పది పదిహేనేళ్ళ దాకా పసితనానికి లోనై తప్పటడుగులు వేస్తూనే ఉంది.

ఆంధ్రభారతి తర్వాత 'త్రిలింగ, సువర్ణలేఖ' పత్రికలు కూడా ఆధునిక కథల్ని ప్రచురించాయి. 'మదరాసు కథలు' అనే కథాసంపుటి 1914 ప్రాంతంలోనే వెలువడింది. తల్లావఝుల శివశంకరశాస్త్రి 'మురారి' కథలు అనే శీర్షికతో కొన్ని కథల్ని రాశారు. అప్పటికి నేను గ్రాంథికవాదినే అని ఆయనే చెప్పుకున్నారు. సాహితీసమతి గట్టి పట్టుపట్టి ఎక్కువమందితో వ్యవహారిక భాషలో రచనలు చేసి ఇష్టాన్ని పెంపొందించడంతో 1920 తర్వాత ఆధునిక కథ క్రమంగా ఊపందుకుంది. 1915లో శ్రీపాదవారి మొదటి చిన్నకథ 'ఇరువురము ఒక చోటికే పోతము' కూడా. గ్రాంథికంలోనే రాశారు. ఆ తర్వాత ఆయన తనలో మార్పు తెచ్చుకుని వ్యవహారిక భాషలో రాయడం ప్రారంభించారు. మధ్య తరగతి ఆడవాళ్ళం ఇళ్ళలో మాట్లాడుకునే

భాషను వ్యవహారిక భాషగా స్వీకరించి ఆ భాషలో రాయడం ప్రారంభించానన్నారు.

శారద, కళ, భారతి సఖిలాంటి పత్రికలు 'కథలని ప్రచురిస్తూ, 'వైవిధ్యము, గౌరవము పెరిగేలా చేశాయి ఆధునిక కథ చిన్నవచన ప్రక్రియ కావడంతో పత్రికలలోనే పెరిగింది. పత్రికలలోనే ప్రయోగాలు జరిగాయి.

ఆధునిక కథ ప్రారంభదశలో వికాసం గురించి చెప్పేప్పుడే ముగ్గురి గురించి ముఖ్యంగా చెప్పుకోవాలి. ఒకాయనకి ఆంగ్ల తెలుగుతో బాటు ఆంగ్లభాషలోనూ చక్కటి ప్రవేశముండి, తెలుగు – ఆంగ్లభాషలలో రచనలు చేసే సామర్థ్యముండడం; మరొకాయనకి అనేక భారతీయ భాషలు బాగా వచ్చి ఉండడం; మూడో ఆయనకు ఆంగ్లం అసలు రాకపోవడం మన అదృష్టంగా భావించాలి. మొదటి ఆయన గురజాడ వేంకట అప్పారావు, రెండో ఆయన వేలూరి శివరామశాస్త్రి, మూడో ఆయన శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి. గురజాడకి ఆంగ్ల భాషతోనూ మంచి పరిచయముండడంతో తెలుగు కథకి ప్రత్యేక శిల్పం అబ్బింది. వేలూరి శివరామశాస్త్రి చిన్న వయసులోనే శతావధానం చేసారు. గొప్ప కవి అయినా మంచి ఆధునిక కథలు రాసారు. ఆయనకు అనేక భారతీయ భాషలు రావడంతో బెంగాల్, గుజరాత్, హిందీలాంటి భాషల నుంచి సరాసరి తెలుగులోకి అనువదించారు. ఇతర భాషలలో ఆధునిక కథ ఎలా వుందనే విషయాన్ని తెలియజెప్పడంతో బాటు తెలుగులో మంచి ఆధునిక కథల్ని రాసారు. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రికి తెలుగు, సంస్కృతం తప్ప ఇతర భాషల పరిచయం లేకపోవడం – ముఖ్యంగా ఆంగ్ల భాషతో పరిచయం లేకపోవడం మన అదృష్టం. భాషలోను, వస్తువులోనూ చక్కటి తెలుగుతనం ఉట్టిపడే చిన్న కథల్ని రాసారు. ఆయనకి తెలిసిన జీవితం – గోదావరి జిల్లాలోని అగ్రహార బ్రాహ్మణ కుటుంబాలలోని, ఆ ప్రాంతాలలోని ఇతర జీవితాల్ని క్షుణ్ణంగా పరిశీలించి, దూరదృష్టితో ఎన్నో కథల్ని రాసారు. తమ కులం, తామున్న ప్రాంతమనే వివక్షతతో ఆయన రాయలేదు. ఎక్కడ చెడున్నా చెండాడాడు. సంస్కరణాభిలాషతో తమ చిన్న కథలకి రూపాన్నిచ్చారు.

ఈ ముగ్గురి ప్రభావం ఆధునిక కథ మీద ఎంతో ఉంది. వీళ్ళతో బాటు చింతా దీక్షితుల సాహిత్య సేవకి ప్రారంభ పరిణామదశలో ప్రత్యేక స్థానం ఉంది. సంచార జీవనాన్ని సాగించేవాళ్ళు, కొండజాతి వాళ్ళ జీవితాల్ని చక్కటి చిన్నకథలుగా మలిచారు. అంటే వస్తు విస్తృతి ప్రారంభమైందన్నమాట.

'సుగాలీ కుటుంబం' అనే చిన్న కథలో సుగాలీలనే కొండజాతి వారి దయనీయ గాథని మన కళ్ళముందుంచారు. చెంచులు, ఎరుకలు, కోయలు, ఒడెలులాగే సుగాలీలు అడవులమీద ఆధారపడి జీవిస్తుంటారు. సుగాలీలకు కొండలు, అడవులు స్థావరాలు. ఎఱ్రకొండలో వున్నవాళ్ళు అక్కడున్న చెంచులు దోచుకోవడంతో అడవికి దగ్గరగా వున్న గ్రామానికి మకాం మారుస్తారు. అడవి మీద ఆధారపడి బతుకుతుంటారు. అడవిలో దేవదారు, కూర, పింకి కాయలు, పాలపళ్ళు, వెలగపళ్ళు – ఏవి దొరికితే వాటిని ఏరుకొచ్చి, అమ్ముకుని జొన్నకఱ్రలు సంపాదించి, జొన్న సంకటి వేసుకుని ఇంటిల్లిపాదీ తినేవారు. ఆకు కూరలు, పళ్ళు కొనేవాళ్ళు తగ్గిపోతారు. ఈత పళ్ళని అక్కడక్కడ పోగు చేసి – ఎండబెట్టి – దంచి ఆ పొడితో చేసిన రొట్టెల్ని కాల్చుకుని తినేవాళ్ళు. కొన్నాళ్ళకు క్రమంగా ఈత పళ్ళు కరువవుతాయి. చింతగింజల్ని దంచి – నానబెట్టి, ఎండబెట్టి, తిరగలితో విసిరి రొట్టెలు చేసుకుని తినేవాళ్ళు. క్రమంగా అవీ లభ్యంకాకుండాపోతాయి. చింతచిగురు, చింతపండు బూడిదలో కలుపుకుని తయారైన అంబలిని త్రాగసాగారు. అడవిలో చింతపండుని తీసుకొచ్చేవాళ్ళకి శిక్షపడుతుందని తెలియజేయడంతో ఆ ఆధారం పోతుంది. విధి లేని పరిస్థితుల్లో ఎవ్వరూ చూడకుండా అర్థరాత్రి అడవిలోకిపోయి, దేవదారుకూరని తెచ్చి, ఉడకబెట్టి, పిల్లలకిచ్చి తామూ తిని ప్రాణాల్ని కాపాడుకుంటారు. కొన్నాళ్ళకి అదీ అయిపోయింది. తిండి లేదు. దేవదారు కూరని దొంగతనంగా తెస్తున్నాడని అడవిలోకి వెళ్ళిన రూరల్ నాయక్‌కి శిక్ష పడుతుంది. అతని భార్యాపిల్లలు అనాధలై ఎటో వెళ్ళిపోతారు. కడుపుచేత బట్టుకుని, సుగాలీ కుటుంబానికి తిండి కరువైతే – వాళ్ళనా పరిస్థితికి తెచ్చిన మునుస్వామి డబ్బుతో ఉద్యోగాన్ని పోగొట్టుకుని గ్రామానికి తిరిగి వచ్చి మిత్రబంధు కోటి ఆప్యాయత కరవై, ప్రేమ కరువుతో బాధపడతాడు.

చెంచుల జీవితం 'చెంచులక్ష్మి' సంచార జీవితాల్ని కొనసాగించి జీవనాన్ని సాగించే దాసరుల దయనీయగాథ 'దాసరిపాట'. 'ఊరిపేరు', 'కిష్కింధలో కోతి', 'పెద్దమేడ', 'అభిప్రాయభేదం', 'మనిషి–కోతి'లాంటి గొప్ప చిన్న కథలనెన్నింటినో రాసారు చింతా దీక్షితులు.

ఒక పెద్ద మేడ, దాని ప్రక్కనే గుడిసెలు కోవెల ఉంటాయి. మేడను డబ్బుతోను, గుడిసెలను మర్యాదతోను, కోవెలను భక్తితోను కట్టారు. మేడ తన ఉన్నతిని చూసి

తాను గర్విస్తుంటుంది. ఆ ఉన్నతికి మేము కారణమంటాయి గుడిసెలు. మీ కౌశలాన్ని నేను డబ్బుతో కొన్నానంటుంది మేడ. మా కౌశలాన్ని నీ తుచ్ఛమైన డబ్బుతో కొనలేవు అంటాయి గుడిసెలు. వాళ్ళ మాటల్ని వింటున్న కోవెల నవ్వుకుంటుంది. చాలాకాలం గడుస్తుంది. గుడిసెలుండే చోట పెద్ద వనం పెరిగింది. పక్షులతో అది కళకళలాడ సాగింది. కోవెల ఉండే చోట ఒక రావి చెట్టు పెరిగింది. ఎందరికో నీడనిస్తోంది. మేడ ఉండే చోట బ్రహ్మజెముడు పొదలు పెరిగి, పాములు - గుడ్లగూబలతో ఆ ప్రాంతం ఆలవాలమైంది. ఈ చిన్న కథలో వున్న పెద్ద అంతరార్థం మీకు అర్థమయ్యే ఉంటుంది.

మనసు కోతిలాంటిదని చెప్పే చిన్న కథ 'మనిషి - కోతి'. మనసుని అదుపులో ఉంచుకుంటేనే మానవుడికి సుఖశాంతులుంటాయి.

ఒక యానాది తన పిల్లని పూలతో అలంకరించి చూసుకుని, ఆనందిస్తుంటుంది. అదే ప్రాంతంలో వున్న ఓ గుమస్తా కుటుంబం తన పిల్లని బంగారు ఆభరణంతో అలంకరించి ఆనందిస్తుంటుంది. యానాది ఒకసారి ఆ బంగారు ఆభరణాన్ని తన పిల్లలకు అలంకరించి చూసుకోవాలనుకుంటుంది. గుమాస్తా పిల్ల మెడలోంచి ఆభరణాన్ని తీసి తన పిల్లమెడలో వేస్తుంది. తమ పిల్ల మెడలోంచి యానాది ఆభరణాన్ని అపహరించిందని గుమస్తా పోలీసు రిపోర్టివ్వడంతో వాళ్ళొచ్చి యానాదిని అరెస్ట్ చేస్తారు. వాళ్ళ పిల్లని అలంకరించినట్టే నా పిల్లని అలంకరించి చూసుకోవాలనుకుంటే దొంగతనం ఎలాగవుతుందని యానాది నివ్వెరబోతే నేనెంతో కష్టపడి సంపాదించిన డబ్బుతో కొన్న నగని యానాది ఎత్తుకుపోవాలని చూసిందని గుమస్తా అభిప్రాయ పడ్డాడు. ఇది అభిప్రాయభేదం.

గురజాడ దగ్గర నుండి అప్పట్లో వచన రచనలకంత ప్రాధాన్యత లేదు కాబట్టి వచన రచనలే ప్రజల దగ్గరకు బాగా వెళ్తాయని ఆశించిన కవులలో వేలూరి శివరామశాస్త్రి ప్రముఖులు. అతి చిన్న వయసులో పదహారేళ్ళ ప్రాయంలో శతావధానం చేసిన వేలూరి గొప్ప హ్రస్వ కథల నెన్నింటినో రాసారు. అన్నింటిని ఇక్కడ విశ్లేషించలేం కాబట్టి రెండింటి గురించి మాట్లాడుకుందాం.

మొదటిది 'డిప్రెషన్ చెంబు'. స్వాతంత్ర్యానికి ముందు రాసింది. అప్పట్లో స్వాతంత్ర్యేచ్ఛతో హ్రస్వకథలు చాలా వచ్చాయి. వాటిలో ముఖ్యమైంది 'డిప్రెషన్ చెంబు'

ఆంగ్లానుకరణ చేస్తే అడుక్కుతినాల్సి వస్తుందని వ్యంగ్యంగా చెప్పారిందులో వేలూరి శివరామశాస్త్రి వృత్తివిద్యని విడిచిపెట్టి, ఆంగ్ల విద్యని అభ్యసిస్తాడు. ఆ డిగ్రీ బియ్యే ఆనర్స్ పేరుని తలక్రిందులు చేసి చివర పెట్టుకోవడానికి ఉపకరిస్తుంది.

ఇక ఉద్యోగ వేట ప్రారంభమవుతాయి. తల్లి మెడలో పుస్తెలతాడు కరిగిపోతుంది. భార్య మెడలోని పుస్తెలని కరిగించాలని చూస్తాడు. ఆమె ఎదురు తిరుగుతుంది. ఓ ఇంటర్వ్యూకి వెళ్తే అరవై రూపాయలిస్తామంటారు. 'ఛా... అరవై రూపాయల జీతమా?' అని ఛీత్కారంతో వెనక్కి వచ్చేస్తాడు. ఎక్కడా ఎలాంటి ఉద్యోగమూ దొరకకపోవడంతో ఆ అరవై రూపాయల ఉద్యోగం కోసమే వెళ్తాడు. కానీ వాళ్ళు ముప్ఫై రూపాయలిస్తే చాలని ముప్ఫై మంది నీ తర్వాత వచ్చారంటారు. బాధతో వెనక్కి తిరిగిన రామశాస్త్రి, ఆ ఇంటి గుమ్మంలో భవతీ భిక్షాందేహి అంటూ ఓ స్త్రీ కనిపిస్తుంది. ఆమె వెనుక పిల్లలుంటారు. భిక్షం కోసం పట్టుకున్న రాగి చెంబు మీద మిసెస్ రామశాస్త్రి ద్వివేదుల బియ్యే ఆనర్స్ అని ఉంటుంది. ఆమె అతని భార్య అయితే – ప్రక్కన పిల్లలు అతని చెల్లెలు, తమ్ముడు. ఉద్యోగాలు దొరక్క ఇప్పుడు యువత పడుతున్న బాధల్ని అప్పుడే ఎంతో చమత్కారంతో చెప్పారు వేలూరి శివరామశాస్త్రి.

ఆయన రాసినదే మరో గొప్ప రచన 'ఒక్కటే చీర'. నాగరాజు సత్రంలో వారానికి ఒక రోజు తమ దగ్గర పనిచేసే వాళ్ళకు ఉచితంగా జావనిస్తుంటాడు. ఆ రోజు జావ దానాన్ని పర్యవేక్షిస్తున్న అతనికి తమకి పాలుపోసే మాతరమ్మ మంచి చీర కట్టుకుని కనిపిస్తుంది. భరించలేక పోయిన అతను ఈ మాటే భార్యతో అంటాడు. సరైన చీర కూడా లేకుండా పాలు పోయడానికి వస్తున్న ఆమెని జూసి, నేను నా చీరని ఒకదానిని ఆమెకిచ్చాను అంటుంది. ఆమె వెళ్ళిపోయిన తర్వాత గంటకి ఆమె కోడలు జయ వస్తుంది. ఆమె అంతకుముందు అత్త కట్టుకుని వచ్చిన చీరలాంటి చీరే కట్టుకుని కనిపించడంతో నాగరాజుకి చిరాకేస్తుంది.

"ఇలాంటి చీరలు మీ ఇంట్లో ఇంకా ఎన్ని ఉన్నాయి?" అని అడుగుతాడు.

"ఒక్కటే చీరవుంది. అందుకనే అత్తమ్మ వచ్చి వెళ్ళిన తర్వాత నేను వచ్చాను. అందుకే ఇద్దరం ఒకేసారి మీ దగ్గరకు పనిలోకి రాలేకపోతున్నాము" అంటుంది.

ఇలాంటి గొప్ప హ్రస్వకథలనెన్నింటినో వేలూరి శివరామశాస్త్రి రాసారు.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు సంస్కరణాభిలాషి. అందుకే ఆయన తన చిన్నకథల ద్వారా నాటి సాంఘిక దురాచారాల మీద యుద్ధాన్ని ప్రకటించారు.

"శ్రీపాదవారు చిన్న కథలుగా మనకి ఎన్నో కబుర్లు చెప్పారు. శ్రీపాద వారి కథలు విని ఉండకపోతే తెలుగు ఉనికి అయోమయం. కొన్ని చిన్న కథలనైనా చదివితే తెలుగు కుటుంబాల ఆపేక్ష, అంతఃకరణలు ఎలాంటివో ఆ మర్యాదలు మన్ననలు ఎట్టివో అర్థమవుతుంది. ఆశ్చర్యమేస్తుంది. ముచ్చటేస్తుంది. చదువరులకు చదువు చెప్పగలిగినది ఆయన రచన. విద్యాబుద్ధులున్న అహంకారులకు కనువిప్పు చేస్తుంది. ఆయన వచనం. తీయనిదనము చవులిచ్చినదాయనశైలి. ఆయన రచనలు మరో భాషకు లొంగవు. జాను తెనుగు నేర్చిన వారికే తెలుగు వారైన వారికే శ్రీపాద వారి చిన్న కథలు చదివి ఆనందించే అదృష్టం అన్నారు మల్లాది రామకృష్ణశాస్త్రి.

ఈయన 75 చిన్న కథలు రాసారు. అన్నీ గొప్పకథలే. వస్తు వైవిధ్యం ఎంతో ఉంది. కేవలం సంభాషణలతో చిన్న కథని చకచకా నడిపించిన దిట్ట. వడ్లగింజలు, గులాబి అత్తరు, కొత్తచూపు, పుల్లంపేట జరీ చీర, కలుపు మొక్కలు, మార్గదర్శి, ఇల్లు పట్టిన విధవాడబడుచు' అరికాళ్ళ కింద మంటలు.... దేని ప్రత్యేకత దానిదే. సమకాలీనులు మెచ్చరే అని నన్నయ్యగారే అన్నారు. కానీ సమకాలీనుల్ని మెచ్చుతూ కందుకూరి వీరేశలింగం రఘుపతి వెంకటరత్నం నాయుడు - లాంటి వాళ్ళని పాత్రలు చేస్తూ చిన్న కథలు రాశారు. వారి సంస్కరణలకి ఊతమిచ్చే చిన్ని కథలు రాసారు.

అరికాళ్ళ క్రింద మంటలు చిన్న కథ చివర్లో తల చెడి పుట్టింటికి చేరిన రుక్కమ్మ అక్కడి బాధలు భరించలేక రాత్రి ఇంట్లోంచి వెళ్లిపోవాలనుకుంటుంది. వీధిలోకొస్తుంది.

"ఎక్కడికి వెళ్తారమ్మా" జట్కా అతను అడుగుతాడు? "ఆమె మెల్లిగా అంటుంది.

"దానవాయి గుంట"

"అక్కడికి తీసుకువెళ్ళడానికి ఏమి పుచ్చుకుంటావ్?"

"పంతులు గారి తోటకా?" అవునన్నట్లు తలూపుతుందామె.

"నిముసాల మీద తోటకు పోతా... బండెక్కండి అమ్మగోరూ".

"నా దగ్గర ఒక్క రాగి దమ్మిడి లేదు".

"పంతులు గారితోటకైతే నాకేమీ ఇవ్వక్కర్లేదు" అంటాడు జట్కా అతను.

జట్కా అతను తర్వాత ఆమెకి చెప్తాడు - నా కుమార్తె కూడా తలచెడి అగచాట్లు పడుతుంటే పంతులుగారే చేయూతనందించారమ్మా అని.

మార్గదర్శి కథలో ఒక పాత్రతో ఇలా చెప్పిస్తారు.

"అనేక కథలు చదవడం వల్ల వినడం వల్ల చిన్నతనంలోనే బుద్ధి వికాసం చెందుతుంది. అదే ప్రౌఢిమ. అంచేత చదువురాని ముసలివాడికంటే చదువు వచ్చిన కుర్రవాడు ఎక్కువ జ్ఞానవంతుడు కావడం... కథలంటే పైపైని వున్నాయనుకున్నావేమో? అవి కల్పించడానికి గొప్ప ప్రతిభ వుండాలి. వాటి విలువ తెలుసుకోవడానికెంతో పరిజ్ఞానం ఉండాలి. అవి చెప్పడానికెంతో నేర్పుండాలి. అవి వినడానికెంతో రుచి వుండాలి. అవి బోధపరచుకోవడానికెంతో బుద్ధి సూక్ష్మత వుండాలి. కథలు కళ్ళకి వెలుగిస్తాయి. బుద్ధికి పదును పెడతాయి. మనసుకి ఉత్సాహము ఉల్లాసము కలిగిస్తాయి. జడునకున్నూ కల్పనాశక్తి ప్రతిపాదిస్తాయి. నిజంగా ఒక్కొక్క కథ యెల్లాంటి ఘట్టంలో కూడా ఒక్కొక్కళ్ళని ఒడ్డెక్కిస్తుంది. కథలు చదవడమూ అధమం వినడము ఎప్పుడూ దండన అనుకోకేం!" అని చెప్పిస్తారు.

కథానిక అంటున్నాడు. ఇంతవరకు చిన్నకథ, హ్రస్వకథ ఆధునిక కథ అనే వాడుతున్నాడేం అనే అనుమానం మీకు రావచ్చు. ఆ రోజులలో కథకు, కథానికము అనే పేరుని కూడా గురజాడ దగ్గర నుంచి ప్రారంభమైన ఈ నూత్న వచన ప్రక్రియను పిలిచేవారు. కాబట్టి 1930లో లక్షణాల గురించి ఈ ప్రక్రియకు పేరేమి పెట్టాలని భారతి లాంటి పత్రికలలో రకరకాల చర్చలు జరిగాయి.

1936లో ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు ప్రతిభతో ఈ విషయాల్నే ప్రస్తావిస్తూ కథిక కథానకమం, హ్రస్వకథ, చిన్నకథ అనే రకరకాల పేర్లతో గాక కథానిక అనే పేరుని వాడదాం అన్నారు. అందరూ అంగీకరించారు. అలా పుట్టిన 26 ఏళ్లకి నామకరణం జరిగింది.

కవికొండల వెంకటరావు, చలం, టేకుమళ్ళ కామేశ్వరరావు, మల్లాది రామకృష్ణ శాస్త్రి, గోపీచంద్, కొనకళ్ళ, కుటుంబరావు, శ్రీశ్రీ, విశ్వనాథ, రావిశాస్త్రి, పాలగుమ్మి పద్మరాజు, శ్రీనివాస శిరోమణి, నోరి నరసింహశాస్త్రి, కొడవటిగంటి వెంకట సుబ్బయ్య, మునిమాణిక్యం నరసింహారావు, మొక్కపాటి, అడవి బాపిరాజు, కాళ్ళూరి, శిరోమణి రాయసం వెంకటశివుడు, కనపర్తి వరలక్ష్మమ్మ, జానకీదేవి, యల్లాప్రగడ సీతాకుమారి, భావరాజు కృష్ణారావు, వేదుల సత్యనారాయణశాస్త్రి, విశ్వనాథ, మొదలి సుబ్రహ్మణ్యశర్మ,

కరుణకుమార, తాత కృష్ణమూర్తి, హనుమచ్ఛాస్త్రి, మాడపాటి హనుమంతరావు ఇలా ఎంతోమంది కథానికాభ్యుదయానికి తోడ్పడ్డారు.

కథానిక పస తగ్గుతోందేమో అనుకునే రోజుల్లో పాలగుమ్మి పద్మరాజు గాలివానకు అంతర్జాతీయ గుర్తింపు రావడంతో మళ్ళీ కథానిక దేదీప్యమానంగా వెలగడం ప్రారంభించింది.

●

తెలుగు కథానిక - విభిన్న ధోరణులు

◆ విహారి

1952లో తెలుగు కథానిక 'గాలివాన'తో అంతర్జాతీయ వేదికనెక్కిన వైనం చూశాము. 1954 మళ్ళీ ప్రపంచ కథానికల పోటీ కోసం తెలుగులో ఎంపికైన నాలుగు కథానికలూ (పురాణం 'నీతి', సూరి 'భారతి', బొమ్మిరెడ్డిపల్లి 'దొంగలున్నారు జాగ్రత్త!', హితశ్రీ 'స్త్రీ') కథానికా సాహిత్యంలో నిలదొక్కుకున్న మూడు ధోరణుల్ని ప్రతిఫలింపజేశాయి. మనిషి అధోజగత్తు, చిత్తవృత్తి విశ్లేషణ, సామాజిక జీవనంలో అభ్యుదయ ఆకాంక్ష, సంస్కరణ ఆవవ్యకత అనేవి ఆ మూడు ధోరణులు ('నీలి', 'స్త్రీ' ఒక ధోరణి; 'దొంగలున్నారు జాగ్రత్త', 'భారతి'– రెండు మూడు ధోరణులు కలిగినవి). ఆ తరంలో కథానిక రాసిన ధనికొండ, రావూరి, శారద, శార్వరి, ఇచ్ఛాపురం జగన్నాథరావు, అవసరాల, బుచ్చిబాబు, చలం, కొ.కు., పా.ప; రావిశాస్త్రి, కా.రా.; మధురాంతకం త్రిపుర, కల్యాణ సుందరీ జగన్నాథ్, మాలతీచందూర్, అచ్యుతవల్లి, వసుంధరాదేవి వంటివారి కథానికల్నీ, స్థూలంగా వర్గీకరిస్తే ఈ పాయల్లో సాగినవే. స్త్రీ చైతన్యాభిలాషని వేరే ధోరణి క్రింద ఉదహరించుకోవచ్చు. మా గోఖలే ఒక్కరినీ ప్రత్యేకంగా పేర్కొనాలి. గుంటూరు జిల్లా మాండలికంలో అధోజగత్ జనం గురించి వారి సామాజిక జీవన వైరుధ్యాల్ని గురించి విలక్షణమైన కథానికలు వ్రాసినవాడు గోఖలే. రావిశాస్త్రి, కా.రా. వంటివారు– ప్రత్యేకించి, సామాజిక సంక్లిష్టతలకీ, సమస్యలకీ, వ్యక్తుల ప్రవర్తనలకీ – రాజకీయార్థిక మూలాలకి భిన్నమైన కారణాలు వుండవనే దర్శనంతో, వాస్తవిక విశ్లేషణతో, వ్యాఖ్యానంతో, కథానిక మరో దృక్కోణంలో వెలువరించసాగేరు. ఇవి ఒక మార్గదర్శక సిద్ధాంతంగా రూపుదిద్దుకున్నాయి కూడా. శ్రీపతి ఎన్నెస్ వంటి బలమైన గొంతుకలు రంగప్రవేశం చేశాయి.

ఆ తర్వాతి ధోరణి ఇతిహాసపు చీకటి కోణంలో అప్పటివరకూ కనిపించకుండా పోయిన - బడుగు, బలహీన, దళిత, బహుజన జీవన విషాదాల ఛిద్ర చిత్రాల ఆవిష్కరణం. ఇల్లిందల సరస్వతి వంటి కొందరు సమస్యల స్పర్శనీయంగా కొలకలూరి ఇనాక్ తన సొంత గొంతుకలిచ్చి 'పిండీకృతశాటి', 'ఊరబావి' వంటి అనన్య సామాన్యమైన కథానికలు వెలయించారు. 'యజ్ఞం'– సరే. ఆర్థిక ఫలాల అనుభవం ఎవరిపరమైపోతోందో వింగడించిన చారిత్రాత్మక కథానిక, రాయలసీమలోని సాంఘిక సమస్యలు కరువు, అనావృష్టి. ఆ స్థితిగతులతో మునిపల్లెరాజు, సుభా, శంకరరాజు, సి. వేణు, జయరాం, కేతు, కుప్పిరెడ్డి పద్మనాభ రెడ్డి, రా.రా., వై.సి.వి.రెడ్డి, పులికంటి కృష్ణారెడ్డి, పి. రామకృష్ణారెడ్డి వంటి ప్రముఖ రచయితలు తమదైన ముద్రణతో కథానికాగమనం చేశారు. ఇక్కడ మరో పాయ – ఫ్యాక్షన్ రాజకీయం, కేతు విశ్వనాథరెడ్డి చూపిన మరో కోణం రైతుకూ భూమికీ వున్న సంబంధం ఎలా విచ్ఛిన్నమైపోతున్నదనే అంశం. బలమైన శిల్పంతో 'నమ్ముకున్ననేల' వంటి చాలా కథానికలు రాశారు. అటు తెలంగాణాలో 'తాడిగిరిపోతరాజు' జైలు కథలు, నవీన్ కాలేజీ జీవితంలో గల వైవిధ్యాన్ని గురించీ కథానికల్ని రాశారు. ఉద్యమ ప్రభావం, గ్రామీణ ససమ్యలతో చెరబండరాజు కథానికలు రాయడం మొదలెట్టారు. 70వ దశకానికి ముందు చాసో కూడా – సమాజ జీవన పరిణామాన్ని చిత్రించటానికి – మరణంలో ఎంతటి ఆర్థిక కోణం యిమిడి వుందో చూపుతూ 'బందపాటు' రాశారు. 'జంక్షన్‌లో బడ్డీ'లో బలహీనవర్గాలు ఉనికి కోల్పోయే వైనాన్ని చిత్రించారు. బీనాదేవి గళం ఒక అనర్గళం శైలీ ప్రవాహం. వస్తు రూపాల్లోని విలక్షణతతో – రావిశాస్త్రి ముద్రకి తానూ పట్టం కట్టారు. మధ్య తరగతి జీవుల సామాజిక జీవనాన్ని చిత్రిస్తూ పోతుకూచి, పోలాప్రగడ, ఉషశ్రీ, మంజుశ్రీ, పోరంకి, శీలావీర్రాజు మొదలైనవారు దర్శనమిచ్చారు. స్త్రీ అస్తిత్వ స్పృహ ఎదిగి, చైతన్య కాంక్ష నుంచీ నడిచి, పురుషాధిక్య నిరసన, తిరస్కారం ధోరణిగా కథానికా రచన ప్రారంభమైంది. జానకీరాణి, కౌసల్యాదేవి, రంగనాయకమ్మ, అరవింద, ఛాయాదేవి, కామేశ్వరి, సులోచనారాణి, వంటివారు మంచి కథానికల్ని అందించారు.

70వ దశకం పూర్వార్థంలో పత్రికలు ఎక్కువగా బాయ్ మీట్స్ గర్ల్' కథానికల్ని ప్రోత్సహించటం మొదలెట్టి కథానికా సాహిత్య రంగంలో ఒక అవాంఛనీయ ధోరణికి పట్టం కట్టాయి. ఆ సమయంలోనే కాలక్షేపపు కథానికలూ విరివిగా రావటం

మొదలెట్టాయి. కథానిక వాణిజ్యావరణంలోకి తీసుకపోబడింది. భావనమాత్ర కథలూ, సన్నివేశం చుట్టూ ఊకదంపుడు కథలూ రాసాగేయి. పత్రికల 'టార్గెట్' గృహిణులైపోయి, 'చదివించే' కథ అయితే చాలు అనే ధోరణి ప్రబలింది. ఆ కారణంగా సరదా కథలు, ఊహాత్మక కథలూ – మూసధోరణిలో వెలువడినై. అయితే, ఆ సమయ పరిచ్ఛేదంలో కూడా – సామాజిక అవగాహనతో, కథానికారాధనతో సీరియస్‌గా రాసిన గొప్ప కథానికలూ వెలువడినై. రంగధామ్ వాచస్పతి, ఆదివిష్ణు, పెద్దిభొట్ల, హవిస్, సింగరాజు, విహారి, శాలివాహన, రాంబాబు అండ్ శాయి, సదానంద, రామాచంద్రమౌళి, శ్రీనివాసశాస్త్రి, వేదగిరి రాంబాబు మంచికథానికలు రాశారు.

ఏళ్ళు గడిచేసరికి – సమాజ జీవనంలో పెనుమార్పులు రాసాగాయి. సంకీర్ణత, సంక్లిష్టత, సంక్షోభం ఎక్కువైనాయి. రచయితల దృష్టీ, ఆలోచన ఆ వైపు మరలాయి. ఆయా సమస్యల్ని కథావస్తువులుగా స్వీకరించటం మొదలైంది. విజయవాడ కేంద్రంగా పుస్తక ప్రచురణ సంస్థలూ, కొత్త కొత్త వార, మాసపత్రికలూ విజృంభించినై. కథానికకు ప్రాచుర్యం హెచ్చింది. మధురాంతకం రాజారాంగారన్నట్టు 'కథానిక అడుగుపెట్టని చోటు లేదు, పలకరించని వ్యక్తిలేడు'.

దళిత జీవన వాస్తవికతని ప్రతిఫలిస్తూ కొలకలూరి ఇనాక్, స్త్రీ చైతన్యాభిలాషతో లత, విలక్షణ సామాజికాంశాలతో తిలక్, పురాణం, పెద్దిభొట్ల, పులికంటి, వీరాజీ, కొమ్మూరి, ఇచ్ఛాపురపు, భరాగో, అవసరాల... ఇంకా... అజరామరమైన ఋణానందలహరి వంటి వ్యంగ్యహాస్య పంటల్ని పండించిన ముళ్ళపూడి వంటి వారంతా ప్రసిద్ధికెక్కారు. రచయిత్రుల ప్రభ వెలుగసాగింది. కౌసల్యాదేవి, కల్యాణసుందరి, సులోచనారాణి, రంగనాయకమ్మ, రామలక్ష్మి, పరిమళా సోమేశ్వర్, మాలతీచందూర్, పవని నిర్మల ప్రభావతి, కామేశ్వరి, సత్యవతి... బీనాదేవి, రాజ్యలక్ష్మి.. ఇలా ఎందరో మంచి కథానికలు చెప్పారు. కేతు విశ్వనాథరెడ్డి (వాన కురుస్తే), గంధం యాజ్ఞవల్క్యశర్మ (సెలవయ్యింది); భమిడిపాటి జగన్నాథరావు (సముద్రం) వంటి కథానికలతో ప్రసిద్ధులైనారు. సి. రామచంద్రరావు, పతంజలి, అరిగే రామారావు, రుద్రాభట్ల, సింగరాజు, హలిస్, విహారి, శాలివాహన, ముప్పిడి ప్రభాకరరావు, రంగధామ్, పాలకోడేటి, ఖైనంపాటి, పియస్ నారాయణ, శ్రీ సుభా, జానకీబాల, లంకిపల్లె, అలపర్తి రామకృష్ణ, డి. వెంకట్రామయ్య, సి.ఎస్.రావు వంటి ఆ తరం రచయితలు కథా సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు.

70ల్లోకొచ్చేసరికి 'కొలిమంటుకుంది', అప్పుడు వీస్తున్న గాలి' ఉద్యమ స్పృహ. తెలుగు కథానిక దశా, దిశా మారింది. తాడిగిరి పోతరాజు, ఉప్పల నరసింహం, చంద్, అల్లం రాజయ్య, జ్వాలాముఖి, తుమ్మేటి, జూకంటి, ఆడెపు లక్ష్మీపతి, బిఎస్ రాములు, కాలువ మల్లయ్య, గూడ అంజయ్య, బోయ జంగయ్య, తిరుపతయ్య, సాహు, భూపాల్, శ్రీపతి వంటి ప్రముఖులు కథానికని సామాజిక చైతన్య ప్రేరక సాధనంగా స్వీకరించి పదునైన రచనలు చేశారు.

80, 90 దశకాల్లో కథానిక కొత్తదారుల్లో పయనించసాగింది. సమాజంలోని వివిధ వర్గాల, వివిధ స్థాయిల, వివిద ఉత్పత్తి కులాల ప్రతినిధులు కథానికా రచయితలుగా రంగం మీదకు వచ్చారు. శ్రమైక జీవన విషాదాల ఛిద్రపటాల చిత్రణ మొదలైంది. శ్రమని ఉన్నతీకరించాలనే నిబద్ధతా కలిగింది.

ఇక్కడికిది చాలా స్థూలమైన నేపథ్యం

ఇప్పుడు తెలుగు కథానికారంగంలో పెద్ద మలుపు. ఆధునిక తెలుగు కథానిక, వన్నె వాసీ – ఇంతఃపూర్వం లేనంతగా – పెరిగిన వైనం గురించిన పర్యావలోకనం చేద్దాం.

కథానికాలోచనం చేసేటప్పుడు – వస్తువు, శిల్పం, శైలి – అనే మూడు అంశాల్నీ స్పృశించాల్సిన అవసరం ఉంది కనుక, వాటిని అదే క్రమంలో పరిశీలిద్దాం.

కథావస్తువుల్లో అంతకుముందులేని కొత్త సమస్యలూ వాటి సంకీర్ణతా చోటు చేసుకున్నాయి. సమాజానికీ వ్యక్తికీ మధ్య సంఘర్షణని చిత్రించటంలో కథకులు మెరుగైన నైపుణ్యాన్ని చూపటం మొదలైంది. కథానికా రచన యువతరం చేతుల్లోకి వచ్చింది. వస్తు స్వీకరణలో రచయితల చూపు నిశితమై, రాజకీయ ఆర్థిక, సామాజిక, వైరుధ్యాల లోతుల్ని తాకటం మొదలైంది. ఇతివృత్తాల్లో వైవిధ్యం పాఠకుల్ని అబ్బురపరచటమే కాక, ఆలోచనకు ప్రేరేపింపచేసేదిగా రాణికెక్కింది. ఆ వైవిధ్య భరితమైన అంశాల్ని ఒకచోట పొందుపరిస్తే – ఇలా దర్శనమిస్తాయి.

1. రైతు దుర్భర జీవితం అనావృష్టి. అతివృష్టి. దళారీల దోపిడి. రైతుకీ భూమికీ మధ్య సంబంధాల్లో వచ్చిన పరిణామం ఆహార పంటల్నిచ్చే భూమి వాణిజ్య వస్తువుగా, వ్యాపార వస్తువుగా రూపుదాల్చటం. ఈ పరిణామంలో జాతి వెన్నెముక క్రుంగిపోతున్న వైనం – ఇవన్నీ ఎంతో పటిష్టమైన కథానికా రూపాలైన వాస్తవికత ప్రాణం పోసుకుంది. సేద్యం ప్రాణాలు తీసే దయనీయ స్థితిలోకి నెట్టబడిన నగ్నవాస్తవికత కథానికల్లో

చోటు చేసుకుంది. పి. చిన్నయ్య 'మెట్టభూమోడు' గురించి చెప్తే రైతుకే గిట్టుబాటు ధర రాక విలవిల్లాడే స్థితిని సింగమనేని 'అడుసు' కె.వి. నరేందర్,సన్నపురెడ్డి 'తమ్ముడి ఉత్తరం', సుంకోజి 'అన్నదాత', అల్లం రాజయ్య ఒక శతాబ్దికి సరిపడ ఇచ్చిన 'మహాదేవుని కల', రాసాని 'అస్తిత్వం', మొలకలపల్లి 'మకరదున్న', పాపినేని శివశంకర్ 'మట్టిగుండె', దయానంద్ 'కర్రావు'–ఇలా ఎన్నెన్నో కథానికలు ఆర్ద్రంగా చదువరుల గుండెల్ని తాకినై. భూమి సంబంధాల్లో వేగంగా వస్తున్న మార్పులు మరో పార్శ్వం వలసలు. ఈ అంశం ప్రధానంగా అటు ఉత్తరాంధ్ర కథకుల్లో ప్రముఖంగా – గంటేడ గౌరునాయుడు, అట్టాడ అప్పల్నాయుడు మంచి సంఖ్యలో మంచికథల్ని రాశారు. గౌరుసు 'వలస పక్షులు' ప్రసిద్ధమైన కథానిక.

2. వర్గమూలాల్లోని విపర్యయాల చిత్రణ పదునుతేరింది. రాసాని 'హెూమం', రాములు 'పాలు', 'అడవిలో వెన్నెల', పెద్దింటి 'వర్గమూలాలు' సామ గ్రామ వివక్ష వంటి గొప్ప కథానికల్ని గుర్తుంచుకోవాలి. (రామ్మోహన్ 'పులిజూదం).

3. కులానికీ, వృత్తికీ మధ్య ఉన్న వైరుధ్యాలూ, గ్రామీణ జీవనంలో చేతివృత్తుల విచ్ఛిన్నం – ఇవి ఒక ప్రత్యేక అధ్యాయనానికి సరిపడే కథానికలు జాతశ్రీ 'అంతర్ముఖం', 'కుట్ర', పెద్దింటి 'జిద్దు' (హలాల్ చేయడం), వరలక్ష్మి 'మంత్రసాని', డి.ఆర్. ఇంద్ర 'మాలిన్యం' (పారిశుద్ధ కార్మికులు), సఖిలేటి 'కలవిరిగిపడె' (మంగలివృత్తి)... వంటి గొప్ప కథానికలు వచ్చాయి. యెన్నం ఉపేందర్ 'చకోర జీవితాలు' చేనేత వృత్తి గురివి తుమ్మేటి 'పనిపిల్ల', పెద్దింటి 'బూమడు', బాలకార్మికుల వెతని చెప్పాడు.

4. నగర జీవితంలో వస్తున్న మార్పులు కథానికల్లో ఎంతో స్పష్టంగా చిత్రితమైనాయి. ఖదీర్‌బాబు 'న్యూబాంబే టైలర్స్' కె.వి. నరేందర్ 'చీపురు' సుజాతారెడ్డి 'న్యూఆనంద్ విలాస్ హెూటల్' వంటి కథానికలు ఉన్నాయి.

5. స్త్రీ ఆత్మగౌరవం అస్తిత్వచేతన, పురుషాధిక్య నిరసన వీటిని ఇతివృత్తాలుగా తీసుకుని శక్తివంతంగా చెప్పిన కథానికలు లెక్కకు మిక్కిలిగా ఉన్నాయి. పెద్దింటి 'రైతక్క', ఐతాచంద్రయ్య 'సరళ', రాములు 'నాన్నమ్మ', శిరంశెట్టి 'బగారా', కేతు 'పనిమంతురాలు', చంద్రలత 'కొలీగ్స్', కుప్పిలి పద్మ 'కుబుసం', ప్రతిమ 'ఖండిత', ఓల్గా 'నిర్ణయం', సత్యవతి 'ఇల్లలకగానే...' వంటి అనేక కథానికలు వచ్చాయి. మల్లీశ్వరి, 'పెత్తనం' వంటి మంచి కథానికలు రాసారు.

6. పిల్లలు, చదువులు, బాల్యం హరించుకుపోతున్న బండబతుకులు, మానసిక చిత్రణ, ఆదూరీ, శిల్పి, కాశీభట్ల 'బృంద', కె.వి.ఎన్.వర్మ 'మరొకడు' వారణాసి రామకృష్ణ 'రాకూడని కల' వంటి కథానికల్లో చూస్తాము.

7. వృద్ధుల పట్ల ఈతరం నిరాదరణా, రానున్న దైన్యానికి సూచనగా విచ్ఛిన్నమవుతున్న మానవ సంబంధాలూ – వీటిని వాస్తవికతతో చిత్రించిన కథానికలు వచ్చాయి. వరలక్ష్మి 'గండు చీమలు', ఆదూరి 'ఊరట', విహారి 'కొత్తనీరు', మంచికంటి 'యాతన', సన్నపురెడ్డి 'ఊరుమడి' వంటివి పేర్కొనాలి.

8. ముస్లిం జీవన విధానం, ప్రత్యేక సామాజిక సమస్యల్నీ చిత్రిస్తూ – షరీఫ్ 'జుమ్మా', ఖదీర్‌బాబు 'దావత్', సత్యాగ్ని 'ఖుల్సా', శశిశ్రీ 'ఇజ్జత్' స్కైబాబా 'దస్తర్', అఫ్సర్ 'తెలంగీపత్తా', సలీం 'తలాక్' ఓల్గా 'జాఫర్' వంటి గొప్ప కథానికలు రాశారు. షాజహానా 'నఖాబ్' సంపుటి తెచ్చారు. గీతాంజలి 'ఔలాద్' వంటి మంచి కథానికలు వచ్చాయి.

9. ఉద్యమ స్పృహతో దాని పూర్వాపరాల్ని విశ్లేషిస్తూ – నరేందర్ 'మాజీ', 'శత్రువు' వంటి గొప్ప కథానికలు రాస్తే, అంతకంత గొప్పగా మీట్కో 'మెట్లమీద' రాశారు. 'జనజీవనస్రవంతి' ఎక్కడుంది అనే ప్రశ్నని వ్యంగ్య శరంగా సంధించి కూర్మనాథ్ 'రాజుగారిబట్టలు' అని రాశారు.

10. దళిత జీవన విషాదాల్నీ, కులంకాటునీ కథానికగా చిత్రించిన రచయితలు అస్పృశ్యత, అనారోగ్యం, ఆకలి, అవిద్య వంటి అనేకానేక అంతరాంతర సమస్యల్ని వ్యాఖ్యానించారు. నరేంద్ర 'సద్గతి', 'ఖిడీబీ' వంటివి వచ్చాయి. ఇనాక్‌గారు అసంఖ్యాకమైన కథానికల్లో కేంద్ర ఇతివృత్తం వీటి చుట్టూ తిరిగింది. కవనశర్మ 'స్పృహ', వివినమూర్తి 'జ్ఞాతం' ఇదే వస్తువు ఆధారంగా సాగిన కథానికలు. తోలేటి 'కులం గాడి అంత్యక్రియలు' రాశారు. బోయ జంగయ్య, జాజుల గౌరీ, జొన్నవిత్తుల, జూపాక సుభద్ర, సదానంద్ శారద, కాలువ మల్లయ్య, బిఎస్ రాములు వంటి ప్రముఖులంతా మైనారిటీ బహుజన గిరిజన జీవిత చిత్రణ చేశారు.

11. పర్యావరణ పరిరక్షణ, వాతావరణ భద్రత అనేవి మానవ మనుగడకి అత్యంత ఆవశ్యకమైన ఈనాటి అంశాలు. వీటిని వస్తువులుగా చాలామంది స్వీకరించారు. కాలువ మల్లయ్య 'సృష్టికర్త ఆవేదన' సురేష్ 'కవర్‌స్టోరీ',

దుర్గాప్రసాదరావు 'పచ్చగా వుంటే', ముప్పిడి ప్రభాకరరావు 'అమ్మచెట్టు' వంటి గొప్ప కథానికలు వచ్చాయి.

12. ఇప్పుడు నడస్తున్న చరిత్ర ప్రపంచీకరణం దుష్ఫలితాలు గ్లోబలైజేషన్ మీద ప్రత్యేక సంపుటి వచ్చింది. ఈ నేపథ్యంలో క్షణక్షణం మారుతున్న మానవ సంబంధాల అర్థాలూ, అనర్థాలూ కథలకెక్కాయి. సాఫ్ట్‌వేర్ హార్డ్‌వేర్ మనుషులు, వెట్టిచాకిరీ బతుకులు, డాలర్లవేట, తత్ఫలితంగా ప్రేమాభిమానాలకి చెల్లుచీటీ, అసుఖ ప్రసవాలు, కలిసి బతకటం తప్ప జీవించటం చేతకాని నిస్సహాయత; ఆర్థిక రాజకీయ దుస్థితిలో కార్మిక, కర్షక, వృత్తి శ్రామికుల ఆత్మహత్యలు, సెజ్‌ల కోసం, జలయజ్ఞం కోసం గ్రామాల్లో, పంటభూముల్నీ ముంచేస్తున్న ప్రభుత్వ పథకాలు, వలసలు, ప్రజల రెప్పల కింద ఉప్పెన – ఎన్నెన్నో సామాజిక సంక్లిష్టతలు, అస్తవ్యస్థ జీవితాలూ కథానికా సందర్భాలైనాయి. చేతివృత్తులు, కుటీర పరిశ్రమలు కనుమరుగవుతున్న దృశ్యాలు, మూతపడుతున్న ఫ్యాక్టరీలు, వీధిన పడుతున్న కార్మికులు ఉద్యోగులు...ఎన్నో కథాంశాలు వచ్చాయి. కేతు విశ్వనాథరెడ్డి 'విరూపం'తో మొదలై, ఓల్గా 'కోకోకోలా', రాములు 'కామన్‌వెల్త్', గొరుసు 'బతుకుగోస', బమ్మిడి 'పెనం', గీతాంజలి 'ఊరికిపోదాం భూదేవి' నల్లూరి రుక్మిణి 'క్వీన్ విక్టోరియా మళ్ళీ నవ్వింది', అప్పల్నాయుడు 'మారిన చిరునామా' వెంకట కృష్ణ 'దారికాచిన వెన్నెల'... ఇలా... ఇలా ... ఇంకా... నవీన్, పెద్దింటి, దార్ల రామచంద్ర. జాతశ్రీ, జయంతి పాపారావు, కె. సుభాషిణి....మంచి కథానికలు రాశారు.

13. కథానికా సాహిత్యంలో నిరంతరం సాగే ఒక పాయ – మానవీయ విలువల ఆవిష్కారం, మానవ మనస్తత్వ ఖనిని త్రవ్వుతూ లోలోతులకి పోతూ వుండడం. వ్యక్తుల స్వభావాల్లో కలిగే వైరుధ్యాలు, విపర్యయాలూ, వైచిత్రీ... నరేంద్ర 'వెదురుపువ్వు'– భీమరాజు వెంకట రమణ 'సంగమం', వరలక్ష్మి 'శివంగి', వివినమూర్తి 'చెల్లుబడి', విహారి 'వలయం', శీలాసుభద్రాదేవి 'గోవుమాలచ్చిమి', షరీఫ్ 'జన్నత్', బత్తుల ప్రసాద్ 'సమాధి', రామాచంద్రమౌళి 'గుగులోత్ రమణి' వంటి మంచి కథానికలున్నాయి. ఒమ్మి రమేష్‌బాబు, కుప్పిలి పద్మ చాలామంచి కథనాలు రాశారు.

14. సామాజిక స్థితిగతుల చిత్రణలో కొన్ని దురాచారాలూ, అవాంఛనీయమైన విలక్షణ దౌష్ట్యాలూ... వీటి పట్ల నిరసన వెల్లువలా సాగింది. పతంజలి 'సర్మా',

ఉమామహేశ్వరరావు 'ఒంటేపమాను' వేశ్యా జీవితంకీ సమాజానికీ మధ్య తలెత్తిన ఘర్షణని శక్తివంతంగా చిత్రించాయి. (ఆనాటి చక్రవేణు కువైట్ సావిత్రమ్మ కథానికలాగా) తాగుడు వలన 'మత్తు'లో కథలో చూపారు నవీన్. జయంపు కృష్ణ 'కల్కి'లో చెప్పారు. 'ప్రశ్న చెపుతానమ్మా'లో కైపు ఆదిశేషారెడ్డి మూఢనమ్మకాల్ని నిరసించారు.

15. నలుగురు నడిచే త్రోవలోకాక, ఎంతో విలక్షణంగా కొత్త వస్తు స్వీకరణంతో మంచి కథానికలు రాసినవారూ ఇటీవల ఎక్కువ సంఖ్యలో దర్శనమిస్తున్నారు. డా. సోమరాజు సుశీల 'నేను చూసిన చిట్టి తల్లి'లో సానుకూల జీవన దృక్పథాన్ని చిత్రించి ఉన్నత విద్యని అభ్యసిస్తున్న యువతిని గొప్ప కథానాయికని చేశారు. అవిరళంగా మాట్లాడుతూ వుంటే భర్త హింస భరించలేని భార్య 'కోర్టు కెక్కని కేసు' కథానిక దర్శనమిస్తుంది. ఇచ్ఛాపురపు రామచంద్రం రాశారు. గర్భవిచ్ఛిత్తి – పుట్టనిబిడ్డ రోదన– కథ అయింది. గిరిజన బాలిక పేరుని విద్యార్థినిగా స్కూల్‌లో రాయించి తిండి కూడా పెట్టకుండా ఇంట్లో వెట్టిచాకిరీ చేయించుకునే ఓ మహాతల్లి కథానిక. 'తార్నాకు కాయ్ చోరీ' పేరున వచ్చింది. ఆరె సీతారామయ్య అమెరికా మార్కు ప్రజాస్వామ్యాన్ని 'మళ్ళీ నాలుగేళ్ళకి' గా కథానికని చేశారు. 'రాతి తయారీ' అంటూ పాత్రికేయ వృత్తిలో యాంత్రికతని చెప్పారు ముని సురేష్ పిళ్లై. రమేష్ ఏటి ఒడ్డు విరగటం తొక్కిసలాట దారుణాన్ని తెప్పతిరుణాలలో చూపారు. న్యాయవ్యవస్థకీ సామాన్య మనిషికీ మధ్య అడ్డుగోడలవుతున్న ఎన్నో అంశాల్ని కథాగతం చేశారు జింబో.

16. మధ్య తరగతి దుర్భర జీవితం, రాజ్యమూ, సాటి సమాజమూ కూడా ఈ త్రిశంకు వర్గాన్ని చూసే చూపులో ఉదాసీనతా, కరుణరాహిత్యం, నిరాదరణ. ఎత్తి చూపుతూ ఎంతో గొప్పకథలు వచ్చినా – విమర్శకులూ, సంకలనకర్తలూ కూడా వాటిపట్ల అంతే నిరాదరణని చూపటం కథానికా సాహిత్యంలో ఈనాటి ఒక దారుణమైన వ్యత్యస్తం.

– ఇలా తెలుగు కథానికలో రచయితలు స్పృశించని వస్తువు లేదా అన్నంత విస్తృతంగా వైవిధ్యం చోటుచేసుకుంది.

శిల్పం విషయానికొస్తే – పెదవి విరుపులు ఎక్కువగా ఉన్నాయి ఇటీవల. అయితే, కథానికలో చదివించే గుణం, చెప్పే విధానంలో నవ్యత, వస్తువుని రసస్ఫోరకం చేసే

సృజనశీలత, ప్రతిభ- ఇవన్నీ కొన్ని కథానికల్లో ఎంతో స్ఫుటంగా కనిపిస్తున్నాయి. ఈ గుణగణాల నైశిత్యాన్ని పట్టుకోగలిగినంత విస్తారంగా కథానికల్నీ చదవలేకపోతున్నారేమో విమర్శకులు అనిపిస్తుంది! భగవంతం 'అతడు... నేను... లోయ చివరి రహస్యం...', పద్మ 'మంచుపూల వానా, నరేంద్ర 'వెదురుపువ్వు', రమణజీవి 'చివరి మనిషి', మహర్షి 'విధ్వంసదృశ్యం', జగన్నాథ శర్మ 'పేగుకాలిన వాసన', శివశంకర్ 'సముద్రం', చంద్రశేఖరరావు 'అతను, అతనిలాంటి మరొకడు', చినవీరభద్రుడు 'ప్రశ్నభూమి', ఈ వ్యాసకర్త 'పోల్చుకోగలరాతే', సౌదా 'శత్రువు', ఛాయాదేవి 'ఆఖరి ఐదు నక్షత్రాలు', 'సుఖాంతం', గొరుసు 'చీడ', ఒమ్మి 'మూడు రాత్రుల కథ', లక్ష్మీపతి 'ఆక్రోశం' కాశీభట్ల 'బృంద', స్వామి 'అద్దం' వంటి ఎన్నో కథానికలు స్ఫురణకొస్తాయి.

కాగా భాషాశైలీ విషయానికొస్తే - రాయలసీమ, తెలంగాణా మాండలికం కథానికల్లో వెల్లివిరుస్తోంది. ప్రకాశం జిల్లా పలుకుబడిన పట్టుకుని దయానంద్, మంచికంటి వారు మంచి కథానికల్ని ఇస్తున్నారు. చిత్తూరు జిల్లా మాటతీరుని హృద్యంగా రాసాని, నరేంద్ర, కరుణాకర్, సుంకోజీ వంటి కథకులు ప్రతిఫలిస్తున్నారు. అయితే కథానికల్లో వాక్య నిర్మాణంలో తేలిపోయే పనితనం కొంతమందిలో కనిపిస్తోంది. ఒక రచయిత తన కథానిక మొదటి కథానికలు ఎంతమాత్రమూ సంబంధం లేని విషయాన్ని కృత్రిమంగా రెండు పేరాలు చెప్పటం, ఒక రచయిత మొదటి వాక్యాన్ని ఆరు లైన్లు రాయటం వంటి పరిహరించుకోదగిన అంశాలు ఉంటున్నాయి. అలాగే, భాషాపరంగా తిట్లూ, అశ్లీలతా... సినిమా భాషని కథాగతం చేయటం వంటి ధోరణీ కనిపిస్తోంది.

ఆధునిక తెలుగుకథానికల్లో - అస్తిత్వ చేతన, వాదాల ఆశ్రయం వంటివి - కేవలం విమర్శకుల అత్యుత్సాహ ప్రదర్శన వలన- ఎక్కువగా పత్రికల్లో గిరికీలు కొట్టున్నా - కథానిక మాత్రం చక్కగా ఏ ట్యాగ్‌నీ, లేబుల్‌నీ తగిలించుకోకుండానే తలెత్తుకు తిరగగలుగుతోంది; నిలువగలుగుతోంది. యువకుల చేతుల్లో వైవిధ్య భరితంగా, విలక్షణంగా, విశిష్టంగా వన్నె మీరుతోంది.

వందేళ్ళ తెలుగు కథానికా - ఉత్పత్తి వర్గాల అనుభవాగ్నిలో పుతం పెట్టుకుంటోంది. సహజ జీవిత గాఢతతో భగభగలాడుతోంది. ధగధగాడుతోంది.

ప్రాంతీయ, లింగ, వర్గ, కుల, మత చైతన్యం అంతర్జ్వాలగా స్థలకాల నిబద్ధతతో సాగుతోంది. తెలుగు కథానిక – నాలుగు దిక్కులనుంచీ అద్భుతంగా విస్తరిస్తోంది.

కథానికా రచనా విధానంలో నూతనావిష్కరణలుగా మార్మిక ధోరణులు కానీ, మాంత్రిక వాస్తవికతగానీ, ఆధునికానంతర ధోరణిగానీ – ఇవన్నీ పీకీ, లాగీ ఒకరో ఇద్దరో చెప్పుకోవలసిన అంశాలుగా పాఠకులు భావిస్తున్నారు. అదంతా మేధావుల కార్యక్షేత్రం. రచయిత చెప్పిన కథానికతో పఠిత ఆనందించటం, అనుభవించటం, మననం చేసుకోవటం, మనసులో నిలుపుకోవటం, కార్యోన్ముఖుడు కావడం – వంటి ప్రక్రియ (ప్రాసెస్)కి పై అంశాలేవీ దోహదం చేయవనేది తేలిపోయింది.

ఆధునిక కథానికా సాహిత్యం గురించి చెప్పుకునేటప్పుడు – పత్రికల ప్రోత్సాహం గురించీ చెప్పుకోవాలి. 'కాలమ్' విలువ వలన కథానిక సన్నబడినా పత్రికలు కథానికని వేయటం అనివార్యమైంది. నామిని, వంశీ, సుశీల వంటి వారు ఆనాటి అమరావతి కథలు వంటి ప్రయత్నాలు చేస్తున్నారు. కథాసంకలనాలు ఎక్కువ సంఖ్యలో వస్తున్నాయి. కథకులే వ్యక్తిగత సంపుటాలు బాగా వస్తున్నాయి. అనువాదాల గురించి చెప్పుకోవలసింది ఎప్పుడూ ఎక్కువగానే మిగిలిపోయి వుంది! కథానికా విమర్శ సాగుతోంది. కథానికా, సదస్సులూ, సమావేశాలూ, గ్రూప్ మీటింగ్‌లూ జరుగుతున్నాయి.

కడకు –

వ్యక్తి ఏ వర్గం వాడయినా, ఏ ప్రాంతం వాడయినా, ఏ వాదాన్ని ఆశ్రయించిన వాడైనా, ఏ బుద్ధీ, స్వభావం తత్త్వం కలవాడైనా – 'మనిషి' గురించే చెప్తుంది కథానిక. కథానికలో – మనిషి పుట్టుక, మనుగడ, జీవిక, సమస్య, సంఘర్షణ, ఏడుపు, దుఃఖం, సంతోషం, మార్పు, వికాసం... ఇవి రాక తప్పదు. మనిషి తనతో తానూ, సమాజంతోనూ ఎలా అనువర్తిస్తున్నాడో రావడం అనివార్యం. మనిషి బహిరంతర చేతన, చైతన్యం కథానికా కేంద్రకాలు. మనిషి మననధారలోని జీవన తత్త్వం కథానిక ఆరోప్రాణం. విపర్యయాలు ప్రకృతి సహజాలు. వాటి ప్రేరకాలూ కారకాలూ భౌతిక వాస్తవాలు. అందుకనీ అవి కథానికా గతం అవుతాయి. దైనందిన రాజకీయ, ఆర్థిక, సామాజిక ఒత్తిడులు 'మనిషి' మీద తమ ప్రభావం చూపుతూనే వుంటాయి. ఆ ప్రభావాల ప్రతిఫలనాలు కథానికల్లో గోచరిస్తూనే వుంటాయి.

కథానిక – రచయితలకు దగ్గరై పాఠకులకు దూరమవుతున్న వైనంలో ఇబ్బంది పడుతున్నా – దానికి బంతి తత్త్వం బాగానే వుంది! సమాజ కళ్యాణాన్నీ, మనిషి హితాన్నీ రచయితలు చిత్తశుద్ధితో కాంక్షిస్తున్నంతకాలం కథానిక సాగిపోతూనే వుంటుంది. విజయోస్తు!!

●

తెలుగు కథానిక - వాదాలు-ఉద్యమాలు-విప్లవాలు

◆ డా. కాలువ మల్లయ్య

వాదం, ఉద్యమం, విప్లవం ఇవి ఒకదానికంటె మరొకటి విస్తృతార్థం కలవి – ప్రతివాదం ఉద్యమం, విప్లవం కాదు... ప్రతి ఉద్యమమూ విప్లవం కాదు కాని వాదమవుతుంది. ప్రతి విప్లవమూ వాదం, ఉద్యమమవుతుంది.

సమాజంలో వాదాలు, ఉద్యమాలు, విప్లవాలు రావడం సహజం. వచ్చిన అన్ని వాదాలూ, ఉద్యమాలు, విప్లవాలుగా మార్పుచెందకపోవచ్చు. సమాజంలో పెల్లుబికిన వాదాలు, విప్లవాలు సాహిత్యంలోనూ చోటుచేసుకోవచ్చు. అయితే అవి కొన్ని వాదాల స్థాయిల్లోను, కొన్ని ఉద్యమాల స్థాయిలోనే ఆగిపోవచ్చు. మరికొన్ని విప్లవాలుగా పరిణామం చెందవచ్చు. అలా తెలుగు కథానికలో వచ్చిన విప్లవాలను పరిశీలిద్దాం.

సాహిత్యంలో ఓ విధానం లేదా వాదం ప్రవేశించి అది గణనీయంగా ప్రభావం చూపి, సాహిత్య మార్గాన్ని నిర్దేశించి, ఆ విధానం కొంతకాలమైనా కొనసాగే అనుచర వర్గముంటే ఆ విధానాన్ని సాహిత్య విప్లవమనవచ్చు. తెలుగు కథ పుట్టిన 1910 నుంచి ఇప్పటివరకు కథాసాహిత్యంలో అనేక ధోరణులు తమ తమ ప్రభావాలను చూపుతూనే ఉన్నాయి. ఆ కాలం నుంచి ఈ కాలం వరకు కచ్చితంగా ఈ కథావిప్లవం కొనసాగింది. అలాంటి కథలు మాత్రమే వచ్చాయి అని చెప్పడం సాధ్యం కాకున్నా ఒకే కాలంలో ఒకటి కంటె ఎక్కువ కథా ధోరణులు కొనసాగినా ఆయా కాలాల్లో విస్తృతంగా వచ్చిన కథలను బట్టి ఫలానా కథా విప్లవం కొనసాగిందని చెప్పవచ్చు. ఇలా తెలుగు కథల్లో వచ్చిన ప్రధాన ధోరణులను వింగడించుకుంటే ఎనిమిది కథావిప్లవాలు వచ్చినట్టగుపడతాయి. అవి 1. సంస్కరణవాదం 2. స్త్రీవాదం 3. అభ్యుదయవాదం 4. అట్టడుగు జీవితాలు 5. విప్లవ వాదం 6. దళిత వాదం 7. బహుజనవాదం 8. ప్రాంతీయ, మైనారిటీ వాదాలు.

ఈ కథా విప్లవాలను సవిమర్శకంగా, వాస్తవికతా దృక్పథంతో పరిశీలిస్తే తెలుగు కథ పోయిన పోకడలు తెలుసుకోవచ్చు. తెలుగు కథా సాహిత్యంలో వచ్చిన ఈ ధోరణుల ద్వారా ఆయా కాలాల్లోని, ప్రాంతాల్లోని తెలుగు జీవితం అవగతమవుతుంది. ఈ ధోరణులన్నింటినీ పరిశీలిస్తే తెలుగు సమాజ పోకడలతో పాటు తెలుగువారి సామాజిక ఆర్థిక సాంఘిక జీవనం గురించి రాయడానికి సరిపోయేంత ముడిసరుకు కథల్లో లభిస్తుంది. ప్రజల సాంఘిక చరిత్రలను సాహిత్యాధారాల ద్వారా ఆపే క్రమాన్ని ఈ ధోరణి మరింత ముందుకు తీసుకువెళ్తుంది. తెలుగు సమాజం అనేక రకాలుగా విభజింపబడుతున్న ఈ సమయంలో తెలుగు ప్రజల సాంఘిక చరిత్ర సాహిత్యంలో ఎలా నిక్షిప్తమైందో తెలుసుకోవడం చారిత్రకావసరం. ఈ ప్రాజెక్టు అందుకుపయోగపడి సాహిత్యానికెంత బలం ఉందో తెలుసుకోవడానికి తెలుగు కథా ద్రోణులకు రెఫరెన్సుగా పనికివస్తుంది.

తెలుగులో మొట్టమొదటి కథకుడు గురజాడ. వీరు రాసిన దిద్దుబాటు 1910లో ఆంధ్ర భారతిలో అచ్చయింది. ఇదే మొదటి కథగా ప్రసిద్ధి పొందింది. గురజాడ కలం పెట్టే నాటికి భారతదేశం పరాయిపాలనలో ఉంది. తెలుగు సమాజంలో సంస్కరణోద్యమాలు. స్వాతంత్రేచ్ఛ పెల్లుబుకుతున్నాయి. కరుడుగట్టిన తెలుగు సమాజాన్ని సంస్కరణోద్యమంతో ముందుకు తీసుకెళ్ళిన వీరేశలింగం పంతులుగారు గురజాడకు సమకాలికులు. గురజాడ కలం పట్టేవరకు మనకు కాశీమజిలీ కథలు, నీతి చంద్రిక కథలు, తెనాలి రామకృష్ణుని కథలున్నా అవన్నీ ఆశుకథా సాంప్రదాయానికి చెందిన కథలు. జానపద కథల్లాంటివి... గురజాడ కథ ఆంగ్ల భాషా సాహిత్య పరిచయంతో తెలుగులో వచ్చిన ఆధునిక కథ – వాటినే మనం కథానికలు అంటున్నాం.

ఆధునిక కథకుడు అంటే లిఖిత సాహిత్య కథకుడు తన చుట్టూ వున్న సమాజంలో విషయాలను తీసుకొని రాస్తున్నా జానపద కథకుడికి ఆ జీవితంతో భాషతో ఉన్నంత తాదాత్మ్యం లిఖిత సాహిత్య కథకుడికి లేదు. ఎందుకంటే ఆ కథకుడు జీవిస్తున్నదా జీవితంలోనే జానపద కథల్నుంచి, జీవితాల్నుంచి రచయితలు నేర్చుకోవాల్సినదెంతో ఉందంటాడు గోర్కీ. ఆధునిక సాహిత్యానికి యుగకర్తయైన గురజాడ మార్గం కవిత్వంలో కంటె కథల్లోనే కొనసాగింది. అంతవరకు ఆశు

సాంప్రదాయంలో ఉన్న తెలుగు కథను లిఖిత సాంప్రదాయానికి చెందిన కథగా మార్చడం గురజాడ సాధించిన కథా విప్లవం.

గురజాడ కథలకు కేంద్రబిందువు స్త్రీ మార్గం సంస్కరణ. భాష పాత్రోచితం. మొదటి కథనే శిల్ప సౌందర్యం గల కథగా తీర్చిదిద్ది తెలుగు కథ సద్యోయౌవనమని నిరూపించాడు. అతడు రాసిన ఐదు కథలూ సంస్కరణోద్యమంలోని వివిధ భాగాలను తెలిసేవే. దిద్దుబాటు, మెటిల్డా కథల్లో వైవాహిక జీవిత సమస్యను, సంస్కర్త హృదయంలో వేశ్యాసమస్యను, మీ పేరేమిటి, పెద్ద మసీదులో మత సమస్యను చిత్రీకరించాడు. ఉత్తమ కథానికా లక్షణాలన్నీ గురజాడ మొదటి కథలోనే పరిపక్వం చెందాయి.

గురజాడ సంస్కరణవాద సాహిత్యానికి పొడిగింపుగా శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి అదే దృక్పథంతో కథలు రాశాడు. వీరేశలింగం సంస్కరణోద్యమం శ్రీపాదనూ ప్రభావితం చేసింది. అతడే కాకుండా కరుణకుమార, టేకుమళ్ళ కామేశ్వరరావు, గురజాడ తడిమిన సంస్కరణ అంశాలను మరింత లోతుగా స్పృశించి కథలు రాశారు.

కందుకూరి విధవా వివాహాల్లాంటి అంశాలనే కాకుండా వేశ్యాసమస్య, స్త్రీ విద్య, స్త్రీ స్వేచ్ఛ, మూఢనమ్మకాల పట్ల వ్యతిరేకత, కులమతాల పట్ల నిరసనను తమ కథల్లో చూపి ఆధునిక సంస్కరణ వాద కథలకు ఆద్యుడయ్యాడు గురజాడ. ఆశు సాంప్రదాయంలో ఉన్న కథను లిఖిత సాంప్రదాయానికి మళ్లించి అలవోకగా అరటిపండు ఒలిచి నోట్లో పెట్టినట్టు సాగే కథను శిల్ప సౌందర్యం గల కథలుగా తీర్చిదిద్ది కథలంటే సమకాలీన సమాజంలోంచి తీసుకొని రాయాల్సినవని చాటిచెప్పి కథకు సాంఘిక ప్రయోజనం ఉండాలని చెప్పాడు గురజాడ. ప్రయోజనమైన ప్రక్రియను తెలుగు పాఠకుడికి కొత్తదైన ఆధునిక కథను తెలుగులోకి తీసుకురావడం గురజాడ సాధించిన కథావిప్లవం. ఈతని సంస్కరణవాద కథలను ఎంతోమంది అనువదించారు. ఈ కాలంలోనే తెలంగాణ ప్రాంతం నుంచి మాడపాటి హనుమంతరావు సంస్కరణ నేపథ్యంగా కథలు రాశారు.

గురజాడ మార్గానికి పొడిగింపుగా స్త్రీనే కేంద్రబిందువుగా తీసుకొని స్త్రీ స్వేచ్ఛకు బలమైన ప్రతినిధిగా పేర్కొనబడేట్టు స్త్రీల గూర్చి కథలు రాసిన మరొక రచయిత చలం. స్వాతంత్ర్యోద్యమానికి సంబంధించిన (అప్పుడూ ఇప్పుడూ) కొన్ని రాసినా స్త్రీవాద కథలకు బలమైన పునాది వేసింది చలమే. ఇతడు తెలుగు సాహిత్యంలో

కట్టలు తెంచుకుని ప్రవహించే ఉధృత ప్రవాహంలాంటివాడు. స్త్రీల తరఫున బలమైన ప్రాతినిధ్యం వహించి కలాన్ని ఝళిపించిన చలం కథలు తెలుగు సాహిత్యంలో గొప్ప సంచలనాన్నే కలిగించాయి. గురజాడలా కేవల సంస్కరణలతో తృప్తి పడలేదు చలం. చలం తన స్త్రీ పాత్రలను రెబెల్‌గా తిరుగుబాటు చేయాలని చెప్పాడు. స్త్రీ పాత్రలకు తిరుగుబాటు తత్వాన్ని నేర్పిన మొదటి ఆధునిక రచయిత చలం. చలం కథ స్త్రీ స్వేచ్ఛను, ఇంకా అవసరమైతే లైంగిక స్వేచ్ఛను కోరుకుంటుంది.

స్త్రీని అక్కున చేర్చుకొని సాంఘిక నియమాలకే మాత్రం విలువివ్వకుండా కథలు రాసిన చలం స్త్రీ పక్షపాతి. స్త్రీల తరఫున వకాల్తా తీసుకొని బలమైనకథలు రాసిన స్త్రీల ప్రతినిధి. పెళ్ళి కొరకు మొహం వాచిపోయినట్టుండే తత్వాన్ని, పెళ్ళే జీవిత పరమార్థంగా భావించే విధానాన్ని ఎద్దేవా చేస్తూ కథలు రాశాడు. పురుషుడి హింసలను భరిస్తూ పాదదాసిగా పడి వుండటం కంటె తనకిష్టమున్న వాడితో లేచిపోయినా తప్పేం కాదని తన కథల ద్వారా చెప్పాడు.

నిండుగా కొంగు కప్పుకోవడాలు, అమ్మవారిలా బొట్టు, అర్థం లేని సంప్రదాయాలు, కట్టుబాట్లు, ఊపిరి పీల్చుకోలేని నిర్బంధం, స్త్రీలపై దౌర్జన్యం లాంటి వాటినన్నింటినీ నిరసించాడు చలం. పురుషుడికో నీతి, స్త్రీకో నీతి ఉండాల్సిన అవసరం లేదన్నాడు. ప్రముఖ విమర్శకులు రాచమల్లు రామచంద్రారెడ్డి గారు చలం కథల గూర్చి ఇలా అన్నారు.

"ముందు తరం రచయితలు స్త్రీల తరఫున నిర్భయంగా రాయడానికి మార్గం సుగమం చేశాడు. విమర్శలు, ధూషణలన్నీ అందరి కంటే ముందు తానే అనుభవించాడు. మళ్ళీ మళ్ళీ సాంప్రదాయాలకు వ్యతిరేకంగా రాసి విమర్శలకు గురి కావాల్సిన అవసరాన్ని చలం తన తర్వాతి రచయితలకు అవసరం లేకుండా చేశాడు. స్త్రీల తరఫున హాలాహలాన్ని మింగి అమృతాన్ని పంచాడు.

మన సాహిత్యం మీద చలం ప్రభావం ఎంత దృఢంగా ఉంది అంటే చలం మన ఆలోచనా ధోరణిలో ఒక విడదీయరాని భాగమైనాడు. మన రక్తంలో జీవమైనాడు. సంస్కారంలో ఒక సంస్కారమైనాడు".

తెలుగు సాహిత్యాన్ని తన విప్లవాత్మక భావాలతో చలం మలుపు తిప్పాడు. చలం గూర్చి కొకు ఆధునిక తెలుగు రచన చరిత్రలో ఒక బ్రహ్మాండమైన ఉప్పెన చలం అని, అతని కలానికి అటూ ఇటూ కూడా ఎవరూ సాటిలేరని అన్నాడు.

నిర్భయంగా సాహిత్యమే జీవితంగా, జీవితమే సాహిత్యంగా భావించి తాను నమ్మిన సిద్ధాంతాలను ఆచరణలో పెట్టినవాడు చలం. చలం స్త్రీల దీనగాథలను గూర్చి, పురుషుల క్రూరత్వానికి బలవుతున్న స్థితిని గూర్చి రాసిన కథలు ఓ పువ్వు పూసింది, కర్మమిలా కాలింది, పతితులు, యౌవనవనం, కల్యాణి, ఆత్మార్పణ సంపుటాలుగా వెలువడ్డాయి. ఓ పువ్వు పూసింది ఫాంటసీని ఉపయోగించి రాసిన ఓ అద్భుత కళాఖండం.

ఇలా చలం తెలుగు సమాజాన్ని, తెలుగు పాఠకలోకాన్ని ఊపి సంచలనం సృష్టించాడు. చలం కథల ప్రభావం అటు తర్వాతి రచయితలు చాలామందిపై ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పడింది. చలంతో ప్రభావితుడై రావూరి భరద్వాజ మొదట్లో ఇవి చలం కథలే అనిపించే విధంగా కథలు రాశాడు. చలం స్త్రీవాద దృక్పథాన్ని ముందుకు తీసుకువెళుతూ మార్క్సిస్టు అవగాహనతో ముప్పాళ్ళ రంగనాయకమ్మ చక్కని కథలు రాశారు. సాహిత్యం రాజకీయోద్యమాలు స్త్రీ విముక్తిని తమ ఉద్యమాల్లో భాగంగా ఎన్నుకున్నాయి. ఆ తర్వాతి కాలంలో స్త్రీల తరఫున బలమైన ప్రతినిధిగా కథలు రాసిన రచయిత్రి ఓల్గా. 80,90లలో స్త్రీవాద సాహిత్యోద్యమాలు బలపడడానికి ముందే చలం బలమైన సామాజిక పునాదిని ఏర్పాటు చేశాడు. పి. సత్యవతి, అబ్బూరి ఛాయాదేవి, కుప్పిలి పద్మ, కొండేపూడి నిర్మలలాంటి వాళ్ళు స్త్రీవాద సాహిత్యోద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్ళారు. స్త్రీవాద సాహిత్యోద్యమ కాలంలో స్త్రీ గూర్చి అనార్థడాక్స్ ధోరణిలో కథలు రాయడానికి చలమే మార్గం సుగమం చేశాడు. చలం, ఆ తర్వాత స్త్రీల గూర్చి వచ్చిన కథాసాహిత్యాన్ని స్త్రీ వాద సాహిత్య విప్లవంగా పేర్కొనవచ్చు. స్త్రీకి స్వేచ్ఛను, తిరుగుబాటు తత్వాన్ని నేర్పి, ఆర్థడాక్స్ ధోరణికి స్వస్తి పలికి స్త్రీల గురించి కథలు రాయడానికి మరింత ధైర్యంగా అభిప్రాయాలను చెప్పడానికి మార్గం సుగమం చేయడం చలం సాధించిన కథా విప్లవం.

3. చలం తర్వాత తెలుగు సాహిత్యంలో మరో గొప్ప దృక్పథానికి, మార్గానికి బాట వేసిన గొప్ప రచయిత కొ.కు. మార్క్సిజం అర్థం కానివాడు జీవితాన్ని అర్థం చేసుకోలేడు అని నమ్మిన మేధావి. శాస్త్రీయ దృక్పథంతో, అవగాహనతో సిద్ధాంతాలను కాక జీవితాల్ని ప్రమాణంగా తీసుకొని కథారచన చేశాడు. చలం అన్‌ఆర్థడాక్స్ ధోరణి, వీరేశలింగం సంస్కరణ ఆధునికతను, గురజాడ సాహిత్యవారసత్వాన్ని జీర్ణించుకొని

తనదైన మార్గంలో తెలుగుకథను సామ్యవాదోన్ముఖం చేశాడు కొడవటిగంటి కుటుంబరావు. ఆకలి దశాబ్ది ప్రభావం. అభ్యుదయ రచయితల సంఘం ప్రభావం ఆలోచనాపరుడైన కొ.కు. పై విశేషంగా ఉంది.

కొ.కు. కథలన్నీ మధ్య తరగతికి చెందిన బ్రాహ్మణ జీవితాలకు చెందినవే. అతనికున్న అనుభవ పరిధి తక్కువైనా 'ఎరుక' చాలా ఎక్కువని తెలుగు సాహిత్యంలో ఇంత ఎరుక గలిగి కథలు రాసిన మరో రచయిత దొరకడం కష్టమంటారు ప్రముఖ విమర్శకులు వల్లంపాటి వెంకటసుబ్బయ్య. కొ.కు. తన రచనలలో అప్పటి స్త్రీల పరిస్థితిని, సాంఘిక స్థితిగతులను బ్రాహ్మణ జీవితాలను ఎక్స్‌రే ఫొటోగ్రఫీలోలా చూపారు. ఈతని కొన్ని కథలలో సాంప్రదాయ విరుద్ధ ముగింపులుంటాయి. గురజాడ సంస్కరణ దృక్పథంతో, చలం వ్యక్తిగతమైన స్వేచ్ఛను అభిలషిస్తూ కథలు రాస్తే కొ.కు. మరింత ముందుకు పోయి స్పష్టమైన అవగాహనతో స్త్రీ ఆ పరిస్థితికి గల కారణాలను పరిష్కారాలను సామాజికపరంగా చూపారు.

కొ.కు. కథల గూర్చి కేతు విశ్వనాథరెడ్డి అన్న మాటలు గమనించదగ్గవి. కథానికా తత్వం ఇంకా పట్టుబడని జాతికి అదేమిటో తన కథల ద్వారా తెలిపిన కథకుడు. త్రికాల జ్ఞానంతో కూడిన పుష్కలమైన విషయజ్ఞత, అనితర సాధ్యమైన శిల్పజ్ఞత, సంస్కార సహజమైన ఉద్రేక రహిత భావుకత్వం వున్న కథకుడాయన. కథను ఒక సామాజిక శక్తిగా నిరూపించిన కథకుడు.

శ్రీశ్రీ అన్నట్టు ఆయన ఆంధ్ర చెహూవ్ కాడు – విశ్వసాహిత్యంలో చెహూవ్ ఒక్కడే వున్నాడు. అలాగే కుటుంబరావు కూడా... తెలుగువాడు తప్ప మరెవరూ రాయడానికి వీలులేని తాతయ్య, అమ్మమ్మ, దత్తపుత్రుడు, తులశమ్మగారు. అమాయకులు, పాల్ కథలు చాలు తెలుగు ఎల్లలు దాటడానికి. కులద్వేషం, నువ్వులూ తెలకపిండి, కొత్త జీవితం, తిండి దొంగ, మహా ఇల్లాలు చాలు భారతీయ కథలను మించడానికి. హింస, కురూపి, ఫోర్త్ డైమన్షన్, స్వార్థ బుద్ధి, బకాసుర, దిబ్బ రాజ్యం కథలు, గ్రహశకలం, పట్నవాసం, పచ్చకాగితం వంటి కథలు విశ్వసాహిత్యంలో ఏ మంచి కథకుని సరసనయినా కొ.కు.ను నిలబెడతాయి.

కుటుంబరావు తీసుకున్న జీవితాలు మధ్య తరగతివే అయినా ఆయన దృక్పథం కార్మికవర్గ దృక్పథం, మార్క్సిస్టు అవగాహన, మధ్యతరగతి జీవితాలను తీసుకొని

అప్పటికి కొత్తదైన కార్మికవర్గ దృక్పథంతో కథలు రాసిన మొట్టమొదటి కథకుడు తెలుగులో కొడవటిగంటి కుటుంబరావు గారే. మధ్యతరగతి జీవితాలకు ఆలోచనలకు భిన్నమైన రీతిలో ముగింపులిచ్చి తెలుగు కథాపరిధిని మరింత పెంచి నూతనత్వానికి ఆద్యుడయ్యాడు కొ.కు. తనకు తెలియని కార్మికవర్గ జీవితాల జోలికి పోకుండా తెలిసిన మధ్య తరగతినే తీసుకొని కార్మికవర్గ దృక్పథంతో కథలు రాసిన గొప్ప కథకుడు కొ.కు.

కుటుంబ వ్యవస్థ గూర్చి రాసినా, వివాహ వ్యవస్థ గూర్చి రాసినా, సామాజిక సమస్యల గూర్చి రాసినా కొ.కు. సంప్రదాయ సిద్ధమైన మధ్య తరగతి విలువలను పరిరక్షించే ముగింపుల జోలికి పోలేదు. స్త్రీ పునర్వివాహం, వేశ్యావృత్తి, వరకట్న నిర్మూలన, స్త్రీ స్వాతంత్ర్యం, ప్రేమవివాహాలను ప్రోత్సహించడం లాంటి వివాహ సంబంధమైన కథల్లో స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం (చెడిపోయిన మనిషి), ఉన్నత విద్య (కురూపి) కావాలని చెప్పాడు. వివాహబంధం స్త్రీని కట్టిపడేసినంతగా పురుషుడ్ని కట్టి ఉంచడం లేదని (పచ్చకాగితం) నిర్ద్వంద్వంగానే చెప్పాడు.

అతడు రాసిన సామాజికపరమైన కథల్లోనూ సమాజ వికాసానికి, జాతి సంస్కార వికాసానికి తోడ్పడేటట్టు ముగింపులిచ్చాడు. గల్పికలాంటి కొత్త సాహిత్య ప్రక్రియను తెలుగులో ప్రవేశపెట్టి నాలుగైదు వందల కథలు రాసి తెలుగు కథలను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్ళాడు. మునిమాణిక్యం, ధనికొండ హనుమంతరావు, మధ్య తరగతి జీవితాల గూర్చి, మల్లాది రామకృష్ణశాస్త్రి, మధ్య తరగతి లైంగిక సమస్యల గురించి రాసారు. మధ్య తరగతి జీవితాలను ప్రతిబింబించాయని అనదగిన కథలు మధురాంతకం రాజారాంగారు రాశారు. వీరి కథలన్నీ కార్మికవర్గ దృక్పథాన్ని సమర్థించేవని చెప్పడం కష్టం.

ఇలా కొ.కు. అంతకుముందున్న మధ్య తరగతి జీవితాలకు, ముగింపులకు భిన్నంగా మధ్యతరగతి జీవితాలను తీసుకొని కార్మికవర్గ దృక్పతంతో కథలు రాసి తెలుగు కథకు కొత్త ద్వారాలు తెరవడం కొ.కు. సాధించిన కథా విప్లవం. కొ.కు. కథలను కార్మిక వర్గ దృక్పథమన్న మధ్య తరగతి జీవితాల కథలుగా పేర్కొనవచ్చు.

4. తెలుగు కథాసాహిత్యంలో మరో కొత్త ధోరణికి బాట వేసిన ప్రతిభావంతుడైన రచయిత రాచకొండ విశ్వనాథశాస్త్రి, కొ.కు. మొదలుపెట్టిన శ్రామికవర్గ దృక్పథాన్ని

మరింత ముందుకు తీసుకెళుతూ అట్టడుగు జీవితాలను తీసుకొని కార్మికవర్గ దృక్పథంతో కథలు రాసిన ప్రగతిశీల రచయిత రావిశాస్త్రి. రావిశాస్త్రి కథల్లో జీవితాలూ, దృక్పథమూ కార్మికవర్గానివే. అట్టడుగు జీవితాలను పాత్రలుగా తీసుకొని శిల్పపు మెరుగులతో తీర్చిదిద్ది కార్మికవర్గం దృక్పథంతో కథలు రాసి మెప్పించిన గొప్ప కథకుడు. రావిశాస్త్రికి ముందే శ్రామిక వర్గ ప్రజల గూర్చి మాగోఖలే, కరుణకుమార, చింతా దీక్షితులు కొన్ని కథలు రాసినా వాళ్ళ దృక్పథం కార్మికవర్గ దృక్పథం కాదు. జీవితాలు అట్టడుగువే అయినా దృష్టికోణం మధ్య తరగతిది. అట్టడుగు జీవితాల గూర్చి కార్మికవర్గ దృక్పథంతో ఉద్యమస్ఫూర్తితో కథలు రాసిన మొట్టమొదటి కథకుడు రావిశాస్త్రి.

సమాజం ఇలా ఉందని చెప్పడం మాత్రమే రచయిత బాధ్యత కాదని, అయ్యో అయ్యో అంటూ సానుభూతి కలిగేలా చేయడమే రచన లక్ష్యం కాదని, అలా ఎందుకుందో అందుకు గల కారణాలేమిటో అవి పోవడానికేం చేయాలో చెప్పడం కూడా రచయిత బాధ్యతేనని గుర్తెరిగి తన రచనా వ్యాసంగాన్ని కొనసాగించిన రచయిత రావిశాస్త్రి. రావిశాస్త్రి కథల్లో జీవితాలు, మానవ సంబంధాలు మాత్రమే కాక వాటిని నడిపే సూత్రాలను తెలుసుకొని రాసిన పరిజ్ఞానం కనబడుతుంది. ఇతని రచనలకు వాస్తవికత ప్రాణం.

శ్రీశ్రీకి అగ్గిపుల్లా, కుక్కపిల్లా ఏవీ కవిత్వానికనర్హం కానట్టే రావిశాస్త్రికి కూడా కథకు అనర్హం కాని వస్తువే కనబడలేదు. సారా మీద, సారాలమ్మే వాళ్ళ మీద, లంపెన్ బతుకుల మీద, అగ్గిపుల్లా, సబ్బుబిళ్ళా, కుక్కపిల్లా, రొట్టెముక్కా, బల్లచెక్కా, అరటి తొక్కా, తలుపుగొళ్ళెం, హారతిపళ్ళెం, గుర్రపు కళ్ళెం, బర్రెల మీద, గోవుల మీద, వేశ్యల మీద, రాజ్యాంగం రాజ్యాంగాన్ని నడిపించే యంత్రాంగం, న్యాయవ్యవస్థలోని డొల్లతనం అన్నిటి మీదా కథలు రాశాడు. ఏ వస్తువును తీసుకొని కథలు రాసినా అతనిది పేద జనుల పక్షపాతమే. ఇతిహాసపు చీకటి కోణంలో అట్టడుగున పడి కాన్పించని దీనహీన మానవులను అక్కున చేర్చుకొని కథలల్లాడు. దీనహీన మానవుల్ని హృదయానికి హత్తుకొని వాళ్ళ సంవేదనలకు అక్షరరూపమిచ్చి ఇంతటి ఉద్యమస్ఫూర్తితో, వర్గ దృక్పథంతో కథలు రాసి మెప్పించిన కథారచయిత రావిశాస్త్రి కంటె ముందు లేడు.

ఇతడు కథలు రాయడం మొదలుపెట్టిన తర్వాత విషయ సేకరణలో తెలుగు కథామార్గం నిర్ధారితమైపోయిందని చెప్పవచ్చు. సారా కథలు తెలుగు కథా సాహిత్యానికి నూతన దారులు చూపాయి. ఈ కథల్లోని ముత్యాలమ్మ, రామదాసు, రాకెట్ అప్పారావు, నీలయ్య, గురవయ్య, హెడ్‌కానిస్టేబుల్, లాయర్లు, పోలీసులంతా ఈ సమాజంలోని సజీవ పాత్రలే. మాయ కథలో ముత్యాలమ్మ ప్రసంగం మనలను అతలాకుతలం చేసి అట్టడుగు ప్రజల జీవిత దృశ్యాలను మన కళ్ళముందుంచుతుంది. రాజ్యాంగం, పోలీసులు, చట్టాలు ఎవరిపక్షమో, ఏ వర్గాల ప్రయోజనాలకు ఉపయోగపడుతున్నాయో తెలుపుతాయి. రావిశాస్త్రి సారా, సారో, పువ్వు, గుమస్తా, ఎండ, వర్షం దేన్ని గురించి రాసిన అతని చూపు దీనహీన మానవుల వైపే. సామాజిక అన్యాయానికి, ఆర్థిక అసమానతలకు గురవుతున్న అట్టడుగు వర్గం పైన్నే.

రావిశాస్త్రి శైలిలో బీనాదేవి, పతంజలి, అతని మార్గాన్ని ముందుకు తీసుకువెళుతూ కారా మరెంతో మంది కథారచయితలు రచనలు చేశారు. కారా రావిశాస్త్రిగార్లు కోస్తా ప్రాంతంలో ఉవ్వెత్తున లేవబోయే ప్రజాపోరాటాలకు నాందులు అనదగిన కథలు రాశారు. ఆ తర్వాత ప్రజా పోరాటాలకు ప్రతిస్పందనగా, పోరాటాలను చిత్రిస్తూ వచ్చిన కథలకు వీరి కథలు పునాదులు. ప్రేరణలు. కథ ఉద్యమ కథగా పరిణామం చెందే క్రమాన్ని ఉద్యమ కథలకు పటిష్టమైన పునాదిని, ఉద్యమాల్లో పాల్గొనే భౌతికావసరాలు తీరని పోరాట ప్రజల జీవితాలను ఇతివృత్తాలుగా స్వీకరించడానికి నాందిని ఈ కథలు మనకిచ్చాయి.

సుస్పష్టమైన సాహిత్య ప్రయోజనంతో, సాహిత్యం సమాజానికి ఏదో విధంగా మేలు చేయాలన్న దృక్పథంతో మంచిని పెంచాలన్న కాంక్షతో రచనలు చేసినవాడు రావిశాస్త్రి. సర్వసంపదలకు సృష్టికర్తలై వుండి కూడా కనీసావసరాలైనా తీర్చుకోలేని దోపిడీ పీడనలకు గురవుతున్న వాళ్ళ గూర్చి కార్మికవర్గ దృక్పథంతో కథలు రాసి తెలుగు కథ పరిధిని మరింత పెంచి ఉద్యమ కథలు రావడానికి పునాది వేసి మరో కథా విప్లవానికి బాట వేసిన గొప్ప కథకుడు రాచకొండ విశ్వనాథశాస్త్రి. ఈతని కథలను అట్టడుగు జీవిత కథలుగా పేర్కొనవచ్చు. ఈ కథలలో తెలుగు సాహిత్యంలో వస్తు సేకరణ మార్గం విశాలమైంది.

5. భూమినాది యన్న భూమి ఫక్కున నవ్వు
ధనము నాది యన్న ధనము నవ్వు
కదనభీతుజూచి కాలుండు నవ్వురా
విశ్వదాభిరామ వినురవేమ

అన్నాడు తెలుగులో మొట్టమొదటి ప్రజాకవి వేమన... భారతదేశ మంతట్లోనూ మొదట తెలంగాణలోనే భూపోరాటాలు మొదలయ్యాయి. స్వాతంత్ర్యానంతరం ఆ పోరాటాలు అణచివేయబడ్డాయి. అటు తర్వాత నక్సల్‌బరీ స్ఫూర్తితో శ్రీకాకుళంలో 1968-69 ప్రాంతాల్లో భూపోరాటాలు ఉధృతమయ్యాయి. అవీ అణచివేయబడ్డాయి. శ్రీకాకుళ పోరాటాలకు ప్రతిస్పందనలుగా కళింగాంధ్ర నుంచి కథలు వచ్చాయి. రావిశాస్త్రి, కా.రా. కథలు శ్రీకాకుళం పోరాటానికి ముందున్న పరిస్థితులను చెబితే శ్రీకాకుళ పోరాటం గూర్చి భూషణం కథలు చెబుతాయి. పోరాట ప్రతిస్పందనలతో కథలు రాసిన మొట్టమొదటి కథకుడు భూషణం - కొండగాలి, అడివంటుకుంది. పులుసు లాంటి కథలు శ్రీకాకుళ పోరాటం స్పందనలే. అక్కడి పోరాటం అణచి వేయబడ్డా రైతాంగ పోరాట ప్రతిస్పందనలుగా భూషణం, అప్పల్నాయుడు, ఎన్నెస్ ప్రకాశరావు, బి.టి. రామానుజం కథలు రాసారు. అటు తర్వాత తెలంగాణలో పోరాటాలు ఉధృతం కావడం, అదే సమయంలో విప్లవ రచయితల సంఘం ఆవిర్భావం జరిగింది. దాంతో విప్లవ కథ ఓ రూపం తీసుకుంది.

తెలంగాణ పోరాట స్ఫూర్తితో కరీంగనర్ నుంచి వెలువడిన బద్‌లా సకంలనం కథల వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్తూ రావిశాస్త్రి, కాళీపట్నం కథా వారసత్వానికి పొడిగింపు అన్నట్టుగా తెలంగాణ నుంచి ఉద్యమ కథలు వచ్చాయి. మొట్టమొదటి తెలంగాణ పోరాట ప్రతిస్పందనలుగా కొన్ని కథలు వచ్చినా అవి తెలంగాణ వాళ్ళు కాని వాళ్ళు రాసినవే ఎక్కువ. అయితే మొదటితరంలోనే అట్టడుగు వర్గ కవితలను తీసుకొని, ప్రజల భాషలో సురవరం ప్రతాపరెడ్డి, కాళోజీ, దాశరథి రంగాచార్య లాంటి వాళ్ళ కథలు రాసారు. రెండవసారి ఉద్యమాలు ప్రారంభమైన తరువాత తెలంగాణ నుంచి కథలు విరివిగా రావడం ప్రారంభమైంది. ఆ పోరాటాల్లోంచి వచ్చిన వాళ్ళు ఆ జీవితాలను చూస్తున్న వాళ్ళలోంచి రచయితలుగా ఎదిగి ఉద్యమ కథను సుసంపన్నం చేశారు. తెలుగు కథకు ఉద్యమ స్ఫూర్తిగా, విప్లవ కథగా మారిన దశకు చేకూర్చింది. భూషణం అల్లం రాజయ్యలతోపాటు తెలంగాణ రచయితలే.

రచయితకు కమిట్‌మెంట్ అవసరమన్న విషయాన్ని గుర్తించి ఉద్యమ కథలకు భాష్యాలకు తగిన కథలు రాసాడు అల్లం రాజయ్య. అతని కథల్లో ముఖ్య విషయం భూమి– భూపోరాటాలు.. ఈతని భూమి కథలు. సృష్టికర్తలు, శ్వేతరాత్రులు సంకలనం, రుతుపవనాలు, కార్మిక కథలు ప్రసిద్ధి చెందాయి. నేల తల్లి విముక్తి కోసం పేరుతో వచ్చిన కథాసంకలనం తెలంగాణా భూపోరాటాల క్రమాన్ని తెలిపే సంకలనం... తెలంగాణా పోరాటం కథకు గొప్ప ఒరవడిని చేకూర్చి అట్టడుగు జనాల గూర్చి, రైతాంగం గూర్చి కార్మిక వర్గ దృక్పథంతో కథలు రాసి కథకు ఉద్యమస్ఫూర్తి కలిగించిన ఉద్యమ కథల ప్రతినిధి అల్లం రాజయ్య. రాజయ్యతోపాటు తెలంగాణా పోరాట కథను అదే ఒరవడిలో సుసంపన్నం చేసిన రచయితలు బి.ఎస్. రాములు, వుప్పల నరసింహం, తుమ్మేటి రఘోత్తమరెడ్డి, కె. రామ్మోహన్‌రాజు, సాహూ, చుక్క గోపి, కాలువ మల్లయ్య లాంటి వాళ్ళెంతో మందున్నారు. 1970–90ల మధ్య ఈ కథల ఉధృతి ఎక్కువగా ఉంది. తెలుగు నవల వ్యాపార మాయలో పడి కొట్టుకుపోతూ, తెలుగు కథ దిక్కులేని స్థితిలో ఉన్న కాలంలో తెలంగాణ నుంచి విప్లవ కథలు విరివిగా వచ్చాయి. దీంతో ప్రజా కథల వైశాల్యం పెరిగింది. బర్లెంకడు, దుడ్డెల రాముడు, పాలేరు, చాకలి రాజయ్య, మంగలి ముత్తయ్యలాంటి వాళ్ళంతా ఇందులో కథానాయకులయ్యారు. తెలుగు కథ విప్లవ కథగా పరిణామం చెందిన కాలం ఇది.

అట్టడుగు జీవిత కథను పోరాటకథగా, విప్లవ కథగా మార్పు చెందించడమే ఈ భావవిప్లవం యొక్క ప్రయోజనం. ఇందులో కళింగాంధ్ర ప్రాంతం నుంచి భూషణంతో పాటు మరికొందరు, తెలంగాణ నుంచి అల్లం రాజయ్యతో పాటు మరికొందరు రచయితలు ముఖ్యపాత్ర వహించారు. తెలుగు కథా విప్లవాల్లో అతి ముఖ్యమైనదైన ఈ కథావిప్లవం గురించి మరింత లోతుగా అధ్యయనం చేయాల్సి ఉంది.

6. ఏ భాషలోనయినా ఒక ప్రత్యేక స్వాతంత్ర్యోద్యమం ఆ ప్రాంతం (దానితో ముడివడి ఉన్న భాష) లోని సాంఘిక, రాజకీయ ఉద్యమాల ననుసరించి లేదా అవసరాన్ని బట్టి ప్రస్ఫుటమవుతుంది. ప్రతి సాహిత్యోద్యమానికి బలమైన రాజకీయ, సాంఘిక పునాదులుంటాయి. అప్పుడే అది సాహిత్యాన్ని, సామాజిక తత్వాన్ని ఇతోధికంగా ముందుకు నెడుతుంది. సజీవమైన ప్రతిస్పందనలు ఇచ్చి ప్రజల

జీవనాడిగా నిలుస్తుంది. అలాంటి ఉద్యమాల్లో దళిత సాహిత్య ఉద్యమం ఒకటి. జాతీయ ఉద్యమకాలంలో దళితుల్లో ప్రధాన భాగమైన హరిజన, గిరిజన ప్రజల సమస్యలు, సంవేదనల గురించి దేశవ్యాప్తంగా వివిధ భాషల్లో సంస్కరణ ధోరణిలో రచనలు వెలువడ్డాయి. గాంధీతత్వం ఆ రచనలకు తోడ్పడింది. మరోవైపు 1938 తరువాత దేశంలో అల్లుకున్న అభ్యుదయ సాహిత్యోద్యమంలో అంతర్భాగంగా దళితుల సమస్యలను చిత్రించడం జరిగింది. కాని ప్రత్యేకించి మహారాష్ట్రలో మాత్రం డా. బి.ఆర్. అంబేద్కర్ ప్రభావం వల్ల మరాఠీ భాషలో దళిత సాహిత్య ఉద్యమాలకు పునాదులు పడ్డాయి. ఆ తరువాత 1970 నాటికి మార్క్సిస్టు తత్వానికి దగ్గరై ఉద్యమం శక్తిమంతంగా దూసుకువచ్చింది. అనువాదాల ద్వారా ఇతర భాషల్లోకి వెళ్ళి మరాఠీ దళిత సాహిత్యం తమ ఉద్యమ ఉత్తేజాన్ని నిరూపించింది.... అంటారు నిఖిలేశ్వర్.

తెలుగు దళిత సాహిత్యోద్యమం పుట్టడానికి మహారాష్ట్రలో లాగ రాజకీయ ఉద్యమాలు విడిగా దళితుల కోసం రాలేదు. వివిధ ప్రగతిశీల సాహిత్యోద్యమాలు దళితుల సమస్యను తీసుకుని ఉద్యమ సాహిత్యంలో భాగంగా రాశారు. అభ్యుదయ విప్లవ సాహిత్యోద్యమాలూ అవే పనిచేశాయి. అయినా తెలుగునాట 80ల తరువాత స్త్రీవాద సాహిత్యోద్యమంతో పాటు దళిత సాహిత్యోద్యమమూ వచ్చింది. దళిత కథలూ వచ్చాయి. ద.ర.క.మే. ఐక్యవేదకి, మాదిగ దండోరా, మాలమహానాడు, వివిధ కులోద్యమాలు, దళిత బహుజనుల నుంచి వచ్చిన రచయితలు ఈ సాహిత్యోద్యమాన్ని ముందుకు తీసుకెళ్ళాయి. ఈ ఉద్యమం తెలుగు విప్లవ కథకు నష్టం చేయలేదు. తెలుగు కథ మరింత ముందుకు వెళ్ళడానికి, ఇదివరకు స్పృశించని మరిన్ని కోణాలను స్పృశించడానికి దోహదం చేసింది. స్త్రీవాద, దళిత సాహిత్యోద్యమాలు రావడానికి కారణం ఉద్యమాలు వీళ్ళ సమస్యలను పట్టించుకోవాల్సినంతగా పట్టించుకోక పోవడం వల్లనే. ఆ ఉద్యమాలకున్న విస్తృతిలో దళిత ప్రత్యేక సమస్యలను, అణచివేతను, అంటరానితనాన్ని, క్షోభను గుర్తించాల్సిన విధంగా గుర్తించకపోవడం వల్లనే. ఈ సాహిత్యోద్యమం రావడం వల్ల దళిత కథ తద్వారా తెలుగు కథ మరింత సుసంపన్నమైంది.

ఈ సాహిత్యోద్యమాన్ని ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ముందుకు తీసుకెళ్ళిన వాళ్ళు బి.ఎస్. రాములు, కాలువ మల్లయ్య, బోయ జంగయ్య, కొలకలూరి ఇనాక్, గూడ అంజయ్య, మాస్టార్జీ లాంటి వాళ్ళు. చెప్పులు కుట్టేవాళ్ళు. డప్పులు కొట్టేవాళ్ళు, తొండాలు మడిచేవాళ్ళు, కూలీలు, వెట్టివాళ్ళు, మాలలు, మాదిగలంతా ఇందులో పాత్రధారులైనారు. మేమూ సాహిత్యానికెక్కదగినవాళ్ళమేనన్న ఆత్మవిశ్వాసం వాళ్ళలో పెరిగింది. తమ పేర్ల చివర అగ్రకులాల వాళ్ళలా కులం పేరు పెట్టుకోవడం తక్కువేం కాదన్న భావం పెరిగింది. వాళ్ళలో ఆత్మన్యూనతా భావం తగ్గింది. దళిత సాహిత్యోద్యమం ఉద్యమమే కాదనే వాళ్ళూ ఉన్నారు. వీరంతా దళిత సాహిత్యానికున్నంత విస్తృతి తెలుగు దళిత కథలకు లేకున్నా ఇటీవలి కాలంలో వచ్చిన దళిత కథలు తెలగు కథా సాహిత్య పరిధిని మరింత విశాలం చేసాయి. కొలకలూరి ఇనాక్ కథలు, కాలువ మల్లయ్య కథల సంపుటాలు, బి.ఎస్. రాములు కథలు, బోయ జంగయ్య కథలు, యువరచయితల కథాసంపుటాలు దళిత కథకు సంపదలనదగ్గవే. దళిత కథల విస్తృతి ఎంతో ఇటీవలి కాలంలో డా. రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, డా. లక్ష్మీనారాయణ వెలువరించిన ఎనిమిది దళిత కథల సంకలనాలను చూస్తే అర్థమవుతుంది.

ఇలా తెలుగు కథ పోరాట కథగానే కాకుండా స్త్రీవాద కథగా, దళిత కథగా ప్రత్యేక శాఖలుగా విస్తరిల్లి ఆయా విభాగాల్లో అద్భుతమైన కథలు రావడానికి దోహదం చేసింది. ఒకే దృష్టి కోణంలోంచ సాహిత్యమూల్యాంకనం చేస్తే దళిత కథ బలమేంటో అర్థమవుతుంది. తెలుగు కథ మరింత లోతుల కెళ్ళిందనడానికి అందులో పొరబాటు లేదనడానికి తెలుగులో వచ్చిన దళిత కథలే నిదర్శనం. జీవన వాస్తవికత అంబేద్కర్ సిద్ధాంతాల ప్రభావంతో వచ్చిన దళిత కథలు తెలుగు కథా సాహిత్య సంపద.... ఇదో కథావిప్లవమే.

7. సర్వసంపదలకు సృష్టికర్తలైన శ్రామిక కులాలవాళ్ళకు మొదట్నుంచీ! సాహిత్యంలో చోటు తక్కువే. బట్టలు కుట్టేవాడు, బట్టలుతికేవాడు, బట్టలునేసేవాడు, గొర్లు కాసేవాడు, నాగలి దున్నేవాడు, కుండలు చేసేవాడు, నగలు చేసేవాడు, కుమ్మర్లు, వడ్రంగులు, చేపలు పట్టేవాళ్ళు, సాతానులు.... ఇతర వృత్తుల వాళ్ళంతా పనిచేస్తూ

బతికేవాళ్ళు.... సంపదలను సృష్టించేవారు....సృష్టికర్తలైన వీళ్ళకుసాహిత్యంలో చోటులేదు. ఉన్నా అతి తక్కువ... బహుజన హితాయ బహుజన సుఖాయ అని బుద్ధుడు చెప్పినా, పూలే అంబేద్కర్ లాంటి వాళ్ళు కృషి చేసినా, రామ్‌మనోహర్ లోహియా రాజకీయ దృక్పథం చూపినా వీళ్ళకు సాహిత్యంలో చోటు లభించింది మాత్రం స్వల్పమే. అయితే ఈ వర్గాల్లోంచి రచయితలు రావడం మొదలైన తరువాత పూలే అంబేద్కర్‌ల భావజాల వ్యాప్తి జరిగిన తరవాత బహుజనుల గురించి ఎందుకు రాసుకోకూడదన్న ప్రశ్న తలెత్తింది. మండల్ కమీషన్ నివేదిక బయటకొచ్చిన తరువాత, బహుజన సమాజ్‌పార్టీ, సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్రీయ జనతాదళ్ లాంటి సామాజిక న్యాయపార్టీల విజృంభణ పెరిగిన తరువాత ఈ భావజాలం మరింత పెరిగింది. అయితే ఏ పార్టీలతో సంబంధం లేకుండా పని సంస్కృతిని ఉన్నతీకరిస్తూ మొదట్నుంచి తెలుగులో ముఖ్యంగా తెలంగాణా నుంచి రచనలు చేస్తున్నారు. వివిధ వృత్తులకు సంబంధించిన వాళ్ళను తీసుకొని కథలుగా మలుస్తున్నారు. అలా వచ్చినవే అవ్వతోడు, గిది తెలంగాణ, తెలంగాణ మట్టికథలు, పల్లె మంగలి కథలు లాంటి... కాలువ మల్లయ్య, బిఎస్ రాములు, ఇతర తెలంగాణ రచయితలు, సుంకోజు దేవేంద్రాచారి, స్వామి లాంటి రచయితలు గోగు శ్యామల, నాయకి వృత్తుల గూర్చి కథలు రాస్తూ తెలుగు కథకు బహుజన పరిమళమద్దుతున్నారు. కొందరు పాతికేళ్ళుగా ఈ కథలకు రాస్తుంటే మరికొందరు ఇటీవలి కాలంలో విరివిగా రాస్తున్నారు. తెలుగు సాహిత్యంలో బహుజన కథావిప్లవం ఓ ఉద్యమం నిలదొక్కుకోలేదన్న వాళ్ళు కూడా ఇటీవలి కాలంలో తమ మూలాలను వెతుక్కుంటూ రాసే క్రమం ఉధృతమైంది. ఈ కథా ఉద్యమం గురించి మరింత లోతులకు వెళ్ళి పరిశీలించాలి.

8. ప్రాంతీయం కాని విశ్వజనీన సాహిత్యం ఉండదన్న సత్యాన్ని గుర్తెరిగి రాసే క్రమం ఇటీవల ఉధృతమైంది. అంతా పరాయీకరణం పాలయి తమ అస్తిత్వాలను కోల్పోతుంటే ప్రాంతీయ దృక్పథంతో, భాషతో తమ మూలాలను వెతుక్కుంటూ రాసే సాహిత్యోద్యమం తెలుగులో వేళ్ళూనుకుంటుంది. ఆయా ప్రాంతాల నుంచి వస్తున్న కథా సంకలనాలు, మైనారిటీ సాహిత్య సంపుటాలు, సంకలనాలు ఇందుకు ఉదాహరణలు. ఇటీవలి కాలంలో వచ్చిన వతన్ కథల సంకలనం తెలుగు నేలలోని మూడు ప్రాంతాల ముస్లిం జీవితాలకు అద్దంపట్టే రచనలు. ప్రాంతీయ, మైనారిటీ

వాద సాహిత్యాలు తెలుగులో ఇంకా ఉద్యమ స్థాయినందుకోకున్నా అందుకునే స్థితిలో ఉన్నాయి. వీటిని గురించి కూడా మరింత లోతులకు వెళ్ళి పరిశీలించాల్సి ఉంది.

తెలుగు సమాజంలో జాతీయ, స్వాతంత్ర్య పోరాటాలు ఉద్యమ రూపం తీసుకున్నాయి. సాహిత్యంలో అది కవిత్వంలో ఉద్యమ రూపం తీసుకుంది. కాని కథల్లో ఉద్యమస్థాయిలో ఎదుగలేదు. అయినా జాతీయోద్యమ ప్రభావంతో కొన్ని కథలు వచ్చాయి. చలం రాసిన అప్పుడూ ఇప్పుడూ, సుశీల కథలు ఇందుకు ఉదాహరణలు. జాతీయోద్యమంలో గాంధీజీని కథానాయకున్ని చేస్తూ మంచి కథలు వచ్చాయి. కలువకొలను సదానంద రాసిన తాత దిగిపోయిన బండి, దాశరథి రంగాచార్య రాసిన మళ్ళీ మహాత్ముడు మన దగ్గరికి వచ్చాడు, విశ్వనాథ సత్యనారాయణ దేవుడి ఇష్టం ఇలా వచ్చిన కథలు... అలాగే కొనకళ్ళ వెంకట రత్నం రాసిన చివరకు మిగిలిన రంగడు, కరుణ కుమార ఉన్నతోద్యోగం, అమరేంద్ర, సమర్పణ, డా. పి. కేశవరెడ్డి 'దిరోడ్', మధురాంతకం రాజారాం అజ్ఞాత సూరీడు, దాదా హయత్ ప్రదర్శన, కట్టెల వెంకటరావు అల్పసంతోషి ఆచార్లు, ముద్దు కృష్ణగారి నామంత్రి, మల్లాది కైంకర్యం, జి.వి. కృష్ణారావుగారి అనిర్వచనీయ ఖ్యాతి, బాపిరాజు ద్వేషం, వేలూరి శివరామశాస్త్రి ఆరాచకం జాతీయోద్యమ కథల్లో చెప్పుకోదగ్గవి.

ఇలా జాతీయోద్యమ ప్రభావంతో వచ్చిన కథలు తక్కువే అయినా వాటిలో ఆనాటి జన జీవితం, ఉద్యమాలు, ఖద్దరు వాడకం, గాంధీ ప్రభావం, దేశభక్తి సమర్థవంతంగా చిత్రించడం జరిగింది.

తెలుగులో దిగంబర సాహిత్యోద్యమం, కవిత్వంలో విశేష ప్రభావం చూపినా వచనంలో చూపిన ప్రభావం దాదాపు శూన్యం... ఈ ఉద్యమం కథల్లో వాదంగాకూడా ముందుకు పోలేదు. అటు తర్వాత వచ్చిన విప్లవోద్యమం తెలుగు కథను విశేషంగా ప్రభావితం చేసి...

ఇలా తెలుగు కథల్లో కొన్ని వాదాలు గానే ఆగిపోతే మరికొన్ని ఉద్యమాలుగా, విప్లవాలుగా పరిణామం చెందాయి. తమ ప్రభావాన్ని తెలుగు సమాజంపై చూపుతున్నాయి.

●

యశోదారెడ్డి కథలు - రచనా శిల్పం

◆ ముదిగంటి సుజాతారెడ్డి

పాకాల యశోదారెడ్డి సంస్కృతాంధ్ర భాషల్లో విదుషీమణి, పరిశోధకులు సాహిత్య విమర్శకులు. వచన కవిత్వం కూడా వ్రాసారు. మంచి వక్త. ఆమె వేదికల మీద నిరర్గళంగా ఉపన్యసించేవారు. ఆమె వాక్ప్రవాహంలో శ్రోతలు తన్మయులై కొట్టుకు పోయేవాళ్ళు. అచ్చమైన తెలుగు, సుదీర్ఘమైన సంస్కృత సమాసాలను కలిపి గుప్పిస్తుంటె వినటానికి ఇంపుగా ఉండేది. దివాకర్ల వేంకటవధాని శిష్యురాలు. ఇవన్నీగాక ఆచార్య యశోదారెడ్డి మంచి కథకురాలు. అసలు ఆమె సాహిత్య జీవితం కథలు, ముచ్చెట్ల రచనలతోనే ఆరంభమైంది. 1950 దశకారంభం నుంచే ఆమె ఆలిండియా రేడియోలో "మహాలక్ష్మి ముచ్చట్లు" అని వినిపించేది. అవి ఆమె పుట్టిన పాలమూరు జిల్లా బిజినేపల్లి గ్రామం భాషలో యాసలో వుండేయి. తర్వాత "మావూరి ముచ్చట్లు" పేరుతో కథల సంపుటి ప్రచురించారు. ఆమె కథలు అచ్చమైన మాండలికంలో వున్నాయి. మాండలిక పదాలను ప్రజలు ఎట్లా పల్కుతారో అదేవిధంగా ఆమె కథలో వ్రాసారు. అందుకే ఆమె కథలు మనకు మనం చదువుకున్న దానికన్నా ఆమె చదివి వినిపిస్తుంటే చాలా రక్తి కట్టేయి. మాండలిక పదాలను చక్కని యాసలో భావయుక్తంగా చదివి వినిపించడం ఆమెకున్న విద్యల్లో ఒకటి. ఆమెది మధురమైన కంఠం. చక్కని తొణకని ఉచ్చారణ. స్వచ్ఛమైన చదివే తీరు అందరినీ ఆకట్టుకునేది. అట్లా తెలంగాణ మాండలికం అంటే యశోదారెడ్డియే అని పేరు తెచ్చుకున్నారు.

కథను పూర్తిగా, కథనంతో పాటుగా మాండలికంలో నడిపిన మొట్టమొదటి కథ తెలుగులో 1939లో సీతారామారావు వ్రాసిన "గరీబోన్ని" అనే కథ. ఇది "తెలుగుతల్లి" పత్రికలో అచ్చయింది. ఈ కథ కథనం అంతా నల్లగొండ మాండలికంలో

వుంది. ఆ తర్వాత 1940లో అచ్చయిన "కమ్మతెమ్మెరలు" అనే కథల సంకలనంలో చరుకుపల్లి రఘోత్తమరావు "కోవిల్లో", చరుకుపల్లి హరికృష్ణారావు "పల్లెబడి" కథలు పూర్తిగా ఆద్యంతం నల్లగొండ మాండలికంలో వ్రాయబడినాయి. 1940 దశకంలో చాసో విజయనగరం మాండలికంలో కొన్ని కథలు వ్రాశాడు. తెలంగాణాలో 1950ల్లో గూడూరి సీతారాం సురమౌళి వంటి రచయితలు కథనంతా మాండలికంలో వ్రాసారు. తర్వాత చాలామంది రచయితలు తమ కథల్లో, నవలల్లో వాస్తవికత కోసం వాతావరణ సృష్టి కోసం సంభాషణల్లో మాండలికాలను వాడారు. కాని కథనంతా మాండలికంలో వ్రాయటం తక్కువగానే జరిగింది. తొలితరం కథారచయితల్లోనూ కథనంతా మాండలికంలో నడిపించినవాళ్ళు తక్కువే. వేళ్ళ మీద లెక్కించేంతగానే కనిపిస్తున్నారు. సంభాషణలను మాండలికంలో వ్రాసిన రచయితలు అప్పుడు ఇప్పుడూ చాలామంది వున్నారు. కాని కథనంతా మాండలికంలో వ్రాయటం అరుదుగా జరిగింది. రచయిత్రుల్లో కథనంతా మాండలికంలో వ్రాసిన వాళ్ళు తొలితరంలో లేనే లేదు. అట్లా మాండలికంలో కథలను తొలితరంలో వ్రాసిన రచయిత్రి యశోదారెడ్డి ఒక్కరే. ఆమె మొదటి కథ 'నాగి' వట్టికోట ఆళ్వారుస్వామి 1956లో ప్రచురించిన "పరిసరాలు" కథల సంకలనంలో కనిపిస్తున్నది. అంతకుముందామె 1951లో వ్రాసిన "వచ్చినవి తామరలు" కథ "సుజాత" పత్రికలో మాకు దొరికింది. దాన్నే మేము తెలంగాణా తొలితరం కథలు రెండో భాగం "తొలినాటి కతలు" లో చేర్చాం. అది తప్ప ఆమె 1956కి మొదలు కథలు వ్రాసినట్లు కనిపించదు. అంటె యశోదారెడ్డి కథారచన 1950 దశకంలో ఆరంభమై 1956 తర్వాత 1960, 70 దశకాల్లోనే ఎక్కువగా సాగిందని చెప్పాలి. ఆమె మొదట కథల సంపుటి "మా ఊరి ముచ్చట్లు" 1973లో అచ్చయింది. ఆ తర్వాత ఆమె 1999లో "ధర్మశాల", 2000లో "ఎచ్చమ్మ కతలు" అచ్చు అయ్యాయి. పబ్లిషర్లు ఎక్కువగా మార్కెట్టున్న నవలలను అచ్చు వేసినట్లుగా కథలను వేయటానికి ముందుకు రాలేదు. ఆమె సొంతంగానే కథలను అచ్చు వేసుకోవలసి వచ్చింది. కాబట్టి ఆమె కథలు తెంలగానా కథకులందరి కథల్లాగానే ఆలస్యంగానే పుస్తక రూపంలో వచ్చాయి. కాని రేడియోలో చదవటం చేత, ఆంధ్రప్రభ, జ్యోతి, స్వాతి, ప్రజాతంత్ర వంటి పత్రికల్లో ఆమె కథలు అంతకుముందే అచ్చు కావటం చేత 1960ల నాటికి ఆమె కథారచయిత్రిగా పేరు సంపాదించుకుంది.

“మా ఊరి ముచ్చట్లు, ఎచ్చమ్మ కతలు”లోని కథల్లో కథనం సంభాషణలు అంతా మాండలికంలో వున్నాయి. “ధర్మశాల” కథలు ప్రామాణిక భాషలో వున్నాయి. ఆమె “విచ్చిన తామరలు” మాండలికంలో వ్రాయలేదు, ఆ కథలో మాండలికం వాసనలు లేవు. కాని 1956 నుంచి ఆమె కథలను ఆద్యంతం అచ్చమైన తెలంగాణ మాండలికం లోనే వ్రాసారు. తెలంగాణలో మొదటి తరం కథారచయిత్రి నందగిరి ఇందిరాదేవితో, (ఆమె అప్పుడు అమెరికాలో వుంటున్నారు) నేను ఫోనులలో మాట్లాడినప్పుడు “మీరెందుకు తెలంగాణ భాష యాసలను నుడికారాలను ప్రయోగించలేద”ని అడిగాను. దానికి ఆమె “ఆ భాష (అంటె ప్రామాణిక భాష)లో వ్రాస్తేనే గుర్తింపు వస్తుందనుకున్నాం” అని చెప్పి తెలంగాణ భాషలో “యశోదారెడ్డిగారు వ్రాస్తుండేవారు” అన్నారు. ఆ విధంగా తెలంగాణ మాండలికంలో కథలను వ్రాస్తున్న రచయిత్రిగా యశోదారెడ్డి 1960ల నాటికి పేరు తెచ్చుకున్నారు. అసలు ఎక్కువ సంఖ్యలో కథలను తెలంగాణ భాషలో, యాసలో మొట్టమొదట వ్రాసింది యశోదారెడ్డి అని చెప్పాలే. తెలంగాణ మాండలికాన్ని ప్రయోగించి తెలంగాణా జీవన సంస్కృతులను చిత్రించి అచ్చమైన తెలంగాణ కథారచయితగా ఆమె పేరు తెచ్చుకున్నారు!

యశోదారెడ్డి మంచి విమర్శకురాలు. కాబట్టి ఆమెకు కథను గురించి దాని చరిత్ర, దాని లక్షణాలను గురించి మంచి అవగాహన ఉంది. ఆమె 1989లో “కథాచరిత్ర” పేరుతో కథాలక్షణాలను కథల భేదాలను గురించి విమర్శ గ్రంథం ప్రచురించారు. “ధర్మశాల” కథల సంపుటికి ఆమె “నా మాట” వ్రాస్తూ– “కథ ఎప్పుడూ నిరాధారంగా పొట్మరిల్లదు” అంటారు. ఇంకా కథను గురించి చర్చిస్తూ – “కథావస్తువు ఎక్కడో అంతూ పొంతూ చిక్కని ఆకాశం నుండి ఊడిపడదు. అది జీవితం నుండి జనానీకం నుండి పరిసరాల నుండి నిశితమైన చూపు నుండి అనుభవరాశి నుండి మొలకెత్తుతుంది” అంటారు. ఆమె తన కథలను గురించి చెప్తూ “నాకథలన్నిటికీ వస్తువు ఎక్కడో మిన్నులుపడ్డ తావుల నుండి రాలేదు. నేను పెరిగి పెద్దదైన పల్లెపట్టులూ, చూచిన గుట్టలూ, కొండవాగులూ, పురుగాడి చెడిన పట్టణపు నాగరికతలూ, తెలిసీ తెలియని మూఢనమ్మకాలు, రాజసాలు, అహంకారాలు, యువకులు, పరిత్యక్తలూ, పతివ్రతలూ, ధూర్తులు ఎందరెందరో – అప్పుడప్పుడు నేను విని, చదివి, చూచిన విషయం భూమిక కాగా యింతవరకు మస్తిష్కంలో దాగిన

స్మృతి జ్ఞానంతో జతపరచి కథలు అల్లడం జరిగింది. అంతేగాని వాస్తవం లవలేశం లేకుండా స్వేచ్ఛగా ఊహాగానం చేస్తూ గిరగిరా రంకురాట్నం తిరుగలేదు. తిప్పలేదు" అని అంటారు. కథకు కొంతమట్టుకు వాస్తవ జీవితం ప్రధానమైనా అది కేవలం వార్తగా మాత్రం సాగకూడదు. "కథను రమణీయంగా మలచడానికి రచయిత రచనపై శిల్పసామర్థ్యాలపై ఆధారపడి ఉంటుంది" అని కథకు శిల్పంకూడా ప్రధానమని ఆమె అంగీకరించారు.

రచయిత తన అనుభవాలు నిశిత దృష్టితో చూసిన విషయాలను "మెదడులో వో మూల స్థిరనివాసాన్ని ఏర్పరచుకుంటాయి. ఆ అనుభవసారమే రచయితకు నిగూఢ నిధిలా ఉపకరిస్తుంది" అని ఆమె గుర్తించారు. అందుకేనేమో యశోదారెడ్డి చాలా కథల్లో ఆమె చిన్ననాటి పల్లెటూళ్ళు, అక్కడి మనుషులు, పేర్లు, అప్పటి జీవితం సంస్కృతి ప్రతిబింబించి కనిపిస్తాయి.

యశోదారెడ్డి రచనారంభ కాలంలో వ్రాసిన "నాగి, ముమ్మైకత, మా పంతులు" కథల్లో ఆమె బాల్య జీవితం బాల్యానుభవాలు ప్రతిబింబించాయి. నాగి పేదరికం, ఆకలితో దొంగగా మారుతుంది. అల్లరి చిల్లరగా తిరుగుతుంది. పట్నంలో చదువుకొని చాలించుకొని వచ్చిన రాంరెడ్డి నాగిని చూసి బాధపడ్డాడు. ఆ పిల్లను చేరదీసి "పొట్ట నిండ అన్నం బెడ్త, పై నిండ బట్టలిస్త ఆ దొంగతనం గింగతనం మాని పనిజేస్తవ?" అని అడుగుతాడు. నాగి బువ్వబట్ట దొరికింతర్వాత బుద్ధిమంతురాలవుతుంది. మనిషి మీద పరిసరాల ప్రభావం వుంటుందని నిరూపించే కథ ఇది. "ముమ్మైకత" ఒక చిన్న పిల్ల తన చిన్ననాడు ఎత్తుకొని ఆడించిన అమరుసింగును చూసి గుర్తుపట్టక వాడు తనను కాలే నూనెలో వేసి "ముమ్మై" అంటే "మోమ్" మైనం చేసేవాడని భయపడుతుంది. తర్వాత అమరసింగు ఇంటికి వచ్చి తనను పరిచయం చేసుకోవటంతో ఆ పిల్ల భయం వదులుతుంది. సామాన్యంగా చిన్న పిల్లల్లో ఇటువంటి ఎత్తుకుపోతారని, జోలెలో వేసుకొని పోతారని, కుక్క పిల్లలుగా జేసుకొని వెంట తీసుకుపోతారని భయాలు చోటుచేసుకుంటాయి. అట్లా భయపడే ఒక చిన్నపిల్ల వృత్తాంతాన్ని యశోదారెడ్డి ఈ "ముమ్మైకత"లో చెప్పారు. అది ఆమె చిన్ననాటి స్వానుభవం స్వానుభూతుల నుంచి వచ్చిన వృత్తాంతమేమో! "మా పంతులు" కథలో ఒక చిన్న బడి పంతులు గురించి బడిలో రోజూ జరిగే విషయాల గురించి యశోదారెడ్డి

కండ్లకు కట్టేటట్లుగా వర్ణించింది. నిజాం కాలంలో తెలుగుబడులు – అంటే తెలుగు నేర్పే బడులు తక్కువ. నిజాం పాలన పోయి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత స్కూలును అప్‌గ్రేడు చేసి ఊరిమనిషి టీచరుగా పనికిరాడని తెలుగురాదని తెలుగుబాగా వచ్చినోడు కాదని ఏరవతలోడిని టీచరుగా నియమిస్తారు. అమాయకులైన పిల్లలు "పంతులూ! అనుకుంటూ కడ్పదాటి ఎంట ఉర్కటంతోటి రచయిత్రి కథను ముగించింది. ఈ కథలో 1930, 40ల్లో ఊరిబడులు వీధి బడులు ఎట్లా వుండేయి, తెలుగు పాఠాలే మేమి చెప్పేవాళ్ళు చాలా విషయాలను తెల్పారు రచయిత్రి.

"మ్యానరికం" కథలో తల్లి తన కొడుక్కు అన్న కూతురును చేసుకోవాలని కోరుకొని అన్న ఇంటికి కొడుకును తీసుకొనిపోతుంది. ఆమె అన్నకు తన కోరిక చెపుతున్నప్పుడే మేనకోడలు తన కొడుకు తల మీదున్న తిరుపతి వేంకటేశ్వరుని మొక్కయిన పొడువైన వెంట్రుకలను కత్తిరించడం చూసి అలిగి నీ కూతురు సంబంధం ఒద్దని వెళ్ళిపోతుంది. ఇదే ఇతివృత్తం "గంగిరేగిచెట్టు" కథలో వుంది. ఆ కథలో మేనగోడలు "ఎచ్చమ్మ", "ఎచ్చమ్మ" అంటే ఏశమ్మ, యశోదయే. అంటె చిన్ననాటి యశోదారెడ్డియే. ఎచ్చమ్మ గంగిరేగి చెట్టు మీదికి వంగిన బావ వీపు మీద కాలు పెట్టి ఎక్కి దిగుతుంది. ఈ దృశ్యం చూపిన ఎచ్చమ్మ మేనత్త ఈ పిల్ల ముందు ముందు తన కొడుకు మీద పెత్తనం చలాయిస్తుందని అటువంటిది తనకు కోడలుగా పనికిరాదని కోపంతో వెళ్ళిపోతుంది. రెండు కథల ఇతివృత్తం ఒక్కటే అయినా రెండు కథలను పూర్తిగా వేరు వేరు భాషతో యాసతో పాత్రలతో సంభాషణలతో వాతావరణంతో శిల్పంతో నడపటం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఈ రెండు కథల్లో పాటించిన యశోదారెడ్డి కథా నిర్వహణ నైపుణ్యాన్ని మెచ్చుకోకుండా ఉండలేము!

"పీర్ల పండుగ" కథలో హిందువులు కూడా భక్తి నిష్ఠలతో పీర్లను ఎత్తుకుంటారు. మత వైషమ్యం లేకుండా ఒకే మతస్థులుగా మెదులుతుంటారు అనే ఇతివృత్తముంది. "జతగాళ్ళు" కూడా హిందూ ముస్లింల సఖ్యతను చెప్పే కథనే.

సీతక్క రాదమ్మ స్నేహితులు. సీతక్క కొడుక్కు మొగుళ్ళ రోగం వస్తే తురక ఫకీరును ఆశ్రయిస్తుంది. కొడుక్కు నయం కావటంతో ఆమె ప్రతి సంవత్సరం భక్తి శ్రద్ధలతో దర్గాకు పోతుంటుంది. తురక మతాన్ని సీతక్క విశ్వసించటం రాదమ్మకు ఇష్టముండదు. ఇద్దరి స్నేహం బీటలు వారుతుంది. ఒకరోజు రాదమ్మ కొడుకు గోపాల్

తన తురక దోస్తు రహీంను వెంట దీసుకొని ఇంటికి సెలవుల్లో వస్తాడు. రహీం సత్ప్రవర్తన చూసి తన కొడుకు అతనితో వున్న స్నేహసంబంధం చూసి రాదమ్మ హృదయం పశ్చాత్తాపానికి గురవుతుంది. సీతక్కను అనరాని మాటలంటి. "ఇంత కుంపటి నాతండ్రి నా ఇంట్లో వెట్టడని నాకు దెల్వకపాయె. గిట్లని ఎర్క ఉంటే కులం తలం ఈడూ జోడూ మాటమన్నిక గలిసిన పిల్ల సీతక్క బిడ్డను వొద్దనకపోదును గదా!" అనుకొని మళ్ళీ సీతక్కతో స్నేహం కద్దుంది. ఆమె కూతురును తన కొడుక్కు చేసుకోవటానికి ఒప్పుకుంటుంది.

"జోగుళయ్య" కథ ఒక శైవ కుటుంబానికి చెందింది. జంగం శెన్నబసప్ప పెద్ద కొడుకు నాగప్పకు బంగు అలవాటు వుంటుంది. దాంతో అతడు ఒకసారి పోయి పోయి సాధువుల్లో కలిసిపోయి నాగయోగి అవుతాడు. మఠంల ఒక్కరోజు పెద్ద యోగిని తనకు సన్యాసం ఇప్పించమని అడుగుతాడు. అప్పుడు పెద్ద యోగి "నీవు నీ ఇంటికిపోయి వారం రోజులు గడిపిరా. వచ్చినంక ఆలోచిస్తామని" అంటాడు. నాగయోగి ఇంటికిపోయి తల్లిదండ్రులను భార్యను చూసి మళ్ళా కుటుంబమోహంలో పడిపోతాడు.

"ఎంకన్న" కథ ఒక విచిత్రమైన కథ. సీతక్క అనే ఆవు మందలో వున్నా ఏ కోడెను దగ్గరికి రానీయదు. కడ్తలేదు. ఈ ఊరి ఎంకట్రాంరెడ్డి ఒక కోడెల జతను కొనుక్కొస్తాడు. ఒక కోడెను నాగిరెడ్డి అడిగితే అతనికిచ్చేస్తాడు. మిగిలిన కోడె ఎంకన్న. ఎంకన్నను చూసి సీతమ్మ సీతమ్మను చూసి ఎంకన్న ఇష్టపడత్తారు. సీతమ్మ లక్ష్మిని కంటుంది. ఈ కథలో యశోదారెడ్డి సీతమ్మ ఎంకన్నల పశువుల ప్రేమను ఒక స్త్రీ పురుషుల మధ్య వుండే ప్రేమగా వర్ణించి రక్తి కట్టించారు.

"మురారి" కథలో ఒక సాధువు ఒక ఊరికి వచ్చి ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా ఊరిని అభివృద్ధి చేస్తాడు. ఏ ప్రలోభాలకు లొంగడు. కథ చివర రచయిత్రి ఆ సాధువు ఆ ఊరి పెద్ద రామచెంద్రయ్య. అతని చెల్లెలు శాంతమ్మ. ఆమె పట్నంలో చదువుతునన్నుడు ఆమెను మురారి ప్రేమిస్తాడు. కాని శాంత సన్నిపాత జ్వరం వచ్చి చనిపోతుంది. ఆమె మీది ప్రేమతో ఆమె మరణం తరువాత మురారి విరాగియై ఆమె పుట్టిన ఊరికి వచ్చి సమాజసేవ చేస్తున్నాడనీ కథ చివర తెలుస్తుంది. వస్తువులో విశేషం లేకున్నా సాధువుగా మురారి చేసిన మంచి పనులను, సాధువును చూసి ఆ ఊరి కన్యలు ప్రేమలో పడిన తీరును రచయిత్రి చక్కని శైలిలో వర్ణించారు.

యశోదారెడ్డి రచించిన కథల్లో వస్తువు ఇతివృత్తం కన్నా కథనం పాఠకుల్ని ఎక్కువ ఆకర్షిస్తుంది. కథలో ఒకొకసారి వస్తువుకు ప్రాధాన్యం లేదన్నట్లనిపిస్తుంది. కథలో వస్తువు వున్నా సన్నివేశాలు, సంఘటనలు తక్కువగా వుంటాయి. కథనం, వర్ణనలు ఎక్కువగా వుంటాయి. పాత్రల మనోగత భావాల వర్ణనలు స్వగతాలు చాలా దీర్ఘంగా వుంటాయి. కథల్లో కథనం ఎక్కువగా రచయిత్రి చెప్పటమే అంటే సర్వసాక్షి కథనమే ఎక్కువగా వున్నా "ముమ్మైకత" వంటి కొన్ని కథల్లో పాత్రల ఆలోచనల స్వగతం రూపంగా, కథనం సాగించటం కనిపిస్తుంది. "కోడలమ్మ ఎతలు" కథలో ఇంట్లో కోడలికి స్వాతంత్ర్యం స్వేచ్ఛ తనదైన వ్యక్తిత్వం తనదైన ఆలోచనలు వుండవు. ఏది చేసినా ఇంట్లోవాళ్ళు తప్పు పడ్తారు. ఈ కథ కోడలమ్మ ఆలోచనలు స్వగతం రూపంగా కూసుంటె నడిచింది. కోడలు తన పరిస్థితిని గురించి ఇట్లా అనుకుంటుంది. తప్పులేస్తే తప్పు అయ్యో! దేవుడా! కూసున్కం లేస్కం అట్లవెట్టి నానెత్తి నేను దువ్వుకున్నా తప్పే! దువ్వుకోకుంటే అంత కన్న తప్పు. తుమ్మిన తప్పే దగ్గిన తప్పే!" కోడలు పడే కష్టాలను రచయిత్రి చాలా సహజంగా వాస్తవికంగా చిత్రించారు. "ముమ్మైకత"తో అమ్మణి పాత్ర కథ చెప్పినట్లుగా పాత్ర దృష్టి కోణంతో ఉత్తమ పురుషలో కథనం నడిచింది.

సర్వసాక్షి కథనంలో మధ్య మధ్య పాత్రల మనస్సులో సాగే ఆలోచనల రూపంగా కథనం నడిపిన సందర్భాలు ఎక్కువగా వున్నాయి. ఉదాహరణకు "మ్యానరికం" కథలో మొదటి రెండు పేజీలు కమలమ్మ పాత్ర ఆలోచనలు, స్వగతం రూపంగా కథ సాగుతుంది. తర్వాత సర్వసాక్షి కథనం కనిపిస్తుంది. పాత్రలకు పేర్లు పెట్టేటప్పుడు కూడా తెలంగాణలో వుండే పేర్లను లేదా తెలంగాణ ఉచ్చారణలో వుండే పేర్లను యశోదారెడ్డి తీసుకున్నారు. కమలమ్మ అనుకుకుండా 'కములమ్మ' అనటం, 'రాధమ్మ' అనకుండా 'రాదమ్మ' అనటం, 'చెన్నబసప్ప' అనకుండా 'శెన్నబసప్ప' అనటం 'శివమ్మ బదులుగా 'శివ్వమ్మ' అనటం అట్లా కథలో వాతావరణాన్ని సృష్టించటానికి ఆమె తెలంగాణ ప్రాంతపు ఉచ్చారణలతో వున్న పేర్లనే వాడారు.

యశోదారెడ్డి కథనం ప్రవాహంలాగా నడుస్తుంది. 'నాగి' కథలో 'నాగి'ని పాఠకులకు పరిచయం చేస్తూ ఆమె ఈ విధంగా అంటుంది. "ఊరన్న ఊరును ఊగిచ్చే ఈ నాగి యెవరు? మూడు పువ్వులెత్తున మూసిన ముత్తెమా? కోట్ల మెరిసి

ఏట్ల దేలె కొర్విదయ్యమా? కండ్లవడకుండ మణిషి నెత్తురు దాగె అనుమానపిశాచమా? – ఉన్నోళ్ళు హుండీలు నింపి ప్యాదోళ్ళను సాగనంపే కరువా? అంటె కాదు. అదో దిక్కులేని ప్యాదరాలు గొల్లమల్లి చిన్నబిడ్డ."

జీవన వాస్తవికత ప్రధానమైన కథలో ఇటువంటి పరిచయాలుండవు. మామూలుగా యథార్థ చిత్రణతో నాగి ఎవరి కూతురు ఊరిమీద పడి అల్లరి చిల్లరగా ఎట్లా తిరుగుతుందన్న వర్ణన వుంటుంది. కాని పై పరిచయ వర్ణన ఒక కావ్యశైలిలో లాగా నడిచింది.

యశోదారెడ్డి కథల్లో అచ్చమైన తెలంగాణా భాషను ప్రయోగించారు. అయినా ఆ భాష యాసలను చదవటంలో పాఠకులకు ఎటువంటి ప్రయాస కలుగదు. భాష యాసలు శైలి సరళసులభంగా వుంటాయి. కథనం సంభాషణలు వర్ణనలు అన్నీ తెలంగాణ భాష యాసలయినా శైలిలో భావవ్యక్తీకరణల్లో ఆమె "క్లాసికల్" సాహిత్యంలోని గద్య రచనాశైలి వాసనలను పోకడలను ప్రవేశపెట్టారు. అది ఆమె రచనాశిల్పానికి ఒక కొత్తదనాన్ని ఏ కథారచయిత శైలిలో లేని రామణీయకతను తెచ్చిపెట్టింది. ఒకవైపు మట్టి వాసనలతో కూడిన పల్లె ప్రజలు జీవితాలు వాళ్ళు నిత్యజీవితంలో మాట్లాడుకునే భాష యాసలు కథల్లో వున్నాయి. ఇంకోవైపు మాండలిక యాసలో అడుగడుగునా సామెతల నుడికారాల ఉపమానాల సొంపులు చేరి ఆమె కథల్లోని రచనాశైలికి ప్రౌఢ గుణాన్ని తెచ్చిపెట్టాయి. ఉక్తివైచిత్రిని, భావవ్యక్తీకరణలో గడుసుతనాన్ని కలిగించాయి.

యశోదారెడ్డి అప్రయత్నంగానే ఎన్నో తెలంగాణాలో ప్రజల నోళ్ళల్లో ఆడే అచ్చమైన తెలుగు నుడికారాలను పలుకుబడులను తనకథల్లో వాడారు – ఆ సొరిసెకే పోతుండ, మిటికెళ్ళన్ని ఇరుస్త, ఆకు మరుగు పిందోలె, ఊరిచ్చి ఊరిచ్చి చెప్తున్న, కావలిచ్చుకొని, మీకంత కష్టమైనా దుర్ల, నాకొద్కు మీ కండ్లకానంది మీ యింట్ల నేనెందుకు, ముద్దిచ్చుకున్నది, మళ్ళా కాపిరం జేస్తవని నాకోర్కె, సామాను పెట్టుకొనికె తనబ్బీలుండేవి, ఏగిర్తవడలేదు, వొణ్కలేదు. గేరొచ్చి బాటల సుట్కపడేవు, కట్టున కదిలింది (గుంపుగా నడిచింది), నా సొతాగ జూసిన, ఎవరి ఎచ్చులు వాళ్ళవి, సెరిసగం రాత్రి దాంక, తెల్లారెట్యాళ్ళకు, పోయొస్త పదిలం ఇల్లు, కంట్ల కనుపాపను దీసినట్లు, మిర్రెక్కి కూసున్నది, తన రక్త సమందం మీద గుంజదా, నెయ్యి గారంగ

గార్వంగ పెంచె మరి, బూమికి మొగులుకు అంటకుండ యాళ్ళాడ్తలేమంట, కాపిరం కంపల వద్దది, మిర్గం బూనకముందె లగ్గం గావాలె, పొరజూసింది, మనమెవ్వరం ముడేసేటందుకు ఇడ్సెటందుకు, సిగ్గూ శరము పురాగ సిట్టెడు గుగ్గిళ్ళ కమ్మినట్లు సొండవు, ఏడిసిన కన్ను దుడ్సినట్లు, మన ఎల్లోటి మన కండ్లు వొడిసే కాలం, ముదురుకొని గంగెద్దోలె నెత్తి ఊపింది వంటి ఎన్నో తెలంగాణ నుడికారాలను యశోదారెడ్డి తన కథనశైలిలో పాత్రల సంభాషణల్లో వాడారు.

తెలంగాణాకే పరిమితమై తెలుగులో "శిలాజాలు" "ఫాసిల్"గా నిలిచిపోయిన అచ్చమైన తెలుగు పదాలను యశోదారెడ్డి తమ కథల్లో అడుగడుగునా ప్రయోగించారు. ఆపతి, తిప్పలు, కులం తలం (కులం హెూదా), కద్పుమసిలి, నెత్తురుకండ (రక్త సంబంధంగల) ఎన్క కట్టువద్దరు, ఆరివారం (ప్రేమ), జోలి, బింకి (లొట్టి), అంగీ, గునియుట, ముర్క సూసుడు, పొంటి, యాడివి, యాడ, కుండేరు, శమ్ల (తలపాగ), తండ్లాడు (బాధపడు) కుత్కె, గదుమ, దొర్కిచ్చుకొని, పాటిచ్చిచూచి, తనబ్బి, యారాలు, ఒక్కపారె, నీల్గుడు (గర్వం), కాపాయం (పొదుపు), మైదులోడు (మత్తుచల్లి ఎత్తుకపోయేవాడు), పెబ్బ (పెద్ద), గాసీం, రివాజు, పొర, లొల్లి, తస్తరి (పళ్ళెం) ఎక్కటేసింది, సొరికె, గొల్క (చెవులకు ముక్కుకు వేలాడే లోలకు), వాలాయించి, ఏలంతపోరి, యాజ్జేస్త, కాకరొడ్లు, (బాస్మతి), వైనాలు, బుగులు, వయి (పుస్తకం), యాట, కీస, నాదాని (తలవంపు), అరుసుకొనుడు బర్కి (దుస్సి), దూప, గిర్క, బర్తి (బరువు), ఉర్కినం, తోల్కరమ్మని, బర్రు, మెత్త, తీరుమాణం (తీరికగా) దీరాలు (సాధింపులు), తేరువాటుగ, ఎచ్చులు, మిడికి, (బాధపడి), రంతు – వంటి ఎన్నో తెలంగాణాలో ప్రజల నోళ్ళల్లో ఆడే తెలుగు పదాలను యశోదారెడ్డి కథల్లో వాడారు. యశోదారెడ్డి పుట్టిన పాలమూరు జిల్లా బిజినేపల్లి గ్రామం ప్రాంతంలో వుండే యాసతో కూడిన పదాలను నుడికారాలను ఆమె చాలా చోట్ల కథల్లో ప్రయోగించారు. ల్యాక (లెక్క) ఆడివిల్ల, కాపిరం, సొళ్లె, ఇంగ, యాది (ఏది), ఎతకత (మంచిచెడ్డ), ఇనవస్తి, నోట్ల్య దుసిపడ్డట్లు, న్యాల సెనక్కాయ, ఇంకా ప్రాణవార్తికం (ప్రేమ), తుర్తుల (తురంత్=తొందరగా) తిర్కం (తిరగటం), వొస్తుండరు, కదుల్కం మెదుల్కం చేయకున్కి మొదలైన ఎన్నో పాలమూరు యాసతో కూడిన పదాలు యశోదారెడ్డి కథల్లో చోటు చేసుకున్నాయి.

"ఎంకన్న" కథలో యశోదారెడ్డి ఒక కోడెను కొనాలంటే చాలా డబ్బుతో కూడిన వ్యవహారమని చెప్పటానికి చెప్పిన తీరు పాఠకుల హృదయాలకు హత్తుకుంటుంది. తెలంగాణంలో వుండే జీవితం ప్రతిబింబిస్తుంది. ఈ కోడెలు గొనాలంటె మూలకున్న గుర్లలన్ని పీకాలె. లేకుంటే పాత గుమ్ములన్నీ మెత్తులు దీయాలె" అంటుంది రచయిత్రి. ఆ విధంగా తెలంగాణా ప్రాంతపు జీవితం ఆచారాలు ఎన్నో ఆమె కథల్లో ప్రతిబింబించి పాఠకులను అలరిస్తాయి.

యశోదారెడ్డి కథల్లోని కథనం సంభాషణల్లో ప్రయోగించిన తెలంగాణ పదాలను నుడికారాలను నేను కొన్నే ఇక్కడ చెప్పాను. అటువంటి అచ్చమైన అందమైన పదాలను నుడికారాలను ఎన్నిటినో మనం కోల్పోతున్నాం. తెలుగు పదాల స్థానంలో అవసర మున్నా లేకున్నా ఇంగ్లీషు పదాలను ప్రయోగిస్తున్నాం. అట్లా ప్రయోగంలో లేక ఎన్నో పదాలు నుడికారాలు లుప్తమౌతున్నాయి. కొన్ని జీవిత విధానం వస్తు సంస్కృతి మారటం వల్ల కూడా పదాలు తొలగిపోతున్నాయి. యశోదారెడ్డి "ఎచ్చమ్మ కతలు"కు వ్రాసిన "నామాట"లో ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. "ఇప్పటి మన వ్యవహార భాష సామెతల సొంపును నుడికారపు సొగసును, జాతీయపు బిగువును గోల్పోయి కేవలం అభిప్రాయ ప్రకటనకు ఉపకరణ రూపంలో యాంత్రికంగా మారింది" అన్నారు. మరీ పత్రికల యుగం వచ్చింతర్వాత వార్తలను తెలుసుకోవడమే జీవితంలో ప్రాధాన్యం కలిగిన తర్వాత భాష మరీ భావప్రకటనకు ఉపకరణంగానే మారింది. భావ వ్యక్తీకరణలో చెణుకులు చమత్కారాలు వక్రోక్తులు రామణీయ కతలు లోపిస్తున్నాయి. "ఈనాడు పల్లెపట్టుల్లో కూడా ఇంగ్లీషు ప్రభావం అధికమై తన సొగసును తానే చంపుకొన్నది తెలుగు భాష" అంటారు యశోదారెడ్డి. తెలుగు పలుకుబడులు నశించకుండా వుండి భావితరాలకు అందాలనే కతలలో పొదిగి అల్లడం జరిగింది" అని అంటారు యశోదారెడ్డి. సామాన్యంగా కథ ప్రక్రియలలో సరళమైన వ్యవహార భాషకే ప్రాధాన్యం.

కథలల్లో అడుగడుగునా సామెతలను జొప్పించి సంభాషణలను వ్రాయటం కథనాన్ని రక్తి కట్టించటం యశోదారెడ్డి రచనాశిల్పంలో ఒక ప్రత్యేకత. "ఎంట ఏలెడంత పిల్ల వుంటె ఏనిగి అంత బలం, పుట్టింటి పుంటికూర రుచి దెల్వందెవరికి, నోరులేని దయ్యం ఊరార్సిందట, పుర్రెన బుట్టిన బుద్ధి పుల్లెలేసినా పోదంట, తాకినప్పుడల్ల

కొత్త తట్టేనా, గుర్రంబోత పోత గూటం పీక్కపాయెనని, అరుసున్ని జూసి పురుషున్ని పోగొట్టుకొనె, రాణివాసం వొచ్చి మూలవాసం పీకిందన్న కత, గండ కత్తెర్ల సొంపదంటోలె జిక్కిన, కాళ్ళు దొరికితే సాలు కైలాసంబోతమని, గంగల ఎన్ని నీళ్ళు గలిస్తే మట్టు గంగకు కులం తప్పొచ్చిందా? నీళ్ళు ఉప్పుగైనవా?, కడివెడు పాలల్ల ఓ కల్లు సుక్కేసినట్లు, అడ్గని జోలి జెప్పె అవుసలి రామక్క, తల్లివిడిస్తె పిల్లి గరుస్తుదని, ఎన్కజూస్తె బాయి ముంగల జూస్తె సెరువా, రాజగుర్రం గాడ్డి అయిందట. ఉట్టి ఎన్నాళ్ళూగుతది ఊగని, ఊగి ఊగి ఉన్నకాడ్కే వొస్తది" ఇట్లా ఎన్నెన్నో సామెతలను యశోదారెడ్డి కథల్లో చొప్పించారు. ఆమె 'తెలుగులో హరివంశములు' అనే విషయం మీద పరిశోధన చేసి డాక్టరేటు డిగ్రీ పొందారు. "తెలుగులో హరివంశములు"రచించిన కవులు ఎర్రన, నాచన సోమనలు. ఆమెకు నాచన సోమన అంటె ఇష్టమైన కవి. నాచన సోమన కూడా తన ఉత్తర హరివంశ కావ్యంలో పలుకుబడులను, సామెతలను వాడి 'నవీన గుణసనాథ" గుణం ప్రకటించుకున్నాడు. యశోదారెడ్డికి కూడా తనకిష్టమైన కవికి లాగానే పలుకుబడులు సామెతలు ప్రయోగంలో చాతుర్యం చూపించారు. కథాకథన శైలిలో ఒక నవీనతను ప్రవేశపెట్టారు.

"ముమ్మైకత"లో అమరుసింగు రోజూ అమ్మణికి పండ్లు తెచ్చి యిచ్చేవాడు. ఇక్కడ కథనంలో అమరుసింగు రోజూ రకరకాలపండ్లు కాయలు తెచ్చి యిచ్చే వాడని చెప్తే సరిపోతుంది. ఏ రచయితయినా అదే చేసేవారు. కాని యశోదారెడ్డి సందర్భం దొరికితే చాలు వస్తువిశేషాలను వస్తువుల పేర్లను వివరంగా చెప్పందే వదలరు "ఇంగ దినాం అమరుసింగు నాకు ఉల్లింత పండ్లు, కాసపూసె పండ్లు, జిట్రే పండ్లు, తునికి పండ్లు, ఊడ్గ పండ్లు, మొర్లిపండ్లు, గిన్నె పండ్లు, యావి దొర్కితే అవి దెచ్చిఇస్తుండె. సేండ్లల్ల కెల్లి మక్కకంకులు, జొన్నకంకులు, తయిత కాపిళ్ళు, మొల్కు, సద్దలు, నూగ్గాయె, సెసరుగాయె, పెబ్బరుకాయె, మిటికిళ్ళు ఇవన్నీ దెచ్చిస్తుండె..." అట్లా రకరకాలుగా పేర్లు చెప్పందే యశోదారెడ్డికి సంతృప్తి వుండదు.

పండ్లిగిలించెటోడు, మంది పిల్లను చాట్లేసి బాలెంతననెటోళ్ళు, రోగి, రొష్టు, కూలికి కుష్టును మోసేటోడు, ఒకే తాడు ముగ్గురు గుడ్డోళ్ళు, ఒక కుంటి, ఒక గుడ్డి యిట్ల ప్రపంచికంల వున్న సబ్బండ జనం తీరు తీరు రూపకం కానొస్తరు" ఇక్కడ రోడ్ల మీద బిచ్చగాళ్ళు కనబడ్డారని చెప్తే చాలు. కాని యశోదారెడ్డి అట్లా ఒక్క మాటతో చాలించరు. వరుసగా బిచ్చగాళ్ళ ఎన్ని రకాల వాళ్ళు కన్పించారో సుదీర్ఘంగా చెప్పటం ఆమె కథన శైలి శిల్పంలోని ప్రత్యేకత. ఇంకొకచోట రోడ్డు మీద ఏమేమి వాసనలుంటాయి. ఏమేమి దుకాణాలుంటాయి వాటిని ఒకపెద్ద పేరాలో పేర్కొనటం పాఠకులకు ఆశ్చర్యం కలిగిస్తుంది. "తరాలనాటి తెగులు" (పేజి16) (ఎచ్చమ్మ కతలు).

'మోనా' అనే కథలో వానపడినప్పుడు వరద ఎట్లా ఏర్పడుతుందో యశోదారెడ్డి వివరంగా వర్ణించారు. "మొన్న మూడు దినాలు మొగులు చిల్లివోయినట్లు ముంతన గుమ్మరించినట్లు, మిన్నూ మన్నూ కలిపి ఏకంగ వొడికినట్టు ఏకసిస్తుగ ఒకటే వాన! వొర్రెలు, వొంపులు, కాల్వలు, మడుగులు, కుంటలు, చెర్లు, ఏర్లు, నదులు అన్ని నీళ్ళు నిండంగ పిక్కటిల్లి గండ్లువడి కట్టలు దెంపుకొని ఏకమై వొడ్లెక్కి అలుగులు దుంకి చిన్నా పెద్దా తారతమ్యాలు డిగి మిర్రు పల్లాలు ఒక్కటై వొంపులు దీరి ఈసురో సాలు ఇడ్సి ఒక్కచాటగా ఒక్క సూటిగా జతజతగా కలెగల్పుగా సముద్రయ్య దిక్కు నడ్సినయ్. నిజంగానే ఆమెశైలి వాన పడి ఆగినట్లుగా ముగిసింది. "వానవచ్చింది" అని చెప్తే చాలు. ఏకథకుడయినా అదే చేసేవారు. కాని యశోదారెడ్డి శైలి ప్రాచీన సాహిత్యశైలిలా ప్రవాహంలా నడిపించారు.

యశోదారెడ్డి తన కథల రచనాశైలిలో ఎన్నో ఉపమానాలను ప్రయోగించారు. కావ్యశైలిలో లాగా ఆధునికకథ కథన శైలిలో ఈ విధంగా ఉపమానాలను ప్రయోగించటం అరుదైన విషయమే. కొలికి దప్పించి కంట్ల కనుపాపను దీసినట్లు దీసి కీసలేస్కోను, పెంక మీది ప్యాలె గింజోలె ఎగురకుంటె ఏం జేతు, బాయిల వడ్డ తప్పలోలె కప్పండ్లాడుకుంట, ప్రాణం చింతకాయ గొరికినట్లైంది, దొంతులోలె పేర్చుకున్న ఆశెలన్ని పిడ్కల కుచ్చెన గూలినట్లు గూలిపాయె, కుమ్ముల వెట్టిన మాడి కాయె తీర్కవుడ్కుతుంది (మనస్సు), మొకమంత వొట్టి శాపలు దిన్న పిల్లి దీర్గ పెట్టుకొని ఎచ్చక్క లేదు పట్నకెళ్ళి వొచ్చిన పుట్నాల గింజ, కంకులు ల్యాత మొగ్గలోలె ఉండవి, మొగులు మీదికెల్లి మోదుగపువ్వ దొర (మన్మథుడు) దిగి వొచ్చేటట్టుండరు,

మాకులు, మంత్రాలు, తంత్రాలు, నోములు, వ్రతాలు, మొక్కుబళ్ళు, దీపారాధనలో ఎన్నో జేయంగ కాన్పు నిల్చింది" అని వరుసగా రచయిత్రి పేర్కొంటుంది (జతగాళ్ళు). "మ్యానరికం" కతలో కములమ్మ తల్లిగారింటికి పోవడానికి సిద్ధమై "తిజోరి దెరిసి సవురకుప్పె, నాగురం, శిగబిల్ల, చెంపసరాలు, పోంచీలు, బన్నసరం, దీసుకొని పెట్టుకున్నది" అని వర్ణిస్తుంది రచయిత్రి. ఇంకొక రచయిత అయితే కమలమ్మ అలంకరించుకుందని చెప్పి వదిలేసే వాళ్ళు. కాని నగల వివరాలను ఈ విధంగా ఒక్కొక్కటి ఓపికగా చెప్పటం యశోదారెడ్డి కథల్లోనే కనిపిస్తుంది. "గంగిరేగు చెట్టు" కథలో "ఇంట్ల ఆడోళ్ళు సకినాలు జుట్టుకుంట, అరిసెల పిండి గొట్టుకుంట, సొజ్జ ఇసురుకుంట, పేణీలకు శక్కెర జల్లుకుంట, పొలావ్ కొరకు కాకోరొడ్లు పొతం జేపిచ్చుకుంట ఆయా పనులల్ల వడిపిల్లల మీద నిగురానికొంచెం సళ్ళిడిసిన్రు" అని ఆడవాళ్ళు ఇంట్లో ఏమేమి పనులు చేసేవాళ్ళో దండకంలా చెప్తుంది రచయిత్రి.

ఈ విధంగా వస్తు విషయాలను మాలను గుచ్చినట్లు చెప్పటం ఒక్క ఉపమేయానికి అనేక ఉపమానాలను వరుసగా దండలు కట్టటం మనకు బాణుడు మొదలైన ప్రాచీన కవుల గద్యంలోనే కనిపిస్తున్నది. ఆధునికమైన కథ ప్రక్రియలో అదీ మాండలిక భాష యాసలో వ్రాస్తూ యశోదారెడ్డి "క్లాసికల్" సాహిత్యంలో కన్పించే రచనాశైలీ రీతులను ప్రయోగించటం ఆమె రచనా శిల్పంలో ఒక ప్రత్యేకత. ఇటువంటి వర్ణనలు మనకు ఆమె వ్రాసిన ప్రతి కథలోనూ అడుగడుగునా కనిపిస్తాయి. యశోదారెడ్డి 'కచటతప'లకు బదులుగా 'గసడదవ'లను ఆదేశం చేసి ప్రయోగించటం వల్ల మాండలిక సౌందర్యం పెరిగింది. పైగా శైలీశిల్పంలా చదివించే మాధుర్యం లాలిత్యం గుణాలు వచ్చాయి.

పాత్రల చిత్రణలో ముఖ్యంగా స్త్రీ పాత్రల చిత్రణలో చిన్న పిల్లల చిత్రణలో ఆమె అనుసరించిన తీరు శ్రీనాథున్ని, తెనాలి రామకృష్ణున్ని స్మరింపజేస్తుంది. "ముమ్మైకత"లో అమ్మన్ని అమరుసింగును జూసి భయంతో కేక పెడ్తుంది. అప్పుడు "గాదెల కెల్లి బియ్యం దోడ్తున్న మాయమ్మ బిరబిర ఇవతలి కొచ్చి ఏమాయెనే, తేలా? పామే?" అని అడుగుతుంది. "జతగాళ్ళు" కథలో సీతక్క కూతురు గోపిని వర్ణిస్తూ చేతుల ఫలారపుకిస్తి పట్టుకొని ఇర్గబూసిన మాధవి తీగోలె గోపి వచ్చింది. గోపీని జూసి మొగ్గదొడ్గిన కడిమిచెట్టు తీర్గ అయిండు గోపాలు..." ఇది మాండలికంలో కావ్య శైలిలో వుంది!

"జోగుళయ్య" కథలో నాగప్ప సాధువు వేషం తీసివేయగానే భార్య శివ్వమ్మ అతని సేవలో నిమగ్నమౌతుంది - "శివ్వమ్మ కొప్పెర్ల కొద్దికి నీళ్ళు గాగవెట్టింది. కూకూడుగాయలు గొట్టింది. నూనె రాసి నెత్తి అంటింది. ఇన్నాళ్ళ కర్వు ఇర్గ ఉడ్కు నీళ్ళు పోసింది. నాగప్ప కిష్టమైన నూగు పిండికారం జేసింది. ఉల్లిగడ్డ పులుసు జేసింది. నింపుండుగాయ వొండింది. చిత్రాన్నం జేసింది. ఎన్నపూస కాగవెట్టి నెయ్యి నేతిపావుల వోసింది. ఎన్నాళ్ళనుండో మూలనున్న తమలపాకు బుట్ట దులిపి ఆకులు దెప్పిచ్చి కడ్గి వెట్టింది. తాను దబదబ శివార్చన జేసుకొని నాగప్పకు, వొడ్డన జేసింది..." శివ్వమ్మ పని నైపుణ్యం గాని మ్యానరికంలో తెనాలి రామకృష్ణుడు చిత్రించిన నిగమశర్మ అక్క గుర్తుకు రాకమానదు. ఆ విధంగాఎన్నో కథల్లో పనిమంతురాళ్లయిన స్త్రీల పాత్రలను ఆటల్లో మునిగిపోయే సాళ్ళెకు పోయే చిన్నపిల్లల పాత్రలను యశోదారెడ్డి సజీవంగా పాఠకుల కనులముందు నిల్చేటట్లుగా వర్ణించింది. కథలో ఎన్నో సన్నివేశాలను పాఠకుల కనుల ముందు ఆడేటట్లుగా చిత్రించింది. యశోదారెడ్డి ఒకొకసారి కథావస్తువుకు ఎక్కువ ప్రాధాన్యం ఇయ్యకుండా తెలంగాణ ప్రాంతం జీవిత విధానం, సంస్కృతిని వర్ణిస్తూ కథలను రచించిందనిపిస్తుంది. అంటె ఆమె కథల్లో కథకన్నా జీవిత చిత్రణ అదీ పల్లెటూరి అమాయకపు ప్రజల చిత్రణ ఎక్కువగా కనిపిస్తుంది. తెలంగాణ నుడికారం మాట్లాడే తీరు, వంటలు, నగలు, మనుషులు ఇండ్లు, చెట్లు పరిసరాలు, పల్లెటూళ్ళు, పండుగలు, ప్రయాణాలు, ఆప్యాయతలు, చుట్టరికాలు, మర్యాదలు పలకరించే విధానాలు అన్ని యశోదారెడ్డి కథల్లో రమ్యంగా చిత్రించి కనిపిస్తాయి. అది ఆమె కథల్లోని శిల్ప విశేషత.

యశోదారెడ్డి కథల్లో వస్తువు, కథనం, కథనశైలి, పాత్రలు, సంభాషణలు, స్వగతాలు, ప్రకృత్యాది వర్ణనలు అన్నీ విలక్షణంగా వుంటాయి. ఆమె ఇతర ప్రాచీనమైన గాని సమకాలికమైనగాని కథారచయితల రచనలను కథల తీరుతెన్నులను గమనించినట్లుగాని వాటి చేత ప్రభావితమైనట్లుగా గాని కనిపించదు. ఆమె తనకు నచ్చిన, తను చూసిన తనకు తెలిసిన సమాజాలను, మనుషులను, సంఘటనలను, వృత్తాంతాలను తీసుకొని కథలుగా వ్రాసారు. ప్రతి పాత్రను ప్రతి సన్నివేశాన్ని పాఠకుల కండ్ల ముందు నిల్చేటట్లుగా చిత్రిక కట్టేటట్లుగా వర్ణించింది. భర్త ప్రసిద్ధ చిత్రకారుడు

పి.టి. రెడ్డి రంగులతో చిత్రాలు వేస్తే యశోదారెడ్డి వర్ణాలు మాటలతో చిత్రాలు వేస్తారు. ఇద్దరివీ వర్ణచిత్రాలే. యశోదారెడ్డి భాష శైలి కథన శిల్పం ఆమెకే సొంతం. ఆమెను ఎవరితో పోల్చి చెప్పటం సాధ్యం కాదు. ఆ విధంగా యశోదారెడ్డి తెలుగు కథాసాహిత్యంతో తనదైన ఒక ముద్రతో గుర్తింపుతో నిల్చారు. తెలుగు కథాసాహిత్య మున్నంత కాలం నిలుస్తారు!

●

కవి సమాజానికి మార్గదర్శకుడు

◆ మల్లెమాల (డా. ఎం.ఎస్. రెడ్డి)

సుదీర్ఘ చరిత్ర గల ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షులు, ఈనాటి సభాధ్యక్షులు పద్మభూషణ్ డా. సి. నారాయణరెడ్డిగారికి, సదస్యులకు నమస్కారం. నేనీ మధ్య సాధ్యమైనంతవరకు పురస్కారాలకు దూరంగా ఉంటున్నాను. కారణం పురస్కారం అందుకోవడం ఇష్టం లేక కాదు. ఏ పురస్కారమైనా స్వీకర్తకు బాధ్యతను పెంచుతుంది. అయినా నేనీ పురస్కారానికి ఎందుకు అంగీకరించానంటే, 1. ఇది ఔషధరంగంలో ప్రపంచప్రసిద్ధి గాంచిన పద్మభూషణ్ డా. అంజిరెడ్డిగారి పేరుతో ఇస్తున్న పురస్కారం. 2. ఆంధ్ర సారస్వత రంగంలో కవిగా, విమర్శకుడుగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా, అసామాన్యుడైన ప్రసంగకర్తగా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మరో పద్మభూషణుడు డా. సి. నారాయణరెడ్డి గారు అందిస్తున్న పురస్కారం. నారాయణరెడ్డిగారి పట్ల నాకు గల అభిమానాన్ని గురించి ఈ సభలో ప్రస్తావించడం అప్రస్తుతం కాదన్న ఉద్దేశంతో కొన్ని మాటలు చెప్తాను. నారాయణరెడ్డిగారు జ్ఞానపీఠ పురస్కారం అందుకొన్న సందర్భంగా ఢిల్లీలోని ఆంధ్రులంతా కలిసి ఒక సన్మానసభ ఏర్పాటు చేశారు. అదృష్టవశాత్తు నేనాదినం ఢిల్లీలో వున్నాను. ఆ సభకు ఆచార్య గోగినేని రంగారావు అధ్యక్షత వహించారు. నేను నిర్వాహకుల కోరిక మేరకు విశిష్ట అతిథిగా పాల్గొన్నాను.

నా ప్రసంగంలో

ఆధునికాంధ్ర కవిత్వ వధూటికి అందాలెన్నో పొదిగినవాడు
ప్రాయం ఇరువది దాటకముందే ప్రౌఢకవిగ రూపొందినవాడు
పాటకు నడకలు నేర్పిన కవిగా పలువురి మన్నన అందినవాడు
విజ్ఞాన శలాక తోటి విశ్వంభర నెమ్మోమున

అతులిత రసరమ్యముగా అక్షర తిలకమ్ము దిద్ది
జ్ఞానపీఠ మధివసించి తెలుగుకలం విలువ పెంచిన
మహాకవి డా॥ సి. నారాయణరెడ్డి

అని అభినందించాను.

ప్రస్తుతం నా ప్రసంగాంశం "కవి సమాజానికి మార్గదర్శకుడు". నిజానికి తొలిసారిగా నా కవిత్వం విన్న మహానాయకుడు ఆంధ్రకేసరి టంగుటూరు ప్రకాశం పంతులుగారు నన్ను అభినందించడంతో పాటు నీ కవిత్వం సమాజానికి మార్గదర్శకం కావాలి అన్నారు. నేను వారి ఆదేశాన్ని జీవితాంతం ఆచరిస్తానని మాటిచ్చాను. ఈనాటికీ ఆ బాటలోనే నడుస్తున్నాను. సముద్రంలో పయనించే నావకు దారి చూపించేందుకు ఒక దిక్సూచి కావాలి. 'దిక్సూచి' అంటే 'మార్గదర్శి' అని అర్థం. సమాజానికి కవి మార్గదర్శకుడు కావాలి. అంటే రాతల్లోనా! చేతల్లోనా! అని ప్రశ్నించుకుంటే రెండింటిలోనూ అనే సమాధానం తక్షణం స్ఫురిస్తుంది. కవి ఇతరులకు నీతులు చెప్పడం కాదు. తాను నీతిగా నడుచుకోవాలి.

నిజాన్ని నిర్భయంగా చెప్పగలగాలి. కవి కాలకంఠుడికి కూడా కట్టుబానిస కాడని ఋజువు చేయాలి. మనసా, వాచా, కర్మణా సమాభ్యుదయమే కవి ధ్యేయం కావాలి. కవిత్వం మాటాడే చిత్రం. చిత్రం మాటాడని కవిత్వం. మంచి కవిత్వం చదివితే చిత్రకారుడు పరవశిస్తాడు. మంచి చిత్తరువును చూస్తే కవి పులకించిపోతాడు. లోకంలో కవి కూడా ఇతర ప్రాణికోటిలాగే ఎప్పుడో ఒకనాడు మరణిస్తాడు. కాని అతని కవిత్వం మరణించకూడదు. అది అజరామరంగా ఉండాలి.

నా ప్రసంగం 'కవి సమాజానికి మార్గదర్శకుడు' అని ముందే చెప్పాను. శీర్షిక గొప్పగా ఉందన్న ఉబలాటంతో తలకు మించిన భారాన్ని తలకెత్తుకున్నాను. ఎత్తుకున్నాక మోయక తప్పదు గదా! కవిత్వానికి అనేక ప్రయోజనాలున్నాయి. అందులో "కవి సమాజానికి మార్గదర్శకుడు కావాలన్నది" ఒకటి. కవిత్వంలో అనేక ప్రక్రియ లున్నాయి. పద్యం, గేయం, వచనం మొదలైనవి. కోనసీమ పనసపండు ఎంత తీయగా వుంటుందో తెలుగు పద్యం అంతే తీయగా ఉంటుంది. పద్యం కాలం చెల్లిన దస్తావేజంటారు కొందరు. ఇది వాస్తవం కాదని పద్యం గత వెయ్యి సంవత్సరాలుగా ఋజువు చేస్తూనే వుంది. ప్రవాహ వేగానికి తుంగ తలవంచుతుంది. కాని, అది

తాత్కాలికమే. వేగం తగ్గగానే తిరిగి తలయెత్తుక నిటారుగా నిలబడుతుంది. తెలుగు పద్యం అంతే.

నన్నయ లేఖినీ ధ్వనుల నర్తనమాడి విభిన్న భావ సం
పన్న రసాబ్ధి తేలి జనవంద్యుల మెప్పును గొన్న పద్దెమున్
వెన్నున పూసలేని కవివీరులు కొందరనాదరింప వి
ద్వన్నుతి పాత్రమైయలరు తద్ఘన కీర్తికి లోటు కల్గునే?

నేను పద్యకవిగా ఈ మాట అనడం లేదు. యదార్థం మీ ముందుంచుతున్నాను. పద్యం ద్వారా కూడా సామాజిక ప్రయోజనాన్ని పాఠకుల కందించవచ్చు. రామాయణ, భారత భాగవతాలన్నీ పద్యగద్యాత్మకంగానే నడిచాయి. సమాజాభ్యుదయానికి ప్రతిబింబాలుగా నిలిచాయి. మానవాభ్యుదయానికి మార్గదర్శకాలైన ప్రాచీన గ్రంథాలు భారత భాగవత రామాయణాలు. ఈ మూడింటిలో రామాయణం ఆది కావ్యం. వాల్మీకి రామాయణం మానవాభ్యుదయానికి మార్గం సూచిస్తుంది. తండ్రీ కొడుకుల అనుబంధానికి, అన్నదమ్ముల అనుబంధానికి, భార్యాభర్తల అనుబంధానికి రామాయణం కరదీపికగా ప్రకాశిస్తుంది. దుష్టశిక్షణ, శిష్ట రక్షణ కోసమే శ్రీరాముడు అవతరించాడని చాటుతుంది. పాతివ్రత్య మహాత్మ్యానికి ప్రతిబింబమై విరాజిల్లుతుంది. పరధారాపహరణం – పతనానికి మూలమని హెచ్చరిస్తుంది. రామాయణం ప్రాశస్త్యాన్ని గురించి నేను

ధ్యానించినంతనే జ్ఞాన సౌరభమీను
మంత్రపుష్పమ్ము రామాయణమ్ము!
దర్శించినంతనే ధర్మకాంతులు జిమ్ము
మంజు కౌస్తుభము రామయణమ్ము!
పఠియించి నంతనే పరతత్త్వమును తెల్పు
అపరవేదమ్ము రామాయణమ్ము!
సేవించినంతనే జీవాత్మనలరించు
మధురామృతమ్ము రామాయణమ్ము!
మనన మొనరించు కొలది తన్మయత బెంచి
సచ్చిదానందమయ భావజలధి తేల్చి

ముక్తికిదె మార్గమని తాను ముందు నడిచి
మనల నడిపించు జ్యోతి రామాయణమ్ము! అని వర్ణించాను.

పంచమ వేదంగా పరిగణింపబడుతున్న మహాభారతం అనేక మార్గదర్శకాలను మానవ సమాజానికి సూచిస్తుంది. ఆంధ్ర మహాభారతకర్త నన్నయ అంతకుముందు రూపంలేని కవిత్వానికి ఒక రూపం కల్పించాడు. ఆదికవిగా, వాగనుశాసనుడుగా ప్రసిద్ధికెక్కాడు.

రాజరాజ నరేంద్రుడు సనాతన మత గౌరవాన్ని వర్ణాశ్రమ ధర్మసారాన్ని భావితరాలకు అందించాలన్న సంకల్పంతో నన్నయను భారత రచనకు పురికొల్పాడు. నన్నయ వ్యాస భారతాన్ని మక్కీకి మక్కీ అనువదించకుండా ఆంధ్ర మహాభారతం అన్న పేరుతో స్వతంత్ర కావ్యంగా ఆది సభాపర్వాలు పూర్తిగా అరణ్య పర్వంలో కొంత భాగం విరచించి తిక్కనకు, ఎఱ్ఱనకు మార్గనిర్దేశం చేశాడు.

తెలుగులో లిఖిత సంప్రదాయం నన్నయతోనే ప్రారంభమైంది. నన్నయ కవిత్వానికి అక్షర రమ్యత, ప్రసన్న కథాకలితార్థ యుక్తి, నానారుచిరార్థ సూక్తి త్రివేణీ సంగమమై భాసిల్లుతాయి.

నన్నయ భారత రచన ద్వారా మానవ సమాజానికి ధర్మసూత్రాలను, వేద రహస్యాలను నిర్దేశించాడు. తెలుగుజాతి బ్రతికివున్నంత కాలం భారతం బ్రతి కుంటుంది. భారతం బ్రతికున్నంతకాలం నన్నయ బ్రతికుంటాడు.

ఇక తిక్కనను గురించి చర్చిద్దాం! తిక్కన గొప్ప రాజనీతిజ్ఞుడు. తిక్కన తన రచనలో రాజనీతికి పెద్దపీట వేశాడు. ఆయన యజ్ఞం చేసి సోమయాజి అయ్యాడు. వ్యాసభారతంలోని పదిహేను పర్వాలను తెలుగుదనం వుట్టిపడేలా తీర్చిదిద్దాడు. తిక్కన రచనలో నాటకీయత ఎక్కువగా ఉంటుంది.

తిక్కన మత విద్వేషాలను గంటంతో తరిమికొట్టాడు. సర్వమానవ సౌభ్రాతృత్వా నికి సాహిత్యం ఊతం కావాలన్నాడు. భారతంలోని ప్రతి పాత్రకు తెలుగుదనం అద్దాడు. అవసరమైన ప్రతిచోట తెలుగు నుడికారాలను కుదిలించి కుప్పపోశాడు. 'కవిబ్రహ్మ'గా, ఉభయకవి మిత్రుడుగా లోకవిఖ్యాతి గాంచాడు. శివకేశవులు వేరు వేరు కాదని హరిహరనాథ తత్త్వాన్ని ప్రబోధించాడు. అల్పాక్షరాల్లో అనల్పార్థాన్ని పొదిగాడు. తెలుగుభాషను సుసంపన్నం చేశాడు. పద్యాన్ని కర్పూర శిల్పంగా

మలిచాడు. తిక్కన నెల్లూరువాడు. నేనూ నెల్లూరువాణ్ణి. అంతమాత్రాన నేను తిక్కనను అవుతానా? కాను. తిక్కన మావాడని చెప్పుకొని మురిసిపోతాను. నెల్లూరు తరతరాలుగా అనేకమంది మహాకవులకు జన్మనిచ్చింది. సాహిత్యంలో నెల్లూరు ప్రాశస్త్యాన్ని గురించి నేను

సిరులకిరవైన నెల్లూరు సీమయందు
పంట పొలముల నొరయుచు పారునట్టి
వాగునకు కూడ సాహిత్య వాసనబ్బు
కవుల సంగతి వేరె పల్కంగనేల!

అన్నాను.

ఇక పోతనామాత్యుని భాగవత రచనను గురించి చెప్పాలంటే ఎంతైనా చెప్పవచ్చు. ఎన్నైనా చెప్పవచ్చు. పోతన పద్యాలే నా కవిత్వానికి మార్గదర్శకాలు. పోతన పద్యాలే నాకు ఛందస్సు నేర్పాయి. అయినా పోతన భాగవతాన్ని గురించి విశ్లేషించగలిగిన శక్తి నాకులేదు. పోతన భాగవత రచన ద్వారా ఆధ్యాత్మిక జీవితానికి మార్గదర్శకుడయ్యాడు.

సరసకవి కరుణశ్రీ పోతన గురించి చెప్పిన పద్యాలను ఇక్కడ ఉదహరించి నా అశక్తతను కప్పిపుచ్చుకుంటాను.

ముద్దులు గొల్కు భాగవతమున్ రచియించుచు పంచదారలో
అద్దితి వేమొ గంటము మహాకవి శేఖర మధ్య మధ్య న
ట్లద్దక ఒట్టి గంటమును అట్టిటు గీచిన తాటి ఆకులో
పద్దెములందు ఈ మధురభావము లెక్కడ నుండి వచ్చురా! అన్నాడు.

అంతేకాదు

నమ్ముము తల్లి నాదు వచనమ్ము ధనమ్ముకై బజారులో
అమ్మనుజేశ్వరాధముల కమ్మను నేనని బుజ్జగించి నీ
గుమ్మములోన నున్న పలుకుంజెలి కాటుక కంట జారు బా
ష్పమ్ములు చేతితో తుడిచివేసిన భాగ్యము నీకె అబ్బెరా! అన్నాడు.

ఇంతకంటె ఎవరైనా పోతనను గురించి చెప్పగలిగింది ఏముంది. అయినా నా వంతుగా

రుచులూర జేసెడు రుక్మిణీ కల్యాణ
ఘట్టమ్ము జాలు నీ ఘనత తెలుప!
మాటికి ప్రహ్లాదు నోట పల్కించిన
పద్యాలు చాలు నీ భక్తి తెలుప!
కరి రాజు బ్రోచిన కళ్యాణ గుణధాము
వర్ణన చాలు నీ వాసి తెలుప!
రామనామమె నాకు రక్షాకవచమన్న
మాటయె చాలు నీ మనసు తెలుప!
ఇట్టు లెన్నని నే వచియింతు సుకవి!
ఇమ్ము దరుగని నీ కవిత్వమ్ము నందు
నవరసమ్ములు సెలయేళ్ళ నడక మార్చు
మహిత గుణధుర్య పోతనామాత్యవర్య!

ప్రతి పద్యము రసరమ్యము
ప్రతి పాదము పంచభక్ష్య పరమాన్నము, నీ
అతులిత కవితా నైపుణి
స్తుతి పాత్రము నిక్కువముగ సూరివరేణ్యా?

రాధాకృష్ణుల ప్రణయ తత్త్వాన్ని రసరమ్యంగా చిత్రించిన కవి పోతన. శ్రీకృష్ణుని చిద్విలాసాలను స్నిగ్ధ సుందరంగా వర్ణించిన కవి పోతన.

కె.వి. రెడ్డిగారి భక్త పోతన చిత్రంలో ప్రధాన పాత్ర పోషించిన చిత్తూరు నాగయ్యగారు ఆ పాత్రలో పరకాయ ప్రవేశం చేశారు. ఆ చిత్రంలో ఆనాటి పోతన మనకు అడుగడుగునా సాక్షాత్కరిస్తాడు. భాగవత రచనలో పోతన భక్తిరసాన్ని ఎంతగా క్రుమ్మరించాడో కళ్ళారా చూసిన వెండితెర పులకించిపోయింది.

పోతన భాగవతం పండిత పామర జనరంజకం. ఆ మహనీయునకు ఈ సభ ద్వారా నా భక్త్యంజలి ఘటిస్తున్నాను.

కవి కలం కత్తికన్నా పదునైనది. నేను ప్రశ్నోత్తరవేదం అని ఒక ఖండిక రాశాను. అందులోని కొన్ని పంక్తులు ఇక్కడ ఉదాహరిస్తాను.

ఇది ప్రశ్నోత్తరవేదం ఎత్తుపల్లముల సంవాదం
నిత్యసత్యములు రుద్రవీణలై నిరంతరం ఘోషించు నినాదం
అసంఖ్యాక త్యాగధనుల ఆత్మార్పణ ఫలితంగా
సిద్ధించిన స్వాతంత్ర్యం స్థిరశాంతికి దర్పణమై
సిరి సంపదలందరివై చెలువొందే దినమెప్పుడు?

సమాధానం పక్కనే వుంటుంది.

ప్రజాసేవ పేరు చెప్పి రంగంలో అడుగుపెట్టి
అమాయకుల ఓట్లు గుంజి అధికారపు గద్దెనెక్కి
అడ్డమైన దార్లు తొక్కి అందినంతవరకు మెక్కు
రాజకీయ దోపిడీని రచ్చకీడ్చినప్పుడు!

జగడాలే ఊపిరిగా తెగబలిసిన గుండాగిరి
చట్టసభలలోన అడుగు పెట్టకుండ తరింకొట్టి
ప్రగతిశీల రాజ్యానికి పట్టం కట్టేదెప్పుడు?
కత్తికన్న వాడియైన కవికలాలు ముందుకురికి
దురాగతుల దుండగాలు ధరాతలం కెరుకపరచి
అవినీతికి ఎదురు నిలిచి అవిశ్రాంతరణం సలిపి
అక్రమాల తోలు ఒలిచి ఆరవేసిప్పుడు!

అన్నాను. ఇవి కవులందరి పక్షాన నేనన్నమాటలు.

ఆంధ్రదేశం లబ్ధప్రతిష్ఠులైన అనేకమంది కవులకు జన్మనిచ్చింది. ఈ సందర్భంగా ఆ కవి దిగ్గజాలను స్మరించుకోవడం మనందరి కర్తవ్యం. ముందుగా ప్రజాకవి వేమనను గురించి మాట్లాడుకుందాం!

వేమన మరణించి శతాబ్దాలు గడిచినా ఇంకా ప్రజల నాలుకల మీదజీవించి ఉన్నాడు. అలతి అలతి మాటలతో వేమన మూఢవిశ్వాసాలను, మూర్ఖ సిద్ధాంతాలను చీల్చి చెండాడాడు. సంఘ దురాచారాలను తూర్పారపట్టాడు. చెడును ఎండగట్టాడు. మంచికి పట్టం కట్టాడు. అప్రయోజకులైన బిడ్డలను కనడం అనర్థాలకు మూలం అని తల్లిదండ్రులకు బోధించాడు. పురుషులందు పుణ్యపురుషులు వేరన్నాడు.

బద్ధశత్రువుకు కూడా కీడు తలపెట్టవద్దన్నాడు. ఇవన్నీ సమాజ హితవుకోరి చెప్పిన మాటలే.

నిజాం ప్రభుత్వ నిరంకుశత్వాన్ని సమర్థిస్తూ రజాకార్లు సాగించిన ఉద్యమంలో కలాల నెదురొడ్డి పోరాడిన యోధులిద్దరు. ఒకరు కాళోజి, మరొకరు దాశరథి. ఇప్పుడిద్దరూ మన మధ్య లేరు. అయినా వారి కలాలు జీవించి వున్నాయి. వారి పేర్లు జీవించివున్నాయి. సమాజానికి మార్గదర్శకాలైన వారి సందేశాలు జీవించి వున్నాయి.

ఈ సందర్భంగా కాళోజీ అన్న ఒక్క మాటను మననం చేసుకుందాం. "పుట్టుక నాది, చావు నాది. జీవితం సమాజానిది" అన్నాడు. ఈ ఒక్కమాటలో వంద మాటల పరమార్థం దాగి వుంది. అలాగే దాశరథి ఏది నిజం? అన్న ప్రశ్నకు 'సోషలిజం' అని సమాధానం చెప్పాడు. సోషలిజం ఆశయం సమసమాజ స్థాపన. ఆ ఆశయసాధన కోసం దాశరథి "తిమిరంతో సమరం" చేశాడు. రుద్రవీణను మోగించాడు. అగ్నిధార కురిపించాడు. అక్షరం అణుబాంబు కంటె శక్తిమంతమైనదని ఋజువు చేశాడు.

మహాత్మాగాంధీ నాయకత్వంలో సాగిన స్వాతంత్ర్య సంగ్రామంలో కవులు గణనీయమైన పాత్ర పోషించారు. తమ దేశభక్తి గీతాలతో ప్రజలను ఉత్తేజపరిచారు.

బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కవితాలాపన చేసిన కవులెందరో జైళ్ళపాలయ్యారు. అయినా ఉద్యమస్ఫూర్తిని ఏ ఒక్కరూ కోల్పోలేదు. గరిమెళ్ళ 'మాకొద్దీ తెల్లదొరతనం' అన్న గేయంలో తన దేశభక్తిని ఎలుగెత్తి చాటాడు. అంతెందుకు? నా మిత్రుడు డా. ఉండేల మాలకొండారెడ్డి స్వాతంత్ర్యానికి పూర్వమే దేశభక్తి పూరితమైన 'నేతాజీ' కావ్యం రచించాడు. అందులో-

"కట్టలు దెంచి లోకములగప్పెడి నీ చరితాంబుధిన్ రుచుల్
పుట్ట మదించి ఆ యమృత పూరము పద్దెములన్న పాత్రలన్
పట్టి కళాపిపాసువుల పంక్తికి వడ్డన చేయువాడ నీ
పుట్టిన పుణ్యదేశమున పుట్టిన యందుకు గర్వమొందుచున్"

అన్నాడు. ఈ పద్యం ఉండేల దేశభక్తికి జాను తెనుగు సంకేతం.

కవులలో అనేక రకాలున్నారు. గమనం ఎవరిది వారిదైనా అందరి గమ్యం లోక కళ్యాణమే. అందుకే "విశ్వశ్రేయః కావ్యం" అన్నారు లాక్షణికులు. వచన కవిత్వంతో సమాజానికి దిశానిర్దేశం చేసిన మహాకవులెందరో వున్నారు. అలాంటి

వారిలో శ్రీశ్రీ, కుందుర్తి, బాలగంగాధర్ తిలక్, డా. సంజీవ్‌దేవ్ మొదలైనవారు ముఖ్యులు.

ఈ సారస్వత సభలో మహాకవి శ్రీశ్రీని స్మరించుకోవడం ఆవశ్యకర్తవ్యం. శ్రీశ్రీ ఆంధ్రాభ్యుదయ కవిత్వ సౌధానికి మణిదీపం. ఆంధ్రభాష బ్రతికున్నంతకాలం ఆరిపోదు ఆ దీపం. ప్రపంచ భాషలనెన్నిటినో ఔపోసన పట్టిన శ్రీశ్రీ, మాతృభాషలో మకుటం లేని మహారాజరాజశ్రీ. "పదండి ముందుకు పదండి తోసుక పదండి పోదాం పైపైకి" అన్నాడు శ్రీశ్రీ.

పీడిత ప్రజలను సంబోధిస్తూ పిడికిలెత్తి అతడన్న భాషితాలప్పటికిప్పటికైనా అక్షర సత్యాలు. విప్లవం ఎవరికి శిరసు వంచదని, వేయి గొంతుకలతో గర్జించిన శ్రీశ్రీ మార్గం అనితర సాధ్యం. అజరామరమగు ఆయన కవిత్వం వాసన తరుగని వాఙ్మయ మద్యం. వందనీయమా కవి ప్రస్థానం. కణకణమండే కలమే శ్రీశ్రీ ఆయుధం. ఆ ఆయుధంతోనే ఆనాటి ఛాందసవాదుల నాలుకలను తెగనరికాడు. విశాఖ సాగర తరంగాలు శ్రీశ్రీ పేరు చెపితే చాలు ఈనాటికీ పొంగి అంబరాన్ని చుంబిస్తాయి. ఆ మహాకవి తెలుగు వాడైనందుకు అందరం గర్వపడదాం.

కవిత్వం ఈనాడు అనేక రూపాలలో మనకు దర్శనమిస్తుంది. అనేక వాదాలను మన ముందుంచుతుంది.

దేవులపల్లి, సముద్రాల, పింగళి మొదలైనే కవులెందరో చిరకాలం గుర్తుండే కవిత్వం రాశారు. ఆ మహాకవులందరు సమాజాభ్యుదయాన్ని ఆకాంక్షించినవారే. 'సౌందర నందము' కావ్య నిర్మాతలైన పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వెంకటేశ్వర రావులను తక్కువ అంచనా వేయగలమా! వేస్తే సాహితీ సమాజం హర్షిస్తుందా!

ఇక ఆరుద్ర గురించి కొన్ని మాటలు చెప్తాను. కవిగా ఆరుద్ర బహుపాత్రాభి నయం చేశాడు. కవిత్వంలో ఆయన ముట్టుకొనని ప్రక్రియ లేదు. ఆరుద్రను ఫలానా కేటగిరికి సంబంధించిన కవి అని చెప్పడం సాహసమవుతుంది. భాషావేత్తగా కఠోరశ్రమతో ఆయన రూపొందించిన "సమగ్రాంధ్ర సాహిత్యా"నికి వెలకట్టలేం. నడకలో నాణెంలో ఆరుద్రదొక ప్రత్యేకమైన బాణి. అనుకరించడానికి వీల్లేనిది ఆయన వాణి. చలనచిత్రాలలో వారు రాసిన పాటలు అక్షరపుష్పాలు. వారి "కూనలమ్మ పదాలు" ఎందరికో మార్గదర్శకాలు.

కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రామాయణ కల్పవృక్షం రాసిన చేతితోనే కిన్నెరసాని పాటలు రాశారు. అవి బహుళ జనాదరణ పొందాయి. ఆరుద్ర కూనలమ్మ పదాలు అంతే. వైవిధ్యభరితమైన కవిత్వానికి కొందరు కవులు సంకేతంగా నిలుస్తారు. అలాంటి వారిలో ఆరుద్రదే ప్రథమ తాంబూలం.

ఇక గురజాడను గురించి చెప్పాలంటే ఎంత చెప్పినా కొంతే అవుతుంది. గురజాడ ఆంధ్ర సారస్వతానికి ముత్యాల సరాలను మూటకట్టి అందించాడు. పుత్తడిబొమ్మగా పూర్ణమ్మ గాధను తులలేని విధంగా మలిచాడు. తెలుగుభాషకు సరికొత్త నడకలు నేర్పాడు. సొంతలాభం కొంతైనా మానుకొని సాటివారికి తోడ్పడమన్నాడు. దేశమంటే మట్టికాదని మనుషులని చెప్పాడు.

దేశం ఆరోగ్యవంతంగా ఉండాలంటే ముందు సమాజం ఆరోగ్యంగా ఉండాలన్నాడు. ఈ సత్యాన్ని విశ్లేషిస్తూ 'తిండిగలిగితె కండకలదోయ్– కండకలవాడేను మనిషోయ్' అన్నాడు. గురజాడ వారి ప్రతి వాక్కు ఋషి వాక్కులాంటిది.

ఇక నవయుగ కవి చక్రవర్తి జాషువాను గురించి ప్రస్తావిస్తాను. జాషువా మొదటి కావ్యం 'గబ్బిలం'. దళిత వాదాన్ని తొలిసారిగా ఎలుగెత్తి చాటిన కవి జాషువా! తెలుగు సాహిత్యానికి పద్యమే మూలకందం అన్న కవి జాషువా! భామహుని వక్రోక్తి సిద్ధాంతానికి పట్టాభిషేకం చేసిన కవి జాషువా.

జాషువా వల్లకాడును వర్ణించిన విధానం అపూర్వం

ఇచ్చోటనే భూమి నేలు రాజేంద్రుల
అధికార ముద్రికలంతరించె!
ఇచ్చోటనే సత్కవీంద్రుని కమ్మని
కలము నిప్పుల లోన కాలిపోయె!
ఇచ్చోటనే లేత ఇల్లాలి నల్లపూ
సల సౌరు గంగలో కలసిపోయె!
ఇచ్చోటనెంతో పేరెన్నిక గాంచిన
చిత్రలేఖకుని కుంచెయు నశించె!
ఇది పిశాచులతో నిటలేక్షణుండు
గజ్జె–కదిలించి ఆడు రంగస్థలమ్ము

ఇది మరణదూత తీక్ష్ణమౌ దృక్కులలయ
అవని పాలించు భస్మ సింహాసనమ్ము!

పంచముడి గాలి తగిలితే చాలు నాల్గు పడగల హైందవ నాగుపాము కసరి బుస కొడుతుందంటూ వర్ణాశ్రమ ధర్మాలను నిరసించిన కవి జాషువా!

కవిగా జాషువా పట్ల నాకు గల అభిమానాన్ని రెండు పద్యాలలో చెపుతాను.

కడగండ్ల జడివాన గడపలో ముసిరినన్
తలవంచి యెరుగని కలము నీది!
సంఘ దురాచార శక్తుల గుండెలో
గునపాలు నాటిన గొంతు నీది!
కవి చెళ్ళపిళ్ళచే గండ పెండేరమ్ము
తొడిగించు కొన్నట్టి అడుగునీది!
ప్రతిపాద రమ్యమౌ పద్యశిల్పము నందు
వాణి అచ్చెరు వందు బాణి నీది!
ఎన్ని అడ్డంకులెదురైన ఎగసి దుమికి
వనధి జేరెడు గంగా స్రవంతి వోలె
గమ్యమే ధ్యేయముగ సాగు గతియనీది!
నీకు సాటి లేరయ! జాషువా కవీంద్ర!!

మధుర మంజుల శబ్దమందారములు పేర్చి
కాందిశీకుని గుడి కట్టినావు
ఊహనే పదునైన ఉలిజేసి ముంతాజ
మహలు నద్భుతముగా మలచినావు

చితిమంటలను భస్మ సింహాసనమ్ముగా
తొలుదొల్త ఎలుగెత్తి పలికినావు
పరిమళించు మరంద పదచిత్రముల తోడ
ఫిరదౌసి ఘనకీర్తి పెంచినావు
బదులు దొరకని పలు ప్రశ్నలదను జూచి

పేరు ఊరును లేని గబ్బిలము చేత
పరమ శివునకు కాన్కగా పంపినావు
నీకు అర్పించు నా నమోవాకములను.

జాషువా కవిత్వం సమాజానికి మార్గదర్శకం కాదనగలమా!

కట్టమంచి రామలింగారెడ్డిగారు రచించిన 'కవిత్వతత్త్వవిచారం' గొప్ప విమర్శనాత్మక గ్రంథంగా పేరు గాంచింది. ఆర్థిక శాస్త్రాన్ని గురించి వారు చెప్పిన ప్రతి మాటా ఆణిముత్యాల మూట. ఆయన వ్యాసాలు ఆంధ్ర విద్యార్థులకు వర ప్రసాదాలు. ఒక్కమాటలో చెప్పాలంటే రామలింగారెడ్డిగారి ప్రతిభ దేవపారిజాతం వలె వాడనిది. వాసన తరుగనిది.

తిరుపతి వెంకట కవులు తెలుగు గడ్డమీద జన్మించి ఉండకపోతే పంచమవేదమైన భారతం పామర జనరంజకం అయ్యేది కాదు. నా చిన్నతనంలో తిరుపతి కవుల 'పాండవోద్యోగ విజయం'లోని పద్యాలను ప్రతిపల్లెగానం చేసింది. కురుసభలో శ్రీకృష్ణుని నోటివెంట ఆ జంటకవులు పలికించిన పద్యాలు పద్యనాటక రంగానికి ప్రాణవాయువులు.

తిరుపతి కవుల అవధానాలు తెలుగు శారదకు నిత్య నీరాజనాలు. ఈనాడు అవధాన ప్రక్రియలో సరిక్రొత్త ప్రయోగాలు చేస్తున్న కవులందరికీ తిరుపతి కవులే మార్గదర్శకులు.

'తెనుగు లెంక'గా అభినవ తిక్కనగా అసమానఖ్యాతి గడించిన స్వర్గీయ తుమ్మల సీతారామమూర్తి చౌదరి రాష్ట్రగానం, రాష్ట్ర ప్రజలకు దిక్సూచిగా నిలిచింది. ఆ రోజుల్లో ఆంధ్ర ప్రజానీకాన్ని ఉర్రూతలూపింది. దేశభక్తి వారి దినచర్యల్లో భాగమైంది. తుమ్మలవారు కల్తీలేని గాంధీయవాది. 'నేను గాంధి కవిని' అని ఆయనే స్వయంగా చెప్పుకొన్నాడు. ఆకారంలో ఆయన అసలు సిసలైన ఆంధ్రుడు. ధర్మరక్షణలో దారితప్పని భారతీయుడు. తుమ్మలవారిని గురించి ఒక్క కమ్మని పద్యం వినిపిస్తాను.

తుమ్మల వారి పద్యములు దొడ్డ రుచుల్ వెలయించు ద్రాక్షలై
కమ్మని జుంటి తేనియులు జ్ఞప్తికి తెచ్చుచు మాటిమాటికిన్
రమ్మని పిల్చి పాఠకుల రంజిల జేసి తెలుంగు జాతికిన్
సొమ్ములుకాన్కగా నిడెను సూరి వరేణ్యులు మెచ్చునట్లుగన్!

నండూరి వెంకట సుబ్బారావు – జనరంజకంగా జానపద గీతాలను వెలయించిన విశిష్ట కవి. పల్లెవాసుల మాటలను పాటలుగా మలచి జానపద కవిత్వానికి దిక్సూచిగా నిలిచిన కవి. ఏనాటికీ మరపురాని విధంగా ఎంకిని – నాయుడు బావను సృష్టించి ఆ జంట ద్వారా అమలిన శృంగారాన్ని ఇంటింటా ఆరబోసిన కవి. 'ఎంకి–నాయుడు బావ'ల సరసం ఎంత జుఱ్ఱుకున్నా తరగని రసం. నండూరి–ఎంకిపాటలు పండు వెన్నెలలాగా ప్రతి ఒక్కరినీ పరవశింపజేస్తాయి.

గుడిపాటి వెంకటాచలం రచించిన 'మైదానం' అనేక వివాదాస్పద వ్యాఖ్యల నెదుర్కొని నిల్చి గెల్చింది. "అతని ప్రేమ లేఖలు చదివేకొద్దీ చవులూరించి వెంట నడిచే వెన్నెల దీపాలు". చలం సహజంగా స్త్రీ జన పక్షపాతి. ప్రతి స్త్రీలో శృంగార రసాధిదేవతను దర్శించిన దార్శనికుడు. వేమనకు – చలానికి కొంత సామ్యముంది. వేమన సకల భోగాలను అనుభవించిన తర్వాతే యోగిగా మారాడు. చలమూ అంతే. అందినంతవరకు అన్ని భోగాలను ఆస్వాదించి చివరకు అరుణాచలం జేరి సిద్ధుడయ్యాడు.

మనమంతా జీవితం వెంట నడుస్తాం. కాని చలం జీవితాన్ని తన వెంట నడిపించుకొన్నాడు. చలం భోగులకు యోగులకు మార్గదర్శకుడనడం అవాస్తవం కాదు.

స్వాతంత్ర్యోద్యమం ముమ్మరంగా జరుగుతున్న రోజుల్లో "కొల్లాయి గట్టితేనేమి మన గాంధీ కోమటై పుట్టితేనేమి" అన్న పాట ఆంధ్రదేశ మంతటా మార్మోగింది. బసవరాజు అప్పారావు దేశభక్తికి తిరుగులేని ఉదాహరణ ఆ పాట. ఆ రోజుల్లో పామరుడు కూడా బసవరాజు పాట వెంట పంచె నెగదోపుకొంటూ పరిగెత్తేవాడు. జానపద గేయాన్ని జనవాహిని నాల్కల మీద నర్తింపజేసిన వారిలో బసవరాజు ఒకరు. బసవరాజు 'సెలయేటి గానము' వింటే పులకించిపోతుంది తెలుగుతల్లి.

ప్రముఖ రంగస్థల నటుడు, స్థానం నరసింహారావు స్త్రీ పాత్ర పోషణలో అనన్య సామాన్యుడు. ఆయన నాటకంలో ఏ పాత్ర ధరించినా చివరలో బసవరాజు గారి 'గుత్తివంకాయ్ కూరోయ్ బావ' కోరి వండీనానోయ్ బావ – కూరలోపలా నావలపంతా కూర్చిపెట్టీనానోయ్ బావ" అన్న పాటను పాడి తీరవలసిందే. పాట బసవరాజుదైనా దానికి రుచి పెంచిన ఘనత స్థానం వారిది.

"ఏ దేశమేగినా ఎందుకాలిడినా
ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనినా
పొగడరా నీ తల్లి భూమి భారతిని
నిలుపరా నీజాతి నిండు గౌరవము" అన్న

రాయప్రోలు సుబ్బారావు గారి పాటలు దేశభక్తికీ, జాతి అభిమానానికి సంకేతం. దేశంలోని ప్రతి వ్యక్తీ తాను భారతీయుడుగా పుట్టినందుకు గర్వించాలని చెప్పడం ద్వారా తన దేశభక్తిని ఋజువు చేసుకున్నాడు రాయప్రోలు.

ఆయన రచించిన తృణకంకణం, శబ్దార్థాలకు సౌరభమద్దుతుంది. రాళ్ళలో కూడా శౌర్యాన్ని రగుల్కొల్పే ఆంధ్ర పౌరుషాన్ని ఆయన అచ్చు గుద్దినట్లు వర్ణించాడొక ఖండికలో. అంతేకాదు, కండ చక్కెర వంటి ఖండకావ్యాలు మరెన్నో రచించి ఆంధ్ర సారస్వత లోకంలో చెరగని ముద్ర వేసుకొన్న కవితల్లజుడు రాయప్రోలు.

మరొక మహాకవిని గురించి చెప్పడం మర్చిపోయాను. బహుభాషా కోవిదుడుగా, సరస్వతీ పుత్రుడుగా జగత్ప్రసిద్ధి గాంచిన పుట్టపర్తి నారాయణచార్యులవారు పరిచయమక్కరలేని పండితకవి.

చాలారోజుల క్రితం నా అధ్యక్షతన చిత్తూరు రామవిలాస సభలో పుట్టపర్తివారి అభినందన సభ జరిగింది. నేను నా అధ్యక్షోపన్యాసంలో

ఎక్కడి పుట్టపర్తి కవి? ఎక్కడి నేనిది నాకు తేరగా
దక్కిన గౌరవమ్మనుట తథ్యము, కావున నేర్చినంతలో
చక్కెరకన్న తీయనగు చక్కని చిక్కని తేట తెన్గులో
అక్కర తీర పాడెదను ఆ మహితాత్ముని పాండితీ ప్రభన్!!

అన్నాను. సభ చప్పట్లతో మారుమ్రోగింది. తర్వాత శివతాండవ పఠనం ప్రారంభమైంది. వారు వయసుకు మించిన ఉత్సాహంతో లయబద్ధంగా గానం చేస్తూ వుంటే సాక్షాత్తు పరమశివుడు తాండవమాడినట్లు నేను పరవశించాను. ఈ సందర్భంగా నేను మీ అందరి తరఫున ఆయనకు సాహితీ నీరాజనాలర్పిస్తున్నాను.

నారాయణరెడ్డిగారిలాగా నిలువెల్లా కవిత్వం నింపుకొన్న కవి గుంటూరు శేషేంద్ర శర్మ. నా కలానికి ఒక దేశపు జెండాకున్నంత పొగరున్నదని నిర్భయంగా చాటిచెప్పిన కవి శేషేంద్ర. సంస్కృతాంధ్రాలలోనే కాక ఆంగ్లంలో కూడా అద్భుత నైపుణ్యం గల

సాహితీవేత్త శేషేంద్ర. విశ్వనాథ వారిలాగే ఎవరికీ తలవంచని కవి శేషేంద్ర. ఆయన అతి చిన్న వయసులోనే వాల్మీకి రామాయణాన్ని గురించి 'షోడసి' అన్న పేరుతో అనేక వ్యాసాలు రాసి ఔరా! అనిపించుకొన్నాడు. అంతేకాదు 'ముత్యాలముగ్గు' చిత్రంలో నిద్రిస్తున్న తోటను పాటతో మేల్కొల్పి సరికొత్త భావానికి సరిగమలైనాడు. శేషేంద్ర రచించిన 'ఆధునిక భారతం' మారిన కాలవైఖరులకు మాసిపోని నిదర్శనం. కాళిదాస మహాకవి సంస్కృతంలో రచించిన 'మేఘసందేశం'లోని ప్రతిశ్లోకం శేషేంద్రకు కంఠస్థం.

నేను వారి మరణ సందర్భంగా

అలవోకగా నీవు కలము దూసితివేని
కడలి తరంగముల్ జడసి ఆగు!
కలను సైతము నీవు గళము విప్పితివేని
వేదనాదమ్ములు విస్తుబోవు!
శిరమెత్తి నింగిని ఉరిమి చూసితివేని
చుక్క లక్షరములై చుట్టుమూగు!
చిరునవ్వుతో నీవు చేయినూపితివేని
రసరమ్య భావముల్ రాసులీను!
పెక్కులేటికి చివరగా ఒక్కమాట
సుకవిజనచంద్ర, శేషేంద్ర, సుగుణసాంద్ర!
చెవికి నోరూర జేయు నీ కవిత వినిన
చివురులామని వీడి నీచెంత జేరు! అన్నాను.

ఇంతటితో శేషేంద్ర కవితాప్రస్థానానికి ముగింపు పలుకుతున్నాను.

"మా తెలుగుతల్లికి – మల్లెపూదండ" అన్న గేయం ఈనాటికీ ప్రతిసభలో మారుమ్రోగుతూ వుంది. ఆ గేయం 'శంకరంబాడి సుందరాచారి' తెలుగుజాతి గతవైభవానికి అద్దం పడుతుంది. ఈ ఒక్కపాట ద్వారా అమరావతిలోని అపురూప శిల్పాల సౌందర్యాన్ని మనకు సాక్షాత్కరింపజేశాడు. బంగారు పంటలకు నీరంద జేయడం కోసం పరుగులు తీసే కృష్ణమ్మకు అక్షర నీరాజనాలర్పించాడు సుందరాచారి. రుద్రమ్మ భుజశక్తిని, మల్లమ్మ పతిభక్తిని, తిమ్మరుసు ధీయుక్తిని, కృష్ణరాయల కీర్తిని

వీణా నినాదంలా మ్రోగించాడు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన రవీంద్రుని గీతాంజలిని తెలుగులో అనువదించి తెలుగు ప్రజలకందించి తరించిన ఆ దేశీయ కవికి దోసిలొగ్గి నమస్కరిస్తున్నాను.

ఆంధ్ర సారస్వతంలో అత్యున్నత శిఖరాలనందుకున్న మహాకవులలో బోయి భీమన్నగారొకరు. పద్యం, గద్యం, గేయం, నవల, నాటకం మొదలైన అన్ని ప్రక్రియలు భీమన్నకు శిష్యరికం చేశాయి. భీమన్న తన కవితా మాగాణంలో నవరసాలు పండించిన కృషీవలుడు. భీమన్న రచించిన పాలేరు నాటకం నాటక రంగానికి తలమానికం. ఆయన 'రాగవైశాఖి' అనే కావ్యంలో ప్రణయ రహస్యాలను రాసులు పోశాడు. అపర వాల్మీకిగా అసంఖ్యాక ప్రజల మన్ననలందుకున్నాడు. మానవాభ్యుదయమే మార్గ దర్శకంగా బహుదూరమేగిన బాటసారి భీమన్న. భీమన్న అడుసుమళ్ళలో ఆవిర్భవించి పరిమళించిన పద్మం. భీమన్నకు సంస్కృతాంధ్రాలు కొట్టిన పిండి. చాలా విషయాల్లో ఆయన జగమొండి. బోయి భీమన్న తుదిశ్వాస ఆగేవరకు ధ్యాసను కవిత్వానికే అంకితం చేశాడు. ఆయన కవిగా పుట్టాడు. కవిగా జీవించాడు. కవిగానే మరణించాడు.

తెలుగు సినిమా పాటకు జానపద సౌరభమద్దిన కవులలో కొసరాజు ఒకరు.

'ఏరువాకా సాగారో రన్నా చిన్నన్నా
నీకష్టమంతా తీరెనురో రన్నా చిన్నన్నా'...

అంటూ 'రోజులు మారాయి' చిత్రానికి కొసరాజు రాసిన పాట ఆ రోజుల్లో చరిత్ర సృష్టించింది. రచయితగా కొసరాజు పట్ల నాకున్న అభిప్రాయాన్ని ఇక్కడ ఉదాహరిస్తాను.

కొసరాజు జానపద కవి మాత్రమే కాదు. ఆయన రచనల్లో వ్యంగ్యం. చమత్కారం దోబూచులాడతాయి. కొసరాజు సమాజాన్ని చైతన్యవంతం చేసే పాటలు చాలా రాశాడు. తెరమరుగున పడిపోయిన అనేకమాటలకు ఆయువు పోశాడు. కొసరాజు రచనలు దిసమొలతో తిరుగాడే పసిపిల్లల వలె సహజ సుందరాలు. ఆయన ప్రతిమాటలోనూ తెలుగుదనం తొణికిసలాడుతుంది. ఆకారమూ అలాగే వుంటుంది. ఇవన్నీ మీకు తెలియనివి కావు. నాకు తెలిసిన నిజాలను మీతో కలిసి పంచుకోవాలని ఈ నాలుగు మాటలు చెప్పాను.

ఇహ వేటూరిది సాటిలేని బహుముఖ ప్రజ్ఞ
పాటకు వేటూరి మాట సుగ్రీవాజ్ఞ

ఆయన పాట అనేక నంది అవార్డులను అందుకొన్నది.

"రాలిపోయే పువ్వా నీకు రాగాలెందుకే
వాలిపోయే పొద్దా నీకు వర్ణాలెందుకే" అంటూ 'మాతృదేవోభవ' చిత్రంలో వారు రాసిన పాట జాతీయ పురస్కారం అందుకొన్నది.

'ఆరేసుకోబోయి పారేసుకున్నాను', 'ఓలమ్మి తిక్కరేకిందా', 'చిలక్కొట్టుడు కొడితే' ఇవన్నీ యువతను ఉర్రూతలూపిన పాటలు.

'చూడాలని వుంది' చిత్రంలో కలకత్తాను వర్ణిస్తూ వేటూరి రాసిన 'యమహానగరి కలకత్తాపురి' ఒక చారిత్రక గానలహరి. 'సితార' చిత్రంలో 'కిన్నెరసాని వచ్చిందమ్మా- వెన్నెల పైటేసి' అంటాడు. 'సిరిసిరిమువ్వ' చిత్రంలో 'ఝుమ్మంది నాదం సయ్యంది పాదం' అంటాడు. 'శంకరాభరణం' చిత్రం విజయంలో వేటూరి పాటలకెంత పాలుందో మనందరికి తెలుసు. ఆ చిత్రాన్ని మలయాళంలో అనువదించారు. అయితే వేటూరి పాటలను మాత్రం యధాతథంగానే వుంచారు.

దీనిని బట్టి వేటూరి పాటలు రాసిలోనూ వాసిలోనూ ఎంత గొప్పవో మనం అర్థం చేసుకోవచ్చు.

●

"ఆముక్తమాల్యదలోని ఉపాఖ్యానాలు-తాత్త్వికాంశాలు"

◆ ఆచార్య మసన చెన్నప్ప

ఆనిష్ఠానిధి గేహసీమ నడురేయాలించినన్ మ్రోయు నెం
తే నాగేంద్ర శయాను పుణ్య కథలున్ దివ్య ప్రబంధాను సం
ధానధ్వానము 'నాస్తిశాక బహుతా, నాస్త్యుష్ణతా, నాస్త్యపూ
పో, నాస్త్యోదన సౌష్ఠవంచ, కృపయాభోక్తవ్య' మన్మాటలున్

(ఆముక్త. 1–84)

విష్ణుచిత్తుని ఇంటిలో నడురేయి కూడా విష్ణుగాథలు వినిపించేవి. దివ్య ప్రబంధాలు చదువబడేవి. విష్ణుచిత్తుని ఇంటికి, ఆముక్తమాల్యదకు భేదం లేదు. ఆముక్తమాల్యద నిజంగా విష్ణుగాథలలో విరాజిల్లే ఒక దివ్య ప్రబంధం.

విష్ణుమూర్తి విష్ణుచిత్తుని చిత్తంలో ఉన్న స్వామి మాత్రమే కాదు, రాయలను ఆవేశించిన విశ్వవిరాణ్మూర్తి. విష్ణు కథలను వర్ణిస్తే ఈ విధంగా వర్ణించాలని నిరూపించిన మహాకవి రాయలు. కేవలం కథలు చెప్పి పాఠకులను సమ్మోహితులను చేయడం కవులందరికీ తెలిసిన విద్య. కాని రాయలు కేవలం కవిగా కనిపించడు. కథా పరమార్థాన్ని ఎఱుక పఱచి, పాఠకుణ్ణి గమ్యానికి చేరుస్తాడు. బుద్ధిని పరమ పురుషార్థం వైపు మళ్ళిస్తాడు.

ప్రేమతో గోదాదేవి ధరించి ఇచ్చిన మాలను విష్ణుచిత్తుడు స్వామికి సమర్పించాడు. అందువల్ల ఇది శృంగార కావ్యం అయింది. కాని నేను ఆముక్తమాల్యదను కేవలం శృంగార కావ్యమని చెప్పలేను. కొబ్బరిబొండాం ఇసుకలో పాతి సాయంత్రం దానిలోని నీళ్ళు త్రాగడం, చలివేంద్రాలలో అమ్మాయిల అందాలతో పాటు వారు

దోసిళ్ళతో పోసే నీళ్ళతో బాటసారులు దాహం తీర్చుకోవడం మొదలైన గ్రీష్మవర్ణనలు; ఇల్లిల్లు తిరిగి, నిప్పు దెచ్చి, పొయ్యిరాజేసి, కప్పు దూలాలు పెట్టి, నేతితో మండించి, అతిథులకు అన్నం వండిపెట్టి, చివరికి పస్తులుండే గృహిణులకు, వర్షం రాగానే రచ్చబండల మీదికి చేరి, మబ్బు విడిపోగానే, మబ్బుతో పాటు చెదిరిపోయే బాటసారులకు చెందిన వర్ష వర్ణనలు; ప్రాతఃసమయంలో స్నానం చేసిన ద్విజులు వస్త్రాలను తడిపి ముద్దలుగా పెట్టి మరచిపోయారేమోనని ముట్టుకోబోయిన తలారుల అజ్ఞానానికి నవ్వుకొనే గోపవనితలకు సంబంధించిన పల్లీయవర్ణనలు ఆముక్త మాల్యదను ఒక ఋతు కావ్యంగా చెప్తున్నాయి. కాని నేను ఆముక్తమాల్యదను ఒక ఋతువర్ణన ప్రాధాన్యం గల కావ్యంగా చూడలేను.

పలువురి వాదోపవాదాలుండడం వల్ల ఆముక్తమాల్యద కేవలం సంవాద కావ్యమని చెప్పడానికీ వీలులేదు. ఇట్లే దశావతారాల వర్ణనల వల్ల ఇదొక పురాణమని చెప్పవలను పడదు. అంతేకాదు రాజుల కథలు, రాజనీతికి సంబంధించిన విషయాలు ఉండడం వల్ల ఇదొక రాజనీతి గ్రంథం అంటానికి కూడా మనసొప్పదు.

అంతెందుకు రాయలు ఆముక్తమాల్యద ద్వారా విశిష్టాద్వైతాన్ని మాత్రమే ప్రబోధించాడని చెప్పేవాళ్ళూ ఉన్నారు. ఆ మాటలే ఒప్పుకుంటే ఇదొక మత గ్రంథం అవుతుంది. కాని ఆముక్తమాల్యద ఒక మతగ్రంథం కూడా కాదు, సర్వజనహిత గ్రంథం.

కళాపోషకుడిగా, కవిగా, రాజనీతిజ్ఞుడిగా, పౌరాణికుడిగా, పరిపాలకుడిగా కనిపించే శ్రీకృష్ణదేవరాయలలో ఒక గొప్ప వేదాంతి ఉన్నాడు. ఒక దార్శనికుడున్నాడు. ఒక తాత్వికుడున్నాడు. వేదాంతి అన్నా, దార్శనికుడన్నా, తాత్వికుడన్నా నా దృష్టిలో ఒకడే.

వేదాంతం అంటే వేద సిద్ధాంతం అని అర్థం. ఉపనిషత్తులు వేదాంత గ్రంథాలుగా పేర్కొనబడడానికి కారణం వాటిలో వేద సిద్ధాంతం చెప్పబడడమే. రాయలు ఉపనిషత్తుల మర్మం తెలిసినవాడు. కనుక అచ్చమైన వేదాంతి. అంతేకాదు, ప్రపంచ తత్వాన్ని, ఆత్మ పరమాత్మతత్వాన్ని యథార్థంగా తెలిసికొన్న వాడు కనుక దార్శనికుడు. దర్శన కారులు తాము దర్శించిన సత్యాన్ని సూత్రబద్ధం చేయగా కవులు కథారూపంలో, వ్యాఖ్యానాల రూపంలో వెల్లడించారు. రాయలు ఆముక్తమాల్యదలో ఆ పనే చేశాడు.

కవులు సర్వజ్ఞులు కాకపోవచ్చుగాని, లోకజ్ఞులు మాత్రం కావాలి. వేదంలో ప్రయోగింపబడిన 'కవి'శబ్దానికి సర్వజ్ఞుడనే అర్థం. లౌకిక భాషలో కవి శబ్దానికి అంతటి అర్థం లేదు. లోకజ్ఞుడని సరిపెట్టుకుంటే అంతేచాలు. రాయలు లోకజ్ఞుడు. అయితే ఆయన లోకానుభవం శాస్త్రానుభవంతో మిళితమై ఆయననొక దార్శనికునిగా మన ముందు నిలబెడుతుంది. ఉపాఖ్యానాలను పరిశీలిస్తే ఈ సత్యం ధ్రువపడుతుంది.

ఆధ్యాత్మిక జీవనానికి సంబంధించినంతవరకు భక్తి జ్ఞాన కర్మలకు విశేషమైన ప్రాముఖ్యం ఉంది. వేదాల ఆధారంగా ప్రకృతి, జీవాత్మ, పరమాత్మల తత్త్వాన్ని గ్రహించి పరమాత్మతో సంబంధాన్ని కలిగి ఉండడమే జ్ఞానయోగం. ఆముక్తమాల్యదలోని ఖాండిక్య కేశిధ్వజోపాఖ్యానం అందుకు ఉదాహరణ. కర్తవ్య కర్మలను ఆచరిస్తూ పరమాత్మను చేరడానికి చేసే ప్రయత్నమే కర్మయోగం. విష్ణుచిత్తుని కథ, దానికి సమాంతరంగా కనిపించే యమునాచార్యుని కథ అందుకు ఉదాహరణలు. పరమాత్మ గుణగణాలను కీర్తిస్తూ, పాడుతూ ప్రాపంచిక విషయాల మీద దృష్టిపెట్టక, భగవంతుణ్ణి పొందడానికి చేసే ప్రయత్నమే భక్తియోగం. దాసరి, బ్రహ్మరాక్షసుల కథలు అందుకు మంచి ఉదాహరణలు.

రాయలు భక్తిజ్ఞాన కర్మయోగాలను తనకాలం నాటి ప్రజల చేత అవలంబింపచేయడానికి ఆముక్తమాల్యద రచించాడా అనిపిస్తుంది. పురుషార్థాలలో నాల్గవదైన మోక్షం పరమ పురుషార్థం. మానవుని గమ్యం అదే. పాండ్యరాజు కథలో దీని ప్రస్తావనే వచ్చింది.

"వినియె, నెలల్ చతుర్ద్వయిని వృష్టిదినాళికి, రాత్రికై దివం
బున; జరకై పయస్సునను; బూనిపరంబున కిప్పుడుద్యమం
బనువుగ జేయగా వలయు" నంచుపురోహితధర్మమాత్మ గీ
ల్కొనల విప్రుడాద్విజులలోన సుభాషితమున్ పఠింపగన్"

(ఆముక్త. 2-76)

వానాకాలంలో సుఖంగా గడపడానికి కావలసిన ధనాన్ని తక్కిన ఎనిమిది నెలల్లో సంపాదించుకోవాలి. అదేవిధంగా రాత్రి కోసం పగటి పూట, వృద్ధాప్యం కోసం వయస్సులో ఉన్నప్పుడు కావలసిన వస్తుసామగ్రిని సమకూర్చుకోవాలి. అంతేకాదు ప్రయత్నపూర్వకంగా పరలోకంలో సుఖపడడానికి ఈ లోకంలోనే అనగా ఈ జన్మలోనే ప్రయత్నించాలి. కావలసిన పుణ్యాన్ని సంపాదించాలి.

పురోహితుని నోట వెలువడ్డ ఈ మాటలు పాండ్యరాజుకు జ్ఞానోదయాన్ని కలిగించాయి. అర్థరాత్రి భోగిని కడకు పోతున్నవాడు, ఆ పని మానుకొని తిరిగి రాజమందిరానికి వచ్చాడు. పడవ ఏవిధంగా తనలో కూర్చున్నవాళ్ళను, వాళ్ళకు తెలియకుండానే ఒడ్డుకు చేరుస్తుందో కాలం కూడా మానవులకు తెలియకుండా మృత్యుతీరానికి చేరుస్తుందనీ, కాలం విలువ గొప్పదనీ, మోక్షం కోసం కాలాన్ని ఉపయోగించుకోవాలనీ, అసలు మోక్షం ఇచ్చే దైవం ఎవరో తెలుసుకోవాలని నిశ్చయించుకొన్నాడు. అందులో కృతకృత్యుడయ్యాడు కూడా.

ఈ సన్నివేశాన్ని బట్టి ఏలాంటివారికైనా పరమపురుషార్థమైన మోక్షమే శిరోధార్యమని స్పష్టమవుతుంది.

విష్ణుచిత్తుని గూర్చి రాయలు చెప్పిన మాటలు అతనికీ వర్తిస్తాయి. విశాలచిత్తుడే కృష్ణరాయలని చెప్పినా అతిశయోక్తి ఎంతమాత్రం కాదు.

"అందుండుం, ద్వయ సద్మపద్మవదనుం, దద్వంద్వు,డశ్రాంతయో

గాందూబద్ధమధుద్విషద్విరదు" డని విష్ణుచిత్తుడు ప్రశంసింపబడ్డాడు. అతడు శీతోష్ణాలు, సుఖదుఃఖాలు అనే ద్వంద్వాలకు అతీతుడు. నిరంతరం ధ్యానయోగం అనే సంకెలతో విష్ణుమూర్తి అనే ఏనుగును హృదయంతో కట్టినవాడు. ఆత్మరూప వత్సాన్ని ధ్యానమనే రజ్జువుతో ప్రాణమనే కొయ్యకు కట్టడమే యోగమని యోగవిదుల అభిప్రాయం. అంతకుమించి "ప్రకృతికంటె పరుండగు తన్నును, తనకంటె పరుండగు పరమేశ్వరు"న్ని తెలిసికొన్నవాడు. తనకూ పరమేశ్వరునికి అనాదిగా ఉండే సేవక, స్వామి సంబంధాన్ని గుర్తించినవాడు. మన్నారుదేవుని అనుగ్రహం వల్ల విష్ణుచిత్తుడు పాండ్యరాజు సభలో ప్రవేశించి అన్యుల వాదాలను ఖండించిన తీరు చూస్తే, రాయలకు దర్శన గ్రంథాలతో గల పరిచయం కూడా తేటతెల్లమవుతుంది. రాయలు ముఖ్యంగా బ్రహ్మసూత్రాలను జీర్ణించుకున్న తత్త్వవేత్త. జగత్తు పుట్టుకకు ప్రకృతే కారణమని చెప్పిన సాంఖ్యమతస్థుణ్ణి "ఈక్షతేర్నాశబ్దమ్" (1-1-5) అనే సూత్రం చేతను; 'నేనే ఈశ్వరుణ్ణి (అహం బ్రహ్మాస్మి) అన్న అద్వైతిమాటలను "భోగమాత్ర సామ్యలింగాచ్చ" (4-4-21) అనే సూత్రం చేతను; అగ్నిష్టోమాది సత్క్రియే ఫలమిస్తుందన్న మీమాంసావాది పల్కులను "ఫలమత ఉపమత్తేః" అన్న సూత్రం చేతను; అనుమాన ప్రమాణం వల్ల ఈశ్వరుడు సిద్ధిస్తాడన్న పరమాణువాది ప్రతిపాదనను "శ్నాయోనిత్వాత్"

(1-1-3) అన్న సూత్రం చేతను ఖండించి ప్రతివాదులను గెలిచిన తీరును గమనించి నప్పుడు రాయలకు వేదాంత దర్శనం మీదగల పట్టు ఏపాటిదో అర్థమవుతుంది.

రాయలు శృంగార రస ప్రధానమైన తన కావ్యాన్ని ఆత్మతత్వ ప్రతిపాదనకు అనుకూలంగా మార్చినాడు. కేశిధ్వజుడు ఖాండిక్యునికి చేసిన ఉపదేశాన్ని గమనిస్తే ఆధ్యాత్మిక విద్యలో రాయలెన్ని మెట్లెక్కాడో తెలుస్తుంది. తెలుగు కవులందరికంటె ఎత్తున ఉన్న విషయం స్పష్టమవుతుంది.

"ఆత్మ కాని మేననాత్మ బుద్ధియును న
స్వంబునందు మిగుల స్వత్వమతియు
నవనివర! యవిద్యయను మహాతరువును
త్పత్తికీద్వయంబు విత్తుమొదలు"-3.66

శరీరం కంటె ఆత్మ భిన్నమైంది. కాని శరీరాన్నే ఆత్మగా లెక్కించి పుత్ర కళత్ర ధన కనకాదులను తనవిగా భావించడం అనే ఈ రెండూ అవిద్య అనే చెట్టుకు రెండు పలుకులు గల్గిన విత్తులాంటివని రాయల వివేచన.

అది కాని దానియందు అది అనే బుద్ధి అవిద్య- "అతస్మిన్ తద్బుద్ధిరవిద్యా".

"అనిత్యాశుచి దుఃఖానాత్మసు
నిత్యశుచి సుఖాత్మఖ్యాతిరవిద్యా'- యోగ. 2-5.

అనిత్యాన్ని నిత్యమనుకోడం, అశుచిని శుచి అనుకోవడం దుఃఖాన్ని సుఖమనుకోడం, అనాత్మ అయిన శరీరాన్ని ఆత్మ అనుకోవడం అవిద్య. అవిద్యచే అంటబడనివాడు పరమాత్మ. అవిద్యచేత సంసారంలో చిక్కి అవస్థలు అనుభవించేవాడు దేవుడు.

ఈ అవిద్యను మిథ్యాజ్ఞానమని కూడా పిలుస్తారు. అవిద్యను తొలగించుకుంటే రాగద్వేషాలుండవు. రాగద్వేషాలు లేకుంటే ధర్మాధర్మ ప్రవృత్తులుండవు. ధర్మాధర్మ ప్రవృత్తులు లేకుంటే జన్మ ఉండదు. జన్మేలేని నాడు దుఃఖమే ఉండదు. మొత్తం మీద అవిద్య దుఃఖానికి కారణం. ఈ దుఃఖం ఆధ్యాత్మికం, ఆధిభౌతికం, ఆధిదైవికం అని త్రివిధం.

త్రివిధ దుఃఖాన్ని తొలగించుకోవడమే మోక్షం. "త్రివిధ దుఃఖాత్యంత నివృత్తి రత్యంత పురుషార్థః" (సాంఖ్యం, 1-1)

అవిద్యతో పాటు అస్మిత, రాగం, ద్వేషం, అభినివేశం క్లేశాలుగా వ్యవహరింప బడుతాయి. ఈ క్లేశాలు అంటనివాడు ఈశ్వరుడు. అంటిన వాడు జీవుడు. రాయలు 'అవిద్య'ను పేర్కొని తర్వాత అస్మితను పేర్కొనడం వల్ల ఆయనకు గల యోగశాస్త్ర పరిచయం తేటతెల్లమవుతుంది.

"నరనాథ పాంచభౌతిక
శరీరమున దేహిమోహ సాంద్రతను తమః
పరివృతుడై 'యేనిది, నా
పరికర'మని యవధి లేని భ్రమపడి తిరుగున్" (3-67)

అస్మితకు కారణం అవిద్యే. నేను, నాది అనడమే అస్మిత. ఇక అవిద్య రాగద్వేషాలకు కూడా కారణమవుతుంది. రాగద్వేషాలకు వైదిక పరిభాషలో దోషమని పేరు. రాయలు అవిద్య, అస్మితలు చెప్పి, ఆ తర్వాత రాగాన్ని ప్రస్తావించాడు.

"జలవసుధాంబర పవన
జ్వలనంబులకంటె తానజస్రంబు వెలిన్
వెలుగొందు నాత్మ యుండగ
కళేబరము నెవ్వడాత్మగా తలపోయున్?" - 3.68.

ఆత్మ పంచభూతాలకంటె భిన్నమై ప్రకాశిస్తుందని, అట్టి ఆత్మను కాదని కళేబరాన్ని ఇష్టపడడం వ్యర్థమని చెప్పిన మాటలు ఎంతో విలువైనవి.

దేహం కంటె ఆత్మ భిన్నమని తెలిసినప్పుడే దేహ సంబంధమైన దోషాలు ఆత్మకంటవని, జన్మలనే మజిలీలు చేస్తూ కర్మవాసనలనే ధూళిచేత కప్పబడిన జీవుడు జ్ఞానమనే వేడినీళ్ళతో జలకాలాడినప్పుడే పవిత్రుడౌతాడని; నీళ్ళు నిప్పుకు అంటకపోయినప్పటికీ, కుండలో ఉండి వేడెక్కినట్లు జీవుడు కూడా శరీర సంసర్గం వల్ల మలినుడవుతున్నాడని కేశిధ్వజుని ద్వారా రాయలు చేసిన ఉపదేశమంతా సాంఖ్యదర్శనంలో చెప్పబడిన అంశాలకు దగ్గరగా ఉన్నదే.

ఇట్లే ప్రకృతి జన్యమైన బుద్ధి - అనగా మనస్సు బంధ మోక్షాలకు కారణమవు తుందనే విషయాన్ని రాయలు సూటిగా తెలియజేశాడు.

"ప్రాణికోటికెల్ల బంధంబు మోక్షంబు
చేరుటకును మనసు కారణంబు

విషసంగియైన విను బంధకారి - ని
ర్విషయమైన ముక్తి విభవకారి" - 3.73

ఈ పద్యం "మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః।
బంధాయ విషయాసంగి, ముక్త్యై నిర్విషయం మనః" అన్న శ్లోకానికి అనువాదమే అయినప్పటికీ రాయలు ఈ సందర్భంలో గ్రహించడం ఆయన విజ్ఞతను తెలియజేస్తుంది.

"బంధం మోక్షంచ యావేత్తి బుద్ధిస్సా పార్థ సాత్వికీ" (18.30) అని భగవద్గీత కూడా చెపుతుంది.

షడ్దర్శనాలలో 'సాంఖ్యం' థియరీ అయితే యోగదర్శనం ప్రాక్టికల్. దీన్ని గుర్తించిన రాయలు కేశిధ్వజుని ద్వారా ఖాండిక్యునికి సాంఖ్యాన్ని బోధించి ఆ తర్వాత యోగదర్శనం ఆధారంగా అష్టాంగ యోగాన్ని గూర్చి తెలియజేశాడు.

రాయలదృష్టిలో విష్ణువు కేవలం అవతార పురుషుడుకాదు, స్వయంభువు, సృష్టికర్త, సర్వేశ్వరుడు, మోక్షప్రదాత. ఆముక్తమాల్యదలో యమనియమాలతో పొందదగిన స్వామిగా విష్ణువు అభివర్ణింపబడడం గమనార్హం.

రాయల దినచర్యను గూర్చి ముచ్చటిస్తూ మనం ఆయన శారీరకమైన కసరత్తును గూర్చి ప్రస్తావిస్తామేగాని, ఆ రాజకవి యోగాభ్యాసన కుశలుడన్న విషయం మరిచి పోతాము. కాని జీవన్ముక్తికి ఏకైక సాధనం యోగమే అని కృష్ణరాయల అభిప్రాయం. కేశిధ్వజుని ఉపదేశమంతా యోగదర్శనానుకూలంగానే జరిగిందన్న విషయం మరువరానిది.

"బ్రహ్మచర్యాదులగు యమంబులేనును, స్వాధ్యాయాదులగు నియమంబులేనును నిష్కాముండై యోగియగువాడు మనోనైర్మల్య సంపాదనకు నాచరింపవలయు" (ఆముక్త. 3.75) నని యమ నియమాలతోపాటు తక్కిన ఆసన ప్రాణాయామాదులను వివరించాడు. "పరమాత్ముని యందు చిత్తంబు నిల్పుట విశుద్ధయగు ధారణ" అంటూ అగ్ని ఏ విధంగా ఎండిన పొదల్ని కాలుస్తుందో అదేవిధంగా ధ్యానవస్తువైన విష్ణువు యోగుల పాపాలను కాల్చివేస్తాడని విశదపరిచాడు. మనస్సును విషయ వాసనల నుండి మరల్చి, మోక్షం కోసం పరమాత్మను ధ్యానించినప్పుడే, సాధకుణ్ణి సూదంటురాయి ఇనుమును ఆకర్షించినట్లు' పరమాత్ముడు అనుగ్రహిస్తాడని తేటతెల్లం చేశాడు.

రాయలు పరమాత్మను ఏవిధంగా అర్థం చేసుకున్నాడో తెలుసుకోవటానికి ఈ క్రింది పంక్తులు మంచి ఉదాహరణ.

"యోగి హృద్ధేయమై యొప్పున మూర్త రూపంబొండు; సత్సంజ్ఞc
బ్రాజ్ఞకోటి దానివచించు; నేతద్రూపమె సమస్త శక్తులకెల్ల
నాశ్రయతబొంది, ప్రాగుక్త విశ్వరూప విలక్షణత గాంచి, అతి మహత్వంబుచే
వెల్గు"- 3.82

యోగుల హృదయాలలో ధ్యానింపదగిన పదార్థమే విష్ణువు. దానికే 'సత్' అని పేరు. ఈ 'సత్' పదార్థమే సమస్త శక్తులకు ఆశ్రయం. ఇదే నిరాకార పరబ్రహ్మ. కాని ఇది విశ్వరూపం (మూర్త ప్రపంచం) కంటె విలక్షణమైంది. అనగా భిన్నమైందని రాయలు చేసిన వివేచన మహత్తరమైంది. వేదానుకూలమైంది.

సృష్టిలో అన్ని పదార్థాలూ విష్ణు శరీరాలేనని, సకల పదార్థాల్లోను ఆకాశం లాగా (ఓం ఖం బ్రహ్మ) విష్ణువే వ్యాపించి ఉంటాడని రాయలు చేసిన వర్ణన ఉపనిషత్ జ్ఞానానికి సమీపంలో ఉంది.

"తదేతన్మూర్తం యదన్యద్వా యోశ్చ, అంతరిక్షాచ్చ, ఏతన్మర్త్యం, ఏతత్స్థితమే, ఏతత్సత్..."

(బృహదారణ్యకం, 2-3-2)

సూర్యోపాసన సాకార పరబ్రహ్మకు చెందింది. పరబ్రహ్మ ప్రతిమూర్త పదార్థంలో ప్రత్యక్షమైనట్లే సూర్యుని ద్వారానూ ప్రత్యక్షమవుతున్నాడు. కనుకనే ఉపనిషత్తులు సూర్యుణ్ణి పరబ్రహ్మ యొక్క ప్రత్యక్షరూపసారంగా పేర్కొంటున్నాయి.

రాయలు యమునాచార్యుని కథ ద్వారా "విష్ణుదేవుండె పరతత్త్వంబనియు, విశిష్టాద్వైతంబె మతంబునగుటయు ప్రతిష్ఠించినవాడు.

ఏదైనా విలక్షణమైనప్పుడే విశిష్టమవుతుంది. అంతవరకది సామాన్యమైందే. ద్వైతం కంటే, అద్వైతంకంటే విలక్షణమైందే విశిష్టాద్వైతం.

అద్వైతం దేవుడొక్కడే అని ప్రకృతి జీవాత్మలను పట్టించుకోలేదు. ద్వైతం ప్రకృతిని ప్రక్కన బెట్టి జీవాత్మ పరమాత్మలను మాత్రం పేర్కొన్నది. ఇక విశిష్టాద్వైతం ఒక అడుగు ముందుకేసి మౌలికమైన విషయాన్ని స్పృశించింది. ప్రకృతితో కూడిన (అనగా విశిష్టుడైన) పరమాత్మను, జీవాత్మను చక్కగా విశ్లేషించగలిగింది. ప్రజలకు చక్కని మార్గం చూపగలిగింది.

రాయలదృష్టిలో విష్ణువు కేవలం లక్ష్మీదేవి భర్త కాదు. విశ్వభర్త. మోక్షప్రదాత. సర్వేశ్వరుడు. సర్వశక్తిమంతుడు.

పాండ్యరాజు సభ చేసి పండితులను "మీమీ శాస్త్రాల ఆధారంగా మోక్షాన్నిచ్చే దేవుడెవరో చెప్పం"దని అడుగగా వారు పలికిన పలుకులు గమనింపదగ్గవి. తాత్త్వికులు ఆలోచింపగా –

"హరునొకడన, సుమనొకడన,
హరినొకడన, శిఖినొకడన నర్కునొకడనన్
కరిముఖునొకడన, రజనీ
శ్వరుడొకడన, నజునొకడన వాదైన తతిన్" (2-86)

ఒకరు శివుడే దేవుడన్నారు. ఒకరు పార్వతిని పేర్కొన్నారు. ఒకరు విష్ణువును సూచించినారు. ఒకరు అగ్నిని జ్ఞాపకం చేశారు. ఒకరు సూర్యుడని తేల్చిచెప్పారు. ఒకరు వినాయకుడనగా, ఒకరు చంద్రుడన్నారు. మరొకరు బ్రహ్మ అని సూచించారు. కాని వీరిలో ఎవరూ మోక్షాన్నిచ్చే వారు కాదని తెలుపుతుంది అని తాత్పర్యం.

ఇక దాసరి కథ విష్ణు కీర్తనం వల్ల గంగే పుణ్యాన్ని గూర్చి పూర్వజన్మలో సోమశర్మ అనే పేరుగల్గిన బ్రాహ్మణుడు. దుష్కర్మలచేత ఈ జన్మలో బ్రహ్మరాక్షసుడయ్యాడు. అతడు చార్వాక మతానికి చెందినవాడు. ప్రపంచంలోని అన్ని పదార్థాలూ జడాలేనని చార్వాకుల సిద్ధాంతం. శరీరంతో అనుభవించే సుఖం దప్ప మరొకటి లేదని, ప్రమాణాల్లో ఒక్క ప్రత్యక్ష ప్రమాణం మాత్రమే అంగీకారయోగ్యమని వారి ప్రతిపాదన. చార్వాకులు జడవాదులు. అలాంటివారు రాయలకాలంలోనే కాదు, అన్ని కాలాల్లోను ఉన్నారు. జడవాది అయిన బ్రహ్మరాక్షసుణ్ణి పరమవైష్ణవునిగా మార్చిన దాసరి కథ ఆముక్తమాల్యదకే వన్నె గూర్చింది.

"ఎవ్వని చూడ్కి జేసి జనియించు జగంబు;
వసించు నిజ్జగం
బెవ్వనియందు; డిందు మఱియెందిది;
యట్టి విష్ణుతో
నిశ్వల నొక్క వేల్పు గణియించిన
పాతకి నౌదునేడునే

నెవ్విధినైన నిన్గదియనేని" యనన్విని

బంధమూడ్చినన్"   – ఆముక్త. 6–43

ఇందులో విష్ణువు సృష్టి స్థితి లయ కారుడని, అతనితో సమానమైవాడు మరొకడు లేడని చెప్పబడింది. విష్ణువుతో మరొక దేవతను సమానంగా లెక్కించడం రాయలదృష్టిలో మహాపాపమని చెప్పినా తప్పు లేదు. దేవుడొక్కడనేదే రాయల సిద్ధాంతం. రాయలు త్రిమూర్తులను ఒప్పుకోలేదు.

దాసరి కురుంగుడికి వెళ్ళి మాట ప్రకారం తన దగ్గరికి రాగా, బ్రహ్మరాక్షసుడు అతని శరీరానికి బదులు జ్ఞాన శరీరం ఇవ్వమన్నాడు. ఆత్మజ్ఞానం ప్రసాదించమన్నాడు. 'జ్ఞానాన్ముక్తిః' అనే సాంఖ్యసూత్రాన్ని ఇక్కడ గమనించాలి. చివరికి గీతాఫలమివ్వ మన్నాడు. సగం ఇచ్చినా సరేనన్నాడు. దాసరి ఒప్పుకోలేదు. అప్పుడు రాక్షసుడు ఆ రోజుకు పాడిన చివరి పాట ఫలమైనా ఈయమన్నాడు. దాసరి అనుగ్రహించాడు. బ్రహ్మరాక్షసుడు ధన్యుడయ్యాడు. పరమ వైష్ణవుడుగా మారాడు.

రాయలు భాగవతోత్తముడు. పరమ వైష్ణవుడు, అంతకుమించి దార్శనికుడు. ఋతువులగురించి తెలిసినవాడే కాదు, ఋతం తెలిసినవాడు. ప్రకృతి గురించి తెలిసినవాడే కాదు. ప్రకృతి పురుష వివేకం కలవాడు. తెలుగు సాహిత్యంలో ఆయన స్థానం విశిష్టమైంది. విలక్షణమైంది. వినూత్నమైంది.

●

ఆముక్తమాల్యద : కవితాశిల్పం

◆ 'సాహిత్యబ్రహ్మ' డా॥ వి.వి.ఎల్. నరసింహారావు

శ్రీకృష్ణదేవరాయలు అసాధారణ ప్రజ్ఞాసమన్వితుడు. ఆ ప్రజ్ఞ బహువిధాలుగా భాసించింది. ఆయనకున్న కీర్తి ప్రతిష్ఠల్లో 'సాహితీసమరాంగణ సార్వభౌమత్వ'మనేది విశిష్టమైనది. ఇటు సాహితీరంగంలోనే కాక అటు సమర రంగంలోను సార్వభౌముడుగా వెలుగొందిన విజయశీలుడు. ప్రస్తుత ప్రసంగంలో ఆయన సాహితీ రంగానికి సంబంధించిన కవితాశిల్పం గూర్చి మాత్రమే ప్రస్తావించవలసి ఉన్నది.

కవులెందరో కవితలు సృష్టించారు. "కవయతీతికవిః; తస్యకర్మకావ్యమ్" అన్నారు. వర్ణించేవాడు కవి, ఆ విధంగా చేసేవాడు కవి. 'లోకోత్తర వర్ణనానిపుణ కవికర్మకావ్యమ్' అనే వివరణ విశిష్టమైంది. ఇట్టి కవితారచన శిల్పంగా భాసించేటట్లు చేయగల కవులు కొందఱే. తాము కవితా శిల్పులమనే ఆత్మవిశ్వాసం కల కవులు కొందరున్నారు. నిర్వచనోత్తర రామాయణావతారికలో తిక్కన అటువంటి ఆత్మవిశ్వాసం అక్షరబద్ధం చేశాడు.

'అమలోదాత్త మనీష నేను భయకావ్య ప్రౌఢి పాటించు శిల్పమునన్ పారగుడన్; కళావిదుడు"నన్నాడు.

కృష్ణదేవరాయలు ఆశ్వాసాంత పద్యములలో తన పద్యములన్నియు హృద్యములని ఆముక్తమాల్యదలోని పద్య రచనానైపుణ్యాన్ని వివరించుకొన్నాడు.

"కృష్ణరాయ మహిజాన్యుత్పాది తాముక్తమాల్యద నాశ్వాసము సప్తమంబలరు హృద్యంబైన పద్యంబులన్" పద్యం హృదయంగమంగా ఉండాలంటే అందులో శైలి మాత్రమే కాక శిల్పం కూడా విశిష్టంగా ఉండాలి. ఛందస్సౌందర్యంతో పాటు, శబ్దసుభగత్వం, భావ రామణీయకం కూడా సిద్ధిస్తే త్రివేణీ సంగమమైనట్లు కవితాశిల్పం

కమనీయంగా రూపొందుతుంది. శిల్పమనేది 'శీలసమాధౌ' అనే ధాత్వర్థ సంభరిత మౌతుంది. కృష్ణదేవరాయల ఆముక్తమాల్యదలో ఈ విధమైన కవితాశిల్పం నిక్షిప్తమై ఉన్నది.

ఇష్టదేవతాస్తుతితో ప్రారంభమైన కావ్యం పాంచజన్య, నందక, కౌమోదకీ, శార్ఙ, సుదర్శన వర్ణనలతో ద్వాదశసూరిస్మరణతో ముందుకు సాగుతుంది. పాంచజన్యాదులు శ్రీ మహావిష్ణువు యొక్క దివ్యసాధనాలు. పన్నిద్దరు ఆళ్వారులలోని సర్గోయోగి ఈ పాంచజన్య శంఖం నుండే ప్రభవించాడు. నందక బాణం నుండి మహాయోగి, కౌమోదకీ గద నుండి భూతయోగి, శార్ఙ ధనుస్సు నుండి పరకాలుడు సుదర్శన చక్రం నుండి భక్తిసారుడు ప్రభవించారు. ఆ పైన ద్వాదశ సూరుల వివరణతో తక్కిన ఆళ్వారులు కూడా ప్రస్తుతించబడ్డారు.

పన్నిద్దరు ఆళ్వారులలో విష్ణుచిత్తుడు గరుడుని అవతారాంతరంగా వైష్ణవ గ్రంథాలు ప్రస్తావించాయి. గోదాదేవి భూదేవి అవతారమన్నది ప్రసిద్ధమైందే.

విష్ణువును చిత్తములో పొదువుకొని ఉన్నవాడు విష్ణుచిత్తుడు. అతనికి కలలో ఆంధ్ర విష్ణువు ప్రత్యక్షమై ఆముక్తమాల్యద కథ రచించవలసిందిగా ప్రబోధించాడు.

"ఎన్నినుగూర్తునన్న విను, మేమును దాల్చిన మాల్యమిచ్చు న (ఆ.మా.౧-౧౫)

ప్పిన్నది రంగమందయిన పెండిలి సెప్పుము" అని నిర్దేశించారు. అంతేకాదు, నీవు కర్ణాట ప్రభువు కూడా అయినప్పటికీ నేను తెలుంగు రాయడనుగా నిన్ను తెలుగులోనే కావ్యము రచింపుమంటున్నాను. తెలుగులోనే ఎందుకువ్రాయాలంటావేమో!

'తెలుఁగదేలయన్న దేశంబు తెలుఁగేను తెలుఁగు వల్లభుండు, తెలుఁగొకండ

యెల్లన్నపులుగొలువ నెఱుఁగవే బాసాడి? దేశభాషలందు తెలుఁగులెస్స"

(ఆ.మా.౧-౧౫)

ఈ కారణంగా తెలుగులోనే నీవు కావ్యం వ్రాయాలి. అదీ ఆముక్తమాల్యద కథావస్తువుగా, ఈ కావ్యం విష్ణు చిత్తీయమని అనుకొన్నా రాయలవారు నిర్ధరించినది ఆముక్తమాల్యదానామమే.

విలుబుత్తూరి వర్ణనతో ఆరంభమైన కావ్యం ప్రధాన పాత్ర విష్ణు చిత్తుడు. అతడు విలుబుత్తూరి నివాసి. అతని జన్మసిద్ధమైన పాండిత్యాది విశేషాలు కవితా శిల్పమండితమైన శార్దూల వృత్తంలో, అభివర్ణించారు రాయలవారు. అందుండున్

ద్వయసద్మపద్మవదనుండద్వంద్వుడు (ఆ.మా.౧-౭౭) నిష్ఠాగరిష్ఠుడు విష్ణుచిత్తుడు. ద్వయమనబడే వైష్ణవమంత్రానికి నిలయమైనవాడు. శీతోష్ణ సుఖదుఃఖాది ద్వంద్వభావములు లేనివాడు. శేషశేషిత్వ సంబంధం పూర్తిగా తెలిసినవాడు. అతనికి హేతువాదం ధాతువాదం కాదు, కాణాదము ప్రాణాదముకాదా, కాపిలము చాపలముకాదు. మీమాంస హింసకాదు, వ్యాకరణము అకరణము కాదు.

ఇట్టి వివేకశాలి అయిన విష్ణుచిత్తునకు ఒక అగ్నిపరీక్ష వచ్చింది. ఆ కాలంలో మధురను పాలిస్తున్న పాండ్య మత్స్యధ్వజ ప్రభువు శైవ భక్తి ప్రపత్తులను దిగ్దిగంతముల వ్యాపింపచేస్తున్నాడు. విష్ణుభక్తి సన్నగిల్లుతున్నది. సరిగా ఈ సమయంలోనే శ్రీమహావిష్ణువు విష్ణుచిత్తుని మధురకు పోయి పాండ్యరాజు కొలువులో వైష్ణవ మత విజయధ్వజం ప్రతిష్ఠించి రావలసిందిగా ఆదేశించాడు. విష్ణు చిత్తుడు నిర్వణ్ణుడై పలికిన పలుకులు కవితాశిల్ప సంశోభితాలే.

"స్వామీ! నన్ను నితః పురాపఠితశాస్త్ర గ్రంథ జాత్యంధు, నా
రామక్ష్మాఖననక్రియాఖరఖనిత్ర గ్రాహితోద్య త్కిణ
స్తోమాస్నిగ్ధకరున్ భవద్భవనదాసున్ వాదిగాఁబంపుచో
భూమీభృత్సభనోటమైన అయశంబుల్ మీకు గాకుండునే?" (ఆ.మా.ని.౯౦)

ఇట్లా సంశయించి కలగుండుపడిన విష్ణుచిత్తుడు పాండ్యసభలోని వాదోప వాదాల్లో గెలిచి విజయధ్వజంతో ఊరేగుతూ రాగలిగాడు. ఎట్లా రాగలిగాడు?

ఆనాటి సభలో విష్ణుచిత్తుని వాద వైశిష్ట్యము రాయలవారు ఒక శార్దూల వృత్తములో అద్భుతంగా వర్ణించాడు. ఇదీ ఆయన కవితాశిల్పానికి నిదర్శనమే.

"అర్థావాగ్విబుధం, బహూవచన కవ్యాహార, మాహావచ
స్సిద్ధం బాఃకృతతాం గతఃకలి రీతి శ్రీసూక్తి విద్యాధరం
బిద్ధొద్ధత్యమగాల్లయంహికుధియామిత్యున్నద తిన్నరం
బద్ధీరాగ్రణి గెల్పుటుత్సవమునందయ్యెన్నభంబంతయున్" (ఆ.మా.౪౯)

దీని తరువాత యామునాచార్య చరిత్రము విశిష్ట కథా కథ శిల్పములో కొనసాగుతోంది. అది కూడా వైష్ణవ ప్రతిపత్తికి ప్రబల సాధనంగా కొనసాగుతోంది.

ఇదంతా ఇట్లా ఉండగా విష్ణుచిత్తుడు పెంచి పెద్ద చేస్తున్న గోదాదేవిలో కన్యాత్వ లక్షణాలు ప్రకోపింపగా ఆమె విచిత్రమైన తనుగానికి గురి అయింది. విష్ణుచిత్తుని

ధర్మపత్ని కూడా తమ బిడ్డ తను గాని లక్షణాలు గుర్తించింది. నవ వయస్సీధుమదము, ఒదవెడు జవ్వనంబు వల్ల కలుగుతున్న మార్పులు తల్లిదండ్రులు గుర్తించారు. గోదాదేవి భూదేవి రూపాంతరమైన ఆండాళమ్మ. తమిళంలో 'చూడిక్కుదుత్తాళ్' అంటారు. ఈమె తన తండ్రి పూదోటలోని పూలుకోసి దండ కట్టుకొని అది తన కొప్పులో పెట్టుకొనేది. ఆ కొప్పులోని పూదండనే తీసి దానినే విష్ణుభగవానునకు సమర్పిస్తుండేది. ఈ కారణం వల్లనే ఈమెకు ఆముక్తమాల్యద అనే నామం సుస్థిరమైంది. కృష్ణదేవరాయలు కూడా ఈ పేరునకే ప్రాధాన్యమిచ్చి ప్రబంధ నామం ఆముక్తమాల్యదగానే ప్రవచించాడు.

ఇంతకు గోదాదేవికి యౌవన ప్రభావం వల్ల కలిగిన తనుగానిని గూర్చి విష్ణుచిత్తుడు ఖిన్నుడై విలుపుత్తూరు గుడిలోని స్వామికి విన్నవించుకొన్నాడు. స్వామి చిఱునవ్వు చిందిస్తూ విష్ణుచిత్తునకు చెప్పిన విశిష్ట కథయే మాలదాసరి కథ. అంటే సాక్షాద్విష్ణుభగవానుడే చెప్పిన కథ. ఆ దాసరి పరమ విష్ణుభక్తుడు. అతడు తన నివాసమునకు మూడు యోజనాల దూరంలో ఉన్న కురుంగుడి గ్రామానికి అనునిత్యం వెళుతూ బ్రాహ్మీవేళల్లో మంగళకైశికితో స్వామిని స్తోత్రం చేస్తుంటాడు. ఆ స్తోత్ర ఫలమే అతనిని నమిలి మ్రింగబోయిన బ్రహ్మరాక్షసుని కూడా శాపవిముక్తుణ్ణి చేసి విష్ణుభక్తుడైన సోమశర్మగా స్వస్వరూపం ప్రసాదించింది. ఈ కథ పరమార్థం గ్రహించిన విష్ణుచిత్తుడు తన కూతురు గోదాదేవి భక్తి ప్రపత్తియే ఆమెను ఊరడించి సత్ఫలం ప్రసాదిస్తుందని గ్రహించాడు.

గోదాదేవి శ్రీరంగంలో రంగనాథస్వామిని సేవించటం ప్రారంభించింది. రంగనాథుడు గోదాదేవి సేవలకు ముగ్ధుడై ఆమెను వివాహం చేసుకోవాలని నిశ్చయించుకొన్నాడు. సరస్వతీ బ్రహ్మలకు, గౌరీరుద్రులకు తన సంకల్పం తెలిపి వారిని విష్ణు చిత్తునొద్దకు పంపి గోదాదేవితో తన వివాహమును నిశ్చయించుకొన్నాడు.

శ్రీవిలిపుత్తూరున విశ్వకర్మ మణిమయంబుగా గట్టిన విడిదిపట్టున రంగనాథుని పెండ్లివారందఱు విడిది చేశారు. విష్ణుచిత్త దంపతులు గోదాదేవిని పెండ్లికూతురుగా నలంకరించి మహానందంతో ఆమె పెండ్లి రంగనాథునితో జరిపారు. పెండ్లి సంబరం విశ్వవిశ్వంభరమై వెలుగులు నింపింది.

ఆముక్తమాల్యద కృతార్థమైంది.

కావ్యకర్త కృష్ణదేవరాయలు కృతార్థుడైనాడు.

సాహితీ సమరాంగణ సార్వభౌముడు జగద్విఖ్యాతుడైనాడు. భువన విజయం సార్థకమైంది. భువన విజయాభ్యసం సద్భవనస్థిత సింహపీఠి బ్రాజ్ఞులగోష్ఠిన్
కవితామధురిమడెందుముదవులన్ కొలువుండె సదయతన్ నృపుడపుడున్.

రాజకవి అయిన శ్రీకృష్ణదేవరాయలు ఆముక్తమాల్యదను ఛందస్సౌందర్యంతో, శబ్దసుభగత్వంతో కథాకథన నైపుణ్యంతో – కవితాశిల్ప సమన్వితంగా తీర్చిదిద్దాడు.

ఆదర్శప్రాయంగా ఉన్న 'ఆముక్తమాల్యద'లో ఆ శిల్ప సౌందర్యాన్ని దర్శించి, సహృదయ కవిలోకం ఆనందతుందిలమౌతుంది. శ్రీకృష్ణదేవరాయల పట్టాభిషేక పంచశత వార్షికోత్సవానికిదే ప్రత్యక్ష నిదర్శనం.

●

ఆధునిక భారతీయ సాహిత్యం - పునరుజ్జీవన విశేషాలు

◆ డా॥ ఎన్. గోపి

భారతదేశం ఒక సంకీర్ణమైన దేశం (Complex Country), వైవిధ్యభరిత మైనది. దీనిని అర్థం చేసుకోవడం అంత సులభం కాదు. భిన్న భాషలు, భిన్న సంప్రదాయాలు, వీటికి కారణభూతమైన భౌగోళిక ప్రత్యేకతలు వంటివాటిని జాగ్రత్తగా అధ్యయనం చెయ్యవలసి ఉంటుంది. అట్లా చేసినప్పుడు ఈ దేశమంతటికీ ఒకే రకమైన ఆంతరిక తాత్వికధార, ఒకే రకమైన భాషా, సాహిత్య చలనచాలన విలక్షణతలు కనిపిస్తాయి. బ్రిటిష్‌వాడు ఈ దేశాన్ని రెండు వందలేండ్లు పరిపాలించి దీనిలో కొన్ని కొన్ని ఉదారభావాలను ప్రవేశపెట్టగలిగారు. ఆంగ్లభాషా సాహిత్యాల ప్రభావంతో స్వదేశీ భాషలు కొత్త స్ఫూర్తిని సంతరించుకున్నాయనడంలో సందేహంలేదు. కొండల్లో, కోనల్లో, నదీ తీరాల్లో జీవిస్తున్న భాషలకు ఇంగ్లీషు కొత్త కిటికీలను తెరిచి విశాల ప్రపంచంలోకి చూపులు ప్రసరించేట్టు చేసింది.

గత దశాబ్ద కాలంగా నేను వివిధ ప్రాంతాల్లో సంచరిస్తూ తెలుసుకున్న విషయాలను, సమాచారాన్ని మీ ముందుంచాలనుకుంటున్నాను. దాదాపు ఈ భాషలన్నింటిలోకి నా రచనలు అనువాదమైనాయి. కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారం లభించిన 'కాలాన్ని నిద్రపోనివ్వను' అనే నా కవితా సంపుటి ఇప్పటికి 16 భాషల్లోకి అనువదించబడింది. త్వరలో మిగతా 8 భాషల్లో కూడా వస్తుంది. ఆయా భాషల్లో నిష్ణాతులైన అగ్రశ్రేణి సాహితీవేత్తలు వాటిని అనువాదం చేశారు. వాటన్నింటిని సాహిత్య అకాడమీ ప్రచురించింది. అట్లాగే నేను రచించిన 'జలగీతం' అనే దీర్ఘకవిత 9 భాషల్లోకి వెళ్ళటం, నానీలు 8 భాషల్లో అనూదితం కావడం వంటి అనుభవాల వల్ల నాకు ఆయా భారతీయ భాషల్లో కొంత పరిచయం ఏర్పడింది. ఆ పరిజ్ఞాన్ని, సమాచారాన్ని మన తెలుగువారికి చెప్పాలనే ఉద్దేశంతో నేనీ ఉపన్యాస వ్యాసం

తయారుచేశాను. దీనివల్ల ఇంత పెద్ద దేశంలో మనమెక్కడున్నామో మనకు కొంత తెలుస్తుందని నా భావన.

మహాకవి, గురువర్యులు, డా॥ సి. నారాయణరెడ్డిగారి సారథ్యంలో నడుస్తున్న ఆంధ్ర సారస్వత పరిషత్ ఇవాళ 'డా॥ అంజిరెడ్డి సాహిత్య పురస్కారాన్ని' నాకు ఇవ్వాలనుకున్నందుకు దానినెంతో గౌరవంగా భావిస్తున్నాను. నిత్య విద్యార్థిగా ఉండాలనుకునే నా ప్రవృత్తికి ఇదెంతో ఉత్సాహకరంగా ఉందనికూడా నేను భావిస్తున్నాను.

ఆధునికత - ఒక సందర్భం

ఆధునికం, ఆధునికత, ఆధునికీకరణ అనేవి కేవలం కాలానికే సంబంధించిన మాటలు కాదు. అవి చారిత్రక అనుభవానికి సంబంధించినవి కూడా. 21వ శతాబ్దం 20వ శతాబ్దానికంటే ఆధునికమైనది అంటే సరిపోదు. ఆధునిక అనేది సాధారణమైన మాట కాదు. కాలాన్నిబట్టే అయితే 'ఆధునికోత్తర (Post-modern) అనే మాట కూడా సరికాదు. రెండు భిన్న సందర్భాలను వేరుచేసి 'ఇక్కడికిది' అంటూ కాగితాన్ని బ్లేడుతో కోసినట్టు చూపడం కూడా సాధ్యంకాని పని. ఒకరకంగా చూస్తే కాలం అవిచ్ఛిన్నమైనది. ఆయా కాలాల్లో ఆయా శక్తుల ప్రాబల్యాలను బట్టి పేర్లు ఏర్పడుతుంటాయి. ఈ దృష్టితో ఆలోచిస్తే పై మాటలు బహుగర్భితమైనవి. కొత్త విలువల్తో నిండి ఉంటాయి. కొత్త దృక్కోణాలు, కొత్త ఆలోచనలు, కొత్త ఆశయాలతో మొలకెత్తే గుణం కలిగి ఉంటాయి. అవి గతంలోని భావధారలకన్నా ప్రగతిశీలంగా ఉంటాయి. కాబట్టి ఆధునికత అనే భావనను కాలవాచి అనడం ఉపరితల పార్శ్వం దగ్గరే ఆగిపోవడం లాంటిది.

అట్లాగే సమకాలీనత, పునరుజ్జీవనం అనే మాటలు కూడా అలవోకగా పుట్టుకొచ్చినవి కాదు. పునరుజ్జీవనం అంటే మళ్ళీ పుట్టడం అని వొట్టి అర్థం చెప్పి ఊరుకోలేం. అది ప్రత్యేక సందర్భంలో పుట్టిన మాట. 14వ శతాబ్దంలో యూరోప్‌లో ప్రారంభమైన సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, విద్యావిషయకమైన పెను మార్పులకు కారణమైన సరికొత్త ఆలోచనలను పునరుజ్జీవనమంటున్నారు.

సమకాలీనం అంటే 'ఇప్పుడున్నది, ఇవాళ జరుగుతున్నది, గతం కానిది' అని అర్థాలు. గతం అంటే ఇటీవలిది కావచ్చు. దశాబ్దాల క్రితం అని కూడా కావచ్చు.

సందర్భాన్ని బట్టి ఆధునికత దానిలో అంతర్లీనంగా కూడా ఉండొచ్చు. కాని సమకాలికానికి అసలర్థం కాలికమే. అయితే కొన్ని గ్రంథాలు ఎప్పటికీ పాతబడవు. అవి సార్వకాలికలు. ఉదాహరణకు అభిజ్ఞానశాకుంతలం. వేమన పద్యాలవంటి వాటికి ఇప్పటికీ ప్రాసంగికత ఉంది. ఆ మాటకొస్తే రామాయణ మహాభారతాలు కూడా ఎప్పటికీ గతార్థం కాని వర్తమానాలుగానే నిలుస్తాయి.

ఒకప్పుడు ఆధునికత అంటే పశ్చిమదేశాల విలువల్తో మిళితమై ఉండేదని అర్థం. కాని ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న ఇండియాలాంటి దేశాల్లో ఆధునికత అంటే ఆ దేశాల పారిశ్రామికీకరణ అనే. అయితే ఆధునికత అనే పెద్దమాటలో పారిశ్రామికత అనేది ఒక అంశం మాత్రమే. అంతేకాదు. భారతదేశ సందర్భంలో ఆధునికత అనేది ఆకాశం నుండి ఊడిపడదు. తరతరాలుగా తనకంటూ ఒక గొప్ప సంప్రదాయం, విలువల సంపుటి, ఆశయాలు, భావనా చిత్రాలు, ప్రతీకలు, పురా గాథలు, ప్రవర్తనా నియమావళి, విశిష్టమైన అభివ్యక్తి ఉన్నాయి. మన ఆధునికత వీటి విధ్వంసంపైన మొలిచే మొక్క కాదు. 'కొత్త పాతల మేలికలయికే' మన పద్ధతి.

ఆధునికత అనేది అన్నిరంగాల్లో ఒకే అర్థంలో ఉంటుందని చెప్పలేం. సాహిత్యంలో ఉండే అర్థానికీ, మతపరంగా చెప్పే అర్థానికీ, కళలకు సంబంధించి కలిగే అర్థానికీ తేడా ఉండొచ్చు. పశ్చిమ దేశాల్లో బైబిల్‌ను కొత్త పద్ధతుల్లో అధ్యయనం చెయ్యడం మతపరమైన ఆధునికత, ఆ రోజుల్లో ఛాందసానికి ఆధునిక చిత్రకళ (Modern Art) లో అమూర్తమైన అభివ్యక్తి (Abstract expressionism) క్యూబిజం, ఇంప్రెషనిజం వంటివి పుట్టుకొచ్చాయి.

ఇక సాహిత్యం విషయానికొస్తే 19వ శతాబ్దం ద్వితీయార్థంలో ఇండియాలోని సాంఘిక, రాజకీయ మార్పులకు కారణమైన ఇంగ్లీషు విద్యను గమనించవలసి వుంది. అప్పుడు ఇంగ్లీషు ప్రభావం వల్ల ఒక కొత్తరకమైన సాహిత్య సృజన మొదలైందని తెలుస్తుంది. వస్తువులోగాని, రూపంలోగాని వినూత్న ధోరణులు అంకురించాయని కూడా అర్థమౌతుంది. ఇది అన్ని ప్రధానమైన భాషల్లో జరిగింది. ఆంగ్ల సాహిత్యంలోని ముఖ్యరచనలు ఇక్కడి రచయితలను ప్రభావితం చెయ్యడం మొదలుపెట్టాయి. ఒకరకమైన సమ్మేళనం (blend) తో సాహిత్యం వెలువడసాగింది. ఆ సందర్భంలో పాశ్చాత్య సాహిత్య భావాల అనుసరణే ఆధునికతగా పరిగణింపబడేది. అప్పటివరకు

గల మన సంప్రదాయ సాహిత్యం భావధోరణిలోగాని, అభివ్యక్తి సరణిలోగాని చాలావరకు దీనికి భిన్నమైంది. అయితే ఒకటి. ఇక్కడ జరిగింది అనుసరణేకాని అనుకరణ కాదు. నవల, కథానిక, జీవితచరిత్ర, గద్యనాటకం, లేఖా సాహిత్యం, వ్యాసం, గీతం వంటివి ఆంగ్ల సాహిత్యకవాటం తెరుచుకోగా ప్రసరించిన కొత్త వెలుగులే. కాని అప్పటికి మనకెంత గొప్ప కవిత్వ సంప్రదాయమున్నా గద్య ప్రక్రియ మాత్రం వృద్ధి చెందలేదు. అయితే వచనం కవిత్వేతర ప్రక్రియలకు వాడబడటం మాత్రం ఈ కాలంలోనే జరిగింది. సాహిత్యపరంగా పునరుజ్జీవనమంటే ఇదే. ఈ పునరుజ్జీవన ప్రక్రియే భారతీయ సాహిత్య సన్నివేశంలో ఆధునికతకు వైతాళికత్వం వహించిందని చెప్పవచ్చు.

ఇండియన్ ఇంగ్లీషు

ఇంగ్లీషు మన భాష కాకపోయినా మనవాళ్ళు కొందరు నేరుగా ఆ భాషలో రాయటం మొదలుపెట్టారు. దానికి చారిత్రక కారణాలున్నాయి. ఇది చాలాకాలం ఉన్నత విద్యలో మాధ్యమంగా, పాలనా భాషగా ఉండడం వల్ల బాహ్య ప్రపంచానికీ, మనకూ మధ్య ఓ కిటికీలాగా ఏర్పడింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా చాలాకాలం ఇంగ్లీషు అధికారభాషగా, దేశీయ అంతర్జాతీయ భాషల మధ్య అనుసంధాన భాషగా ఉంది. అంతేకాకుండా స్థానిక రాజకీయ సంక్లిష్టతలో దాని తాటస్థ్య స్వభావం అదనపు ప్రయోజనంగా పనికొచ్చింది. కాబట్టి ఇండియాలో రెండు శతాబ్దాలకు పైగా ఒక రకమైన ఇండియన్ ఇంగ్లీషు ఏర్పడింది. మన భారతీయాంగ్ల రచయితలు చక్కని ఇంగ్లీషు వచనం రాసి బ్రిటిషు ఆంగ్ల రచయితల మన్ననలు పొందారు. ఆధునికత అనే భావన బెంగాలీ, మరాఠీ భాషా సాహిత్యాల్లోకి రాకమునుపే ఇండియన్ ఇంగ్లీషు రచనలు వేళ్ళూనుకోవడం గమనార్హం. ఒక రకంగా ఇండియన్ ఇంగ్లీషు భారతీయ భాషల పునరుజ్జీవనానికి ఒక వాతావరణాన్ని సృష్టించిందని చెప్పవచ్చు.

సంస్కృతం

పునరుజ్జీవ ప్రయత్నాలు సంస్కృతాన్ని ఏ మేరకు స్పృశించగలిగాయో చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. భారతీయ భాషా సాంస్కృతిక సందర్భాల్లో దీనిది విశిష్టమైన స్థానం. ఇది ప్రపంచంలోనే అతి ప్రాచీనమైన భాష. అంతేకాకుండా ఇది మన సంస్కృతిలో పోషించిన పాత్ర అమోఘమైంది. సంస్కృతం భారతీయ వారసత్వ సంపదకు

తాళం చెవిలాంటిది. అయితే 10వ శతాబ్దం తర్వాత దేశీయ భాషలు అభివృద్ధి చెందే క్రమంలో ఇది తన పూర్వ వైభవాన్ని కోల్పోయింది. ముఖ్యంగా ఆంగ్లేయ పరిపాలనలో ఇంగ్లీషు ప్రాబల్యం, తదితర కారణాల వల్ల పండితమండలికే పరిమితమైపోయింది. కాని సంస్కృతం సామాన్యుల నిత్యవ్యవహారంలో లేనప్పటికీ ఇతర దేశీయ భాషల వికాసానికదే మూలాధారమయ్యింది. ఒక్కమాటలో చెప్పాలంటే సంస్కృతం భారతీయం అనే దానికి సూక్ష్మరూపంగా భావించబడింది. భారత స్వాతంత్ర్యం, దాని అనంతర ఘటనలవల్ల ఆనాటి నేతలు, మేధావుల్లో సంస్కృతం పట్ల పునరాలోచన మొదలైంది.

సంస్కృతం మరణించలేదనీ, దానిది సుప్తావస్థ మాత్రమేనని ఆనాడు భావించారు. ఆ మాటకొస్తే ఇండియాలో అధికార భాషగా ఉండే స్థాయి దానికుందని వాదించారు. అంతే! సంస్కృతానికి ప్రాధాన్యం పెరిగింది. విద్యాసంస్థల్లో దాని అధ్యయనానికి దారులు పడ్డాయి. రచయితలు ఆధునిక అభివ్యక్తికి సంస్కృతాన్ని వాడడం ప్రారంభించారు. అయితే దాని నిర్మాణ క్లిష్టత వల్లా, సాంప్రదాయిక భారం వల్లా దానికి పునరుజ్జీవనం పూర్తిగా సాధ్యం కాలేదనే చెప్పాలి.

సంస్కృతం ఒక రకంగా వారసత్వ భాష. సూత్రబద్ధమైన వ్యాకరణంతో, ఉల్లంఘించరాని ఛందస్సుతో సంస్కృతం సామాన్య ప్రజలకు దూరమౌతుంటే, దేశీయ భాషలు దానికి రుణపడిపోతూనే ప్రజల ఆకాంక్షలకూ, అభిరుచులకూ అనుగుణమైన సాహిత్యాన్ని సృష్టిస్తూ వారికి దగ్గరైనాయి. సంస్కృతం క్రమంగా పాండిత్యానికి చిహ్నమైపోయింది.

కాబట్టి పునరుజ్జీవనమనేది సంస్కృతానికి సంబంధించిన మాట కాదు. అయినప్పటికీ పండితులు వచనాన్ని గుర్తించక తప్పలేదు. వ్యాసం, జీవిత చరిత్ర, కథానిక, నాటకం లాంటివాటిని అనుసరించక తప్పలేదు. నవలను 'సరళ' పేరిట హరిదాస సిద్ధాంతవాగీలా అనే ఆయన 19వ శతాబ్దం చివరి దశాబ్దంలో వెలువరించాడు. దానికి బంకించంద్రుని నవల ప్రేరణ. అలాగే బెంగాలీ, ఇంగ్లీషుల నుంచి అనువాదాలు కూడా సంస్కృతంలోకి వచ్చాయి.

తెలుగు

ముందే తెలుగు గురించి చెప్పడానికి తార్కికమైన కారణం ఏమీ లేదు గాని, ఇతర భాషలతో తులనకు సౌకర్యంగా ఉంటుందని నా ఉద్దేశం. తెలుగు భాషకు

వెయ్యి సంవత్సరాల సాహిత్య చరిత్ర ఉంది. ఇది సంస్కృతాన్ని పుక్కిటబట్టిన ద్రావిడ భాషా కుటుంబానికి చెందినది. తెలుగు లయాత్మకమైన కవితా రచనకు పెట్టింది పేరు. అయితే వచన సాహిత్య రచనలో తన సత్తాను నిరూపించుకున్నది మాత్రం 19వ శతాబ్దం ద్వితీయార్థంలోనే. దీనికి తెలుగులోని ఆధునికత ఇద్దరు మహోన్నత సారస్వతమూర్తులకు రుణపడి ఉంది. వారిలో మొదటివారు కందుకూరి వీరేశలింగం పంతులు (1848-1919) అయితే రెండోవారు గురజాడ అప్పారావు (1862-1915). వయస్సులో కందుకూరి గురజాడ కన్నా పధ్నాలుగేళ్ళు పెద్దవారే కాని ఇద్దరూ సమకాలికులనేది గమనార్హం. ఇద్దరు కూడా సాహిత్యాన్ని సామాజిక న్యాయానికి సాధనంగా మలిచారు. సాంఘిక దురాచారాల పట్ల పాఠకులను జాగృతపరిచారు.

వీరేశలింగం నవల, వ్యాసం, ప్రహసనం, సాహిత్య విమర్శ, స్వీయచరిత్ర వంటి గద్యరూపాలను తెలుగులో మొదటిసారి రచించి పరిచయంలోకి తెచ్చారు. వీటిలో కవుల చరిత్ర (1886, 1917), స్వీయచరిత్రము (1910, 1915) అనేవి అత్యంతప్రముఖమైనవి. ఈయన రచించిన 'రాజశేఖర చరిత్రము' (1878) తెలుగులో తొలి నవల.

గురజాడ అప్పారావును చాలామంది విమర్శకులు యుగకర్తగా భావించారు గాని రాయప్రోలు సుబ్బారావుకు కూడా (1892-1984) ఆయన పక్కన చోటు లభించింది. డా. సి. నారాయణరెడ్డిగారు తమ 'ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు: ప్రయోగములు' అనే సిద్ధాంత గ్రంథంలో ఆ విషయాన్ని ఈ విధంగా నిర్ధారించారు.

"రచనల నవ్యతను బట్టి, వాని ప్రచురణ కాలమును బట్టి, తరువాతి కాలమున వాని ప్రభావమును బట్టి యుగకర్తృత్వము నిర్ణయించవలసి యుండును. ఈ దృష్టితో పరిశీలించినచో ఇరువురి రచనలు నవ్యతా నిర్భరములే. వస్తు భావ రచనలో ఇరువురు క్రొత్త బాటలు తీసినవారే. ఇక ప్రచురణ విషయము. ఇది రెండు విధములుగా నుండును ఒకటి: పత్రికాముఖమున; రెండవది: పుస్తక రూపమున. (పుట. 181) గురజాడ పాత ఛందస్సులను నిరాకరించి జానపద బాణీలను అవలంబించారు. ఆయన రచించిన కొత్తరకం గేయాలు 'ముత్యాలసరాలు'గా ప్రసిద్ధికెక్కాయి. ఆయన

స్వీకరించిన వస్తువులు, అనుసరించిన నుడికారం సామాన్య జనబాహుళ్యానికి సన్నిహితమైనవి. అయితే గురజాడ, రాయప్రోలు కూడా పాఠకుల్లో దేశభక్తి భావాలను రేకెత్తించారు. రాయప్రోలు రచించిన లలిత (1909), తృణకంకణం (1913) వంటి ఖండకావ్యాలు ఆధునిక భావాలకెత్తిన మణిపతాకలు.

సారాంశమేమంటే తెలుగులో పునరుజ్జీవనం 1875లో ప్రారంభమై క్రమంగా పరిణత దశకు చేరుకుందని చెప్పవచ్చు.

తమిళం

భారతదేశంలోని భాషలు ప్రధానంగా రెండు పెద్ద భాషా కుటుంబాలకు చెంది ఉన్నాయి. వాటిలో ఇండో ఆర్యన్ కుటుంబం మొదటిదైతే ద్రావిడ భాషా కుటుంబం రెండోది. నిర్మాణంలో ఈ రెండింటికి తేడా ఉంది. ఇండో ఆర్యన్ భాషలు ప్రత్యయాత్మక భాషలు (inflexional) (ప్రాతిపదికకు ప్రత్యయం చేరితేనే పదం) ద్రావిడ భాషలేమో ప్రతిపదాత్మక భాషలు (Agglitinative) (పదం పక్కన పదం చేరడం) సునీతికుమార్ ఛటర్జీ, వరదరాజన్ లాంటి పండితులు ఒకప్పుడు ద్రావిడ భాషలు భారతదేశమంతటా వ్యవహారంలో ఉండేవని భావించారు. ఇప్పటికీ ఉత్తరాదిన కొలామీ, పర్జీ, గోండీ, బ్రాహుయీ లాంటి భాషలు అక్కడక్కడ కనబడుతున్నాయి. అయితే దక్షిణాదిన ఓ నాలుగు నాగరిక భాషలుగా స్థిరపడ్డాయి. అవి తమిళం, కన్నడం, తెలుగు, మలయాళం. వీటిలో తమిళం, సంస్కృతం తర్వాత అతి ప్రాచీనమైన భాష. ఇది రెండు వేల సంవత్సరాల ప్రాచీనమైన భాష (Classical), అయితే తమిళం, ప్రాచీన మరియు ఆధునిక భాష కూడా (Classical & Modern). తమిళంపైన సంస్కృత ప్రభావం అంతంత మాత్రమే అనే విషయం గమనార్హం. కాని మిగతా ద్రావిడ భాషలైన తెలుగు, కన్నడం, మలయాళంలు ధ్వనిశాస్త్రంలో (Phonology)గాని పదజాలంలోగాని సంస్కృతంతో ఎక్కువ ప్రభావితమైనాయి. తమిళంలో సంస్కృత ప్రాబల్యం పట్ల ప్రతిఘటన వాతావరణం కూడా వుంది.

తమిళంలో 19వ శతాబ్దం అర్ధభాగానికే అంటే తెలుగుకన్నా ఓ పాతికేళ్ళు ముందుగా ఆధునిక తొలిరేకలు పొడసూపాయి. రామలింగ అడికల్ (1823–74), గోపాలకృష్ణ భారతీయార్ (1850), సుందరం పిళ్ళై (1855–97), వీరి రచనలు

దానికి తార్కాణం. సుబ్రహ్మణ్య భారతి (1882–1921) దగ్గరికి వచ్చేసరికి ఆధునికత పూర్తిగా వికసించింది. అయితే, కవిత్వంలో మాత్రమే. వచనంలోనైతే వేదనాయకం పిళ్ళైని (1824–89) చెప్పుకోవచ్చు.

సుబ్రహ్మణ్యభారతి గతానికి భిన్నంగా సామాన్యుడిని పట్టించుకున్నాడు. తమిళులకు ఆయనది కొత్త గొంతుగా తోచింది. ఆయన మాతృభాషాభిమానాన్ని, జాతీయతను కొనియాడాడు. ఆయన కవితల్లో గురజాడలోలాగే జానపద ధోరణులు పరిమళించాయి. మొదట ఆయన రచించిన దేశభక్తి గీతాల సంపుటి 1909లో వెలువడింది. భారతి రచించిన 'పాంచాలి శపథం' (1912) పురాణగాథలను కొత్తగా వ్యాఖ్యానించడంలో మార్గదర్శకంగా నిలిచింది. అలాగే ఆయన కువిల్ పట్టు (కోకిల పాటలు 1912) ఎంతో భావనాత్మకంగా ఉంటాయి.

భారతీదాసన్ (1891–1962) సుబ్రహ్మణ్య భారతికి కొనసాగింపుగా కనిపిస్తూ పునఃజాగృతికి నిదర్శనంగా నిలుస్తున్నాడు. తమిళంలో నాస్తిక భావాలను మొట్టమొదటిసారి ప్రవేశపెట్టింది భారతీదాసనే. ఈయన విదేశీ దండయాత్రకు, కులవ్యవస్థకు వ్యతిరేకంగా రచనలు చేశాడు.

తమిళంలో మొదటి నవల 'ప్రతాప ముదలియార్ చరిత్రం' (1879). రచయిత సామ్యూల్ వేదనాయకం పిళ్ళై (1826–89). తమిళ నవల తెలుగు నవల కన్న ఒక సంవత్సరం జూనియర్. తమిళ నవలలో ఒక సుదీర్ఘమైన అసంబద్ధమైన కథ వుంటుంది. ఉత్తమ పురుష కథనంతో సాగుతుంది. ప్రబోధం, వినోదం ఈ నవల యొక్క ఉద్దేశం. ఇది తొలి నవలే అయినా తమిళ నవలా రచనకు మంచి పునాదులు మాత్రం బి.ఆర్. రాజం అయ్యర్ రచించిన "కమలాంబాల్ చరిత్రం (1893), మాధవయ్య రచించిన 'పద్మావతీ చరిత్రం' (1928) లలో పడ్డాయి. అయితే అనంతర కాలంలో నవలా రచనకు ఉత్తేజాన్ని సమకూర్చి ప్రాచుర్యానికి తెచ్చింది మాత్రం కృష్ణమూర్తి 'కల్కి' (1899–1954) అనే రచయిత.

హిందీ

మాట్లాడేవారి సంఖ్యను తీసుకుంటే హిందీ యావత్ ప్రపంచంలోనే మూడోస్థానంలో నిలుస్తుంది. బీహార్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హర్యానా,

హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాంచల్ వంటి ఏడు రాష్ట్రాల్లో ప్రధాన భాషగా ఉండడంతో పాటు భారత జాతీయ వ్యవస్థలో అధికార భాషగా స్థానాన్ని సంపాదించుకుంది. మన జనాభాలో 30శాతం మంది హిందీ మాట్లాడుతున్నారు. మిగతా ఇండో ఆర్యన్ భాషలతో కూడా హిందీకి సన్నిహిత సంబంధముంది. పశ్చిమ, తూర్పు ప్రాంతాలు కలుపుకొని దాని మాండలికాలతోసహా హిందీ ఎక్కువ విస్తీర్ణం గల భూభాగంలో వాడుకలో ఉంది. అయితే ఇప్పటి ఆధునిక హిందీ మాత్రం 18వ శతాబ్దం చివరి భాగంలోనే అభివృద్ధి చెందింది. కడీబోలి అనే హిందీ ముఖ్యంగా ఢిల్లీ-మీరట్ ప్రాంతాలకు చెందిన భాష. దీనిపైన హిందీ, ఉర్దూల వాడుక ఆధారపడి ఉంది. తొలినాళ్ళలో ముస్లింల ప్రభావంతోనే ఇది వృద్ధి చెందింది. ఆ రకంగా తొలి సాహిత్య భాష ఉర్దే. సహజంగా ఉర్దూపైన అరబిక్, పర్షియన్‌ల ప్రభావం ఉంది. సంస్కృతంతో ప్రభావితమైన హిందీ సాహిత్యం ఇటీవలే ప్రాచుర్యానికొచ్చింది. దేశవిభజన తర్వాత మనదేశంలో హిందీ భాషా సాహిత్యాలు పుంజుకున్నాయి. అయితే ఉర్దూ ఇక్కడ కొంత వెనుకబడి పాకిస్తాన్‌లో పుంజుకుంది.

హిందీ భాషకు 19వ శతాబ్దం పూర్వార్థమంతా ఆధునికత కోసం సిద్ధమౌతున్న దశ. 'కడీబోలీ' 1850లో ఓ రూపానికి వచ్చింది. వేగంగా వికాసం చెందుతున్న బెంగాలీ వచనం, దాని హిందీ అనువాదం 'కడీబోలీ' పరిణామాన్ని ప్రభావితం చేసింది. హిందీ సాహిత్య ఉషోదయ వేళ చెప్పుకోదగిన సమున్నత వ్యక్తి భారతేందు హరీశ్చంద్ర (1846-84). అతడు రచించిన 'విద్యాసుందర (1868), మరో 15 నాటకాలు నిలువ నీరులాంటి హిందీ సాహిత్యంలోకి కొత్త గాలులను ప్రసరింపజేశాయి. వాటిలో 'ప్రేమ్‌జోగిని' (1875), రాజకీయ నాటకం 'భారత దుర్దశ' (1876) వంటివి ప్రముఖమైనవి. 1882లో శ్రీనివాసదాస రచించిన 'పరీక్ష గురు' హిందీలో తొలి నవలగా పరిగణించబడినా దానిలో ఆధునిక లక్షణాలు కొన్నే. 19వ శతాబ్దం చివరి సంవత్సరాల్లో ఇటువంటి నవలలు మరికొన్ని వచ్చాయి. అయితే ప్రేమ్‌చంద్ (1880-1936) ఆగమనంతోనే హిందీలో నవలాయుగం ఆరంభమైందని చెప్పవచ్చు. సామాజిక సమస్యలు తీసుకొని రాసిన 'సేవాసదన్' (1919)తో ప్రారంభమై దాదాపు 10 నవలలు రాశాడు ప్రేమ్‌చంద్. వాటిలో 'గోదాన్' శిఖరప్రాయమైనది.

హిందీలో ఆధునిక కవిత్వం మహావీర్‌ప్రసాద్ ద్వివేది (1864–1938)తో ప్రారంభమైందని చెప్పవచ్చు. ఈయన గొప్ప కృతులన్నీ 19వ శతాబ్దం తొలి దశాబ్దంలో కడీబోలీలోనే వెలువడ్డాయి. కడీబోలీని అత్యున్నత స్థాయికి తీసుకెళ్ళిన వారు మాత్రం మైథిలీ శరణ్ గుప్త (1886–1964) జయశంకర్ ప్రసాద్, (1889–1937). 1912లో వెలువడిన గుప్తాగారి 'భారత భారతి' సాహిత్య ప్రపంచంలో పెద్ద సంచలనమే సృష్టించింది. అలాగే జయశంకరప్రసాద్ 'కామాయని' (1936) యావత్ మానవాళికి సంబంధించిన వస్తువుతో, సమర్థమైన నిర్వహణతో వెలువడిన కావ్యంగా పాఠకాదరణ పొందింది. 'కామాయని' రచన హిందీలో కాల్పనిక సాహిత్య రచనకు పరాకాష్టగా భావించబడింది. హిందీలో ఆధునికత 1880లో ప్రారంభమై 20వ శతాబ్దం మూడో దశాబ్దం దాకా కొనసాగింది.

ఉర్దూ

ఒక రకంగా ఉర్దూకి, హిందీకి ఒకే రకమైన వ్యాకరణం ఉంటుందిగాని భాషలుగా దేని ప్రత్యేకత దానిది. ఉర్దూ ఇండియాలో పుట్టిన హింద్వార్యభాష. సాంస్కృతిక సంయోజనం వల్ల ఉద్భవించిన భాష ఉర్దూ. భారీ యెత్తున ఏర్పడిన వలసలు, సైన్యం దండయాత్రలు ఆ సంయోజనానికి కారణమైనాయి. దీని పదజాలం, నుడికారం, సాహిత్య సంప్రదాయం వంటివన్నీ మధ్య ఆసియా భాషలైన టర్కీ, పర్షియన్‌ల నుంచి వచ్చాయి.

ఇండియాలో ఉర్దూను గుజరాతీ, కన్నడ భాషలకన్నా ఎక్కువమంది మాట్లాడుతారు కాని వారంతా అక్కడక్కడ చెదిరిపోయి ఉన్నారు. ఈ కారణం వల్లనే వారికి ఒక ప్రత్యేక రాష్ట్రం నుండి పొందవలసిన పోషణలేదు. జమ్మూకాశ్మీరులలో ఉర్దూకి అధికార భాష హోదా ఉందిగాని ప్రాబల్యం గల భాష కశ్మీరీయే. ఈ పరిమితుల్లోనే స్వాతంత్ర్యానంతర కాలంలో ఉర్దూ సాహిత్యం చెప్పుకోదగినంతగా వర్ధిల్లిందని చెప్పవచ్చు.

19వ శతాబ్ధంలో ఉర్దూ సాహిత్యం ఇస్లామిక్, హిందూ, పాశ్చాత్యం అంటూ మూడు పాయలుగా సాగింది. 1875 తర్వాత ఇస్లామిక్ పాయ మందగించింది. దానికి మలుపునిచ్చినవారు అల్తాఫ్ హుస్సేన్ హాలి (1837–1914), మహమ్మద్ హుస్సేన్ ఆజాద్ అనేవారు (1830–1910).

ఉర్దూలో తొలి నవలపేరు 'మినాతుల్ ఉరుస్' (1869,(The mirror of the bride). దీని రచయిత నజీర్ అహమ్మద్ (1831–1912). తెలుగు నవలకు 9 యేళ్ళు ముందుగా ఇది వెలువడింది. అహమ్మద్‌కు సమకాలికుడైన పండిట్ రతన్‌నాథ్ అనేవాడు 1889లో రచించిన 'ఉమ్రావ్ జాన్ అదా' అనే నవల ఎంతో ప్రసిద్ధికెక్కింది. కుర్రతుల్ ఐర్ హైదర్ రాసిన 'అగ్ కా దరియా' నవలకూడా మిక్కిలి జనాదరణ పొందింది.

ఇక ఉర్దూ సాహిత్య ప్రపంచంలో ఉన్నతోన్నతుడు మహమ్మద్ ఇక్బాల్ (1873–1938). ఇతడు 20వ శతాబ్దంలోనే గొప్పకవి. ఇక్బాల్ పాశ్చాత్యుల సాహిత్యాన్ని కుత్తక బంటిగా ఆస్వాదించినా వారి భౌతికవాద పర్యవసానాలను గురించి మాత్రం హెచ్చరించక మానలేదు.

సింధీ, కశ్మీరి

పర్షియా, అరబిక్ ప్రభావాల దృష్ట్యా సింధీ, కశ్మీరీలను ఉర్దూలతో కలపవచ్చు. సింధీలు ఎక్కువగా ఇండియాలోని పట్టణ ప్రాంతాల్లో వ్యాపించి ఉన్నారు. ముఖ్యంగా గుజరాతీ, మహారాష్ట్ర, రాజస్థాన్, ఢిల్లీలలో ఎక్కువగా వ్యాపించి ఉన్నారు. సింధీకి పర్సో అరబిక్ లిపిని 1853లో అమలుచేశారు. దానికి విశేషమైన ఆదరణ కలిగింది. చారిత్రకంగా కశ్మీరికి అనేక లిపుల్లో లేఖన ప్రయత్నం జరిగింది. శారదా లిపి, దేవనాగరి, రోమన్, పర్సో అరబిక్ ఇలా చివరకు ఒకేవర్ణపు వివిధ ధ్వని భేదాలను సూచించే అదనపు చిహ్నాలతో పర్సో అరబిక్ లిపి స్థిరపడింది. దీనివల్ల ముద్రణలో కొన్ని ఆటంకాలు ఏర్పడ్డాయి.

సింధీలో 1885కు ముందే ఆధునిక ఉషోదయ రేకలు పొడసూపాయి. సింధీలో పునరుజ్జీవనం కవిత్వం కంటే వచనం ద్వారా ముందు జరిగింది. వ్యాసరచయితలు, పాఠ్యగ్రంథ రచయితలు అయిన కౌరోమత్‌ఖిల్ నాని (1844–1914) మిర్జా ఖాలిబ్ బేగ్ (1853–1929), దయారాం గిడుమల్ (1857–1927) సింధీలో వచన ప్రక్రియను సుసంపన్నం చేశారు. వీరిలో బేగ్ పరిమాణంలో గాని ప్రక్రియా వైవిధ్యంలోగాని అగ్రేసరుడు. ఇతనికి 'పుస్తక యంత్రం' (Book machine) అని పేరొచ్చింది. 300 పుస్తకాలు రచించాడు. అతని మొదటి నవల 'దిల్ ఆరామ్'

(Comfort of the heart) 1888లో అచ్చయింది. దీనిలో అంతా రాజుల గొడవే. అతనిదే రెండో నవల జీనత్ (Zinat). 1890 ఇది సింధీలోని తొలి ఆదునిక నవలగా గణనకెక్కింది. బేగ్ నాటక ప్రక్రియకు చేసిన సేవ కూడా (1885-1910) పేర్కొనదగినది. కాని సింధీ నాటక రంగంలో జపజీసాహెబ్ రచించిన గిడుమల్ (1891)ది పెద్ద పేరు.

కవిత్వంలో సంప్రదాయ ప్రీతి కలిగిన సింధీ 1910 తర్వాతనే ఆధునిక ధోరణులను అంగీకరించింది. అప్పటినుంచి దేశభక్తి, వాస్తవికతలకు సంబంధించిన రచనలు వెలువడజొచ్చాయి.

కాశ్మీర్‌లో ఆధునిక యుగం మహజోర్‌తో ప్రారంభమయ్యింది. మహాకవి ఇక్బాల్ సలహాతో ఉర్దూ, పర్షియన్‌లను వదిలేసి మాతృభాష అయిన కశ్మీరీ వైపు మళ్ళాడు. అతడు రచించిన 'పల్లెపిల్ల' (1936) భావకవిత్వ కావ్యం. మహజోర్ గజళ్ళు తాజాగా, మజాగా ఉండేవి. భారతీయ సందర్భంలో మారుతున్న దృక్కోణాలు షిక్వా ఎ ఇబ్లిస్ (Satan's Plant) లోయెల్ త ఘటజార్ (Love and intellect) అనే గ్రంథాల్లో ప్రతిఫలించాయి.

తర్వాత జిందాకౌల్ మాస్టర్జీ (1886-1966) అనే కవి కశ్మీరీ కవిత్వాన్ని ఉన్నత శిఖరాలకు తీసికెళ్ళాడు. ఇరవయ్యవ శతాబ్దపు రెండవ, మూడవ దశాబ్దాల్లో కశ్మీరీ కవిత్వంలో ఆధునిక తాజా పవనాలు వీచాయి.

కశ్మీరీ వచన రచన చాలా ఆలస్యంగా ఈ మధ్యనే మొదలైంది. వచన రచయితల్లో అఖ్తర్ మొహియుద్దీన్ (1928), మహమ్మద్ అమీన్ కామిల్ (1924), అలీ మహమ్మద్‌లోన్ (1926) ముఖ్యులు. 1957లో వీరు ఒక్కొక్కరు ఒక్కో నవల రాశారు. ఇది ప్రారంభం మాత్రమే. అయితే అవి గొప్ప నవలలేమీ కావు. ఇప్పటికీ కాశ్మీర్‌లో దినపత్రికలు, వారపత్రికలు లేకపోవడం వల్ల కశ్మీరీ సాహిత్యంలో క్రమవికాసం కరువైంది.

బెంగాలీ

పశ్చిమ భారతదేశంలోని ముఖ్యభాషలు మరాఠీ, గుజరాతీ, పంజాబీలైతే తూర్పున అస్సామీ, బెంగాలీ, ఒరియా భాషలు ప్రాబల్యం వహించాయి. అయితే వీటి

వికాసమంతా క్రీ.శ. 1000 తర్వాతే జరిగింది. మరాఠీ, గుజరాతీలు కొంత ముందుగా వికసించాయి. అనేక కారణాలవల్ల బెంగాలీ ఎక్కువ ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ముఖ్యంగా క్రీ.శ. 1800 తర్వాత, బెంగాల్‌లో ఆధునికత ఆవిర్భవించడానికి రాజారామమోహనరాయ్(1772-1883) మూలపురుషుడు. కలకత్తాలో ఫోర్ట్ విలియమ్ కాలేజీ స్థాపన (1800)తోనే బెంగాల్‌లో కొత్త తరానికి అంకురార్పణ జరిగింది. సిరాంపూర్‌లో బాప్టిస్ట్ మిషన్ ప్రెస్ స్థాపన కూడా కొత్త వెలుగులు ప్రసరించడానికి మరో కారణమైంది. అలాగే 1817లో హిందూ కాలేజీ స్థాపన వల్ల పర్షియన్ స్థానంలో ఇంగ్లీషును పెట్టడం ఓ మైలురాయిగా నిలిచింది. ఆంగ్ల విద్య, ఐరోపా సాహిత్య పరిచయం బెంగాల్‌లో ఒక కొత్త జాగృతికి కవాటాలు తెరిచింది. ఫలితంగా మైఖేల్ మధుసూదనదత్తు (1824-73), బంకించంద్రఛటర్జీ (1938-94), రవీంద్రనాథ్ ఠాగూర్ (1861-1941) శరత్‌చంద్ర ఛటర్జీ (1876-1938) వంటి దిగ్గంతులు ఆవిర్భవించారు. భారతీయ పునరుజ్జీవనదశలో ఠాగూర్ ఒక గొప్ప సృజనాత్మక శక్తిగా నిలిచాడు. పై నలుగురు విశాల భారతావనిలోని రచయితలెందరినో ప్రభావితం చేశారు. నిజానికి 19వ శతాబ్దంలోని బెంగాలీ సాహిత్యం భారతీయ సాహిత్యంలోనికి పాశ్చాత్య భావాలు, వ్యక్తీకరణాలు ప్రవేశించడానికి ఉత్ప్రేరకంగా పనిచేసింది. ఈ ప్రభావం ఓ శతాబ్దం దాకా రాజ్యమేలింది.

ఆధునిక భారతీయ సాహిత్య యుగాన్ని 1850-1975 మధ్యకాలంగా గుర్తించవచ్చు. అంతకుముందే ఉషోదయ రేఖలు కనపడ్డా పూర్తి వికసనం మాత్రం 19వ శతాబ్దం ఉత్తరార్ధం నుంచే అని చెప్పాలి. ఫలానా గ్రంథంతోనే ఆధునికతకు తెల్లవారింది అని స్పష్టంగా చెప్పడం కష్టం గాని అక్కడక్కడ కొన్ని భాషల్లో వాటిని గుర్తించవచ్చు. ఉదాహరణకు మలయాళంలో ఇందులేఖ అనే నవల. ఇది 1889లో వెలువడింది. అట్లాగే 1865లో బెంగాలీలోని 'దుర్గేశనందిని' అనే నవల అటువంటి చరిత్రను సృష్టించింది. అదే మార్గంలో ఆధునికతకు వైతాళికులనదగిన వారు ఒరియాలో ఫకీర్ మోహన్ సేనాపతి, పంజాబీలో భాయ్ వీర్‌సింగ్, తెలుగులో వీరేశలింగం, గురజాడ అప్పారావు, గుజరాతీలో దళపత్రం, నర్మద్‌లు కనపడతారు.

మైఖేల్ మధుసూదన్‌దత్ ఆధునిక బెంగాలీ కవిత్వానికి వైతాళికుడు. ఇతడు ఇంగ్లాండులో చదువుకున్నాడు. అందుకే ఇండియన్ ఇంగ్లీషు కవిగా అతని వ్యాసంగం

మొదలైంది. అతని ఇంగ్లీషు కావ్యం పేరు His captive Ladie (1849), బైరన్, స్కాట్‌లను తలపించే కావ్యమది. తరువాత బెంగాలీవైపు మళ్ళి మేఘనాథ్ బోధ్ కావ్య (1861) వంటి కావ్యంతో ఆధునిక బెంగాలీ కవిత్వానికి వైతాళికుడయ్యాడు. రమేశ్‌చంద్రదత్ మరో ద్విభాషా రచయిత. రామాయణ, మహాభారతాలను ఆంగ్లంలోనికి తీసికెళ్ళాడు. అదేకాలంలో స్వదేశాంగ్ల కవుల్లో బలమైన కంఠం తోరుదత్‌ది (1856-77). రాజారామ్‌మోహన్‌రాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్‌ల కాలంలో బెంగాలీ వచనం వికసించింది. మైఖేల్ మధుసూదనదత్తు దీనబంధు మిత్ర (1829-74), బంకీంచంద్ర ఛటర్జీల రాకతో ఆ వచనం ఫలించింది. బంకీంచంద్రుని దుర్గేశనందిని (1869) ఆ కాలంలో దుమ్మురేపిన నవల. కథనంలోని ప్రత్యేకత వల్ల అన్ని వర్గాల ప్రజలను ఆకర్షించింది. దేశభక్తిని మేల్కొలిపింది. ఆధునిక భారతీయ నవలకు బంకీంచంద్రుడే జనకుడు. తర్వాత వచ్చే పెద్ద పేర్లు రవీంద్రనాథ్ ఠాగూర్, శరత్‌చంద్ర ఛటర్జీ. అయితే బెంగాలీలో వెలువడిన తొలి నవల మాత్రం టేక్‌చంద్ ఠాకూర్ రాసిన 'అలలర్‌ఘర్ దులాల్' (Alaler Ghar Dulal, The spoiled child).

మరాఠీ

1818-1855ల మధ్యకాలంలో మరాఠీలో ఆధునికత ప్రవేశించింది. పాశ్చాత్య ప్రభావం నెమ్మదిగా స్థిరంగా ప్రసరించింది. మరాఠీలోని చింతనాత్మక, కథనాత్మక సాహిత్యం క్రమంగా కాల్పనిక సాహిత్యానికి చోటిచ్చింది. నలుగురు సాహిత్యకారులు ఆధునిక వైతాళికులుగా గుర్తించబడ్డారు. కవిత్వంలో కేశవ్ సుత్ (1865-1905), కాల్పనిక సాహిత్యంలో హెచ్.ఎన్. ఆప్టే (1864-1919), నాటక రంగంలో కిర్లోస్కర్ (1843-85) మరియు దేవల్ (1855-16). ఆ కాలంలో మైలురాళ్ళనదగిన గ్రంథాలు నాలుగు. అవి కేశవ్ సుత్ రచించిన 'హరెపాత్రేయ' (1904) అనే కావ్యం, ఆప్టే రచించిన సాంఘిక నవల 'పాన్ లక్సట్ కోన్ ఘేటో (1893), కిర్లోస్కర్ రచించిన 'సౌభద్ర' (1882) అలాగే దేవల్ బాల్య వివాహం పైన రచించిన వాస్తవికతా నాటకం 'శారదా' (1899).

మరాఠీలో 20వ శతాబ్దం తొలి రెండు దశాబ్దాలు పునరుజ్జీవ యానంలో అగ్రభాగాన నిలిచాయి. ఆ కాలంలో సాహిత్యం సంస్కరణ నుండి రాజకీయాలవైపు మళ్ళింది. ఇక మరాఠీ సాహిత్య చరిత్రలో తరువాతి అధ్యాయాన్ని (1920-45)

అనేక ఇతర భారతీయ భాషల్లో లాగానే మార్క్స్, ఫ్రాయిడ్, రస్సెల్స్ ఆక్రమించుకున్నారు. ఇక తరువాతి కాలమంతా అతి నవ్య ధోరణులతో, ప్రయోగాలతో సాగిపోయింది.

గుజరాతీ

గుజరాతీ సాహిత్యం మధ్యయుగ వాతావరణం నుంచి బయటపడి 19వ శతాబ్దం అర్థభాగం నుంచి కొత్తపుంతలు తొక్కింది. దానికి ముఖ్యకారకులు దళపత్‌రామ్ (1920–98), నర్మద్‌లు (1833–86). దళపత్ రామ్ కొత్త కవితా రూపాలకు పాదులు తీస్తే నర్మద్ సామాజిక స్పృహకూ, దేశభక్తికీ దారులు వేశాడు. 'దళపత్ కావ్య', 'నర్మద్ కావ్య' అనేవి ఆధునికతను ప్రతిబింబించే కవితా సంపుటాలు.

అట్లాగే గుజరాతీ సాహిత్య చరిత్రలో 1887 గుర్తుంచుకోదగిన సంవత్సరం. నరసింహారావు దివేటియా రచించిన కవితాసంపుటి 'కుసుమమాల' వెలువడిన సంవత్సరమది. అదేవిధంగా గోవర్ధన్ రామ్ రచించిన 'సరస్వతీచంద్ర'. ఈ రెండింటివల్ల గుజరాతీ సాహిత్యానికి గొప్ప ఉత్తేజం కలిగింది.

తొలిరోజుల్లో గుజరాతీ సాహిత్యాన్ని వివిధ రకాలుగా సుసంపన్నం చేసిన గొప్ప సాహితీవేత్తల్లో మణిశంకర్ రంజీత్ భట్ (1867–1923),'కంట్' పేరిట ప్రఖ్యాతుడు, 'వసంత విజయం' అనే ఖండకావ్యం రచించాడు (1889). అలాగే 'దేవయాని' (1890); ఇంకా వ్యాసరచయిత ఆనంద్ శంకర్ బాపూభాయ్ ధ్రువ (1859–1942); రంచోడ్ భాయ్ ఉదయవర్మ దావె (1837–1923) అనే నాటక రచయిత 'జయకుమారి విజయ' (1864), లలిత దుఃఖ దర్శక (1865), నలదమయంతి నాటక (1893) అనే నాటకాలు రచించాడు.

మలయాళం

ఓ.చందూమీనన్ రచించిన (1847–1900) 'ఇందులేఖ' (1889) అనే సాంఘిక నవలతో మలయాళ సాహిత్యంలో ఆధునికత ప్రారంభమైందని చెప్పవచ్చు. ఈయన తర్వాత పేర్కొనదగినవారు మార్తాండవర్మ (1891), మరియు చారిత్రక నవల రచించిన సివి. రామన్ పిళ్ళై (1858–1922).

చందూమీనన్, రామన్ పిళ్ళై ఇద్దరూ వైతాళికులైనప్పటికీ ఇతరుల సేవను

విస్మరించలేము. వారిలో కేరళవర్మ, రాజరాజవర్మ ముఖ్యులు. కేరళవర్మ (1845-1914) పాశ్చాత్య ప్రభావంతో రాసిన తొలి రచయిత. ఈయన పలు ఆంగ్ల ప్రక్రియలను అనుసరించాడు. ఆయన పిల్లల కోసం రాసిన వచన రచనల్లో అక్బర్ (1894) అనే నవల అతనివే వేట జ్ఞాపకాలు (మృగయా సమసరణకళ్ (1905) అనేవి పేర్కొనదగినవి. అలాగే రాజరాజవర్మ రచించిన 'మలయ విలాసం' అనే ఖండకావ్యం (1895)ఒక మైలురాయిగా నిలుస్తుంది. 20వ శతాబ్దం తొలి సంవత్సరాల్లో ఇంగ్లీషు ప్రభావంతో పాట, స్మృతిగీతం, ఏకపాత్రాభినయం లాంటివి వెలువడ్డాయి. నిజానికి కుమారన్ ఆసాన్ (1873-1924) 'ఒరువీణాపూవు' (A fallen flower) 1907 రాలిన పూవు)తో ఒక కొత్త ధోరణి ప్రారంభమైంది. అలాగే సి.యస్. సుబ్రహ్మణియన్ పొట్టి రచించిన 'ఒరు విలాపం' (1902) బాలకృష్ణ ఫణిక్కర్ రచించిన ఇటువంటిదే మరో ఎలిజీ (1908) పేర్కొనదగినవి.

అస్సమీస్

అస్సమీస్‌లో 1889లో ఆధునిక వాయువులు వీయడం ప్రారంభమైంది. ఉన్నత విద్యకోసం కలకత్తాకు వెళ్ళిన కొందరు యువకులు జొనాకీ (వెన్నెల) అనే మాసపత్రికను స్థాపించడంతో అది జరిగింది. దీని ద్వారా అస్సమీస్‌లో భావకవిత్వోద్యమం మొదలవడమే కాకుండా కవిత్వంలో న్యూవేవ్ సాహిత్యం కూడా ఎగిసింది. రసదృష్టిని పెంపొందించడం, ప్రకృతి ప్రీతి, సౌందర్యారాధన, ప్రణయం, జానపద సాహిత్య పునరుద్ధరణ, మధ్యయుగం నాటి పురాగాథల పునఃసృజన, స్వదేశభక్తి, నూత్న ప్రయోగాభిలాష, వాడుక భాష పట్ల మక్కువ అనేవి జొనాకీ యుగలక్షణాలుగా గుర్తింపబడ్డాయి.

జొనాకీ యుగంలోని శిఖరప్రాయులైన కవిత్రయం లక్ష్మీనాథ్ బెజుబారువా (1864-1938); చంద్రకుమార్ అగర్‌వాల్లా (1867-1938); హేమచంద్ర గోస్వామి (1872-1928). వారిలో బారువా బహుముఖ ప్రజ్ఞాశాలి. అతడు వ్యాసకర్త, కవి, నాటకకారుడు, నవలారచయిత, కథకుడు. మిగతా ఇద్దరు గీతరచయితలు. జానపద కవిత్వం, పాశ్చాత్య కాల్పనిక కవిత్వాల సమ్మేళనంతో పాటలు రాశారు. బహుశా మన ఎంకి పాటల్లాగా.

బెజ్‌బారువ, అతని సమకాలికుడైన పద్మనాథ్ గోహేన్ బారువ (1871-1946) అస్సామీ నవలకు విశిష్ట రూపురేఖలను సంతరించారు. గోహెన్ బారువా రచించిన 'భానుమతి' (1890) మరియు బెజ్‌బారువా రాసిన పదుమ్ కున్‌వరి (1891) అస్సమీస్‌లో నవలా వికాసానికి దారులు వేశాయి. రజనీకాంత్ బార్ డోలోయ్ (1867-1939) 9 నవలలు రచించి ఈ ప్రక్రియను సుసంపన్నం చేశాడు. ఈయనపై వాల్టర్ స్కాట్ బంకించంద్రల ప్రభావం ఉంది. అలాగే 1890-1920ల మధ్య నాటక ప్రక్రియ కూడా వర్ధిల్లింది. గుణాభిరామ్ బారువా రచించిన 'రామనవమి' (1857) అస్సమీస్‌లో తొలినాటకం. ఇది వితంతు పునర్వివాహాన్ని సమర్థించింది. హేమచంద్ర 1876లో వచనంలో తొలి కథ రాశాడు.

పంజాబీ

చాలాకాలం వరకు విద్యాపరంగా గాని, పాలనాపరంగా గాని పంజాబీ భాష సవతి తల్లి ప్రేమనే పొందింది. హిందీ, ఉర్దూ భాషలు పంజాబీని సుసంపన్నం చేసినా సిక్కుమతం అండవల్లనే పంజాబీ బాగా పుంజుకుందని చెప్పాలి. బ్రిటిష్ వారి కాలంలో ఇంగ్లీషు ప్రాబల్యం వహించినా పంజాబీ తన మానాన తాను ఎదిగింది. కారణం దాని అంతర్గతశక్తీ, మతపరమైన అదిగ్రంథం యొక్క ఆకర్షణ. అంతేగాక సింగ్ సభోద్యమం గురుముఖి లిపిలో పంజాబీ భాషా వికాసానికి ప్రోత్సాహాన్నందించింది. అయితే లాహెూర్‌లో 1864లో ఓరియంటల్ కళాశాల ప్రారంభమైనా పంజాబీ భాషలో తరగతులు మొదలు కావడం మాత్రం 1877లో జరిగింది.

పంజాబీలో వచనం వికాసం చెందడానికి క్రైస్తవ మిషనరీల ప్రభావం తోడ్పడింది. ఆధునిక భాషానుడికారంలో బైబిల్ పంజాబీలోకి అనువాదం కావడం, పత్రికలు, పాఠ్యపుస్తకాలు వెలువడడం, ఈ సందర్భంగా చెప్పుకోదగిన విషయాలు. 1880లో 'గురుముఖి అఖ్బర్' పత్రిక, 1886లో 'సిధారక్'లు సింగ్ సభా ఉద్యమం ద్వారా వచ్చాయి. కవిత్వావిర్భావం సహజమే,కాని నవల, కథానిక, జీవిత చరిత్ర, యాత్రా చరిత్ర క్రైస్తవ మిషనరీలు ప్రభావంతోనే వచ్చాయి.

పంజాబీ సాహిత్యంలో వైతాళికుడు భాయ్ వీర్‌సింగ్ (1872-1957). ఇతడు బహుముఖ ప్రజ్ఞాశాలి. అర్థశతాబ్దం పాటు సాహిత్యాన్ని ఏలాడు. ఇంగ్లీషు కవిత్వాన్ని

అనువదించడంతో పాటు 'సుందరి' (1893) అతని చారిత్రక నవల పంజాబీలో తొలి నవల. ఇది పంజాబీ వీరుల వీరకృత్యాలను చిత్రిస్తూ సిక్కులను ఉత్తేజపరిచింది. ఇతని రెండో నవల 'బిజయ్ సింగ్' (1899) కూడా పాఠకాదరణ పొందింది. వీర్‌సింగ్ నవలల్తో ఆగక కవిత్వం, నైతిక వ్యాసాలు కూడా రాశాడు. రాశిలో వాసిలో ఆయనకు ఆయనే సాటి. పంజాబీ సాహిత్యపితగా ప్రఖ్యాతిగాంచాడు. పలు ప్రక్రియలకు ఆయన మార్గదర్శకుడు.

కన్నడం

తొలి ఆధునిక కన్నడ గ్రంథం లాంటిది వెలువడడానికి ముందు దానికి అనువాదాలే దారిని వేశాయి. అవి : బైబిల్ (1820), యాత్రి రాణసంచార (The Piligrim's Progress, 1847), రాబిన్‌సన్ క్రూసో (1857) ఇవన్నీ ఇంగ్లీషు నుండే. ఇక సంస్కృతం నుండి 'శాకుంతలమ్' (1847), బెంగాలీ నుండి దుర్గేశనందిని (1885) కన్నడంలోనికి అనువదించబడ్డాయి. కన్నడంలో తొలి నవల గుల్‌వాడి వెంకటరావు రచించిన 'ఇందిరాబాయి' (1899), ఇది సాంఘిక నవల. అలాగే తొలి నాటకం సూరి వెంకట శాస్త్రి రచించిన ఇగ్గప్ప హెగ్గడే వివాహ 'ప్రహసన' (1887).

అదేవిధంగా 19వ శతాబ్దం ఉత్తరార్ధభాగంలో ఆధునికాంశాలతో కొన్ని రచనా ప్రయత్నాలు జరిగాయి. ఈ సందర్భంగా శ్రీకంఠయ్య (1884-1946) వెలువరించిన '19 ఇంగ్లీషు గీతాలు' అనే పుస్తకం మైలురాయిగా పరిగణించబడింది. ఈ దారిలో మరో సాహిత్య శిఖరం ఎం. గోవిందపాయ్ (1883-1963); అనంతరకాలంలో ఈ ధోరణిని కె.వి. పుట్టప్ప, డి.ఆర్. బెంద్రె వంటి వారు అందిపుచ్చుకున్నారు.

కన్నడంలో ఎం.ఎస్. పుట్టన్న రచించిన (1854-1930) 'మదిద్దున్నో మహారాయ' (1915) అనేది తొలి నవలగా పరిగణించబడుతున్నది. శివరామ కారంత్ వంటివారు (1926) ఈ ప్రక్రియను సుసంపన్నం చేశారు. కారంత్ రచించిన 'మారవి మన్నిగె' (Back to soil, 1942), గొప్ప నవలగా ప్రఖ్యాతి గాంచింది.

ఒరియా

ఒరియా సాహిత్య చరిత్ర 500 యేండ్లదే. ఈ భాషలో ఆధునికతకు కారణమైన వారిలో అతి ముఖ్యుడు ఫకీర్ మోహన్ సేనాపతి. (1843-1918). అన్ని ప్రక్రియలకు ఆద్యుడైన సేనాపతి ఆధునిక ఒరియా సాహిత్యానికి జనకుడిగా సంభావింపబడ్డాడు.

ఫకీర్ మోహన్ అసాధారణమైన వ్యక్తి. బడిలో నాలుగో తరగతి వరకే చదువుకున్నా ఐదు భాషల్లో నిష్ణాతుడయ్యాడు. ఇంగ్లీషులో కూడా వ్యవహార పరిజ్ఞానాన్ని సంపాదించాడు. కేవలం ఆయన ప్రతిభ వల్లనే ఒరిస్సా రాష్ట్రపు దీవాన్ స్థాయి దాకా ఎదిగాడు. ఆయనే ఒరియా గ్రంథ ముద్రాపకుడిగా, ప్రచురణకర్తగా, పాత్రికేయుడిగా కూడా మార్గదర్శకుడైనాడు. రాశిలో ఫకీర్ మోహన్ రచనలు ఆశ్చర్యకరం, అద్భుతం. రామాయణ, మహాభారతాలను ఒరియా భాషలోనికి అనువదించాడు. కథానికా రచనను పరిచయం చేశాడు. వీర గాథలు, కథనాత్మక గేయాలను రచించాడు. అరడజన్ నవలలను సృజించాడు. అవి వాస్తవికత, నైతిక జీవితానికెత్తిన పతాకలు. 'చమన అథ గుంత్' (1901) అనేది ఆయన ముద్రించిన వాటిలో ప్రముఖ నవల. అట్టడుగు పల్లెజనులపై జమీందార్ల పీడనను ఇది చిత్రించింది. ఇది ఉత్కల్ సాహిత్య అనే పత్రికలో సీరియల్‌గా వచ్చింది. ఆధునిక సరణిని విశాలపరిచిన వారిలో ఇతర రచయితలు రధానాథ్‌రాయ్ (1848–1908), మధుసూదన్ (1853–1912), నందకిశోర్‌బాల్ (1875–1928) ప్రభృతులు ఉన్నారు.

ఆలస్యం అమృతం:

నేపాలీ

నేపాలీకి ఖాస్, పర్బతె ఘోర్‌ఖలీ అని నామాంతరాలున్నాయి. నేపాలీ అనబడే విస్తృత రాజ్యం 1816లో ఏర్పడింది. ఒకప్పుడు బనారస్ దీనిలోనే ప్రధాన విద్యాకేంద్రంగా ఉండేది. అనేకగ్రంథాల ప్రచురణ ఇక్కడి నుంచే జరిగింది. ఇక ఇతర నేపాలీ సాహిత్యకేంద్రాలుగా పశ్చిమబెంగాల్‌లోని డార్జిలింగ్, ఉత్తరప్రదేశ్‌లోని డెహ్రాడూన్ ఉండేవి. నేపాల్‌ని హిందీ, సంస్కృతాలు కొంతవరకు ప్రభావితం చేశాయి.

భానుభక్త ఆచార్య (1814–69) రచించిన రామాయణంలో ఆధునిక నేపాల్ భాషాఛాయలు ప్రారంభమైనాయని చెప్పవచ్చు. ఆచార్య రచించిన ఇతర భక్తి గీతాలతో పాటు 'భక్తమాల' (1853) అనే పుస్తకం ఆత్మచింతనకు అభివ్యక్తిగా నిలుస్తుంది. నేపాలీని ఆధునికతవైపు మళ్ళించిన మరో గొప్ప వ్యక్తి మోతీరాం భట్టి (1966–96). ఇతడు జీవిత చరిత్రలు, విమర్శలు, కవిత్వం, నాటకాలు రచించడమే కాకుండా 'భారత్ జీవన్‌ప్రెస్'ను నెలకొల్పి 'రసిక సమాజం' అనే సంస్థను స్థాపించాడు. 'భానుభక్త

రామాయణం' దీనిలోనే అచ్చుయ్యింది (1891). అలాగే తొలి నేపాలీ పత్రిక గోర్ఖా భారత్ జీవన్ (1886)ను బనారస్ నుండి ప్రారంభించిన ఘనత కూడా మోతిరాంకే దక్కుతుంది.

ఇక సమాయ్ (Lahari) సంప్రదాయానికి వస్తే ఇది సంప్రదాయం కన్నా సామాన్య మానవునికి ప్రాధాన్యమిచ్చింది. దీనిలో రెండు రకాలున్నాయి. (1) పార లౌకికం (2) లౌకికం. మొదటిదానిలో యోగికవుల రచనలు రెండోదానిలో లౌకిక విషయాలు ఉన్నాయి. ఇవన్నీ 1890-1910ల మధ్య వెలువడ్డాయి. లౌకిక పద్ధతిలో మణిరాజ్ షాహి (1900) రచించిన 'చరికోస్వాయ్' ఎంతో గణనకెక్కింది. దీనిలోని వస్తువేమిటంటే, రెండు పక్షులు, వేరు వేరు జాతికి చెందినవి. అయినా వాటి మధ్య పెళ్ళి, దానిని అన్ని రకాల పక్షులు ఆమోదించి ఆనందిస్తాయి.

గోర్ఖాపత్ర అనే నేపాలీ అధికార వార్తా పత్రికలో 20వ శతాబ్దం తొలి పాదంలో గీతాలు, కథానికలు వెలువడ్డాయి. బ్రిటిష్, నేపాలీ రాచరిక పాలనల నుండి ప్రోత్సాహం లభించకపోయినా నేపాలీ సాహిత్యం తనదైన పద్ధతిలో అభివృద్ధి చెందింది. కథాకుసుమ్ (1936) అనే కథాసంకలనం రుద్రరాజ్ పాండే రచించిన రూపమతి (1934) అనే సాంఘిక నవల, రూప్‌నారాయణ్ సిన్హా రచించిన భ్రమర్ అనే శృంగార నవల ఆ అభివృద్ధికి నిదర్శనంగా నిలుస్తాయి.

మైథిలీ

మైథిలీ భక్తి, శృంగారాల సంప్రదాయాలతో అలంకృతమైన సాహిత్యం. మైథిలీలో రాసిన గొప్పకవి విద్యాపతి (1360-1448)ని భారతీయులంతా తమవాడిగా సంభావిస్తారు. భౌగోళిక పరిమితి వల్ల పునరుజ్జీవనం ఇక్కడ ఆలస్యమైంది. 1880-98ల మధ్య పరిపాలించిన మహారాజా లక్ష్మీశ్వర్ సింగ్ పాశ్చాత్య విద్య చదవటం వల్ల కొత్తదనాన్ని, ప్రయోగాలను ప్రోత్సహించి పోషించాడు. ప్రముఖ భాషా శాస్త్రజ్ఞుడైన జార్జ్ గ్రియర్‌సన్ కూడా ఆ ధోరణిని ప్రోత్సహిస్తూ, మైథిలీ యొక్క ప్రత్యేక వ్యక్తిత్వాన్ని నిలబెట్టాడు.

ఆధునిక మైథిలీ సాహిత్యానికి చందా ఝా (1832-1907) జనకునిలాంటి వాడు. అతడు ప్రాచీన ప్రక్రియలకు కొత్త రూపురేఖలను సంతరించాడు. రామాయణేతిహాసాన్ని ఆరేళ్ళలో పూర్తిచేశాడు. (1886-92).

కవిత్వంలో మైలురాయి అనదగిన యధునాత్ యుదువర్ రచించిన 'మైథిలీ గీతాంజలి' 1923లో అచ్చయింది. అలాగే భువన్ రచించిన ఆశద్ (1936) అనే సంపుటి ఇదే కోవకు చెందుతుంది.

నేపాలీ నవల కూడా ఈ కాలంలోనే వెలువడింది. హరిమోహన్ ఝా రచించిన 'కన్యాదాన్' (1929–33) విశేష పాఠకాదరణ పొందిన గొప్ప నవల.

రాజస్థాని

రాజస్థానీ భాషలో ఇంగ్లీషు ప్రభావంతో కొన్ని నాటకాలు, నవలలు వెలువడ్డాయి. ఇలా కొత్త పద్ధతి రచనలను పరిచయం చేసినవాడు శివచంద్ర భారతీయ్ (1853–1918). అతడు రచించిన నాటకం 'కేసర్ విలాస్' (1900), నవల 'కనక సుందర్' (1903) అనేవి కొత్తపద్ధతిలో ప్రముఖమైన రచనలు. రాజస్థానిలో పునరుజ్జీవన ధోరణులు 1950దాకా మెల్లగానే సాగాయి. ఒకవైపు సంప్రదాయ పద్యరచన సాగుతుండగానే మరోవైపు ప్రయోగశీల గీతాలు వెలువడ్డాయి. విద్యారంగంలో ఆధునిక హిందీని ప్రవేశపెట్టడం వల్ల చాలాకాలం వరకు రాజస్థానీ భాష వెనకే ఉండిపోయింది. కాని సాహిత్యం స్వాతంత్ర్యం తర్వాత బాగా పుంజుకుంది. 'కవిత' 1965 ప్రాంతంలో కొత్త శిల్పంతోసంప్రదాయేతర కాంతులతో వెలువడజొచ్చింది.

రాజస్థానిలో తొలి ఆధునిక నవల ఎస్.ఎన్.జోషి రచించిన 'అభయ్ పాటకీ' (1956). ఇది వితంతు పునర్వివాహానికి సంబంధించిన కథ. ఆ వివాహం వల్ల ఆమె కులబహిష్కరణకు గురవుతుంది. జోషి ఆదర్శవాదంతో మరో రెండు నవలలను రచించాడు. వాటిలో 'అన్నారాం సుధామ'కు సంస్కరణ నవలగా ఎంతో పేరొచ్చింది. రాజస్థానీలో కథానిక 1940లో ప్రారంభమైంది.

కోంకణి

కోంకణి భాష ప్రజల వాడుకలో ప్రాచీనమైనదైనా ఒక ప్రామాణిక భాషగా పరిణామం చెందడానికి ఎన్నో అడ్డంకులను అధిగమించవలసి వచ్చింది. దీనిని మాట్లాడేవారు ఎక్కువగా బొంబాయి, గోవా, మంగళూరు, కొచ్చిన్ ప్రాంతాల్లో వ్యాపించి ఉన్నారు. దానివల్ల కోంకణి బాగా అభివృద్ధి చెందిన మరాఠీ, కన్నడం, మళయాలం

వంటి భాషలతో తీవ్రమైన పోటీని ఎదుర్కోవలసి వచ్చింది. కోంకణీ భాషీయులు ఎక్కువగా ఉన్న గోవా వంటి ప్రాంతంలో కూడా మరాఠీ పెత్తనాన్ని ఎదుర్కోవలసి వచ్చింది. మరాఠీ వారు దానిని తక్కువస్థాయి మాండలికంగా భావించేవారు. పోర్చుగీసువారు కూడా అలాగే పరిగణించేవారు. ఇట్లాంటి అడ్డంకులెన్ని ఉన్నా కోంకణిలో మంచి సాహిత్యం పుష్పించింది. అయితే ఆధునికత ఇక్కడ కొంత ఆలస్యమైంది.

కోంకణిలో ఉడెన్ టెచెయ్ సల్లోక్ (తూరుపు కమలం, 1889), ప్రచురణతో కొత్త ధోరణులు మొదలైనాయి. కోంకణిలో ఇదే మొట్టమొదటి పత్రిక. సంపాదకుని పేరు ఎడురాడో జోస్ బ్రునో డిసౌజా (1836-1905). ఇతడు కోంకణీ జనులకు సంబంధించిన సాంఘిక, ధార్మిక, భాషాశాస్త్ర, సాంస్కృతికమైన అన్ని విషయాలకు ఆ పత్రికలో స్థానం కల్పించాడు. ఇతని స్వతంత్ర రచన 'ఇవ మరియు మోరి' 1899లో అచ్చయింది. దీనిలోని బైబిల్ కథ పద్యరూపంలో ఉండి కొత్త ధోరణులను ప్రతిఫలించింది. అయితే అసలైన ఆధునికత 1910 తర్వాతనే ఆవిర్భవించిందని చెప్పవచ్చు. దానికి కారకుడు షెనాయ్ గోఎంబాబ్ (1877-1946). అతడు గొప్ప పండితుడు, రచయిత. ఆయన ఎన్నో కథానికలు, నాటకాలు, జీవిత చరిత్రలు రచించాడు. అవి 1928-48ల మధ్య అచ్చయినాయి. ఇతని 'సంసార్‌బుట్టి' (The Deluge, 1933) అనే వచన రచన శిఖరప్రాయమైనది. గోఎంబాబ్ కూడా ఇలాంటి రచనలు చేశాడు.

మణిపురి

మణిపురి సాహిత్యం చాలాకాలం వరకు రాజపోషణ కింద మణిపురి లిపిలోనే సాగింది. మణిపురిలో మొదటి పుస్తకం కలకత్తాలోని బాప్టిస్ట్ మిషన్ ద్వారా 1890లో అచ్చయ్యింది. గరీబ్ నివాజ్ మహారాజా కాలంలో (1709-48) మెటీస్‌ను (Meiteis) హిందూమతంలోకి మార్పించిన సందర్భంగా మెటీ లిపిలో ఉన్న గ్రంథాలన్నీ తగులబెట్టబడ్డాయి. సాహిత్యంలో బెంగాలీ లిపిని అవలంబించిన తర్వాత సాహిత్యంలో భౌతికవాద ఇతివృత్తాలు ఎక్కువగా స్వీకరించబడ్డాయి. 1891లో మణిపూర్ బ్రిటిష్‌వారి పాలనలోకి వెళ్ళింది. దీనివల్ల ఆనాటి విద్యావంతులైన యువత మొగ్గు బెంగాలీ,

సంస్కృతం, ఇంగ్లీషుల వైపు మళ్లింది. సంప్రదాయ, మతపరమైన సాహిత్యం భావుకత గల లౌకికవాద సాహిత్యం ధాటికి తట్టుకోలేక అదృశ్యమైంది. ఆ రకంగా మణిపురిలో ఆధునిక సాహిత్యం ప్రారంభమై 1947 తర్వాత మరింత పుంజుకుంది.

స్వాతంత్ర్యానికి ముందు ఆధునిక స్ఫూర్తితో వెలువడిన గ్రంథాలు కమల్‌సింగ్ రచించినవి (1899–1934); వాటిలో లీ పరెంగ్ (దండ 1929), చ ఓబా సింగ్ (1896–1951), అంగన్ ఘుల్‌సింగ్ (1896–1951), దైనాగి లీరాంగ్ (ప్రాచీన పుష్పాలు, 1939), ఖంబా థోయిబీ షేరెంగ్ (ఖంబా థోయిబీపైన కవిత 1940) పేర్కొనదగినవి. ఈ కావ్యాలు మణిపురి భాష యొక్క అభివ్యక్తి విశిష్టతను నలుదిక్కులా చాటాయి.

మణిపురిలో తొలి నవల 'మాధబి' 1930లో వెలువడింది. కమల్‌సింగ్ దీని రచయిత అదే దశాబ్దంలో మరికొన్ని నవలలు వెలువడ్డాయి. తమ చుట్టూ ఉన్న జీవితాన్నే అవి ప్రతిబింబించాయి. పరిణత నాటకం కోసం మణిపురి సాహిత్యం స్వాతంత్ర్యం వచ్చేదాకా ఎదురుచూడవలసి వచ్చింది. ఏది ఏమైనా ఆధునిక మణిపురి సాహిత్యం వయస్సు ఆరు దశాబ్దాలు మాత్రమే.

డోగ్రీ

నోటి భాషగా డోగ్రీ ప్రాచీనమైందే కాని సాహిత్య భాషగా వికసించడానికి చాలా ఆలస్యమైంది. కారణం వ్రజ్ భాష, సంస్కృతాల ఆధిపత్యం ఒకటైతే ముద్రణ సౌకర్యాలు లేకపోవడం రెండోది.

'డోగ్రీ సంస్థ జమ్ము' అనే సాహితీ సాంస్కృతిక సంస్థ (1944) వల్ల డోగ్రీ సాహిత్యానికి మంచి ఊపు లభించింది. ఇది నిర్వహించిన సమ్మేళనాల వల్ల కవితలు, కథానికలకు మంచి చైతన్యపూరిత వాతావరణం లభించింది.

దినుభాయ్ పంత్ గ్రంథాల రచన (1944–46) డోగ్రీలో ఒక పెద్ద ఘటనగా చెప్పవచ్చు. అతని 'గుట్టులున్' (Tittilation, 1944) అనే పద్య సంపుటి, వీర్‌గులాబ్ (The Heroic Mood) అనే ఒక చిన్న ఇతిహాసం. 'మంగూరి ది చబిల్' అనే వెట్టిచాకిరిని చిత్రించిన రచనలు గణనకెక్కాయి. అలాగే 'సారా బాపు' అనేది గాంధీ హత్యపై స్పందించి రాసిన రచన. ఇంకా బి.పి. సాథే రాసిన 'పైహ్లోఫుల్' (తొలిపుష్పం, 1947) అనేది కథల సంపుటి. 'జాగోడుగ్గార్' (డోగ్రీ దేశమా! మేలుకో!) 1949–50)

అంటూ డోగ్రీలో వెలువడిన మొట్టమొదటి కవితాసంకలనం. ఇవన్నీ ఆధునికతకు దోహదం చేశాయి. డోగ్రీ సాహిత్య వికాసం 20వ శతాబ్దం నాలుగో దశకం దాకా నిరీక్షించవలసి వచ్చింది.

ఇప్పటిదాకా చెప్పుకున్న భాషలు చాలావరకు ఒకే కాలంలో అభివృద్ధి చెందినట్లు అర్థమౌతుంది. కొన్నింటి అభివృద్ధి ఆలస్యం కావటానికి ఆయా చారిత్రక పరిస్థితులే కారణమని తెలుస్తోంది. తెలుగు భాషను గురించిన అవగాహనే కాకుండా ముఖ్యంగా తెలంగాణా ప్రాంతంలో పరాయి భాషా పరిపాలన వల్ల ఏర్పడిన దుస్థితికి కారణాల గురించి ఆలోచించడానికి కూడా వీలు కలుగుతుంది.

ఆనాటి పునరుజ్జీవన ప్రయత్నాల్లో ఆంధ్ర సారస్వత పరిషత్ పాత్రను కూడా నేనీ సందర్భంగా స్మరిస్తున్నాను. ఇతర భాషా సాహిత్యాల గురించి తెలుసుకున్నప్పుడే ఎవరికైనా స్వస్వరూపజ్ఞానం కలుగుతుందనే ఉద్దేశంతో ఈ ప్రసంగవ్యాసం తయారుచెయ్యడం జరిగింది.

●

బైరాగి 'ఆగమగీతి'- ఒక అవగాహన

◆ డా॥ అద్దేపల్లి రామమోహనరావు

20వ శతాబ్ది ప్రారంభం నుండి, తెలుగు కవిత్వంలోకి ఆధునికత్వాన్ని తెచ్చిన సమర్థులైన కవులందరిలో రెండు గమనింపదగిన అంశాలున్నై. మొదటిది వారు ప్రాచీన కవిత్వాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసినవారు. రెండోది పాశ్చాత్య కవిత్వంలో ప్రచురితమైన నూతన ధోరణులచేత ప్రేరణ పొందినవారు. ఈ రెండంశాల సమ్మిళిత చైతన్యంలోంచి ఎన్నో కొత్త మార్గాల్ని ఏర్పరచి, తర్వాతి వారికి మార్గదర్శకులైనారు. ఈ మార్గాలలో, స్థూలంగా చెప్పాలంటే, రెండు ప్రధానమైన వాటిని గుర్తించవచ్చు. ఒకటి సామాజికమైనది; రెండోది వైయక్తికమైనది. వైయక్తిక ధోరణుల్లో గూడా, తాత్విక ధోరణి ఏ కాలంలోనైనా అంతర్ముఖుల్ని ఆకర్షిస్తూనే ఉంటుంది. తాత్వికతలో తనను గూర్చి, ఈ విశ్వాన్ని గూర్చి, రెంటికీ ఉండే మౌలిక సంబంధాన్ని గూర్చి అవగాహన కోసం పడే తపన ఒక అంశం. రెండోది ఈ జీవితమే అనుక్షణ దుఃఖభరితమనే ఆవేదన అంతరంగాన్ని వదలకుండా ఆక్రమించుకుని, చైతన్యమే ఒక కాలుతున్న కాగడాలా మండుతూ, నిరంతర క్షోభపడుతూ ఉండడం. ఈ క్షోభలో జీవితం, మరణం అనేవాటి గూర్చి అనుస్యూతమైన ఆలోచన, జీవిత వైయర్థ్యాన్ని గూర్చిన చింతన మనస్సును తొలిచివేస్తూ ఉంటై. ఇటువంటి 'జీవిత క్షోభ'లోంచి కవిత్వాన్ని రాసి, ఇటువంటి ఒక ఆధునిక స్రవంతికి మార్గదర్శకుడైన కవి బైరాగి. 'జన్మదుఃఖం, జరాదుఃఖం, సర్వం దుఃఖమనే భారతీయ వేదాంతమెలాగూ ఉంది, దానికి తోడు టి.ఎస్. ఇలియట్ తాత్విక కవిత్వ ప్రభావమూ బైరాగిపై బలంగా ఉంది. ఇలియట్‌లోనూ సామాజికాంశ ఉంది; బైరాగిలోనూ ఉంది. కాని, ఒక ప్రత్యేక భావనిబద్ధుడైన కవి, వేరే అంశాల గూర్చి రాసినా, అతని అస్తిత్వానికీ కవిత్వానికీ ఉన్న అనివార్యమైన సంబంధాన్ని స్పష్టంగా గమనించగలం. దీన్నే ఒక కవి తాలూకు 'ఐడెంటిటీ' అని

చెప్పుకుంటాం. బైరాగి జీవిత క్షోభ సామాన్యమైనది కాదు. ప్రతి అక్షరమూ, అగ్ని జ్వాలలా మండుతూ, పాఠకుణ్ణి తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. 'ఆగమగీతి'లోని ఆవిష్కరణల అనేక కోణాల్ని గూర్చి విశ్లేషించడం, ఈ వ్యాసలక్ష్యం.

జీవితం, మృత్యువు - ఈ రెండూ బైరాగిని ప్రతిక్షణం వెంటాడినై. అందుకే దాదాపు ప్రతి కవితలోనూ వీటి గూర్చిన చింతన కనిపిస్తుంది. 'పలాయనం' అనే దీర్ఘ కవిత, చాలా గొప్పది. అత్యంత కవితాత్మకమైనది కూడా. బైరాగి ఆలోచనలు చాలా బలంగా కనిపిస్తై. దీని ప్రారంభమే

"జీవితం తింటోంది తనను తాను...
మృత్యువు ఏదో ఒకపూట
చూచిపోయే అతిథికాదు
వెంటబడిన అప్పులవాడు
పుట్టుకతో పుట్టిన చావు
చావుతో చస్తోంది; ఈ దేహంతో పాటే మన్నులో కలుస్తోంది"

జీవితం, మృత్యువు - వేరువేరుగా లేవు. రెండూ కలిసే నడుస్తై. పుట్టుకతో పుట్టిన చావు, చావుతో చస్తోంది' అన్న వాక్యం విచిత్రమైంది. పుట్టుక జరిగింది అంటే, దానికి చావున్నట్లే. అందుకే చావు, పుట్టుకతోనే పుడుతోంది. ప్రాణి చచ్చినపుడు చావు కూడా చస్తోంది. అంటే ఇంక మరణానికి అస్తిత్వం లేదు. పుట్టుక ఉంటే మరణం ఉంది. పుట్టుకపోతే యింక మరణమూ లేదు.

ఈ అస్తవ్యస్తమైన జీవితం నించి పారిపోదాం పదమంటాడు. ఎక్కడికి వెళ్ళాలో తెలియదు. కాని ముందు, ఈ బాధనించి తప్పించుకోవాలి. ఎక్కడికి వెళ్ళాలని కవి ఉద్దేశమంటే -

'నడచి నడచి భూమి అంతమొందేచోట
కాలమాగిపోయేచోట
పండుకుని ప్రశాంతంగా ఆకసం వంక చూస్తూ
మనం కళ్ళు మూసుకుంటే
అదే మన యెరుషలేము, మన కాశీ, మన మక్కా
నీడనిచ్చే బోధివృక్షం, ఆత్మల తీర్థస్నానం
పారిజాత దివ్యాఘ్రాణం'

కవి ముగింపులో, అసలు ఈ జీవితం నించి తప్పించుకోవడం అనేదే అర్థం లేని ఆలోచన అంటాడు. ఏ ఆలోచనకైనా చివరకు, అర్థం లేని దానిలో కలిసి పోవలసిందే – అన్న ఒక ధ్వని ఈ ప్రశ్నల్లో ఉంది.

'చావునించి పారిపోవడమే బ్రతుకు
    బ్రతుకునించి పారిపోవడమెక్కడికి?....
జైలు నించి పారిపోతే బయలు
    బయలు నించి పారిపోవడమెక్కడికి?
గోడను తప్పించుకొంది నీడ
    నీడను తప్పించుకునేదెప్పటికి?....
జీవితాన్ని గడిపేస్తోంది కాలం
    కాలాన్ని గడిపి వేయడమెలాగా?'

ఈ ప్రశ్నల వల్ల తెలిసే విషయమేమిటంటే, ఈ బ్రతుకు నుండి పారిపోదామన్న, అది సాధ్యం కాని పని. అందువల్ల ఈ శోకాన్ని అనుభవిస్తూ ఉండడమే మిగిలింది.

ఎంత అందమైన, ఆనందమైన విషయాన్ని గూర్చి కవి చెప్తున్నా, ఎవరికీ రాని బీభత్సమైన భావాల్లోకే ప్రయాణించడం కనిపిస్తుంది. అంటే, తన మౌలికమైన వేదనకు, ఏదీ దూరమైన వస్తువు కాదు. 'మల్లెపూలు' అన్న కవిత యిందుకుదాహరణ. మల్లెపూల్ని అందంగా వర్ణిస్తూ, చివరకు ఎలా అంటాడో చూద్దాం.

'తెల్లగా మెరుస్తున్నవి బల్లపైన మల్లెపూలు
బాధల చిరునవ్వులా, టూత్‌పేస్టు ప్రకటనలా
బర్మా బియ్యంలా, ఆపరేషన్ గది గోడల్లా
దేవతల వస్త్రాల్లా, పసిపాపల ముఖాల్లా
మల్లెపూలు మేళవిస్తాయి సత్యాన్నీ, స్వప్నాన్నీ
సౌకుమార్యాన్నీ, శక్తినీ, మోహాన్నీ
ముక్తినీ, చావునూ, బ్రతుకునూ....'

తనతో మల్లెపూల మధ్య ఆనందించే భాగస్వామిని పిలుస్తాడు. ఇక్కడ జీవితం, మృత్యువుల స్పృహ ఎంత బలంగా చెప్తాడో గమనించవచ్చు.

'నేను నీకు నిశ్చలంగా మృత్యువును మోహించడం నేర్పుతాను
నీవు నాకు జీవితాన్ని ప్రేమించడం నేర్పుదువుగాని'
మనమిద్దరమొకటై ద్వైతంలో అద్వైతాన్ని నేర్చుకుని
తెలుసుకుందాం అనేకంలో ఏకాన్ని'

అనేకంలో ఏకం ఏమిటంటే, జీవిత మృత్యువుల సమాగమం. అది ఎలా ఉటుందనే దానికి ఒక భావచిత్రాన్నిస్తాడు.

'రా! మనమిద్దరం దేశ కాలాల పరిధులు దాటి
అస్తిత్వపుగుహలో, అనంతశూన్యంలో
గదిలో, చీకటిలో విహరిద్దాం
పెదవులపై చేతులుపై, కౌగిలియై, చుంబనమై
ఒక జ్యోతిర్మయక్షణమై చలిద్దాం'

'అలోకంబగు పెంజీకటి కవ్వల నెవ్వండేకాకృతి వెలుగు' అన్నట్లుగా ఊహాతీతమైన ఒక స్థితికి రూపకల్పన చేస్తున్నాడు. ఒక కవితలో 'అలోకం' అనే పోతన పదాన్ని కూడా ప్రయోగిస్తాడు బైరాగి.

బైరాగి, ప్రతిక్షణం జీవితంలోని వెలుగుకంటె చీకటిని చూస్తాడు. జీవితం కంటె మరణాన్ని గూర్చి ఆలోచిస్తాడు. అద్భుతమైన భావచిత్రాలన్నిటినీ జీవిత క్షోభలోకే పర్యవసింపచేస్తాడు. 'వేసవి రేయి – రెండు పక్షాలు' అనే కవితలో వెలుగునీ చీకటినీ రెంటినీ బీభత్సంగానే వర్ణిస్తాడు. చీకటి యిలా ఉంది.

'నక్షత్రాల రజతజ్వాల రగిలినరేయి
జాజిపూల మల్లెపూల తలంబ్రాలు
నక్షత్రాల రుధిరజ్వాల రగిలినరేయి...
వెలుగును ఇలా చెప్తాడు.
'వెన్నెలవిచ్చుకత్తులు తళతళమనురేయి
గాయపడిన గాలిలోన దాయరాని కూయి
మంత్రగాని తోటలోని విసపుపూలతావి
ముద్దులొలుకు మిత్తవలా విషకన్యకమోవి'

సౌందర్యమైనా, అసౌందర్యమైనా రెండూ అంతిమంగా వేదన కలిగించేవే అన్న భావం కలిగిస్తాడు కవి.

బైరాగి కవితల్లో కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, ఆరుద్ర, నారాయణబాబు మొదలైన వారి పదాలెన్నో సముచితమైన స్థానంలో కలిసిపోయి సాగిపోతూ ఉంటై, టి.ఎస్.ఎలియట్ భావాలు కూడా, కేటాయింపుగా కనబడకుండా, సందర్భంలో మిళితమైపోతుంటే, బహుశా, టి.ఎస్. ఎలియట్ చేసిన 'Allusi Veness' అనే శిల్పం ప్రభావం కావచ్చు. ఇంతకుముందు ఉదాహరించిన

'నక్షత్రాల రుధిర జ్వాల రగిలిన రేయి'

అన్న పంక్తిలోని 'రుధిరజ్వాల' నారాయణబాబుదే. బహుశః తమ యిద్దరికీ భావ చిత్ర ధోరణిలోని కొంతసామ్యం వలన (ఆ సామ్యం బీభత్సస్థాయి వరకే) నారయణబాబుపై అతడు రాసిన కవిత 'శ్రీరంగం నారాయణబాబు' అనేది, అద్భుతమైన ఒక 'వ్యక్తి చిత్రణ' శిల్పం. భావ చిత్రాల్ని పూర్తి అర్థంతో పిండిన అభివ్యక్తి నైపుణ్యం. ప్రతిపదంలోనూ, ప్రతిభావనలోనూ, సూటిగా చెప్పకుండా నారాయణబాబు ఆత్మద్రవ్యాన్ని స్ఫురింపజెయ్యడం ఇందులోని శక్తి. నారాయణబాబు విజయనగరంలో అయ్యకోకొటి ప్రహారీకి ఆనుకుని ఉన్న నొక చిన్నగుడిలాటి గూటిలో ఒంటరి బ్రహ్మచారిగా జీవించిన ఏకాంతజీవి. కవిత్వంలో బీభత్స భావచిత్రాలకి పేరు పొందినవాడు. ఆంగ్ల సాహిత్యంలోని కొత్త ధోరణులన్నిటి ప్రభావమూ కలిగినవాడు. ఇలా ఎన్నో ఎన్నో ప్రత్యేకతలున్నై. నారాయణబాబు పోయినప్పుడు బైరాగి ఈ కవిత రాశాడు. "And his death is onlya symbol" అని శీర్షిక కింద అంటాడు. దేనికి ప్రతీక ఔతుందో కవిత నిండా కనిపిస్తుంది. నారాయణబాబు కవితారీతిలోనే ప్రతీకలూ, భావచిత్రాలు రావడం ఈ కవిత ప్రత్యేకత. ఇందులో కొన్ని భావచిత్రాలు.

'ఎండిన ఇసుకపై కోరిక కుంటి చేప'

కొత్తదనం మీద బైరాగికి విపరీతమైన ఇష్టం. ఇది అతని ప్రతి రచనలోనూ కనిపిస్తుంది. 'కుంటి చేప' అని ఎవరంటాడు. కళ్ళు లేని చేపకుంటిది అనడం ధ్వనిలో పర్యవసించేదే. అది ఎండిన ఇసుకలో ఉంటే అటూ ఇటూ కొట్టుకోవడమే తప్ప, కొంతసేపటికి చలనం ఆగిపోవడమే తప్ప, ఎక్కడికీ వెళ్ళదు. అలాటిదే కోరిక. నారాయణబాబు బీభత్స భావచిత్ర ధోరణిలోనే, అతణ్ణి గూర్చి ఒక భావచిత్రం–

'స్వరతి నిరత చాలకుడు, దోషకశాచాలికుడు
అతని మనస్సు క్యూబిస్టు బేబిలోను
వెర్రిపీరులు, శివలింగాలు, సింధూర చర్చిత శిలలు
రక్తాంబర ధారుదాతడు, రక్తాక్షుడు
ఆదిశక్తి ఆరాధకుడు
జీవిత శ్మశానంలోకవితా శవసాధన చేస్తున్నాడు'

ఒంటరిగా అర్ధరాత్రులు చీకటిలో కూర్చుని బీభత్స భావచిత్రాలు రాసే కవి గురించి, ఈ చివరి పంక్తి కంటె గొప్ప చిత్రీకరణ ఎక్కడ ఉంటుంది? ఈ సందర్భాన్ని యింకొంత బీభత్సంగా వర్ణించి చివరకు–

'ఆఫ్రికాలో అర్ధరాత్రి' అంటాడు.

ఆఫ్రికా అనగానే, అక్కడి తాంత్రికత, మంత్రతంత్రాలు మొదలైనవన్నీ మనస్సులో మెదుల్తై. పైగా అర్ధరాత్రి ఇటువంటివే, టి.ఎస్. ఇలియట్ మార్గాన్ని స్ఫురింపజేస్తై.

నారాయణబాబు సమాజం నుంచి అలా విడిగా ఉండడంతో ఒక నేరస్థుడితో పోలుస్తాడు. అతని మరణం గురించి ఎలా చెప్తూ ముగిస్తాడో చూడండి.

'నిర్జన మానసాన అడుగుల సడి వడివడి మ్రోగ
నీడల్లో ఒదిగి ఒదిగిపోతున్నాడు నేరస్థుడు
హఠాత్తుగా సందు మలుపు తిరగగానే
బుగ్గమీసాల పత్తేదారు 'హేండ్సప్' అని అరచాడు'

ఈ దొంగని పట్టుకున్న పత్తేదారు యమధర్మరాజే. నారాయణబాబు జీవన వైచిత్రికీ, ఈ ముగింపు ఎంతో బాగా సరిపోయిన ప్రతీకాత్మక భావచిత్రం.

తాత్వికులందరికీ 'ఏకాంతం' లేదా 'ఒంటరితనం' ఎంతో ఎంతో యిష్టం. ప్రపంచాన్నించి ముడుచుకుపోయి తమలోపలికి తాము అనంతంగా ప్రయాణం చెయ్యడం వీరిలోని సహజ ప్రేరణ. బైరాగి కవితల్లోనూ ఈ ఏకాంత భావన బలంగా ఉంటుంది. అలా ప్రయాణం చెయ్యడానికి ప్రతి మనిషీ భయపడతాడు. ఎందుకంటే, మనస్సు లేక అగాధాల్లోకి వెళ్తే ఎటువంటి ప్రమాదం జరుగుతుందోననే సందేహం. బైరాగి 'ప్రయాణం' అనే ప్రతీక ఎప్పుడూ ఆంతరంగిక ప్రయాణాన్నే సూచిస్తుంది. ఇక్కడ చీకటిగాని, నీడలుగాని, మిగిలిన అవరోధాలుగానీ అన్నీ ప్రతీకలే ఔతై. 'పరాజితులకొకపాట' ఒంటరితనాన్ని గురించిన కవిత.

"ఒకటి మాత్రం జ్ఞాపకముంచుకోనీవు
ఒంటరిగా సాగిపోవాలి ముందుకు
ఈ నీడలు నీకు తోడురావు
ఒంటరిగా సాగిపోవాలి ముందుకు'

నీడలు – లౌకికప్రేరణలకీ, వ్యామోహాలకీ ప్రతీక. వీటన్నిటినీ దాటిపోతే, మనిషి ఎప్పుడూ ఒంటరే.

'ఎవడికి వాడే దళపతి
ఎవడికి వాడే ఆనతి'

ఆజ్ఞ యిచ్చేదీ అతడు. శిరసా వహించి చేసేదీ అతడు.

'ఈ వినీల సువిశాలాంబరతలాన
ఎవడికి వాడే ఆన
ప్రతి ఒక్కడు సమ్యక్ స్వేచ్ఛాసిద్ధుడు
ప్రతి ఒక్కడు తనతో తానే బద్ధుడు'

ఇదే (existencial crisis) అస్తిత్వ వాద పరాకాష్ఠ బైరాగి ఎంతగా పాశ్చాత్యవాద ప్రభావితుడైనా, అతని మౌలిక వేదన భారతీయమే. ఆ విషయం ఒంటరితనాన్ని గూర్చి అతడు రాసిన 'మేలుకొన్నవాడు' అనే కవితలో కనిపిస్తుంది. శీర్షిక కింది అతడు రాసిన వాక్యం ఇది.

'యానిశా సర్వభూతానాం
తస్యాం జాగర్తి సంయమీ'

సంయమీ – అంటే తనను తాను పూర్తిగా నిగ్రహించుకున్నవాడు. అన్ని ప్రాణులూ దేన్ని రాత్రిగా భావించి నిద్రపోతాయో, అక్కడ ఈ ఒంటరి మేలుకుని ఉంటాడు. ఈ మెలకువకి అర్థమే ఈ కవిత.

'ప్రతిక్షణం ఎవరో తలుపు తట్టిన భ్రమ
శూన్యమేధాగృహం మధ్య
పిరికితలపుల ఎలుకల పరుగు
కుక్కల మొరుగు
రాత్రి మౌనపు దుప్పటి చిరుగు
ఎవరికర్థమౌతుందన్న మేలుకొన్నవారికన్న?"

పైనున్న తలుపు తట్టిన భ్రమ, ఎలుకల పరుగు, దుప్పటి చిరుగు, ఇవన్నీ జీవిత వైయర్థ్యానికి ప్రతీకలే. అందరూ నిద్రపోతుంటే ఒకానొకడు ఎందుకు మేలుకుని ఉండాలంటే, దానికి కారణం చెప్తాడు కవి.

'కాని ఇచ్చట ఎవరో ఒకరు
మేలుకుని ఉండక తప్పదు గదా
అనాగతుడు అభ్యాగతుడై
అడుగులసడి వినబడినప్పుడు
తలుపెవ్వరు తెరుస్తారు? ఎవ్వరు పలకరిస్తారు?...
అగ్రేసరుల ప్రథమ దూత
నడిరేతిరి మేలుకొన్నవాడెవరని?'

కాబట్టి తమోమయలోకం నించి, పరిష్కారం కనుక్కోవాలన్నా, ఎవరో ఒకరు మేలుకుని ఉండాలి.

బైరాగిలో సామాజికమైన వైరుధ్యాల గూర్చిన ఆవేశం కూడా ఉన్నత ప్రమాణాల్లోనే ఉంది. ఎందుకంటే ఒక సమయంలో అతడు రాజకీయాల పట్ల కూడా బాగా అభినివేశం చూపించినవాడు. 'వాగ్దత్త వసుంధర' అనే కవిత అతని సామాజికావేశాన్నీ, లోకంలోని కుళ్ళును అసహ్యించుకునే తత్వాన్నీ బాగా పట్టిస్తుంది. రాబోయే కాలం ఎలా ఉంటుందో చెప్తున్నాడు.

'కచ్చలు, మచ్చరాలు, విచ్చుకత్తులు, అచ్చుకప్పులు, అన్నీ రద్దు
రద్దు, రద్దు, ముద్దుల సామ్రాజ్యానికి
సరిహద్దులన్నీ రద్దు
మారుమూల ఆకలిగొందుల చీకటి దుకాణాలు
స్త్రీ శీలం, పురుషుని పరువు, పసిపాపల ప్రాణాలు
అమ్మే అంగడులన్నీ మూసేశాం
దివాలా బోర్డులు వేలదీశాం.
సిరికి విరుగుడు కనిపెట్టాం
భీషణ శోషణ యంత్రపు పండ్ల చక్రాలు, ముళ్ళ కంచెలు
బ్యాంకులు, షేర్ మార్కెట్లు, అంకెల గారడీతో

పేదవాని కడుపు కొట్టే లంకాసురుల రహస్య సొరంగాలు
మాయా సింహాసనాలు అన్నీ కూలద్రోశాం, నేలపాలుచేశాం...'

ఇలా ఎన్నో దోషాలు చెప్తూ చివర్లో అంటాడు.

'యథాశక్తి శ్రమ చేస్తాం, యథాభుక్తి అనుభవిస్తాం
వృథా కాదు, చేసిన శ్రమ
ఈనగాచి నక్కల పాలు చేయమింక
ఒక్కొక్కడు అందరికొరకు
అందరూ ఒక్కొక్కని కొరకు...'
నేడుగదా మానవుడు చేరుకున్నాడు కోరుకున్న విడుమరను
ద్రష్టలు, యుగద్రష్టలు సూచించిన వాగ్దత్త వసుంధరను'

ఏ దోషాలు, ఏ వైరుధ్యాలు పోవాలని కవి భావించాడో, అవన్నీ ప్రపంచీకరణ ముదిరిపోతున్న ఈనాడు, ఇంకా ఇంకా దృఢంగా పాతుకుపోవడం, ఈనాటి కవులందరూ నిత్య వేదననుభవించే దారుణ విషాదం.

బైరాగిలో మానవశక్తి పైగల నమ్మకం ఒక ప్రధాన కోణం. నవమానవ విజయగీతం ఆలపించడం అతనికిష్టం. 'నరులారా!' అనే కవితలో మానవుడి అసమానశక్తిని కీర్తిస్తాడు.

'ఆశాంతాల ఊహాంతాల ప్రాంతంలో
అగణిత గ్రహాల ఉపగ్రహాల అంతరాళధ్వాంతంలో
అనంతాంతరిక్షంలో
జీవన పరమావధుల సమక్షంలో
గర్వంగా నిలిచిన నరుడు
సుపర్వులపై సవాలు చేస్తున్నాడు
అమరుల కోటలోన పాగా వేస్తున్నాడు
సోదరా! చింతలేదు, ఏమాత్రం వింతకాదు
మానవ మేధా విజయపరంపరలకంతం లేదు'

వియత్నామ్ అమెరికాపై చేసిన ఆత్మవిశ్వాసపు పోరుపై కూడా కవిత రాశాడు బైరాగి.

'ఉత్తి చేతుల మిత్తవతో పోరే వీరుల చూచి
మిత్తవ కూడా సిగ్గుపడి దూరంగా పారుతున్నది
తెల్లదొరలకు పట్టుకున్న మనాది వియత్నామ్
సామ్రాజ్యపు సైతానుకు సమాధి వియత్నామ్
జనశక్తుల ఉదయానికి పునాది వియత్నామ్
ప్రాచీదిగ్వధువు నొసట
తీర్చిదిద్దిన విజయతిలకం వియత్నామ్'

మౌలికంగా సామ్రాజ్యవాదాన్ని ప్రతిఘటించే తత్వం బైరాగిలో చాలాచోట్ల కనిపిస్తుంది. మనిషి ఆత్మవిశ్వాసానికి పరాకాష్ఠ కవితగా 'నాక్కొంచెం నమ్మకమివ్వు' అనే కవిత సుప్రసిద్ధం. మనిషికి కొంచెం నమ్మకమిస్తే ఎన్నెన్నో ఘనకార్యాలు సాధించగలడు. అతడు సాధించలేనిది లేదు.

'నాక్కొంచెం నమ్మకమివ్వు!
కొండలు పిండి కొట్టేస్తాను
చితికిన టొమాటోలాంటి సూర్యుణ్ణి
ఆరిన అప్పడం లాంటి చంద్రుణ్ణి
ఆకాశపు ఎంగిలి పళ్ళెంలోంచి నెట్టేస్తాను
నాదగు బాహుబంధనంలో ఈ విశాల బ్రహ్మాండాన్ని
చాపలా చుట్టేస్తాను
నిస్సహాయ మానవునినొసటి వ్రాలు
ఒక్క కలంపోటుతోటి కొట్టేస్తాను
జీవిత సభా భవనద్వారం నించి
అన్యాయాన్ని అక్రమాన్ని మెడబట్టి గెంటేస్తాను
ఇంకా ఎన్నో ఎన్నెన్నో చేసేస్తాను
కాని ఒక్కటి - నాక్కొంచెం నమ్మకమివ్వు!'

ఆధునిక చైతన్యంలో పాశ్చాత్య దేశాల నుండి తెచ్చుకున్న ధోరణుల్లో మృత్యు వాంఛ ఒకటి. కొందరు కవులు మృత్యువాంఛని కేవలం నిరాశావాద ధోరణిలో రాస్తారు. గొప్ప భావచిత్రాలుండవచ్చు. కాని, వారిలో మానవుని అసమర్థత

కనిపిస్తుంది. కాని, భారతీయ తత్వంతో ప్రేరేపింపబడిన తాత్వికుడు కాబట్టి, బైరాగి ఎంతగా మృత్యు స్పృహతో లోకాన్ని గూర్చి ఆలోచించినా, ఆశావాదాన్నీ, మానవశక్తిపైన అచంచల విశ్వాసాన్నీ వదులుకోలేదు. ఇది బైరాగిలోని గొప్ప కోణం.

ఏ సమగ్ర సిద్ధాంతం గల వారికైనా, ఒక ఆదర్శమానవుడుంటాడు. ఆ ఆదర్శ మానవుని వల్లనే తాము నమ్మిన లోకం అవతరిస్తుందని భావిస్తారు. మార్క్సిస్టులకి ఒక సమ సామాజిక వ్యక్తి, అస్తిత్వవాదులకు ఒక ఏకాంత వ్యక్తి, వేదాంతులకి ఒక సన్న్యాసవ్యక్తి, యోగులకి ఒక సమాధి సాధక వ్యక్తి – ఇలా ఎన్నో ఆదర్శాలుంటై, ప్రపంచంలోని సుఖ దుఃఖాలన్నీ ఆలోచనాపరుడికి వేదననే కలిగిస్తై అని బైరాగి భావన. అంతర, బాహిర బాధలన్నీ ప్రపంచంలో తొలగించడానికి ఒక మహావ్యక్తి రావాలి. వ్యక్తివాదుల దృక్పథంలో సమాజాన్ని మార్చడానికి మహాత్ములు కావాలి. సమాజం మహాత్ముల్ని తయారుచేస్తుందని కాక, మహాత్ములే సమాజాన్ని మారుస్తారని వారు నమ్ముతారు. బైరాగి ప్రస్తుత క్షీణపరిస్థితుల్ని చెప్తూ, అందుండి అవతరించే నూతన మానవుణ్ణి గూర్చి యిలా చెప్తాడు. ఇదే 'ఆగమగీతి' పుస్తకంగా మొదటి కవితగా కనిపిస్తుంది. దీని శీర్షిక 'ఆగమగీతి'.

'మనుజుని ప్రేమ' పద్మ పత్రమి వాంభీసా'
జారిపోయే క్షణాన
మనుజుని ఆస్థ మధ్యాహ్నపు మంచులాగు
కరగినీళ్ళు కారిపోయే క్షణాన
మనుజుని ఆశ యక్ష్మార్తుని దగ్గులాగు
పచ్చి నెత్తురులు గ్రక్కే ఈక్షణాన
మనుజుని ఆత్మ కుష్ఠ జర్జర దుర్గతిలో చిలికి క్రుళ్ళి
గుప్పెడు ధూళికి మ్రొక్కే ఈ క్షణాన
ఆరతి వెలిగించేందెవరు?....'
'దుర్బల రక్త మాంసాల్లోంచి పిండిన
వజ్రఖండం వంటి విశ్వాసం
భ్రాతల ఎడ వాసుకి బంధసదృశమైన ప్రేమపాశం
హిమాచలం వంటి దీక్ష

నయాగరా వంటి కరుణ
శరదాకాశ సారళ్యం
జాహ్నవీజలం వంటి, వహ్నివంటి నైర్మల్యం
పిల్లలవంటి తెల్లని మనసు కలిగినవాడు
ఏడ ఆ అపరాజేయమానవేయుడు
జితేంద్రియుడు, వీతభయుడు, మృత్యుంజయుడు
ఏడీ, ఆ మహనీయుడు?....
ఉదయిస్తాడనల సంభవుడు, ఆత్మభవుడు, నవమానవుడు
అతనికొరకే వేచి ఉంది యుగయుగాల నుండి ధరణి
అతని వ్యోమమార్గంలో ఉల్కా ధరపు హరితరణి'

'దుర్బల...' దగ్గర నుండి సంస్కృత బహుళమైన రచనతో సాగిన పంక్తులు, 'పిల్లల వంటి తెల్లని మనసు కలిగినవాడు' అని వర్ణనలోని ముగింపు వాక్యం వ్యవహారంలో ఉన్న తెలుగు పదాలు కావడంతో, ఈ పంక్తికి గొప్ప బలం వచ్చింది. బైరాగి కవిత్వంలో, శైలికి సంబంధించి, అభివ్యక్తి రీతుల్లో, అవగాహన పూర్వకంగా వికసించే స్పృహ ఎక్కువగా కనిపిస్తుంది.

బైరాగి అత్యంత నిబద్ధతగల కవి. జీవన తత్వానికీ, కవిత్వతత్వానికీ ఏకీ భావన గల కవి. అతని భావ చిత్రాలుగాని, ప్రతీకలుగాని, పదాలుగాని, పదబంధాలుగాని, అన్నీ ఒక 'తృతీయపంథా'లో సాగిపోతూ ఉంటై, అందరూ వాడే పదాల్నే పొందికలో విభిన్నం చేస్తాడు. ఒక అర్థంలో అందరూ వాడే పదాల్ని గాక వేరే పదాల్ని ఉపయోగిస్తాడు. అందరూ 'టకటక'మని అంటే అతడు 'టికటిక'మని అంటాడు. లోహగాథకి లౌహగాథ అంటాడు. ఇలా అతని కవిత పొడుగునా కనిపిస్తై. ఇక భావచిత్రాలైతే అన్నీ ప్రత్యేకంగానే ఉంటై. గాఢత, లోతు కలిగి ఉంటై. 'సూతాశ్రమం' గురించి రాసిన కవితలో కొన్ని పంక్తులు –

'శుభ్ర విద్యుత్ కాంతిలో
శస్త్రకారుని శస్త్రం నవ్విన అందం
స్వస్థశ్వాసలాగ
ఎర్రని మూసలోన పారేలోహపు అందం

కనుచూపుల కనుమదాటి
మింటిని ఒంటరిగా పయనించే
ఇనుపడేగ తెల్లని రెక్కల అందం'

హేతువాదంలోని కాఠిన్యం, అందులోంచి వచ్చే సత్ఫలితాలు ఒకేసారిపై భావచిత్రాల్లో కొత్తదనంతో చెప్పిన విధానం గమనించగలం. 'ఇనుపడేగ'కి 'తెల్లనిరెక్కలుండడం' నవ్యమైన ఆవిష్కరణ.

బైరాగి శైలిలోని భావధార కూడా నిరాటంకంగా సాగిపోతుంది. కాని, కొందరు మార్గదర్శకులైన కవుల్లాగా అతడు జనప్రియం కాలేదు. చాలామందికి బైరాగి ఒక గొప్ప కవి అనే తెలియదు. దీనికి రెండు ముఖ్యకారణాలు.

మొదటిది, సామాజికోద్యమ పరిణామంతో సాగిపోయే కవిత్వానికి, విభిన్న ధోరణిలో ఉండడం. ఉద్యమస్ఫూర్తి ఉన్నవాళ్లలో ఇతరమైన ధోరణిలో ఉన్న కవిత్వం చదివి, అనుభూతి పొందగలవాళ్ళు చాలా తక్కువమంది ఉంటారు. రెండోది, యింకా ముఖ్యమైనవి బైరాగి అందరికీ అందుబాటులో ఉన్న ప్రచురితమై ఉన్న వ్యావహారిక భాష ప్రయోగించడు. సుదీర్ఘ సంస్కృత సమాసాలుగాని, విభిన్నమైన తెలుగుపదాలుగాని, కొన్నిచోట్ల గ్రాంథిక స్పర్శగాని, చాలామందిని సుఖంగా చదవనివ్వవు. భాష గురించి విస్తృతమైన అవగాహనతో, భావం మీది యిష్టంతో, చదివేవారికి, భావధార ఎక్కడా వేగం కోల్పోయినట్లు అనిపించదు. కాని, సామాన్యులకు అంతశ్రమ యిష్టం ఉండదు.

ఆధునిక చైతన్యంలో ఒక తాత్విక భావధారని నిండుగా, ఉన్నత కవితాభివ్యక్తితో ప్రతిబింబించిన కవి బైరాగి. జీవనక్షోభనీ, కవితాశోభనీ ఉదాత్తంగా సమ్మిళితం చేసిన విశిష్ట కవి బైరాగి.


ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్, హైదరాబాదు - 500 001
Andhra Saraswatha Parishath.
Tilak Road, Hyderabad - 500 001
NO PARKING


డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరం